

ఈనాడు


THE LARGEST CIRCULATED TELUGU DAILY



విజయవాడ 7-3-2018 బుధవారం సిటీ సంపుటి 44 . సంచిక 206 రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

హోదాగ్ని జ్వాల



'ప్రత్యేక హోదా'...

నాలుగేళ్ల క్రితం అది విభజన గాయాన్ని పూడ్చే దివ్యౌషధం

ఇప్పుడది రాజుకుంటున్న నిప్పు కణిక.

ఆ సెగ ఆంధ్రప్రదేశ్ వీధుల నుంచి దిల్లీ గల్లీలకు చేరింది. భాజపా మినహా రాష్ట్రంలోని రాజకీయ పక్షాలన్నీ ఉద్యమ పంథాల్లో ఆందోళనలు చేస్తున్నా... కేంద్రం మాత్రం 'హోదా'కు ససేమిరా అంటోంది. హోదా వివాదంపై మంగళవారం కూడా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ, తెలుగుదేశం శాసనసభాపక్ష సమావేశం, పార్లమెంటు ఉభయ సభలు, దిల్లీలోని వివిధ రాజకీయ వేదికల సాక్షిగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. తెలుగుదేశం పార్టీ భాజపాతో తెగతెంపులకు దాదాపు సిద్ధమైపోయింది. అమరావతిలో జరిగిన పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో 95 శాతానికి పైగా తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భాజపాకు కటీఫ్ చెప్పాలని అధినేత చంద్రబాబు సమక్షంలో కుండబద్దలు గొట్టారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కూడా దిల్లీలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆత్మగౌరవ దీక్షలో పాల్గొని 2019లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొదటి సంతకం ప్రత్యేక హోదా దస్త్రంపైనే చేస్తామని హామీ ఇచ్చారు. ఇక పార్లమెంటు లోపల, వెలుపల రెండోరోజు కూడా తెలుగుదేశం, వైకాపా ఎంపీల నిరసనలు కొనసాగాయి. అదే సమయంలో కేంద్రం తన వైఖరిని పునరుద్ఘాటించింది. ఒకప్పుడు 'హోదా' హామీ వచ్చిన రాజ్యసభలోనే... ఇకముందు ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఉండబోదని మంగళవారం కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి శుక్లా మరోసారి స్పష్టం చేశారు.

2, 11 పేజీల్లో



జంతర్‌మంతర్ వద్ద ఏపీ కాంగ్రెస్, వామపక్ష నేతలతో కలిసి నిరసనలో పాల్గొన్న కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ

ప్రత్యేక హోదాపైనే తొలి సంతకం

- 2019లో అధికారంలోకి వచ్చాక ఇదే మా మొదటి ప్రాధాన్యం
- కాంగ్రెస్ ఆత్మగౌరవ దీక్షలో రాహుల్‌గాంధీ వెల్లడి

ఈనాడు, దిల్లీ: కేంద్రంలో 2019లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తొలి సంతకం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపైనే చేస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చెప్పారు. ఈ అంశాన్నే తమ మొదటి (మిగతా 2లో)

తాడో పేడో..!

- భాజపాతో తెగతెంపులు చేసుకుందాం
- 95 శాతానికిపైగా తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభిప్రాయం
- ఇక పోరాటం తప్పదన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

'వ్యక్తిగతంగా శ్రద్ధ చూపిస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావని ప్రధానికి చెప్పాను. ప్రస్తుతం ఉన్న ఆ ఆశా పోయింది. ఇప్పుడు పోరాటం చేయకపోతే రాష్ట్రానికి ఎప్పటికీ న్యాయం జరగదు. ఇందుకోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. కేంద్రంతో సోమవారం చర్చలు సానుకూలంగా జరగలేదు...



12,476 కోట్లు ఇచ్చాం

- ప్రత్యేక ప్యాకేజీ కింద 16,725 కోట్లు అడిగారు
- జాతీయ విద్యాసంస్థలకు 608 కోట్లు ఇచ్చాం
- ఏపీకి సాయంపై అరుణ్‌జైట్లీ వెల్లడి

ఇక ఎవరికీ ఉండదు

- మిగతా రాష్ట్రాల పరిశ్రమల మాదిరిగానే హోదా ఉన్న రాష్ట్రాలూ పన్నులు కట్టాల్సిందే
- డీఐపీపీ కొంత మొత్తాన్ని తిరిగి చెల్లిస్తుంది
- అదీ సెంట్రల్ ఎక్సైజ్ నోటిఫికేషన్స్ కిందున్న యూనిట్లకే
- రాజ్యసభలో ఆర్థికశాఖ సహాయమంత్రి శుక్లా వెల్లడి
- ఏపీకి హోదా ఇవ్వడం కుదరదన్న ఆర్థికశాఖ వర్గాలు

ఈనాడు, దిల్లీ: దేశంలో ఇకమీదట ఏ రాష్ట్రానికీ ప్రత్యేక కేటగిరీ హోదా ఉండదని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి శివప్రతాప్ శుక్లా తెలిపారు. అలాగే ఇకనుంచి ఎవ్వరికీ హోదా కొనసాగించడం కూడా లేదని పేర్కొన్నారు. మంగళవారం రాజ్యసభలో వైకాపా సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన లిఖిత పూర్వక ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. "ప్రత్యేక కేటగిరీ హోదా ఇక మీదట ఉండదని, ఏ రాష్ట్రానికీ ఇవ్వడం కానీ, కొనసాగించడంకానీ జరగదని, ఒకసారి జీఎస్టీ అమల్లోకి వచ్చిన (మిగతా 2లో)



మంగళవారం పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద తెదేపా ఎంపీలతో కలిసి నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ ఎంపీలు

స్వపక్షమే విపక్షమై..

మిత్రపక్షాలు శత్రుపక్షాలయ్యాయి...

తెలుగుదేశం, శివసేనలు ఎన్డీయే ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉంటూనే కేంద్రంపై పోరు జెండాను ఎగురవేశాయి.

వాటి ఆందోళనలకు విపక్షాల నిరసనలు అగ్నికి ఆజ్యంలా తోడయ్యాయి.

పార్లమెంటులో ప్రకంపనలు సృష్టించాయి.

ప్రత్యేకహోదా ఇవ్వాలంటూ తెలుగుదేశం, వైకాపా...

రిజర్వేషన్లు పెంచాలంటూ తెరాస, ఎంఐఎం...

కావేరీ బోర్డు ఏర్పాటు చేయాలంటూ ఏఐఏడీఎంకె...

మరాఠీకి ప్రాచీన భాష హోదా ఇవ్వాలంటూ శివసేన...

పారిపోయిన నీరవ్‌మోదీని పట్టుకురావాలంటూ కాంగ్రెస్, తృణమూల్, వామపక్షాలు...

ఎవరికి వారుగా తోసుకుంటూ లోక్‌సభ సభామధ్యంలోకి దూసుకొచ్చారు.

నినాదాలతో హోరెత్తించారు. సభను స్తంభింపజేశారు.

పీజీ వైద్య సీటు ఒక్కటే

- కేటాయింపులో కేంద్రం మొండిచేయి
- పొరుగు రాష్ట్రాలతో పోలికే లేదు..

ఈనాడు అమరావతి: పీజీ వైద్య సీట్ల పెంపులో కేంద్రం రాష్ట్రానికి మొండిచేయి చూపింది. ఆంధ్రప్రదేశ్‌కు కేవలం ఒకేఒక సీటును కేటాయించింది. ఈ విషయంలో ఇతర రాష్ట్రాలతో కనీసం పోలిక కూడా లేదు. ఈ పరిణామంపై ప్రభుత్వ వైద్య కళాశాలలు, విద్యార్థి వర్గాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నాయి. సీట్ల పెంపుపై భారతీయ వైద్య మండలి(ఎంసీఐ)తో సంప్రదించేందుకు వెళ్లినప్పుడు సానుకూలత చూపి, ప్రస్తుతం భిన్నంగా స్పందించడంపై వైద్య కళాశాలల ప్రిన్సిపళ్లు (మిగతా 2లో)

2 లక్షల కోట్లను తాకనుందా!

- రాష్ట్ర బడ్జెట్‌లో ఎన్నికల తాయిలాలే ప్రధానం
- నిరుద్యోగభృతి, సంక్షేమం, పింఛన్లు, సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యం

ఈనాడు - అమరావతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గురువారం శాసనసభకు సమర్పించనున్న 2018-19 రాష్ట్ర బడ్జెట్ భారీ మొత్తంలో ఉండబోతోంది. దాదాపు రూ. 2 లక్షల కోట్లకు తాకే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. సాధారణ ఎన్నికలకు ముందే ఇదే పూర్తి స్థాయి బడ్జెట్. ఎన్నికల తాయిలాలకూ, సంక్షేమానికి (మిగతా 2లో)

ఆర్థిక సంవత్సరం	మొత్తం (రూ.కోట్లలో)
2014-15	1,11,824
2015-16	1,13,049
2016-17	1,35,689
2017-18	1,56,999
రాబోయే బడ్జెట్ అంచనా....	
2018-19	1,86,000

నుంచి 2,00,000 కోట్ల మధ్య ఉండవచ్చు.



త్రిపురలో విధ్వంసం

- భాజపా-సీపీఎం కార్యకర్తల నడుమ ఘర్షణలు
- వామపక్ష కార్యాలయాలపై దాడులు.. లెనిన్ విగ్రహం కూల్చివేత

15లో



ప్రపంచ కుబేరుడు జెఫ్ బెజోస్

- 19వ స్థానంలో ముకేశ్
- ఫోర్బ్స్ జాబితా విడుదల

వివరాలు బిజినెస్‌లో



2 లక్షల కోట్లను తాకనుందా!

(మొదటి పేజీ తరువాయి)

పెద్దపీట వేయబోతున్నారు. జలవనరులకు సంబంధించి సాగునీటి ప్రాజెక్టులకు, ఉపాధికి, పింఛన్లకు పెద్ద మొత్తాలు ప్రతిపాదించనున్నారు. 2014-15లో 1,11,824 కోట్ల అంచనాతో సమర్పించిన బడ్జెట్ క్రమంగా ప్రతి ఏటా వేల కోట్లు పెరుగుతూ వస్తోంది.

నిరుద్యోగభృతి, ఆదరణకు... ఈ సారి బడ్జెట్‌లో నిరుద్యోగ భృతికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. తెలుగుదేశం గత ఎన్నికల ప్రణాళికలో ఈ మేరకు హామీ ఇచ్చింది. దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారుకు మంత్రివర్గ ఉపసంఘం కసరత్తు చేస్తోంది. దాదాపు అన్ని అంశాలు కొలిక్కి వచ్చిన నేపథ్యంలో వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి నిరుద్యోగ యువతకు భృతి కల్పించి వారిని సామాజిక కార్యక్రమాలకు వినియోగించుకోవాలనే ఆలోచన ఉంది. ఇందుకోసం పెద్ద మొత్తం ప్రతిపాదించబోతున్నారు.

వెనుకబడిన, ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వబోతున్నారు. కిందటి జన్మభూమిలో సామాజిక పింఛన్ల సంఖ్య పెరిగింది. దీనికి కేటాయించే మొత్తాలు పెరగనున్నాయి. రేషన్‌కార్డుల సంఖ్య ఎక్కువైనందున పౌరసరఫరాలశాఖకు ఇచ్చే సబ్సిడీ మొత్తమూ పెరగబోతోంది. జలవనరులశాఖ ప్రాజెక్టుల పరంగా పరిశీలిస్తే... దాదాపు రూ.20 వేల కోట్ల విలువైన కొత్త వాటికి మార్చి నెలాఖరులోగా టెండర్లు పిలిచి పనులు అప్పగించనున్నారు. దాదాపు రూ.5000 కోట్లతో గోదావరి పెన్నా తొలిదశ, దాదాపు 4,500 కోట్లతో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి వంటివి వచ్చే ఎన్నికల్లోగా పూర్తి చేయాలన్న తలంపుతో ఉన్నారు. వెలిగొండ ప్రాజెక్టు తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. ఈ పరిస్థితుల్లో రూ.24 వేల కోట్లు జలవనరులశాఖకే కేటాయించబోతున్నారు. ఇందులో పోలవరం రూపేణా రూ.13 వేల కోట్లు ఖర్చు చేసి కేంద్రం నుంచి తిరిగి రాబట్టుకోవచ్చన్న అంచనాల్లో ఉన్నారు.

పీజీ వైద్య సీటు ఒక్కటే

(మొదటి పేజీ తరువాయి)

ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీట్లు పెరిగితే నీట్ ర్యాంకు ఆధారంగా విద్యార్థులు రాష్ట్రంలోనే చదువుకునే అవకాశం ఉండేది. ఈ ప్రయోజనాలకు విద్యార్థులు దూరమవుతున్నారు. దేశవ్యాప్తంగా 604 సీట్ల పెంపు జాబితాను కేంద్రం మంగళవారం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఆంధ్ర వైద్య కళాశాల ఈఎన్‌టీ విభాగంలో కేవలం ఒకేఒక సీటు పెరిగింది. తెలంగాణలో గాంధీ, కాకతీయ, నిమ్స్, ఉస్మానియా వైద్య కళాశాలల్లో కలిపి 27 సీట్లు పెరిగాయి. అసోంలో 18 సీట్లు పెరిగాయి. దేశవ్యాప్తంగా రెండువేల సీట్లు పెంచేందుకు సిద్ధమైన కేంద్రం 604 సీట్లకే పరిమితమైంది.

వైద్య నిపుణుల కొరతను తీర్చేందుకు కేంద్రం 2017-18లో అధ్యాపకులు, విద్యార్థుల నిష్పత్తిలో మార్పుచేసి సీట్లను పెంచింది. దీనివల్ల రాష్ట్రానికి 155 సీట్లు వచ్చాయి. తిరుపతి స్విమ్స్‌లో 17 సీట్లు పెరిగాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనూ సీట్లు పెరిగాయి. 2018-19 విద్యా సంవత్సరంలోనూ అదనంగా సీట్లు ఇస్తామని, దరఖాస్తు చేసుకోవాలని అన్ని రాష్ట్రాలకు కేంద్రం సూచించింది. సాధారణంగానైతే ఇద్దరు పీజీ విద్యార్థులకు ఒక ఆచార్యుడు ఉండాలి. ప్రత్యేక పరిస్థితుల్లో ఈ నిబంధనలను సవరించి ఒక ఆచార్యుడికి ముగ్గురు పీజీ విద్యార్థులు ఉండొచ్చని పేర్కొంది. ఈ మేరకు గుంటూరు, విశాఖ, తిరుపతి, ఇతర ప్రభుత్వ వైద్య కళాశాలల నుంచి ఎంసీఐకి దరఖాస్తులు వెళ్లాయి. అధ్యాపకుల అర్హతలు, మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, ఇతర సౌకర్యాలను క్రోడీకరించి కళాశాలల ప్రిన్సిపళ్లు ఎంసీఐకి ప్రతిపాదనలను సమర్పించారు. గుంటూరు జీజీహెచ్ నుంచి 60 సీట్లకు ప్రతిపాదనలు వెళ్లగా కేటాయింపులో రిక్తహస్తమే మిగిలింది. తిరుపతి శ్రీవేంకటేశ్వర వైద్యకళాశాలలో 30 సీట్లు పెరుగుతాయని ఆశించినప్పటికీ అదనంగా ఒక్కటీ రాలేదు. ఆంధ్ర వైద్య కళాశాలలో 20 సీట్లపై భరోసాతో సుమారు 27 కిలోల బరువున్న పేజీల సమాచారాన్ని ఎంసీఐకి సమర్పించారు. కేవలం ఒక సీటే పెరిగింది.

APPSC పంథాలో
RRB ALP గ్రూప్-D
DSC SGT SA
90596 29934
73960 15883

2014 DSC-SGT
DSC SGT, SA(ALL), TPT, HPT
8-3-18
ప్రతిభ
93 92 91 75 84

DSC Online Classes for
SA SGT
FEE: 5,000/- FEE: 4,000/- EM TM
Kautilya
www.kautilyacareers.com
9901474 1474

AP-DSC
SGT, SA (All Sub.), TPT, PET
AP, తెలంగాణ లో వేలాది మందిని ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన సంస్థ
అత్యుత్తమ అధ్యాపక బృందంచే డైరెక్టర్ సిరికొండ లక్ష్మీనారాయణ సారథ్యంలో భోధన
మా ప్రత్యేకతలు - Daily Test లు, నిర్వహించబడును. హాస్టల్ వసతి కలదు
FREE DEMO : 11-03-2018 at 10.08 am
RAMAIAH
COMPETITIVE COACHING CENTRE
Dilsukhnagar, HYDERABAD
9246208422, 040-66778422
Cell : 8885555202

తాడో పేడో తేల్చుకుందాం..!

ఈనాడు అమరావతి: భాజపాతో కలసి నడవడం వల్ల ఇక ఏ మాత్రం ప్రయోజనం లేదని, తక్షణం తెగతెంపులు చేసుకుందామని 95 శాతానికిపైగా తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముక్తకంఠంతో స్పష్టం చేశారు. మంగళవారం శాసనసభ కమిటీ హాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన తెదేపా శాసనసభాపక్ష సమావేశం జరిగింది. భాజపాతో సంబంధాలపై మీ అభిప్రాయమేమిటో చెప్పాలని ఆయన కోరగా... ఈ సమావేశానికి హాజరైన వారిలో ఆరుగురు తప్ప మిగతా వారంతా భాజపాతో తెగతెంపులకే మొగ్గు చూపారు. "మీ అభిప్రాయమే నాది కూడా. రాష్ట్ర ప్రయోజనాల కోసం మనం చేస్తున్న పోరాటాన్ని ఉద్ధృతం చేద్దాం. మనం ఓపిక పట్టినా, ప్రజలు ఓపిక పట్టే పరిస్థితి లేదు...'' అని ముఖ్యమంత్రి తెలిపారు. ఆ పరిస్థితే వస్తే రాష్ట్రంపైనా, వ్యక్తిగతంగాను కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. త్యాగాలకు మీరు సిద్ధమేనా? అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలన్నదే మన డిమాండ్ అని స్పష్టం చేశారు. తెదేపా నాయకులు ఎవరూ ప్రత్యేక ప్యాకేజీ అన్న ప్రస్తావనే తేవొద్దని, ప్రత్యేక హోదా గురించే మాట్లాడాలని నొక్కి చెప్పారు. విభజన చట్టంలోని అంశాలు, హామీల అమలుపై కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ముఖ్యమంత్రి తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్ర డిమాండ్లకు సంబంధించి కేంద్ర ఆర్థిక శాఖ మీడియాకు ఇచ్చిన లీకులపైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇప్పుడు యుద్ధం లేదు కదా అని సైన్యం నిధులు కూడా ఇమ్మని అడిగేలా ఉన్నారని కేంద్రం అనడం సమంజసం కాదు. రాష్ట్రాన్ని ఆదుకోవడానికి... యుద్ధానికి సంబంధం ఉందా? అసలా పోలికేంటి? అప్పట్లో కాంగ్రెస్ ఇలాగే వార్‌రూంలు పెట్టడం, విభజన బిల్లు యుద్ధ విమానంలో పంపడం వంటివి చేస్తే ఆ పార్టీకి ఏమైందో తెలుసు కదా...'' అని వ్యాఖ్యానించారు. "నేనేమీ గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదు. మనకు హక్కుగా రావాలసినవే అడుగుతున్నాం. కేంద్రాన్ని దేహీ అనాల్సిన అవసరం మనకు లేదు...'' అని తెలిపారు. "ప్రజల మనసులోను... మీ మనసులోను ఏముందో నాకు తెలుసు.



తెదేపా శాసనసభాపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మన హక్కులు కాపాడుకోవడంలోను, రాష్ట్రాభివృద్ధిలోను రాజీ లేదు. నాకు ఎవరిపైనా ద్వేషం లేదు. నాకెవరూ శత్రువులు కాదు. సమస్యలపైనే నా పోరాటం. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుందాం. కష్టమొచ్చినా... నష్టమొచ్చినా భరిద్దాం. ప్రజల్నీ సంసిద్ధుల్ని చేద్దాం...'' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తానెవరికీ భయపడాల్సిన పనిలేదని, ప్రతిపక్ష నాయకుడిలా తనపై అవినీతి కేసులేమీ లేవన్నారు. విభజన చట్టంలో ఉన్న ప్రతి ఒక్కటీ అమలు చేసేంత వరకు పోరాటం ఆగదన్నారు. బుధవారం శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై చర్చకు సమాధానమిచ్చేటప్పుడు ఈ అంశంపై మరింత వివరంగా మాట్లాడతానని ఆయన పేర్కొన్నారు.

అందరిదీ ఒకే మాట..!

శాసనసభాపక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రారంభోపన్యాసం ముగిశాక... సభ్యులు తమ అభిప్రాయాలను తెలిపారు. కాకినాడ అర్బన్ శాసనసభ్యుడు వనమాడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం కేసులు పెడుతుందని ముఖ్యమంత్రి భయపడుతున్నారని వైకాపా ప్రచారం చేస్తోందని చెప్పారు. భాజపాతో మైత్రి తెంచుకునే అంశంపై కొన్నాళ్లు వేచి ఉండటమే మంచిదని అభిప్రాయపడ్డారు. ఎవరో కేసులు పెడతారన్న భయం తనకు లేదని, తానేమీ తప్పులు చేయలేదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. భాజపాతో మైత్రిపై వేచి చూద్దామన్న వారెందరో చేతులెత్తాలని ఆయన కోరగా... వనమాడి వెంకటేశ్వరరావు, కాగిత వెంకటరావు సహా ఆరుగురు మాత్రమే చేతులెత్తారు. మిగతా వారంతా తెగతెంపులు చేసుకోవడమే మంచిదని చెప్పారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ... ఇన్నాళ్లూ ముఖ్యమంత్రి మనసులో ఏముందో తెలియక తామేమీ మాట్లాడటం లేదని, ఈ రోజు ఆయన చెప్పిన మాటలతో తమకు ఒక స్పష్టత వచ్చిందని పేర్కొన్నారు. "మిత్రధర్మాన్ని పాటించే ఇన్నాళ్లూ మనం భాజపాకి వ్యతిరేకంగా ఏమీ మాట్లాడలేదు. కొన్ని విషయాలు మీకూ చెప్పేవాడిని కాదు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే అవమానాలు భరిస్తూ వచ్చాం. ఇప్పుడు చెప్పక తప్పదు. మనం ప్రభుత్వంలో ఉన్నాం. ఒక్కసారిగా రోడ్డు ఎక్కలేం. ప్రభుత్వాన్ని నడపాలి. కేంద్రం హామీలు అమలు చేస్తుందని ఇన్నాళ్లూ వేచి ఉన్నాం. ఇక పోరాటం తప్పదు. సమస్య జటిలమైనదే అయినా పోరాడి సాధించుకుందాం...'' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. "ఐదు కోట్ల మందిని వ్యతిరేకం చేసుకోవడం మంచిది కాదు. ఒక రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేయడం తగదు. ప్రజల భావోద్వేగాలతో ఆడుకోకూడదు. అస్సాం, పంజాబ్, జమ్ము-కాశ్మీర్ ఫలితాలను గుర్తుంచుకోవాలి. మన వల్ల ప్రజలు ఇబ్బంది పడకూడదనే ఓపికపట్టాం. నా జీవితంలో ఎప్పుడూ ఎవరికీ భయపడలేదు. ఇందిరాగాంధీతో సహా అందరూ నాపై కేసులు పెట్టించాలని చూశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 26 కేసులు పెడితే ఏమైంది?...'' అని సీఎం ప్రశ్నించారు.

వ్యక్తిగత దూషణలు వద్దు..!

రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై గట్టిగా మాట్లాడాలని, ఎవరూ భయపడాల్సిన పనిలేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. భాజపా నాయకులు రెచ్చగొట్టినా వ్యక్తిగత దూషణలకు దిగవద్దన్నారు. నిర్మాణాత్మకంగా, హుందాగా మాట్లాడాలని పార్టీ నాయకులకు సూచించారు. విశాఖలో ప్రధాని మోదీని అవమానించేలా... ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాన్ని ఆయన తప్పుబట్టారు. అదే సమయంలో మంగళవారం శాసనసభ మీడియా పాయింట్‌లో వాసుపల్లి బాగా మాట్లాడారని ఆయన మెచ్చుకున్నారు. "విశాఖ, విజయవాడ ఘటనలు పునరావృతం కాకూడదు. ఎవరు రెచ్చగొట్టినా రెచ్చిపోవద్దు. వాళ్లు తప్పుడు లెక్కలు చెబితే మీరు నిజాలు చెప్పండి...'' అని సూచించారు.

ఉపాధి హామీ పథకానికి రాష్ట్రం ఎక్కువ నిధులు తీసుకుందని అనడంలో అర్థం లేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఎక్కువ పనులు చేశాం కాబట్టే, నిధులూ ఎక్కువగా వచ్చాయని, దానికి చట్టమే అవకాశం కల్పించిందని తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలతో ఆంధ్రప్రదేశ్‌ని పోల్చడం సరికాదన్నారు. "వాళ్లు అభివృద్ధి చేసుకోలేకపోతున్నారు. మనం చేసుకుంటున్నాం. అది మన తప్పా. నా మీద నమ్మకంతోనే రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయి. కేంద్రం న్యాయం చేయకపోయినా మన అభివృద్ధి ఆగదు. వాళ్లు చట్టబద్ధంగా ఇవ్వాల్సినవి ఇస్తే మరింత వేగంగా అభివృద్ధి చెందుతాం...'' అని వివరించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం విషయంలో ఎందుకలా ప్రవర్తిస్తోందో అర్థం కావడం లేదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తాను కొన్ని విషయాల్లో ఆయనతో విభేదించినా, ఆయన మంచిగా తీసుకునేవారని, పరస్పరం ఒక నమ్మకంతో పనిచేసేవాళ్లమని, ఇప్పటి లాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురు కాలేదని చంద్రబాబు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు సహకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం సిద్ధంగా లేదన్న విషయం స్పష్టమవుతోందన్నారు.

జైలుకి పోతావంటే ఏ ఆట అయినా ఆడతాడు..!

"ఆందోళనలు, ధర్నాలు చేసినా హోదా రాదని... వచ్చే ఎన్నికల్లో వైకాపా 20 ఎంపీ స్థానాలు గెలుస్తుందని.... అప్పుడు ప్రత్యేక హోదా ఇస్తేనే భాజపాకి మద్దతిస్తామని వైకాపా ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి దిల్లీలో వ్యాఖ్యానించారని ఈ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ... " అంటే ఎన్నికలకు ముందు కలవమని, ఆ తర్వాత భాజపాతో జట్టుకడతామని చెబుతున్నట్టే కదా. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వవద్దని వాళ్లే చెబుతున్నట్టుగా ఉంది...'' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. జైలుకి పోతావంటే జగన్మోహన్‌రెడ్డి ఏ ఆట అయినా ఆడతాడని, అప్పుడు కాంగ్రెస్ కంట్రోల్‌లో ఉంటే... ఇప్పుడు భాజపా కంట్రోల్‌లో ఉన్నాడని ఆయన వ్యాఖ్యానించారు.

కేసీఆర్‌లా ఉంటే బాగుండేది?

మీరు కూడా తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌లా ఉంటే బాగుండేదని, కేంద్రానికి వ్యతిరేకంగా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులనూ కూడగడితే సత్తా తెలిసేదని, ఒక రాష్ట్రానికే పరిమితమైనందున కేంద్రం తక్కువ అంచనా వేస్తోందని కొందరు సభ్యులు వ్యాఖ్యానించారు. మీరు జాతీయ రాజకీయాల్లోకి వెళితే వాళ్లకు ఇబ్బంది ఎదురవుతుందని భావిస్తున్నారేమోనని మరికొందరు సభ్యులు ప్రస్తావించగా... ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందిస్తూ... తనకు ఆసక్తి లేదని, అలాంటివన్నీ తాను ఇది వరకే చూసేశానని తెలిపారు. జాతీయ రాజకీయాల్లో జోక్యం చేసుకుంటే దిల్లీకీ, ఇక్కడికీ తిరగాల్సి ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయాలన్నదే తన ఏకైక లక్ష్యంగా తెలిపారు.

పోరాడకపోతే ఎప్పటికీ న్యాయం జరగదు

ఈనాడు డిజిటల్, అమరావతి: నాడు కాంగ్రెస్ రాష్ట్రాన్ని విభజించి అన్యాయం చేస్తే... నేడు భాజపా సహకరించడం లేదని ప్రజలు నిందించే పరిస్థితి ఉందని సీఎం చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. మంగళవారం శాసనసభ కమిటీ హాల్‌లో జరిగిన తెదేపా శాసనసభాపక్ష సమావేశంలో మంత్రులు, శాసనసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ ధర్నా చేస్తుంటే రాహుల్‌గాంధీ హాజరై అధికారంలోకి వస్తే ప్రత్యేకహోదా ఇస్తామని ప్రకటించారు. ఇంకా అనేక పార్టీలు మద్దతు ఇస్తున్నాయి. ఇవన్నీ చూస్తుంటే మనది రాజకీయ పోరాటం కాదు ప్రజల మనోభావాలకు సంబంధించినది అని అందరికీ అర్థమవుతోంది. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని... నాడు రాజ్యసభలో ప్రధాని ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా నెరవేర్చాలని కోరుతున్నాం. ఇవే అంశాలను గవర్నర్ ప్రసంగంలోనూ చేర్చాం. స్వార్థం కోసమో, అవసరమైన దాని కన్నా ఎక్కువో అడగడం లేదు. మేం చేస్తోంది రాజకీయ పోరాటం కాదు. రాష్ట్ర ప్రజల మనోభావాల కోసం. అమరావతికి రూ.2500 కోట్లు ఇచ్చి... దాన్నే ఎక్కువంటున్నారు. కేంద్రం నుంచి పోలవరానికి రూ.3200 కోట్లు రావాల్సి ఉంది...' అని సీఎం చంద్రబాబు వివరించారు.

జాతీయ పార్టీలే అన్యాయం చేస్తే ఎలా..

విభజన సమయంలో రెండు జాతీయ పార్టీల తీరు ఆక్షేపణీయం. నాడు సమన్వయంతో వ్యవహరించి ఉంటే ఇలాంటి జటిల పరిస్థితి ఏర్పడి ఉండేది కాదు. సమస్య పరిష్కారిద్దామనో, అనుకూలంగా ఉంటుందనో విభజన చేశాయి. విభజన చేసినందుకు రాష్ట్రానికి న్యాయం చేయాలన్న బాధ్యత రెండు పార్టీలకు ఉందా? లేదా?. జాతీయ పార్టీలే మనకు అన్యాయం చేస్తే ఏ విధంగా ఆలోచించాలి? రాష్ట్రానికి కాంగ్రెస్ చేసిన అన్యాయాన్ని సరిదిద్దుతుందన్న నమ్మకంతోనే భాజపాతో పొత్తు పెట్టుకున్నాం. నాలుగేళ్లుగా ఏం చేశారని అందరూ అడుగుతున్నారు? ...' అని చంద్రబాబు పేర్కొన్నారు.

చరిత్రలో చూడలేదు

'వైకాపా లాంటి ప్రతిపక్షాన్ని నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో నేను ఎన్నడూ చూడలేదు. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ప్రతిపక్షం బడ్జెట్ సమావేశాలను బహిష్కరించడం దురదృష్టకరం. ఈ సమావేశాలు జరిగే అన్ని రోజులు సభ్యులంతా పాల్గొని చర్చలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రైతులు అమరావతి కోసం రూ.40 వేల కోట్ల విలువైన భూములిచ్చినందువల్లే ఇప్పుడు శాసనసభలో సమావేశాలు నిర్వహించుకుంటున్నాం...' అని చంద్రబాబు పేర్కొన్నారు.

● తెదేపా శాసనసభాపక్ష సమావేశంలో మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడుకు తెదేపా సంతాపం ప్రకటించింది. "ఆయన అనునిత్యం ప్రజల మధ్య ఉండే వ్యక్తి.." అని సీఎం చంద్రబాబు కొనియాడారు.

ఈశాన్య రాష్ట్రాలకు ఇస్తున్నవే మనకూ ఇవ్వమన్నాం

'మిత్రపక్షంగా ఉన్నాం కాబట్టే ఇప్పటివరకు గమ్మునున్నా.. లేదంటే ఇంకా ఎక్కువగా పోరాడే వాడ్ని.. ఈ విషయం గుర్తు పెట్టుకోండి..' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మంగళవారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా భాజపా శాసనసభ్యుడు ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రత్యేక హోదాతో అన్నీ వరదలా కొట్టుకొస్తాయనే అపోహలు ప్రజల్లో సృష్టిస్తున్నారన్నారు. 'ముఖ్యమంత్రి పలుసార్లు ప్రత్యేక హోదా వల్ల రాష్ట్రానికి రూ.3వేల కోట్లకు మించి రాదు.. దీని వల్ల పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందే అవకాశం లేదన్నారు.. ఈనాడు, ఆంధ్రజ్యోతి కటింగ్స్ ఉన్నాయి..' అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకుంటూ 'తప్పుదారి పట్టించడం (మిస్‌లీడ్) సరికాదు.. వారు చెబుతున్నట్లుగా రూ.3వేల కోట్ల కంటే ఎక్కువ రాదని నేను ఎప్పుడూ చెప్పలేదు. ఏదైనా సాక్షి పత్రికలో రాస్తే.. దాన్ని పట్టుకుని వారు మాట్లాడితే నేనేం చేయలేను..' అని స్పష్టం చేశారు. 'ప్రత్యేక హోదా ఎవరికీ ఇవ్వడం లేదు.. అదే స్థాయి ప్రయోజనాలు ఇస్తున్నామంటే.. దానిపై రాత్రి 12 గంటలకు నాతో మాట్లాడితే.. అన్ని ప్రయోజనాలు ఇస్తే తప్ప ఒప్పుకోనన్నాను.. అలాగే ఇస్తామన్నారు. అవీ ఇవ్వలేదు..' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈశాన్య రాష్ట్రాలకు ఇస్తున్నవే మనకూ ఇవ్వమని డిమాండు చేస్తున్నామన్నారు. 'ఇది తెలుగువారి మనోభావాలకు.. ఆత్మగౌరవానికి సంబంధించిన విషయం అనేది గుర్తుపెట్టుకోవాలి. చాలా ఓపిగ్గా 29 సార్లు దిల్లీకి తిరిగాను. మరోసారి దిల్లీకి రమ్మంటే పంపించాను...'' అని పేర్కొన్నారు. విభజన చట్టంలో పెట్టినవన్నీ చేయాలన్నారు. మీరు కూడా (భాజపా నాయకులు) దిల్లీకి వెళ్లి సమీక్ష చేయించండని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో మన హక్కుల సాధనలో రాజీ లేదని చంద్రబాబు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యేలకు ర్యాంకులు.. శాసనసభ సమావేశాల్లో మంగళవారం మంచి ప్రతిభ, పనితీరు కనబరిచిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ర్యాంకులిచ్చారు. పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో ముఖ్యమంత్రి వారి పేర్లు చదివి వినిపించారు. వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ రాజకీయ వ్యాఖ్య కేటగిరీలో మంత్రి అచ్చన్నాయుడు, ఉత్తమ ప్రజంటేషన్ విభాగంలో మరో మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఎంపికయ్యారు. మీడియా పాయింట్ వద్ద బాగా మాట్లాడిన వారిలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మొదటి స్థానంలోను, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న రెండో స్థానంలోను, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మూడో స్థానంలోను నిలిచారు. ఉత్తమ అనుబంధ ప్రశ్న విభాగంలో పిఠాపురం ఎమ్మెల్యే వర్మ ఎంపికయ్యారు.

ప్రత్యేక హోదాపైనే తొలి సంతకం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యంగా తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంగళవారం దిల్లీలో ఏపీపీసీసీ ప్రధాన కార్యదర్శి గిడుగు రుద్రరాజు అధ్యక్షతన నిర్వహించిన ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్షలో రాహుల్‌గాంధీ పాల్గొని మాట్లాడారు. 'మోదీ సర్కారు ఇంతకాలమైనా హోదా అమలు చేయలేదు.. అందరం కలిసి ఒత్తిడి తెస్తే నాడు యూపీఏ ఇచ్చిన హామీలు అమలయ్యేలా చేయవచ్చు' అని పేర్కొన్నారు. ఏపీపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. 'ప్రత్యేకహోదా ఆంధ్రుల హక్కు.. సాధించేవరకు పోరాటం కొనసాగుతుంది' అని చెప్పారు. ఏపీలో ప్రతిపక్షం అసెంబ్లీ సమావేశాలు బహిష్కరించిందని, అధికార పార్టీ ఒక్కటే సభలో ఏం చేస్తోందో అని వ్యాఖ్యానించారు. ఏఐసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొప్పుల రాజు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందాలంటే హోదా తప్ప వేరే మార్గం లేదన్నారు. ఏపీని కేంద్రం నిరాదరణకు గురి చేయడానికి చంద్రబాబు కారణమని మాజీ ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య ఆరోపించారు. అన్ని పార్టీల ఒత్తిడితోనే నాడు యూపీఏ ప్రభుత్వం రాష్ట్ర విభజన నిర్ణయం తీసుకుందని మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు తెలిపారు.

సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు రామకృష్ణ, మధు; ఆంధ్ర మేధావుల ఫోరం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, ఆర్జేడీ ఎంపీ జైప్రకాశ్‌యాదవ్, ఆప్ నేత సోమనాథ్ భారతి తదితరులు కాంగ్రెస్ దీక్షకు మద్దతు తెలుపుతూ మాట్లాడారు. కేంద్ర మాజీ మంత్రులు జేడీ శీలం, పళ్లంరాజు, ఎంపీలు కేవీపీ రామచంద్రరావు, సుబ్బరామిరెడ్డి, కాంగ్రెస్ నేతలు నాదెండ్ల మనోహర్, శైలజానాథ్, బాలరాజు, కమలమ్మ, రఫీఉల్లాబేగ్,





మంగళవారం దిల్లీలో ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న వైకాపా ఎంపీ సుబ్బారెడ్డి
● ప్రత్యేక హోదా కోసం మంగళవారం దిల్లీలో వినూత్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీ మహిళా సమాఖ్య (అనంతపురం జిల్లా) సభ్యులు

సుంకర పద్మశ్రీ, గంగాభవానీ, రమాదేవి, వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు, జగన్, పవన్ దిల్లీకి రావాలి

'అన్ని పార్టీల నేతలు దిల్లీలోనే ఉన్నారు. అసెంబ్లీ మానుకొని చంద్రబాబు, పాదయాత్రను ఆపి జగన్, కమిటీ నివేదికతో పవన్‌కల్యాణ్ తక్షణమే ఇక్కడకు రావాలి. అందరం కలిసి పోరాడుతూ ప్రధాని మోదీని నిలదీద్దాం' అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు ఇచ్చారు. ఆంధ్ర మేధావుల ఫోరం అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అధ్యక్షతన ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో మంగళవారం దిల్లీలో నిర్వహించిన ధర్నాలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి తెదేపా బయటకు వచ్చాకా చూద్దామన్న ధోరణిలో భాజపా ఉన్నట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు మాట్లాడుతూ.. చంద్రబాబుకి చిత్తశుద్ధి ఉంటే పశ్చాత్తాపం చెందాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి బయటకు రావాలని డిమాండు చేశారు. పార్లమెంటు వేదికగా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఐ రాజ్యసభ సభ్యుడు డి.రాజా అన్నారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ ఎంపీలు కేవీపీ, సుబ్బరామిరెడ్డి, వైకాపా ఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, విజయసాయిరెడ్డి, సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షుడు సదాశివరెడ్డి తదితరులు ధర్నాలో మాట్లాడారు. ఆంధ్ర మేధావుల ఫోరం గౌరవ సలహాదారు జార్జివిక్టర్, వైకాపా నేతలు బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరావు, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం అధ్యక్షుడు తిరుపతిరావు, ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు వలీఉల్లా ఖాద్రి తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేక హోదా రాకపోవడంతో అనంతపురం వంటి వెనకబడిన జిల్లాల్లో అభివృద్ధిలేక ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయంటూ మహిళలు సహా పలువురు ఉరితాళ్లకు వేలాడి నిరసన వ్యక్తంచేశారు.

ఇక ఎవరికీ ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత ప్రత్యేక కేటగిరీ హోదా ఉన్న రాష్ట్రాలకూ ఎలాంటి పన్ను మినహాయింపులు కొనసాగించబోరన్నది నిజమేనా?'' అన్న ప్రశ్నకు కేంద్రమంత్రి 'అవును' అని సమాధానమిచ్చారు. జీఎస్‌టీ కింద ప్రత్యేకహోదా రాష్ట్రాలకు ఎలాంటి ప్రత్యేక మినహాయింపులు, ప్రోత్సాహకాలు ఇవ్వరాదని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఈ నిర్ణయానికి కట్టుబడే ప్రత్యేకహోదా రాష్ట్రాలకు ఎలాంటి రాయితీలూ వర్తింపజేయడం లేదని తెలిపారు. ఆ రాష్ట్రాల్లో ఉన్న అన్ని పారిశ్రామిక యూనిట్లూ దేశంలోని మిగతా రాష్ట్రాల్లోని యూనిట్ల మాదిరిగానే కేంద్ర, రాష్ట్ర, సంయుక్త పన్నులు చెల్లించాల్సిందేనని పేర్కొన్నారు. కాకపోతే డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండస్ట్రియల్ పాలసీ అండ్ ప్రమోషన్ (డీఐపీపీ) 2017 అక్టోబర్ 5న నోటిఫికేషన్ ద్వారా... బడ్జెట్ మద్దతు పథకాన్ని ప్రకటించినట్లు పేర్కొన్నారు. దాని ప్రకారం ఆ రాష్ట్రాల్లోని పారిశ్రామిక యూనిట్లు ప్రభుత్వానికి చెల్లించిన కేంద్ర, సమీకృత పన్నుల్లో కొంతభాగాన్ని రీఫండ్ చేయనున్నట్లు తెలిపారు. ఇదివరకు సెంట్రల్ ఎక్సైజ్ నోటిఫికేషన్స్ పరిధిలోకి వచ్చే యూనిట్స్‌కు మాత్రమే రీఫండ్ పొందే అర్హత ఉంటుందని స్పష్టం చేశారు.

ఆర్థికశాఖదీ అదే మాట... ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా సాధ్యం కాదని ఆర్థికశాఖ అత్యున్నత స్థాయి వర్గాలు పేర్కొన్నాయి. సోమవారం కేంద్ర మంత్రి సుజనాచౌదరి, యనమల రామకృష్ణుడు బృందంతో చర్చల్లో పాల్గొన్న వర్గాలు మంగళవారం ఈమేరకు అభిప్రాయపడ్డాయి. "ఆ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు రాష్ట్రానికి ప్రత్యేకహోదా, ఈశాన్య రాష్ట్రాల తరహాలో పన్నురాయితీలు కల్పించాలని అడిగినమాట నిజమే. అయితే ప్రత్యేకహోదా సాధ్యం కాదు కాబట్టి అందుకు సమానమైన నిధులు అందిస్తామని చెప్పాం. 14వ ఆర్థికసంఘం సిఫార్సుల తర్వాత ఎవ్వరికీ ప్రత్యేకహోదా ఇవ్వడంలేదు. అందుకే ఇదివరకు చెప్పిన ప్రత్యేక ప్యాకేజీ నిధులు అందించడానికి కట్టుబడి ఉన్నాం. ఈశాన్య రాష్ట్రాల తరహాలో ఏపీకి పన్ను రాయితీలు ఇవ్వడం సాధ్యం కాదు. అలా చేస్తే ఏపీకంటే తక్కువ ఆర్థిక వనరులున్న బిహార్, పశ్చిమబంగ, ఒడిశా, ఉత్తరప్రదేశ్ లాంటి రాష్ట్రాలూ అడుగుతాయి. అప్పుడు పరిస్థితి మరింత జటిలమవుతుంది. గత నాలుగేళ్లలో ఏపీకి కేంద్రం రూ.12,500 కోట్ల సాయం చేసింది. ఇప్పటివరకూ దేనికీ లెక్కలు చెప్పలేదు. కేంద్రం ఏమీ సాయం చేయలేదని చెప్పి ఆంధ్రప్రదేశ్ నాయకులు అనవసరంగా తమకుతాము రాజకీయ ఒత్తిడి పెంచుకున్నారు. దాన్నుంచి బయటపడటానికే ఆందోళనలు చేస్తున్నారు. వీళ్లు ఇప్పుడు తెలుగు సెంటిమెంట్ అంటున్నారు. రేపు ఇలాగే తమిళం, మలయాళం సెంటిమెంట్ అంటూ మరికొందరు వస్తారు. రక్షణశాఖకు డబ్బులెందుకు అని అడుగుతారు. ఇప్పుడు యుద్ధం జరగటం లేదు కదా.. సైన్యానికి కేటాయించే డబ్బు మాకు ఇవ్వమని అడిగినా ఆశ్చర్యపోనక్కరలేదు.. అందువల్ల ఏపీకి ఇదివరకు చెప్పిన ప్యాకేజీకి మినహాయించి కొత్తగా రాయితీలు కల్పించడం సాధ్యం కాదు'' అని ఆ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

గ్రహం అనుగ్రహం


7-3-2018 బుధవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
షష్ఠి: తె. 4-08 తదుపరి సప్తమి
విశాఖ నక్షత్రం: రా. 12-44 తదుపరి అనూరాధ
అమృత ఘడియలు: మ. 3-27 నుంచి 5-08 వరకు
వర్జ్యం: ఉ.శే. 7-02 వరకు తిరిగి తె. 5-01 నుంచి
దుర్ముహూర్తం: మ. 11-47 నుంచి 12-34 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6-19; సూర్యాస్తమయం: సా.6-04

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కర్నూలు	38.7	22.0
విశాఖపట్నం	38.2	20.0
శ్రీకాకుళం	38.0	20.5
కడప	38.0	18.0
తిరుపతి	38.0	16.1
అనంతపురం	37.3	18.4
రాజమహేంద్రవరం	37.0	18.5
గుంటూరు	36.5	16.8
విజయవాడ	36.0	19.4
నరసాపురం	34.0	24.2
నెల్లూరు	34.0	20.0
ఒంగోలు	33.8	21.6
తాడేపల్లిగూడెం	32.5	21.5

ఇదీ సంగతి!



ఎంజీఆర్ పాలనను తలపిస్తాడట.

వ్యవ'సాయం చేస్తారా'?



• అన్నదాతల సమస్యలకు ఎన్నో పరిష్కారాలు • సర్కారు చొరవే కీలకం

పెట్టుబడి కోసం చేతిలో సొమ్ము.. పంట పండాక గిట్టుబాటు ధర.. మేమే కొంటామనే అభయం.. అన్నదాతలు సర్కారు నుంచి ఆశించే సాయం ఇదే. ఈ భరోసా లభిస్తే ఎంత కష్టాన్నైనా సునాయాసంగా నెత్తికెత్తుకుంటారు. ప్రభుత్వాల్లో ఈ ఆలోచన కొరవడటం వల్లనే గిట్టుబాటు ధర ఎన్నికల హామీగా మిగిలిపోతోంది. బడ్జెట్ బండి మాత్రం ఎక్కడం లేదు. ఈ సారైనా వ్యవ'సాయం' సరిగా అందుతుందా అనే ప్రశ్న రైతుల్లో వ్యక్తమవుతోంది.

బోనస్‌తో భరోసా..

సమస్య: గిట్టుబాటు ధరలే రైతుకు అసలు సమస్య. ఇది లేకనే అప్పుపాలై మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యల ఆలోచన చేస్తున్నారు.

ఏం చేయాలి: పంట పెట్టుబడికి రైతు శ్రమ కింద 50శాతం కలిపి ధర నిర్ణయించాలి. కేంద్రం తక్కువగా ఇచ్చినా ఆ తేడాను రాష్ట్రం బోనస్ రూపంలో భరించాలి. పసుపు, మిర్చి, కూరగాయలు, ఉల్లి, పండ్ల ఉత్పత్తులకూ గిట్టుబాటు ధరలివ్వాలి. రేటు బాగుందంటే రైతుల్లో మానసికస్థైర్యం పెరుగుతుంది.

ప్రతి రైతుకూ యాంత్రీకరణ ఫలం

సమస్య: యంత్రాల రాయితీ పథకాల్లో రాజకీయ జోక్యం పెరుగుతోంది. నేతల సిఫార్సు లేనిదే రైతులకు యంత్రం అందడంలేదు.

ఏం చేయాలి: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన వెంటనే అర్హులైతే వెంటనే మంజూరు చేయాలి. నేతలు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరిగే విధానం తప్పించాలి. వ్యవసాయ, అనుబంధ విభాగాలన్నిటిలో యంత్రపరికరాలను రాయితీపై రైతులకు అందించేలా ఏకీకృత వ్యవస్థ ఏర్పాటు చేయాలి.

పంటల నమోదు.. ఉచితంగా బీమా

సమస్య: పంట విస్తీర్ణం లెక్కలపై స్పష్టత లేదు. ఈ-పంట(ఈ-క్రాపింగ్) తూతూమంత్రమే. అమ్మకాల సమయంలో ప్రభుత్వం వీటినే పరిగణనలోకి తీసుకోవడంతో అందులో పేర్లులేని రైతులు విక్రయించుకోలేక పోతున్నారు. వ్యవసాయాధికారి సాగు ధ్రువీకరణ పత్రాలిచ్చినా అవి పెద్దలకే వరమవుతున్నాయి. బ్యాంకులు వసూలు చేసే బీమా రుసుముకు లెక్కల్లేవు. రశీదులివ్వరు.

ఏం చేయాలి: పొగాకు తరహాలో ఖరీఫ్, రబీ ముందే ఏ సర్వే నంబరులో ఏ పంటలు వేయబోతున్నారో నమోదు చేయాలి. ఈ రైతులకు నామమాత్ర రుసుముతో ఉచిత పంటల బీమా, వ్యక్తిగత బీమా అందించాలి. బ్యాంకుల ద్వారా విచ్చలవిడి బీమా వసూళ్లు నిలిపేయాలి.

రైతు పరపతి పెరగాలి

సమస్య: పురుగు విజృంభించిన సందర్భాల్లో రైతులు పంటనష్టపోతుంటారు. అప్పులు, వడ్డీల భారం పెరుగుతోంది. కొన్నిచోట్ల ఒక్కో బ్యాంకు పరిధిలో 10 నుంచి 20 గ్రామాలుంటున్నాయి. రుణ మంజూరులో జాప్యం జరుగుతోంది.

ఏం చేయాలి: కౌలు రైతులతో సహా సాగుదారులందరికీ పరపతి పెరగాలంటే బ్యాంకులతో సంబంధాలు పెరగాలి. 5వేల జనాభా లోపు గ్రామాల్లో కూడా శాఖలు ఏర్పాటు చేయించాలి. పత్రాలంటూ వేధించకుండా ఈసీ, అడంగులు, 1బి ఆన్‌లైన్‌లో చూసుకుని రుణాలిచ్చే వెసులుబాటు ఉండాలి.

యువతకు ప్రాధాన్యం

సమస్య: రైతులు, రైతు కూలీల్లో సింహభాగం 50 నుంచి 70ఏళ్ల లోపువారే. యువత ఎంతో ఆసక్తిగా వ్యవసాయంలోకి అడుగిడుతున్నా నష్టభయం వెంటాడుతోంది. దీంతో వ్యవసాయం వదిలి పట్టణబాట పడుతున్నారు.

ఏం చేయాలి?: గ్రామాల్లో యువ రైతులతో సంఘాలు ఏర్పాటు చేసి కార్పస్‌ఫండ్ అందించాలి. పంటల సాగు, మార్కెట్ అవకాశాలపై శిక్షణ ఇవ్వాలి. అద్దె యంత్రాల యూనిట్లు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించాలి. పంట ఉత్పత్తుల రవాణా, నిల్వ, కోల్డ్‌చైన్ విధానాల్లో భాగస్వాములుగా చేయాలి.

ఏడాదంతా కొనుగోళ్లు.. ప్రత్యేక నిధి

సమస్య: ధరలు తగ్గిన సమయంలో పంట ఉత్పత్తుల కొనుగోలుకు మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్‌లు రంగంలోకి దిగేలోగానే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది.

ఏం చేయాలి: ఏడాదిలో ఎప్పుడు మార్కెట్‌కెళ్లినా గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేసే విధానం అవసరం. మార్క్‌ఫెడ్, ఆయిల్‌ఫెడ్, పౌరసరఫరాలశాఖ. . అంటూ విభజించకుండా ఏకీకృత వ్యవస్థను ఏర్పాటుచేసి కొనుగోలు చేయించాలి. రూ.1,000కోట్లతో మార్కెట్ జోక్యం నిధి అందుబాటులో ఉంచాలి. దీని వల్ల వ్యాపారులు ఇష్టానుసారం ధరలు తగ్గించే అవకాశం ఉండదు.

- ఈనాడు, అమరావతి

విద్యాహక్కు చట్టం అమలుపై వివరాలు సమర్పించండి

• తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం
• నిబంధనలు అమలు కాకపోవడంపై అసంతృప్తి

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో విద్యాహక్కు చట్టం(ఆర్టీఈ) నిబంధనలు అమలు కాకపోవడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తంచేసింది. చట్టం అమలు తీరుపై పూర్తి వివరాలతో ప్రమాణపత్రాలు దాఖలు చేయాలని అధికారుల్ని ఆదేశించింది. వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ, తెలంగాణ, ఏపీ పాఠశాల విద్యాశాఖ కార్యదర్శులు, విద్యాశాఖ కమిషనర్లకు నోటీసులు జారీచేసింది. చట్టం 2010లో అమల్లోకి వచ్చినా ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించింది. ప్రైవేటు అనెయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు అర్హులైన పేద విద్యార్థులకు ఉచితంగా ఎందుకు కేటాయించలేదని అడిగింది. ప్రతివాదులు ప్రమాణ పత్రాలు దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్, జస్టిస్ కె.విజయలక్ష్మిలతో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీచేసింది. ఆర్టీఈ చట్టంలోని నిబంధలను అమలు చేయాలని అభ్యర్థిస్తూ వనపర్తి జిల్లా ఆత్మకూరు గ్రామానికి చెందిన వై.తిప్పారెడ్డి హైకోర్టుకు లేఖ రాశారు. ఆ లేఖను న్యాయస్థానం తనకు తానుగా (సుమోటో) ప్రజాహిత వ్యాజ్యంగా పరిగణించింది. ఆర్టీఈ చట్టం అమలు కోసం న్యాయ విద్యార్థి తాండవ యోగేష్ గతేడాది ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ రెండు వ్యాజ్యాలపై హైకోర్టు మంగళవారం సంయుక్తంగా విచారణ జరిపింది. యోగేష్ వాదనలు వినిపిస్తూ.. పేద విద్యార్థులకు 25 శాతం సీట్ల కేటాయింపు దేశంలోని పలు రాష్ట్రాల్లో అమలవుతోందని, తెలుగు రాష్ట్రాల్లో అమలు కావడం లేదని తెలిపారు. ఏపీలో ఓ మంత్రికి ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయని, ప్రైవేటు పాఠశాలల్లో చట్టం అమలు కోసం తెచ్చిన జీవోలపై న్యాయస్థానం స్టే ఇస్తే దాన్ని ఎత్తివేయడానికి ప్రభుత్వం ఎలాంటి యత్నం చేయడం లేదని తెలిపారు. ప్రైవేటు యాజమాన్యాలు అధికారులతో కుమ్మక్కయ్యాయన్నారు.

బోయ వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చొద్దు

• లంబాడాలను జాబితా నుంచి తొలగించాలి
• దేశరాజధానిలో ఆదివాసీల నిరసన

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చొద్దని, తెలంగాణలో లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తెలుగు రాష్ట్రాల ఆదివాసీలు డిమాండు చేశారు. మంగళవారమిక్కడ వందలాది మంది ఆదివాసీలు సంప్రదాయ నృత్యాలైన గుస్సాడి, చెంచు నృత్యాలు, డప్పులు, కొమ్ముబూరాలతో పార్లమెంటు వీధిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ, తెలంగాణల్లో ఆదివాసీలు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. విద్య, వైద్యం, రాజకీయం ఇలా ఏ రంగంలో చూసినా అన్యాయం జరుగుతోందన్నారు. ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే రెండువేల మంది వేరే కులాలవారు బెంతొ ఒరియా ధ్రువపత్రాలతో ఉద్యోగాలు చేస్తున్నారని ఆరోపించారు. దిలీప్‌సింగ్ భూరియా సిఫార్సుల మేరకు తెలుగు రాష్ట్రాల్లోని 805 గ్రామాలను ఐదో షెడ్యూలులో కలపాలని డిమాండు చేశారు. తెలంగాణలో ఆదివాసీలకు న్యాయంగా లభించాల్సిన రాజ్యాంగ హక్కులు దక్కడం లేదన్నారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు నాశనం చేసేలా ఆదిలాబాద్‌లో చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసి ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం (ఏఈడబ్ల్యూసీఏ) తెలంగాణ అధ్యక్షుడు వెంకటరమణ, మెట్లపాపయ్య, మంచు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ఏపీ నుంచి సవర రాంబాబు, యోగేశ్వరరావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏపీలో ఆదివాసీల హక్కులు పరిరక్షించాలంటూ కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి జుయెల్ ఓరానికి ఏపీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ జూనియర్ వైద్యుల సమ్మె విరమణ

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ జూనియర్ వైద్యులు తాత్కాలికంగా తమ సమ్మెను విరమించారు. డిమాండ్ల పరిష్కారంలో భాగంగా సీనియర్ రెసిడెంట్ వైద్యుల గౌరవ వేతనాన్ని పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. దీంతో తాత్కాలికంగా సమ్మెను విరమిస్తున్నట్లు వైద్యుల సంఘం తెలిపింది.

హజ్ వాలంటీరు యాత్రకు దరఖాస్తుల ఆహ్వానం

ఈనాడు డిజిటల్, అమరావతి: హజ్ వాలంటీరు(ఖాదిముల్ హుజ్జాజ్)గా 2018 హజ్ యాత్రకు వెళ్లాలనుకుంటున్న వారి నుంచి కేంద్ర హజ్ కమిటీ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రభుత్వ లేదా ప్రభుత్వరంగ సంస్థల్లో పనిచేస్తూ 25-58 ఏళ్ల మధ్య వయస్సున్న సంపూర్ణ ఆరోగ్యవంతులు మాత్రమే ఇందుకు అర్హులని హజ్ కమిటీ కార్యనిర్వహణాధికారి లియాఖత్ అలీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 24 లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇతర అర్హతలు, నిబంధనలు, వివరాలకు www.hajcommittee.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ఆ వీసా వినియోగించుకోవచ్చు!



ఈనాడు, హైదరాబాద్: అమెరికా వీసాలకు సంబంధించి వివిధ అంశాలపై 'అమెరికాయానం' పేరిట పాఠకుల నుంచి 'ఈనాడు' ఆహ్వానించిన ప్రశ్నలకు... హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ జనరల్ అధికారులు సమాధానాలిచ్చారు. అవి ఇలా ఉన్నాయి...

ప్రశ్న: **డిపెండెంట్ వీసాపై అమెరికాలో ఉంటున్నాను. దాన్ని విద్యార్థి వీసాగా మార్చుకోవచ్చా? అందుకు ప్రక్రియ ఏమిటి?** **- ఎం.పరిమళ**

జవాబు: డిపెండెంట్ వీసాపై ఉన్న వారికీ, ఇతరులకూ విద్యార్థి వీసా ప్రక్రియ ఒక్కటే. అమెరికాలో ఉండగా నాన్ ఇమిగ్రెంట్ వీసా స్థాయిని మార్చుకునేందుకు ఉన్న అవకాశాల కోసం www.uscis.gov ను చూడండి. అమెరికా బయట ఉండి వీసా కోసం దరఖాస్తు చేయాలనుకున్నప్పుడు, అపాయింటుమెంటు షెడ్యూల్ తదితర సమాచారం కోసం ustraveldocs.com/in ను చూడండి. అమెరికాలో చదువుకునేందుకు మరింత సమాచారం కోసం educationusa.state.gov ను పరిశీలించండి.

ప్ర: **ఓటీపీపై అమెరికాలో ఉన్నాను. 2019 మార్చి వరకు చెల్లుబాటులో ఉంది. 2021 వరకు నా పాస్‌పోర్టు చెల్లుబాటులో ఉంది. భారతదేశం వద్దామనుకుంటున్నాను. హైదరాబాద్‌లో వీసా స్టాంపింగ్ వేయించుకోవాలా? లేదా చెల్లుబాటయ్యే ఆ పత్రాలతో ప్రయాణం చేయవచ్చా?** **- అలివేణి కంది**

జ: విద్యా కార్యక్రమంలో ఓటీపీని భాగస్వామిగానే పరిగణిస్తారు. మీ ఎఫ్-1 వీసా ఇంకా ఆ విభాగంలోనే ఉండడంతోపాటు చెల్లుబాటయ్యే వీసా ఉండి మీ విశ్వవిద్యాలయం, ఎస్ఈవీఎస్ నంబరు, విద్యా కార్యక్రమంలో మార్పులులేని పక్షంలో భారతదేశం వచ్చి తిరిగి అమెరికా వెళ్లేందుకు ప్రస్తుత వీసాను మీరు వినియోగించుకోవచ్చు. వాటిల్లో మార్పులున్న పక్షంలో భారతదేశంలో ఉండగానే ఎఫ్-1 వీసా కోసం దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. విద్యార్థి వీసా(ఎఫ్-1) కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన సమాచారం కోసం www.ustraveldocs.com/in ను చూడండి.

ప్ర: **నాకు ఎల్-1 వీసా ఉంది. తల్లిదండ్రులను వెంట తీసుకెళ్లవచ్చా? వారికి డిపెండెంట్, పర్యాటక వీసాల్లో దేనికి దరఖాస్తు చేసుకోవాలి?** **- ప్రవీణ్ మానేపల్లె**

జ: ఎల్-2 డిపెండెంట్ వీసా అనేది ఎల్-1 వీసాదారు భార్య, పిల్లలకు మాత్రమే వర్తిస్తుంది. నాన్ ఇమిగ్రెంట్ వీసా ప్రక్రియలో తల్లిదండ్రులు, బంధువులు డిపెండెంట్ వీసాకు అర్హులు కాదు. అమెరికాలో పర్యటించేందుకు మీ తల్లిదండ్రులు బి1/బి2 వీసాకు దరఖాస్తు చేసుకోవాలి. బి1/బి2 వీసాదారులు గరిష్ఠంగా ఆరు నెలలే అమెరికాలో ఉండేందుకు అనుమతిస్తారు. అది కూడా అమెరికా ప్రవేశ ప్రాంతంలో నిర్ధారిస్తారు. బి హోదాతో మీ తల్లిదండ్రులు మీతో ఉండలేరు. మరింత సమాచారం కోసం www.ustraveldocs.com/in ను చూడండి.

ప్ర: **ఇటలీలో మాస్టర్స్ చదువుతున్నా. రెండు నెలల్లో అది పూర్తవుతుంది. అమెరికాలో పీహెచ్‌డీ చేద్దామనుకుంటున్నా. స్కాలర్‌షిప్ లభించే అవకాశం ఉందా?** **- శ్రీనివాస్ కేతేపల్లి**

జ: అమెరికాలోని పలు విశ్వవిద్యాలయాలు గ్రాడ్యుయేట్స్‌కు ఉపకార వేతనాలు, ఇతర ఆర్థిక చేయుతను అందిస్తున్నాయి. ఇందుకోసం ప్రతి విశ్వవిద్యాలయం వేర్వేరు విధానాలను అనుసరిస్తాయి. మీరు ఎక్కడ చదవాలని నిర్ణయించుకుంటారో ఆ విద్యా సంస్థలోని ఆర్థిక చేయూత కార్యాలయాన్ని నేరుగా సంప్రదిస్తే మరింత సమాచారం అందుతుంది. ఉపకారవేతనాలు, అమెరికాలో చదువుకునే అంశాలపై www.usief.org.in ను పరిశీలించండి.

- ☛ వీసాలకు సంబంధించిన నిర్దుష్టమైన అంశాలు, తిరస్కారాలపై సందేహాలను support india@ustraveldocs.com కు ఈ-మెయిల్ చేయండి.
- ☛ మరింత సమాచారం కోసం హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ వెబ్‌సైట్ http://hyderabad.usconsulate.gov ను సంప్రదించవచ్చు.
- ☛ హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ కార్యాలయం అందించే వీసా తదితర సేవలకు సంబంధించిన ప్రశ్నలను usvisa@eenadu.net కు పంపగలరు.

చదువుల్లో 'జై'.. స్వాల్!

11 ఏళ్లకే డిగ్రీ తొలి సెమిస్టర్‌లో ఉత్తీర్ణత

ఈనాడు, హైదరాబాద్: తొమ్మిదేళ్లలోనే పదో తరగతి.. పదేళ్లలోనే ఇంటర్.. పదకొండేళ్లలోనే డిగ్రీ తొలి సెమిస్టర్.. ఇలా ప్రతీ దాంట్లోనూ అత్యధిక మార్కులు సాధిస్తూ రికార్డులు సృష్టిస్తున్నాడు హైదరాబాద్ కాచిగూడకు చెందిన అగస్త్య జైస్వాల్. తెలంగాణలోనే అతి చిన్న వయస్సులో పది, ఇంటర్ పూర్తి చేసిన రికార్డులను అగస్త్య ఖాతాలో వేసుకున్నాడు. తాజాగా డిగ్రీ బీఏ మాస్ కమ్యూనికేషన్ జర్నలిజంలో మొదటి సంవత్సరం 6.11 ఎస్‌జీపీఏతో ఉత్తీర్ణుడై మరో రికార్డును సృష్టించాడు. అగస్త్య జైస్వాల్ యూసుఫ్‌గూడలోని సెయింట్ మేరీస్ కళాశాలలో చదువుతున్నాడు. అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి నైనాజైస్వాల్‌కు అగస్త్య జైస్వాల్ సోదరుడు. జైస్వాల్ ఉత్తీర్ణత సాధించడంతో కుటుంబసభ్యులు అభినందించారు.



అగస్త్యకు మిఠాయిని తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

నేర నేతల విచారణ న్యాయస్థానం నేడు ప్రారంభం

ఈనాడు - అమరావతి, విజయవాడ న్యాయవిభాగం - న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లోని ఎమ్మెల్యేలు, ఎంపీలపై నమోదైన క్రిమినల్ కేసులను త్వరితగతిన విచారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానం బుధవారం ప్రారంభం కానుంది. విజయవాడలోని న్యాయస్థానాల ప్రాంగణంలో సాయంత్రం 5 గంటలకు ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.రామసుబ్రమణియన్ డిజిటల్ విధానం ద్వారా ప్రారంభించనున్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ న్యాయస్థానాన్ని ఏర్పాటు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు విడుదల చేసిన సంగతి తెలిసిందే. విజయవాడ 8వ అదనపు జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి నేతల రమేష్‌బాబు ఈ ప్రత్యేక న్యాయస్థానానికి ఇన్‌ఛార్జి న్యాయమూర్తిగా వ్యవహరించనున్నారు. నూతన న్యాయస్థానం ప్రారంభోత్సవ ఏర్పాట్లను విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయస్థానం న్యాయమూర్తి రవీంద్రబాబు పరిశీలించారు. ఈ ప్రారంభోత్సవంలో కృష్ణాజిల్లా ప్రధాన జిల్లా న్యాయమూర్తి లక్ష్మణరావు, న్యాయవాదులు పాల్గొననున్నారు.

ఏప్రిల్ నెలాఖరుకల్లా జర్నలిస్టుల ఇళ్లకు సమగ్ర విధానం

మంత్రి కాలవ శ్రీనివాసులు వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: జర్నలిస్టుల ఇళ్లకు సంబంధించిన సమగ్ర విధానం ఏప్రిల్ నెలాఖరుకల్లా సిద్ధమయ్యే అవకాశం ఉందని సమాచార శాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఇందుకోసం తనతోపాటు మంత్రి పి.నారాయణ, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్‌తో కమిటీని నియమించనున్నట్లు వెల్లడించారు. కమిటీకి కన్వీనర్‌గా సమాచార శాఖ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ వ్యవహరిస్తారని తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఏపీ జర్నలిస్టుల సమాఖ్యతో మంత్రి సమావేశమయ్యారు. గృహవసతికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చే రాయితీ కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించే ప్రతిపాదన పరిశీలనలో ఉందని పేర్కొన్నారు. మార్చి నెలాఖరునాటికి కొత్త అక్రిడేషన్లు జారీ అయ్యేలా చూస్తామన్నారు. మృతి చెందిన జర్నలిస్టు కుటుంబానికిచ్చే పెన్షన్‌ను రూ.3 వేలకు పెంచే ప్రతిపాదన పరిశీలనలో ఉందన్నారు. సహజంగా మరణించిన జర్నలిస్టు.. కుటుంబాలను సైతం ఆదుకునేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు.

రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలి

• సచివాలయం ముందు ధర్నా నిర్వహించిన ఆర్‌హెచ్‌ఎస్‌ఎస్

ఈనాడు డిజిటల్, అమరావతి: రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలని రాయలసీయ హైకోర్టు సాధన సమితి(ఆర్‌హెచ్‌ఎస్‌ఎస్) డిమాండ్ చేసింది. మంగళవారం మధ్యాహ్నం వెలగపూడిలోని సచివాలయం ముందు ధర్నా నిర్వహించింది. ఆర్‌హెచ్‌ఎస్‌ఎస్ ఐకాస కోకన్వీనర్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. రాయలసీమలో హైకోర్టు విషయమై ఇప్పటికే మంత్రులకు అనేక సార్లు విజ్ఞాపన చేసినా, పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించేంత వరకూ తాము వెనుకడుగు వేయబోమన్నారు. కార్యక్రమంలో రాయలసీమ జిల్లాల న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎంసీజీ ఒప్పందంతో వ్యవసాయ రంగానికి మేలు

ఆమ్‌వే ఇండియా సీఈవో

ఈనాడు, విశాఖపట్నం: దేశంలోని ప్రముఖ ఫుడ్ అండ్ మాన్యుఫాక్చర్ అండ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) కంపెనీతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందంతో వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని ఆమ్‌వే ఇండియా సీఈవో అన్షు బుధ్‌రాజ్ తెలిపారు. గత నెలలో విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షాన ఆమ్‌వే ఇండియాతో ఈ ఒప్పందం కుదిరిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ వివరాలను మంగళవారం వెల్లడించారు. రాష్ట్రంలో సేంద్రియ ఉత్పత్తులకు సహకారం అందించేలా ఈ ప్రాజెక్టు రూపుదిద్దడానికి, స్థానిక ఉత్పత్తులను దేశంలో తయారయ్యే న్యూట్రిలైట్ ఉత్పత్తుల కోసం ఉపయోగించేలా ప్రణాళికలు చేస్తున్నట్లు చెప్పారు.



అమరావతికి నిరంతర వెలుగులు

• రూ.500 కోట్లతో విద్యుత్తు లైను

పోలవరం, న్యూస్‌టుడే: కేంద్ర పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నవ్యాంధ్ర రాజధాని అమరావతికి నిరంతరం(అంతరాయం లేకుండా) విద్యుత్తు సరఫరా చేసేందుకు తూర్పుగోదావరి జిల్లా వేమగిరి నుంచి గుంటూరు జిల్లా నరసరావుపేట వరకు వేస్తున్న ప్రత్యేక లైను పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కేంద్ర పవర్ గ్రిడ్ కార్పొరేషన్ రూ.500 కోట్లతో ఈ పనులు చేపట్టింది. రాజమహేంద్రవరం, నూజివీడు, నందిగామ డివిజన్ల పరిధిలోని విద్యుత్తు శాఖ అధికారులు ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. 765 కిలోమీటర్ల పొడవున నిర్మించే ఈ లైనులో రెండు చోట్ల కృష్ణా, గోదావరి నదులను దాటాల్సి ఉంటుంది. 750 టవర్లు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం పోలవరం మండలం గూటాల వద్ద టవర్ నిర్మాణ పనులు సాగుతున్నాయి. గోదావరి మధ్యలో ఇసుక తిన్నెలపై సిమెంటు స్తంభాల నిర్మాణం పూర్తి చేశారు. వాటిపై టవర్ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. మే నెలాఖరుకు పనులు పూర్తి చేసేలాచర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు.

గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణకు సమష్టి కృషి

• ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి తోడుగా ముందుకొచ్చిన ధన్ ఫౌండేషన్, ఐఎస్‌బీ తదితర సంస్థలు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: గ్రామీణ పేదలకు వైద్య పరీక్షలు, సేవలను అందించేందుకు ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ (ఎల్వీపీఈఐ), ధన్ ఫౌండేషన్‌తోపాటు మరి కొన్ని సంస్థలు ముందుకొచ్చాయి. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో ఎల్వీప్రసాద్ ఆసుపత్రి.. నేత్ర సంరక్షణకు అమలు చేస్తున్న విధానాన్ని అన్ని రకాల అనారోగ్య సమస్యలకు వర్తింపజేసి వైద్యసేవలు విస్తృతంగా అందించాలని సిద్ధమవుతున్నాయి. బంజారాహిల్స్‌లోని ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థలో మంగళవారం దీనిపై మేధోమథన సదస్సు నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆసుపత్రి వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ జి.ఎన్.రావు మాట్లాడుతూ.. వైద్యం, విద్య, జీవనోపాధిలో అందరికీ సమాన అవకాశాలు అందించాలని ఈ ఆలోచన చేసినట్లు తెలిపారు. ఎల్వీపీఈఐ, ధన్ ఫౌండేషన్, ఐఎస్‌బీ, ఫెర్నాండెజ్ ఆసుపత్రి, మీడియం హెల్త్‌కేర్ కన్సల్టింగ్, అమేయ లైఫ్, వాత్సాల్య డెంటల్, డాక్టర్స్ ఫర్ సేవా, స్మైల్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కోలో-ప్రాక్టాలజీ, సాక్షమ్, నానో హెల్త్ సంస్థల ప్రతినిధులు ఇందులో పాలుపంచుకునేందుకు ముందుకు వచ్చారన్నారు.

ఈనాడు

జాతికి రక్షణ ఛత్రంగా...

కొండనాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడిన చందంగా పొలాల్లో కీటక నాశనుల విచ్చలవిడి వినియోగం దేశాన్ని పలు విధాలుగా దెబ్బతీస్తోంది. పంటలకు ఎలాంటి పురుగు ఆశిస్తే ఏ మోతాదులో ఏయే మందులు పిచికారీ చెయ్యాలన్న శాస్త్రీయ అవగాహన బడుగురైతుకు కొరవడటం, నిద్రాగ్రస్త యంత్రాంగాల సాక్షిగా నకిలీ కీటక నాశనులు మార్కెట్లను ముంచెత్తి, రైతు సంహారకాలుగా మారడం- సతత హరిత విప్లవ ఆకాంక్షలకు కసిగా తూట్లు పొడుస్తున్నాయి. నిరుడు ద్వితీయార్ధంలో ఉభయ తెలుగు రాష్ట్రాలు సహా మహారాష్ట్ర, తమిళనాడు, పంజాబ్, ఒడిశాల్లో కీటక నాశనుల పిచికారీ వికటించి 50మంది దాకా అభాగ్య రైతులు మృత్యువాత పడటం తెలిసిందే. అమెరికా, జపాన్, చైనాల తరవాత ప్రపంచంలో నాలుగో అతిపెద్ద పురుగుమందుల ఉత్పత్తి కేంద్రమైన ఇండియాలో ఈ తరహా అరాచకం నిశ్చేష్టపరచేదే! రైతాంగాన్ని రక్షించి, పురుగు మందుల సురక్షిత వినియోగాన్ని ప్రోత్సహించేందుకంటూ మోదీ ప్రభుత్వం గత నెల మూడోవారంలో కీటక నాశనుల నిర్వహణ ముసాయిదా బిల్లును తెచ్చి అందరి అభిప్రాయాలూ కోరింది. 1968నాటి చట్టం స్థానే కొత్తగా పట్టాలకెక్కాల్సిన బిల్లుకు మూడు నెలల్లో తుదిరూపు ఇచ్చి అమలు చేస్తామని కేంద్రం చెబుతున్నా- దానితో ముడివడిన అన్ని వర్గాలవారిదీ ఒకటే మాట. పంట నష్టాల్ని తగ్గించి ఉత్పాదకత పెరుగుదలకు దోహదపడాల్సిన పురుగుమందుల రంగంలో పారదర్శకత, జవాబుదారీతనాలతో లైసెన్స్ రాజ్‌కు తావులేని గట్టి నియంత్రణలుండాలంటున్నవారు- ప్రతిపాదిత బిల్లులో కొన్నింటి నిర్వచనాలు న్యాయవివాదాలకు అంటుకట్టే ప్రమాదాన్నీ ప్రస్తావిస్తున్నారు. మారిన కాలమాన పరిస్థితులకు అనుగుణంగా లేని యాభయ్యేళ్లనాటి చట్టం- ఎకాయెకి 40 శాతానికి చేరిన నకిలీల చీడను ఏం చెయ్యలేక చేతులెత్తేస్తోంది. దాని స్థానే తెస్తున్న చట్టమైనా రైతుజన శ్రేయస్సాధకంగాను, కొత్త పరిశోధనలకు ఊపిరులూది రసాయనిక అవశేషాల పీడలేని ఆహారోత్పత్తులకు రాచబాట పరచేదిగాను వన్నెలీనాలి!

దేశీయంగా తొలి హరిత విప్లవం వేరూనుకొన్న తొలి ఏళ్లలోనే- కీటక నాశనుల దిగుమతి, నమోదు, ఉత్పాదన, విక్రయం, రవాణా, పంపిణీ, వినియోగాలను సమగ్రంగా నియంత్రించేందుకు 1968లో చట్టం చేశారు. పిమ్మట మూడేళ్లకు చేసిన నిబంధనలే ఇటీవలి దాకా దిక్కు! రసాయన పురుగు మందుల విచ్చలవిడి వాడకంవల్ల మనుషులు, జంతువులతోపాటు పర్యావరణానికీ తీవ్ర హాని కలుగుతున్న వాస్తవాన్ని ఆలస్యంగా గుర్తించిన యూపీఏ సర్కారు 2008లో కీటక నాశనుల నిర్వహణ బిల్లును ప్రతిపాదించింది. ఆహార భద్రత ప్రమాణాల చట్టం నిర్దేశించిన పరిమితులకు లోబడే ఆయా పంటలపై రసాయన అవశేషాలు ఉండేటట్లయితేనే కీటక నాశనుల నమోదు సాగుతుందంటూ నాడు ఆర్భాటంగా చేసిన ప్రతిపాదనలు, వాటికి మరిన్ని మెరుగులద్దుతూ పార్లమెంటరీ స్థాయీసంఘం చేసిన సూచనలూ దస్త్రాలు దాటి బయటకొచ్చిందీ లేదు; బిల్లు చట్టరూపం దాల్చిందీ లేదు. తనవంతుగా మోదీ ప్రభుత్వం- రసాయన పురుగుమందుల నియంత్రణ నియమావళిలో సవరణలు తెచ్చి, కీటక నాశనుల తయారీ విక్రయాలను కట్టుదిట్టం చెయ్యాలని 2016 ఫిబ్రవరిలో ఆదేశించింది. ప్రతి పురుగు మందుల సంచీపైనా అందులోని రసాయనాల వివరాలు, మనుషులపై వాటి ప్రభావ తీవ్రతను తప్పనిసరిగా ముద్రించాలని నాడే నిర్దేశించినా, అది పక్కాగా అమలవుతోంది ఎక్కడ? ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు నిషేధించిన 67 రకాల పురుగు మందుల్లో 51 కీటక నాశనులు ఇండియాలో నిక్షేపంగా వినియోగంలో ఉన్నాయని నిరుడు మోదీ ప్రభుత్వం దిల్లీ హైకోర్టుకు తానే నివేదించింది. ఇలా తాళ ప్రమాణాలకు చేరిన అవ్యవస్థ- ప్రత్యక్షంగా రైతులకు, పరోక్షంగా 130 కోట్ల జనావళికి చెరుపు చేస్తున్న నేపథ్యంలో శాస్త్రీయ స్పృహతో దిద్దుబాటు చర్యలు చట్టబద్ధంగా పట్టాలకెక్కాలి!

ఇతర దేశాల్లో కీటక నాశనుల నియంత్రణ వ్యవసాయశాఖ పరిధిలో లేకుండా, ఆరోగ్య శాఖ అజమాయిషీలో ఉండటం- వాస్తవిక దృక్పథానికి దిక్సూచి. పురుగు మందుల వాడకాన్ని హేతుబద్ధీకరించడం పలు దేశాల్లో సురక్షిత, ఆరోగ్యకర సేద్య సంస్కృతిగా స్థిరపడింది. వరిక్షేత్రాల్లో రసాయన ఎరువుల వాడకాన్ని 65 శాతం దాకా తెగ్గోసిన ఇండొనేసియా రైతు 15 శాతం అధిక దిగుబడి సాధించాడని, కీటక నాశనుల వినియోగాన్ని కట్టడి చేసి మంచి ఫలితాలు సాధించడంలో స్వీడన్ ఆదర్శమని అధ్యయనాలు చాటుతున్నాయి. చేలపై పిచికారీ చేసే విష రసాయనాలు ఏటా రెండు లక్షల మందిని కబళిస్తున్నాయన్న ఐక్యరాజ్య సమితి నిపుణుల నివేదిక- ప్రపంచ జనాభా ఆహార అవసరాలు తీర్చడంలో క్రిమిసంహారకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయనడం పచ్చి అబద్ధమని నిరుడు నిగ్గుతేల్చింది. ఈ వాస్తవాల వెలుగులో మోదీ ప్రభుత్వం తీసుకురానున్న చట్టం- సమగ్రతతోపాటు, శాస్త్రీయ దృక్పథానికీ ఎత్తుపీట వెయ్యాలి. కేంద్ర కీటక నాశనుల బోర్డు, రిజిస్ట్రేషన్ కమిటీల ముందస్తు ఆమోద ముద్ర లేనిదే దేశంలో వాటి విక్రయం, వినియోగం సాధ్యం కాదు. ఆయా సంస్థలు ఏర్పాటయ్యాక ఇప్పటిదాకా మూడు లక్షల దాకా అనుమతులు అనుగ్రహించారంటే, పైస్థాయిలోనే అరాచకత్వం రాజ్యమేలుతున్నట్లు! 2008నాటి బిల్లుకు తాజా ప్రతిపాదనలూ దాదాపు నకలుగానే ఉన్నాయని భిన్నవర్గాలు ఆందోళన వ్యక్తీకరిస్తున్నందున- సహేతుక మార్పులన్నింటికీ కేంద్రం సంసిద్ధం కావాలి. నకిలీ చీడ మందుల పీడ విరగడ చెయ్యడంలో రాష్ట్రాలకూ ఇతోధిక భాగస్వామ్యం కల్పించి- స్వస్థ సేద్య సంస్కృతికి బీజావాపనం చెయ్యాలి!



సవాళ్ల మధ్య బడ్జెట్ సవారీ

రేపే రాష్ట్ర పద్దుల పత్రం సమర్పణ

వచ్చే ఏడాది రాబోయే ఎన్నికలకు ముందు పూర్తిస్థాయి చివరి బడ్జెట్ సమర్పించనున్న ఆంధ్రప్రదేశ్, ఇప్పుడిప్పుడే తప్పటడుగుల దశ దాటి బుడిబుడి అడుగుల స్థాయికి చేరుకుంటోంది. విభజన దరిమిలా రోజులు ఎప్పటిలాగే గడుస్తాయా, ఉద్యోగులకు నెలవారీ జీతాలొస్తాయా, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా నడుస్తాయా వంటి అనుమానాలు ప్రతి ఒక్కరిలో ఉండేవి. గడచిన నాలుగేళ్లలో రాష్ట్రప్రభుత్వం తీసుకొన్న చొరవ కారణంగా క్రమంగా ఆ అభద్రతాభావం తొలగిపోయింది. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఉద్యోగులకు వేతన సంఘం సిఫార్సులు అమలు చేయడం, 49 లక్షలమందికి నెలవారీ సామాజిక పింఛన్లు ఇవ్వడం, రైతు రుణ ఉపశమనం, డ్వాక్రా మహిళలకు పెట్టుబడి నిధి విడతలవారీగా విడుదల చేస్తూ రావడంతో జనంలో గూడు కట్టుకున్న భయాలు తొలగిపోయాయి. ప్రస్తుతం అందరి దృష్టీ అభివృద్ధి మీదే కేంద్రీకృతమై ఉంది. 'ఏవి తల్లీ నిరుడు కురిసిన హిమ సమూహాలు' అని నిరాశతో నిట్టూరుస్తూ కూర్చోకుండా పునర్వైభవం సాధించాలన్న కసి ఆంధ్రప్రదేశ్ ప్రజల్లో కనిపిస్తోంది. విభజన తరవాత తలసరి ఆదాయపరంగా అధమ స్థానానికి దిగజారిన రాష్ట్రాన్ని తిరిగి ప్రథమ స్థానంలో నిలపాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు సొంత బలంతోపాటు కేంద్రం కూడా చేయూతను ఇవ్వాల్సిందే! ఆంధ్రప్రదేశ్ పరిస్థితిని దేశంలో మరే రాష్ట్రంతోనూ పోల్చలేం. ఒకవైపు కొత్తరాష్ట్రాన్ని పునాదుల నుంచి పునర్నిర్మించుకుంటూనే- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలనూ గాడితప్పకుండా కొనసాగించాల్సిన అవసరం ఉంది. ఈ పాత్రను ప్రభుత్వంలో ఉన్నవారు ఎంత సమర్థంగా పోషిస్తున్నారన్న విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ప్రజల అవసరాలను గుర్తించి, వారి ఆకాంక్షలను సమర్థంగా నెరవేర్చాల్సిన బాధ్యత సంకీర్ణ భాగస్వాములుగా ఉన్న ఇరు పార్టీలపైనా ఉంది.

రెవిన్యూ లోటు ఎప్పుడు తీరేను?

సుమారు నాలుగేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ రెవిన్యూలోటు రాష్ట్రంగా ప్రస్థానం ప్రారంభించింది. విభజనకు ముందు ఏడాది దేశంలో 11 రెవిన్యూ లోటు రాష్ట్రాలు ఉండగా- అందులో ఆంధ్రప్రదేశ్ లేదు. 2014 నుంచి ఆంధ్రప్రదేశ్ రెవిన్యూలోటు రాష్ట్రాల జాబితాలో చేరింది. ఈ జాబితాలో 2014-15లో 15, 2015-16లో 10, 2016-17లో 12, 2017-18లో ఎనిమిది రాష్ట్రాలు ఉన్నాయి. అంటే ఒక్కో ఏడాది గడిచే కొద్దీ కొన్నింటి పరిస్థితి మెరుగుపడుతోంది. మరికొన్ని రాష్ట్రాల పరిస్థితి మరింత దిగజారుతోంది. అందుకే రెవిన్యూలోటు జాబితా నుంచి కొన్ని పాత రాష్ట్రాలు వెళ్లిపోతుంటే, మరికొన్ని కొత్తగా వచ్చి చేరుతున్నాయి. కానీ ఆంధ్రప్రదేశ్ మాత్రం ఆ జాబితాలో కొనసాగుతూ వస్తోంది. 14వ ఆర్థికసంఘం గడువు ముగిసిన తరవాతా రెవిన్యూలోటును ఎదుర్కొనే ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ మిగలనుంది. 14వ ఆర్థికసంఘం రాష్ట్ర ఆదాయాన్ని ఎక్కువగా, ఖర్చులను తక్కువగా అంచనా వేసింది. అప్పుడూ ఆంధ్రప్రదేశ్ కడపటి స్థానాల్లోనే నిలిచింది. ఒకవేళ లెక్కలను వాస్తవంగా అంచనా కట్టి ఉంటే- రాష్ట్రం మరో అయిదేళ్ల తరవాతైనా రెవిన్యూ లోటు చట్రంనుంచి బయటపడే అవకాశాలు ఉండేవి కావేమో! ఆంధ్రప్రదేశ్ ఏటా 13శాతం వృద్ధి రేటు సాధిస్తుందని, 2015-'20 సంవత్సరాల్లో రూ.3.90లక్షల కోట్ల సొంత ఆదాయం సమకూర్చుకుంటుందని పద్నాలుగో ఆర్థికసంఘం అంచనా వేసింది. వాస్తవ బడ్జెట్ అంచనాల కంటే ఇది చాలా ఎక్కువ. ఆర్థికసంఘం మదింపు ప్రకారం తొలి మూడేళ్లలో రాష్ట్రానికి రూ.2.04 లక్షల కోట్ల సొంత ఆదాయం రావాలి. రెవిన్యూ వ్యయం రూ.3.08 లక్షల కోట్లకు పరిమితం కావాలి. వాస్తవం ఇందుకు భిన్నంగా ఉంది. ఆదాయం రూ.1.61 లక్షల కోట్లకు పరిమితమైతే, ఖర్చు రూ.3.34లక్షల కోట్లకు ఎగబాకింది. అంచనాలు, వాస్తవాల మధ్య రూ.72వేల కోట్ల తేడా ఉంది. ఈ మూడేళ్లలో పన్నుల వాటా పంపిణీ, రెవిన్యూ లోటు భర్తీకింద కేంద్రం నుంచి రూ.1.04లక్షల కోట్ల రూపాయలు వచ్చాయి. కానీ అంచనాలకు అందని రూ.72వేల కోట్ల భారాన్ని రాష్ట్రప్రభుత్వం విధిగా భరించాల్సి వస్తోంది. వాస్తవంగా అంచనా వేసి ఉంటే ఈ మొత్తాన్ని కూడా రెవిన్యూలోటు కింద మూడేళ్లలో కేంద్రం అందించాల్సి వచ్చేది. దాదాపు అన్ని రాష్ట్రాల అంచనాలనూ ఆర్థికసంఘం ఇలా పెంచి చూపడంవల్ల కేంద్రంపై భారం తగ్గింది!

విభజన కారణంగా హైదరాబాద్‌లో వదిలేసి వచ్చిన వ్యవస్థలను పునఃసృష్టి చేసుకోవడానికే ఆంధ్రప్రదేశ్ శక్తి సామర్థ్యాలను గరిష్ఠ స్థాయిలో వినియోగించాల్సి ఉంటుంది. పరిశ్రమలు, సేవారంగాన్ని అభివృద్ధి చేసుకోవడం తలకు మించిన భారమే. ఒకవైపు మౌలిక వసతులు కల్పిస్తూనే మరోవైపు భూములు, పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తే తప్ప పారిశ్రామికవేత్తలు రాష్ట్రంవైపు కన్నెత్తిచూసే పరిస్థితి ఉండదు. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తోంది. అందుకు కేంద్రం చేయూత చాలా అవసరం. ఈశాన్య రాష్ట్రాలు ప్రకృతిపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నాయన్న కారణంగా 2007 నుంచి 2017 వరకు 'ఈశాన్య రాష్ట్రాల పారిశ్రామిక ప్రోత్సాహక పథకం' చేయూత అందించారు. ప్రస్తుతం విభజనపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటోంది కాబట్టి మన రాష్ట్రానికీ ఈశాన్యానికి అందజేసిన రాయితీలు లాంటివి ఇవ్వడం తప్పు కాదు. ఏడు ఈశాన్య రాష్ట్రాలు, మూడు కొండప్రాంత రాష్ట్రాలకు కలిపి పారిశ్రామిక ప్రోత్సాహకాలు, జీఎస్టీ తిరిగి చెల్లింపు కింద కేంద్రం తాజా బడ్జెట్లో రూ.2,573 కోట్లు ప్రత్యేకించింది. 2017తో ఈ ప్రోత్సాహకాలు పూర్తవుతాయని, ఆపై వాటిని కొనసాగించబోమని నమ్మబలికిన కేంద్రం తాజా బడ్జెట్లో వాటిని కొనసాగించడం ప్రజలను మభ్యపెట్టడమే అవుతుంది. ప్రోత్సాహకాలు తమకు ఇవ్వని పక్షంలో ఈశాన్య రాష్ట్రాలకూ తీసేయాలని ఆంధ్రప్రదేశ్ అడగడం లేదు. వారికి ఇచ్చారు కాబట్టి తమకూ ఇవ్వాలని కోరుతోంది.

సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లుగానే వెనకబడిన రాష్ట్రాల అభ్యున్నతికి కేంద్రం ప్రత్యేక కార్యాచరణను పట్టాలకు ఎక్కించాలి. విభజన కారణంగా- 58 శాతం జనాభా ఉన్న ఏపీ రాష్ట్రానికి 46 శాతం వనరులే వచ్చాయి. దీనివల్ల ఆర్థిక ఇబ్బందులతోపాటు, విత్త బాధ్యత బడ్జెట్ నిర్వహణ (ఎఫ్‌ఆర్‌బీఎం) నిబంధనలకు కట్టుబడి పనిచేయడమూ అసాధ్యంగా మారింది. సొంతంగా సృష్టించుకుంటున్న ఆదాయ వనరులన్నీ ఉద్యోగుల జీతాలు, పింఛన్లు, సంక్షేమ కార్యక్రమాలకే సరిపోతున్నాయి. ఆస్తులు సృష్టించే మూలధన వ్యయానికి వనరులేమీ మిగలడంలేదు. కొత్త రాష్ట్రంలో మూలధన వ్యయం పెంచుకోవడానికి అనువుగా ఆర్థిక వనరులు సమకూర్చుకొనేందుకు ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిని మూడు శాతం నుంచి ఏడు శాతానికి పెంచాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 14వ ఆర్థిక సంఘానికి విజ్ఞప్తి చేసింది. చివరకు కనీసం 3.5 శాతానికి అయినా పెంచాలని కేంద్రాన్ని కోరింది. కానీ అటువైపునుంచి స్పందన లేదు. దేశంలోని ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా అధికంగా ఉండటంవల్ల వాటి సొంతవనరుల కంటే పన్నువాటా బదిలీ, గ్రాంట్ల రూపంలో కేంద్రం నుంచి వచ్చే మొత్తమే అధికంగా ఉంటోంది. ఉదాహరణకు 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఉత్తర్ ప్రదేశ్ సొంత ఆదాయం రూ.1.29లక్షల కోట్లయితే- పన్నుల్లో వాటా, గ్రాంట్ల రూపంలో కేంద్రం నుంచి రూ.1.89లక్షల కోట్లు వచ్చింది. అంటే సొంత వనరులకంటే 45శాతం అధికంగా కేంద్రం నుంచి సునాయాసంగా వచ్చి పడుతోంది. అలాగే బిహార్‌కు 181 శాతం అధికంగా నిధులు సమకూరాయి. ఛత్తీస్‌గఢ్, జమ్మూకశ్మీర్, పశ్చిమ్ బంగ, ఒడిశా... ఇలా అనేక రాష్ట్రాలకు బడ్జెట్లో సొంత ఆదాయ వనరుల కంటే కేంద్రం నుంచి వచ్చే వనరులే రెట్టింపు మొత్తంలో ఉంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కి మాత్రం 2017-18లో రాష్ట్ర ఆదాయంకంటే 13శాతం మాత్రమే అధిక వనరులు కేంద్రం నుంచి వచ్చాయి. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర నిధులు తక్కువగా అందుతున్నాయి. ఆర్థిక సంఘాలు అనుసరిస్తున్న ప్రాతిపదికలవల్ల కేంద్ర నిధుల పంపిణీలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోంది.


పెరుగుతున్న రుణభారం

వనరుల కొరత కారణంగా ఆంధ్రప్రదేశ్ బహిరంగ విపణి రుణాలపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. 2018 బడ్జెట్ నాటికి రాష్ట్ర రుణభారం రూ.2.16 లక్షల కోట్లకు చేరుతుందని గత డిసెంబర్ అయిదో తేదీన కేంద్ర ఆర్థికశాఖ లోక్‌సభలో ఒక లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానంగా చెప్పింది. మూడేళ్లుగా ఏటా 11శాతం మేర రుణభారం పెరుగుతూ పోతోంది. జీఎస్‌డీపీలో రాష్ట్ర ప్రభుత్వ రుణ నిష్పత్తి 24శాతానికిపైగా ఉంది. ఇది 14వ ఆర్థికసంఘం వేసిన అంచనాలకు లోబడే ఉన్నప్పటికీ అభివృద్ధి చెందిన రాష్ట్రాలతో పోలిస్తే చాలా అధికం. దీనివల్ల బహిరంగ మార్కెట్ నుంచి తెచ్చుకున్న రుణాలన్నీ తిరిగి వాటి చెల్లింపులకే సరిపోతున్నాయి. రాష్ట్రం సరైన పంథాలో నడుస్తోందనడానికి ప్రధాన కొలమానం మొత్తం వ్యయంలో మూలధన వ్యయ శాతం అధికంగా ఉండటమే! ఇది 2017-18 ఏపీ బడ్జెట్‌లో 19శాతం ఉంటే పైన పేర్కొన్న రాష్ట్రాల్లో అది 28శాతం దాకా ఉంది. ఏదో ఒక రూపంలో కేంద్రం నుంచి అందుతున్న సాయంవల్లే అది సాధ్యమవుతోంది. అలాగని నెపాన్ని పూర్తిగా కేంద్రం పైకి నెట్టేయడమూ భావ్యం కాదు. రాష్ట్ర ప్రభుత్వమూ తన పరిధిలో మరింత ఆర్థిక క్రమశిక్షణను అనుసరించాలి. సంక్లిష్ట పరిస్థితుల్లో ప్రజాకర్షక విధానాల జోలికి వెళ్లకుండా జాగ్రత్తపడాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించి ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, వారికి ఈ లెక్కలు పూర్తిగా అర్థమయ్యేలా చేయాలి. పొదుపు చేసే ప్రతిపైసా దీర్ఘకాలంలో ఎలాంటి మేలుచేస్తుందో అర్థమయ్యేలా చెప్పాలి. బడ్జెట్ ఓ ప్రజాపత్రం. కాబట్టి అందులోని ప్రతి అంశాన్నీ ప్రజలకు విడమరచి చెప్పడం ప్రభుత్వ బాధ్యత. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో ప్రభుత్వం దుబారా చేస్తోందన్న అపోహలకూ తావివ్వరాదు. మరో ఏడాదిలో ఎన్నికలు రానున్న దశలో- చిట్టచివరి పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పణకు సిద్ధమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రాథమ్యాలకు కట్టుబడుతుందన్న దానిమీదే అందరి దృష్టి ఉందిప్పుడు!

- చల్లా విజయభాస్కర్

ఆదాయ మార్గాలకు అన్వేషణ

సేద్యం చేసే రైతుకు ఆదాయం చేతికి రానట్లే- వ్యవసాయ ప్రధానమైన కొత్త రాష్ట్రానికీ ఆదాయం తక్కువగానే ఉంటోంది. దక్షిణాదిలో ప్రధానమైన తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లో రాష్ట్ర స్థూలోత్పత్తి (జీఎస్‌డీపీ)లో వ్యవసాయరంగం వాటా కనిష్ఠంగా 11.39శాతం నుంచి గరిష్ఠంగా 15.34శాతం వరకు ఉంది. అదే ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయరంగం వాటా 31.77 శాతం మేర ఉంది. స్థూల ఉత్పత్తి వృద్ధిలో ఇది బాగానే కనిపించినా



అదే నిష్పత్తిలో ప్రభుత్వ ఖజానాకు పన్నులు రావు. సేవా రంగంతో ఖజానాకు బలం చేకూరుతుంది. పైన పేర్కొన్న మూడురాష్ట్రాల్లో జీఎస్‌డీపీలో సేవారంగం వాటా 60శాతానికిపైగా ఉంటే, ఆంధ్రప్రదేశ్ 46 శాతానికే పరిమితమైంది. కొత్త రాష్ట్రం పొరుగు రాష్ట్రాలతో ఆర్థికంగా సమానస్థాయికి చేరినప్పుడే తలసరి ఆదాయం పెరుగుతుంది. అది జరగాలంటే పారిశ్రామికీకరణ, పట్టణీకరణ పెరగాలి.

ఆధిపత్యం కోసం కొత్తకుంపట్లు

మళ్ళీ భగ్గుమన్న సిరియా

ముక్కాలి పీట కూర్చోవడానికి బాగుంటుంది కాని, రాజకీయాలు మాత్రం మూడు కాళ్ల మీద నడవలేవు! సిరియా ప్రజలకు నరకం చూపిన ముక్కోణ సమరం ఎట్టకేలకు ముగిసినా, తాజాగా కొత్త త్రికోణ పోరు విరుచుకుపడి ప్రపంచాన్ని నివ్వెరపరుస్తోంది. ఇంతకుముందు ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్), అమెరికా, రష్యా అనుయాయ సేనల మధ్య నడచిన పోరాటంలో ఐసిస్ చిత్తయింది. ఆపైన రష్యా అండదండలున్న సిరియా ప్రభుత్వ సేనలు; అమెరికా, సౌదీల మద్దతు గల ప్రతిపక్ష సేనలూ ఒకరినొకరు చంపుకోవడం ఆపడంతో ప్రజలు హమ్మయ్య అని నిట్టూర్చారు. సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్ సర్కారును కాపాడటానికి రంగంలోకి దిగిన రష్యా తన లక్ష్యం నెరవేరింది కాబట్టి అక్కడి నుంచి తన సేనలను వెనక్కు రప్పిస్తానని ప్రకటించింది. అంతలోనే సిరియా ప్రభుత్వం మళ్ళీ ప్రతిపక్ష సేనల మీద విరుచుకుపడగా, కొత్తగా కుర్దు దళాల పని పట్టడానికి టర్కీ సైన్యం బరిలో దూకింది. అదలాఉంటే అమెరికా దాడిలో కొందరు రష్యన్లు మరణించగా, మృతులు తమ సైనికులు కారని, కిరాయి సైనికులని రష్యా వివరించింది. ఈలోపు ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య వైరాలు భగ్గుమన్నాయి. సిరియాలో శాంతి నెలకొంటుందని అందరూ ఆశపడుతున్న సమయంలో అన్ని పక్షాలూ పరస్పరం పీకలు నులుముకోవడం విడ్డూరం. 2011 మార్చి నుంచి 4.65 లక్షల మంది సిరియన్ల ఉసురు తీసి, దేశ జనాభాలో సగం (1.2 కోట్ల)మందిని రోడ్డుకు ఈడ్చిన అంతర్యుద్ధం ఇప్పుడు ఆధిపత్య సమరంగా మారింది.


నివురుగప్పిన నిప్పు

ఐసిస్ చిత్తు కావడంతో పశ్చిమాసియాపై, ముఖ్యంగా సిరియాపై ఆధిపత్యం కోసం సున్నీ సౌదీ అరేబియా, షియా ఇరాన్‌ల మధ్య పోటీ రాజుకొంది. ఇరాన్, రష్యాలు సిరియాలో బషర్ అల్ అసద్ సర్కారుకు అండనిస్తుంటే; సిరియా ప్రతిపక్ష సేనలకు, సౌదీకి, కుర్దులకు అమెరికా పెద్ద దిక్కుగా నిలుస్తోంది. ఐసిస్ రాజధాని నగరం రక్కాను గత అక్టోబరులో కైవసం చేసుకున్న సిరియా ప్రజాస్వామిక దళాలు (ఎస్‌డీఎఫ్) కుర్దులతో ఏర్పడ్డాయి. వాటికి పరమ గురువు అమెరికానే. మరోవైపు ప్రతిపక్ష సేనలతో కాల్పులు విరమించిన సిరియా ప్రభుత్వం గత డిసెంబరుకల్లా యూఫ్రటిస్ నది పడమర ప్రాంతాలను వశపరచుకుంది. కుర్దుల ఎస్‌డీఎఫ్ ఆ నదికి తూర్పు ప్రాంతాలను స్వాధీనపరచుకుంది. కుర్దుల జోరుతో టర్కీ బెదిరిపోయి ఉన్నట్టుండి దాడులకు దిగడం పరిస్థితిని కొత్త మలుపు తిప్పింది.

టర్కీ కూడా అమెరికా అనుయాయి అయినప్పటికీ, కుర్దుల స్వాతంత్ర్య పిపాస ఆ దేశానికి బెదురు పుట్టిస్తోంది. ఇరాన్, ఇరాక్, టర్కీ, సిరియాల్లో వ్యాపించిఉన్న కుర్దు ప్రాంతాలను కలిపి సొంతంగా కుర్దిస్థాన్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నది కుర్దుల చిరకాల స్వప్నం. అమెరికా మద్దతుతో తమ ఆశయం సాధించుకోవాలని ఆశించిన కుర్దులు, ఐసిస్‌పై పోరులో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇరాన్‌లోని కుర్దు ప్రాంతాలకు స్వయంప్రతిపత్తి లేకపోయినా ఇరాక్‌లో ఆ హోదా ఉంది. సిరియాలో తమ ప్రాబల్య ప్రాంతాల్లో కుర్దులు సొంత ప్రభుత్వాన్ని ఏర్పరచుకున్నారు. దీంతో ప్రమాదం శంకించిన టర్కీ ఇప్పుడు కుర్దులపై నేరుగా దాడులకు దిగింది.

మరోవైపు సిరియా ప్రభుత్వ సేనలు కాల్పుల విరమణను ఉల్లంఘించి, ప్రతిపక్ష సేనల అధీనంలోని ఏకైక రాష్ట్రం ఇద్లిబ్‌లో కొన్ని ప్రాంతాలను ఈ జనవరిలో ఆక్రమించాయి. దేశ రాజధాని డమాస్కస్ శివార్లలోని ప్రతిపక్ష కంచుకోట తూర్పు ఘౌటామీద ఫిబ్రవరిలో దాడిచేశాయి. నిజానికి రష్యా మధ్యవర్తిత్వంతో కుదిరిన సయోధ్య ఒప్పందం ప్రకారం ఇద్లిబ్, తూర్పు ఘౌటాల్లో ప్రతిపక్ష అనుయాయులు స్వేచ్ఛగా జీవించాల్సింది. కానీ, ఐసిస్ ఓడిపోయిన దరిమిలా సిరియా భాగ్యవిధాతలుగా అవతరించాలని రకరకాల శక్తులు పోటీపడుతున్నందువల్ల





పాత హామీలు నీటిమీద రాతలుగా తేలాయి. సిరియా సంక్షోభం సమసిపోయేంతవరకు తమ సేనలను అక్కడి కుర్దు ప్రాంతాల్లో నిలిపి ఉంచుతామని అమెరికా విదేశాంగ మంత్రి రెక్స్ టిలర్‌సన్ ప్రకటించడంతో కోపోద్రిక్తమైన టర్కీ, కుర్దుల అదుపులోని ఆఫ్రిన్‌పై దాడికి దిగింది. అక్కడ అమెరికన్ సేనలు లేవు కాని, దగ్గర్లోని మన్‌బిజ్ పట్టణంలో అవి ఉన్నాయి. నాటో సైనిక కూటమిలో అమెరికా, టర్కీలు భాగస్వాములే అయినా, అవసరమైతే మన్‌బిజ్‌పైనా దాడిచేస్తామని టర్కీ ప్రకటించడం ప్రమాద సంకేతం.

ఐసిస్ ఖతమయ్యాక కూడా సిరియాలో అమెరికా తిష్ఠవేయడం రష్యాకూ గిట్టడంలేదు. బహుశా అమెరికన్లు ఎంతవరకు బరిలో నిలబడతారో పరీక్షించడం కోసం తూర్పు సిరియాలోని వారి స్థావరంపై సిరియా ప్రభుత్వసేనలు దాడికి దిగాయి. వీరిలో రష్యన్ కిరాయి సైనికులూ ఉన్నారు. దాడిని తిప్పికొట్టడానికి అమెరికా గగనతలం నుంచి క్షిపణులు, బాంబులు కురిపించగా కనీసం 300 మంది రష్యన్లు మరణించారు. ప్రైవేటు సంస్థ వాగ్నర్‌కు చెందిన ఈ కిరాయి సైనికులతో తమకు సంబంధంలేదని రష్యా ప్రభుత్వం ప్రకటించింది. వాస్తవమేమిటంటే తన వ్యూహ ప్రయోజనాలను నెరవేర్చుకోవడంకోసం రష్యా ప్రైవేటు సేనలను పంపుతుందని క్రిమియాలో 2014లోనే రుజువైంది. సిరియాలో టార్టస్, ఖమైమిమ్‌లలోని శాశ్వత స్థావరాల్లో రష్యన్ సేనలు యథాప్రకారం కొనసాగుతాయని పుతిన్ సర్కారు ప్రకటించింది. ఈ నెల 18న అధ్యక్ష ఎన్నికలు జరగనున్న దృష్ట్యా సిరియాలో రష్యా ప్రాబల్యానికి ఢోకాలేదని ఓటర్లకు చాటడం పుతిన్ వ్యూహం.

ఐరాస తీర్మానానికి చుక్కెదురు

సిరియాపై పట్టుకోసం నడుస్తున్న సమరంలో ఇరాన్ తక్కువేమి తినలేదు. లెబనాన్‌లో తన అనుయాయులైన హెజ్బొల్లాకు సిరియా మీదుగా ఆయుధాలు పంపుతుంటే, హెజ్బొల్లా దళాలు ఇజ్రాయెల్ అధీనంలోని గోలన్ హైట్స్ ప్రాంతానికి దగ్గరగా జరుగుతున్నాయి. గత నెలలో తన గగనతలంలోకి ప్రవేశించిన ఇరానీ డ్రోన్‌ను ఇజ్రాయెల్ కూల్చివేసింది. దానికిముందు సిరియాలో ఇరానీల అధీనంలో ఉన్న ఒక స్థావరంపై బాంబులు కురిపించింది. ఒక ఇజ్రాయెలీ జెట్ ఫైటర్‌ను సిరియా దళాలు కూల్చివేసినందుకు ప్రతిగా ఎదురుదాడి జరిపింది. పశ్చిమాసియాలో ఇరాన్ ప్రాబల్యం ఎంత విస్తరిస్తుంటే ఇజ్రాయెల్ భయాలు అంతగా పెరిగిపోతున్నాయి. రెండు దేశాలూ బహిరంగంగా యుద్ధానికి దిగకపోవచ్చు కానీ, పరోక్ష సంఘర్షణలను మాత్రం ముమ్మరం చేయవచ్చు. ఈ అవాంఛనీయ పరిణామాలను నివారించడానికని సిరియాలో 30 రోజులపాటు అన్ని పక్షాలూ కాల్పులు విరమించాలంటూ గత నెల 24న ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానించింది. సిరియా ప్రభుత్వం, ఇరాన్, టర్కీలు పోరు ఆపేదిలేదని ప్రకటించి ఆ తీర్మానాన్ని బుట్టదాఖలు చేశాయి. ఇక రష్యా శత్రులక్ష్యాలను గురితప్పకుండా ఛేదించే రాకెట్లను, ఇతర అధునాతన ఆయుధాలను సిరియాకు తరలించింది. అమెరికా స్టెల్త్ బాంబర్లను మోహరించినందుకు ప్రతిగా రష్యా అయిదోతరం సుఖోయ్ 57 ఫైటర్లను రంగంలోకి దించింది. ఈ సరికొత్త ఆయుధాలను యుద్ధరంగంలో పరీక్షించి చూస్తానంటోంది. అంతటితో ఆగక సిరియాలో ఇరాన్ కార్యకలాపాలను యథేచ్ఛగా సాగనిస్తోంది. రష్యా, సిరియా, ఇరాన్, హెజ్బొల్లాల దూకుడు తన అస్తిత్వానికే ఎసరు తెస్తాయని ఇజ్రాయెల్ ఆందోళన చెందుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ అణు ఒప్పందాన్ని తుంగలో తొక్కుతానంటూ కత్తులు నూరుతున్నారు. పరిస్థితి చేయిదాటి పశ్చిమాసియాలో యుద్ధం విరుచుకుపడితే అందులో తామూ ఇరుక్కొంటామని ఐరోపా దేశాలు కలవరపడుతున్నాయి. సిరియాగడ్డపై ఎంతకూ తెగని విదేశీ శక్తుల వైరాలు, వ్యూహప్రతివ్యూహాలను చూసి, అసలు సిరియా ప్రజల అగచాట్లు ఎన్నటికైనా తీరుతాయా అని ప్రతి ఒక్కరూ మథనపడుతున్నారు.

- వర ప్రసాద్

పరిణతి

జీవితం అంటే, మార్పు. అనుక్షణమూ అది మారుతుంటుంది. క్షణక్షణమూ వైరుధ్యంగా గోచరిస్తుంది. సుఖదుఃఖాలు లేదా మంచిచెడుల మిశ్రమం అది. అందులో కలయిక ఉంటుంది. ఎడబాటూ సంభవిస్తుంది. మనిషికి ఎన్నో ఆశలుంటాయి. మమతలు, మమకారాలు అతణ్ని శాసిస్తుంటాయి. అవేవీ జీవిత సహజ పరిణామాల్ని మార్చలేవు!

తెలిసిన విషయానికి మానవుడు కొత్తగా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. ఆవేదన చెందాల్సిన పని అంతకన్నా ఉండదు. ఎటువంటి మార్పునైనా అతడు అంగీకరించాలి, స్వాగతించాలి, అందులోనే ఏదైనా ప్రయోజనాన్ని వెతుక్కోవాలి. కలిగిన అవకాశం అతడికి మరో ఉపయుక్తమైన, తృప్తికరమైన బాధ్యతగా పరిణమించవచ్చు. ఎంతో కొంత విశ్రాంతినీ ప్రసాదించవచ్చు. జీవన రంగంలో ప్రతి ఒక్కదాన్నీ మనిషి అన్వేషించాల్సిందే.

ఇటీవలి కాలంలో వృద్ధుల పట్ల పిల్లల నిరాదరణ, నిర్లక్ష్యం పెరుగుతున్నాయి. అవి పెద్దలకు భరించలేనంత నిరాశను, నిర్వేదాన్ని కలిగిస్తున్నాయి. ఆవేదన, ఆందోళన మిగిలిస్తున్నాయి. వృద్ధుల వేదన ఎంత అంటే- ఆత్మహత్యకు పాల్పడేంత లేదా మరణం కోసం ఆత్రంగా ఎదురుచూసేంత! పిల్లలే సర్వస్వంగా జీవించినవారిని క్షోభ ఆవరిస్తోంది. సంతానమే ప్రాణంగా బతికే మనిషికి, ఆ ఊపిరే ఆగిపోతే? నీటిలో తప్ప బతకలేని చేపను బయట ఎక్కడో పడేస్తే? ఇదీ అంతే!

వృద్ధులకు కావాల్సింది పిల్లల ప్రేమాభిమానాలు! అవి తప్ప, వారికి మరేవీ ఆనందాన్ని ఇవ్వవు. పిన్నలకు జీవితాన్ని ఇచ్చినవారు, ఆనందాన్ని పంచినవారు పెద్దలే. వాటిని ఎంతో కొంత తిరిగి ఇవ్వాల్సిన బాధ్యతను, ధర్మాన్ని సంతానం విస్మరిస్తోంది. ప్రతి మనిషీ సంఘజీవి, విశ్వజీవి. ఏ విషయంలోనైనా బాధ్యతలు, హక్కులు అతడికి సమాన స్థాయిలో ఉంటాయి. సమాజంతో ముడివడి ఉన్న జీవితాన్ని అతడు దానితోనే పంచుకోవాలి. ఆవేదన, ఆనందం...దేన్నైనా కలబోసుకోవాలి. ప్రేమ, ఆత్మీయత వంటివన్నీ సమాజంలోనే, సమాజంతోనే ఉంటాయి.

సమాజ దృక్పథంతో చూసినప్పుడు బంధాలు, బంధుత్వాలు అనేవి ఎంతో అవసరం. అవే ఆదరణీయాలు, అభిలషణీయాలు. మనసున్న మనిషిగా వెలగాలి.



అంతర్యామి

అతడి జీవితం కేవలం ఆ కుటుంబానికే పరిమితం కాదు. విశ్వ కుటుంబంలో అతడూ ఒక భాగం. ఏ భావమైనా దానితో పంచుకోవచ్చు- అది ఇవ్వడమైనా, తీసుకోవడమైనా! మానవుడు ఒక అమూల్య సంపద. పండిపోయేకొద్దీ ఆ విలువ మరింత పెరుగుతుంటుంది. ఎంత అంటే, చెప్పలేం. పాత్రతో కొలిచి చూపలేం. మల్లెపూల సౌరభానికి మాటలుండవు. ఆస్వాదించాలి. అంతే!

పెద్దవారు ఇంట్లో ఉండటం కుటుంబానికి అవసరం, శ్రేయస్కరం.

అలాంటి వృద్ధులు దేన్నికైనా కుంగిపోవాల్సిన పని లేదు. విలువను తగ్గించుకోనక్కర్లేదు. స్వాభిమానం ఉండాలి. ఆత్మగౌరవంతో మెలగాలి. ఎప్పుడూ తీసుకోవడమేనా... ఇవ్వడాన్నీ నేర్చుకోవాలి. మనసుకు ఏవీ అడ్డు రావు. అనర్హతలు అసలే ఉండవు. తీసుకోవటంలోని ఆనందం తెలిసిన వ్యక్తికి, ఇవ్వడంలోని అవసరమూ తెలిసే ఉంటుంది. తాను ఇతరుల నుంచి ఆశిస్తున్నాడు కాబట్టి, ఆ ఇవ్వడం అనేది తానే ఎందుకు చేయకూడదు? ఏమైనా ఇవ్వాలని తాను ఆశించేవారు, తనకు కొందరే ఉంటారు. తానే ఇవ్వాలని అనుకున్నప్పుడు, ఎందరైనా లభిస్తారు. ఎందరికైనా, అందరికైనా, ఎవ్వరికైనా, ఏమైనా ఇవ్వవచ్చు. ఆ ఇచ్చే స్థానంలోకి పెద్దలే వెళ్లగలిగితే- ఎవరో ఏదో ఇవ్వాలని ఆశించే స్థాయి నుంచి ఎదుగుతారు. మానవుడి నుంచి భగవంతుడు ఆశించే స్థితి లేదా స్థాయి అదే!

- చక్కిలం విజయలక్ష్మి



పరిశ్రమల సీఈవోలు, ప్రతినిధులతో దిల్లీలో సమావేశమైన ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్

రాష్ట్రంలో పెట్టుబడులకు హెచ్‌పీ సంస్థ ఆసక్తి

• దిల్లీ పర్యటనలో పలు సంస్థల సీఈవోలతో లోకేశ్ భేటీ

ఈనాడు డిజిటల్, అమరావతి: త్రీడీ ప్రింటింగ్, డిజిటలీకరణ, వీఆర్ రంగాల్లో రాష్ట్రంతో కలిసి పనిచేయడానికి హెచ్‌పీ సంస్థ అంగీకరించింది. ఏఆర్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఏర్పాటు సహా విద్యార్థులకు శిక్షణనిచ్చేందుకు ముందుకొచ్చింది. దిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారా లోకేశ్ మంగళవారం సాఫ్ట్‌వేర్, మొబైల్, ఎలక్ట్రానిక్ సంస్థల డైరెక్టర్లు, సీఈవోలను కలిశారు. డెలాయిట్ సంస్థ గ్లోబల్ సీఈవో పునీత్ రెంజెన్, నోబెల్ గ్రూపు కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ డైరెక్టర్ సరబ్‌జిత్ సింగ్, కిమాషీ ఎలక్ట్రానిక్స్ సీఈవో అనిల్‌గుప్తా, యూహో మొబైల్ కంపెనీ ఎండీ చన్‌ప్రీత్ సింగ్‌తో లోకేశ్ వేర్వేరుగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో వ్యాపారానికి ఉన్న అవకాశాలను వారికి వివరించి పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. రాష్ట్రంలో ఎలక్ట్రానిక్ తయారీ రంగం అభివృద్ధి చెందుతోందని.. మొబైల్, ఎలక్ట్రానిక్స్ కంపెనీలు పెద్ద ఎత్తున ఏపీలో పెట్టబడులు పెడుతున్నాయని వివరించారు. ఇప్పటికే 150 ఎకరాల్లో ఎలక్ట్రానిక్స్ పార్క్ ఏర్పాటుకు రిలయన్స్ ముందుకొచ్చిందని తెలిపారు. హెచ్‌సీఎల్ సహా ఫాక్స్‌కాన్, సెల్‌కాన్, కార్బన్, డిక్సన్‌లాంటి ఫోన్ల కంపెనీలు రాష్ట్రంలో ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయని తెలిపారు. దేశంలో తయారవుతున్న పది ఫోన్లలో రెండు ఏపీవేనని వివరించారు. భవిష్యత్తులో వీటి సంఖ్య ఐదుకు పెరుగుతుందని తెలిపారు. ఎలక్ట్రానిక్ తయారీ కంపెనీల ఏర్పాటుకు కావాల్సిన అనుమతులు, రాయితీలను సకాలంలో కల్పిస్తున్నామని చెప్పారు. లోకేశ్ ప్రతిపాదనల మేరకు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు డెలాయిట్, నోబెల్ గ్రూప్ కన్జ్యూమర్, కిమాషీ ఎలక్ట్రానిక్స్ సంస్థల ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. ఏపీలో తమ సంస్థ ఏర్పాటుకు త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు.

కనీస మట్టం దిగువ నీరు వినియోగం

• తెలంగాణకు 24 టీఎంసీలు.. ఆంధ్రకు 9 టీఎంసీలు

• కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: శ్రీశైలం రిజర్వాయర్‌లో మార్చి నెలలోనే కనీస నీటిమట్టం దిగువ నుంచి నీటిని తీసుకోవడానికి కృష్ణా నదీ యాజమాన్య బోర్డు నిర్ణయించింది. ఉమ్మడి రిజర్వాయర్లైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో కనీస నీటిమట్టాలకు పైనున్న 33.770 టీఎంసీలలో తెలంగాణ 24.467 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 9.303 టీఎంసీలు వినియోగించుకొనేలా బోర్డు నిర్ణయించింది. ఈనెల 2వతేదీన రెండు రాష్ట్రాల ఇంజినీర్ ఇన్‌చీఫ్‌లు, బోర్డు సభ్యకార్యదర్శులతో కూడిన త్రిసభ్య కమిటీ సమావేశమై నీటి వినియోగంపై చర్చించి నిర్ణయాలు తీసుకొంది. ఇందుకు సంబంధించిన ఆదేశాలను మంగళవారం బోర్డు జారీ చేసింది. దీనిప్రకారం.. తమకు ఆగస్టు వరకు 46 టీఎంసీలు అవసరమని తెలంగాణ కోరగా, మే వరకు 30.38 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ తెలిపింది. మార్చిలో 26.38 టీఎంసీలు కావాలని ఆంధ్రప్రదేశ్ కోరగా, 19 టీఎంసీలు కావాలని తెలంగాణ పేర్కొంది. నాగార్జునసాగర్‌లో మార్చి 20వరకు 520 అడుగులు, మార్చి 31వరకు 515 అడుగులు నిర్వహించడానికి త్రిసభ్య కమిటీ అంగీకరించింది. సాగర్‌లో ఈమట్టం నిర్వహించడానికి ఆ నెలాఖరు లేదా అంతకంటే ముందే కనీస నీటిమట్టం దిగువన కూడా నీటిని తీసుకోవాలని నిర్ణయించింది. రెండు రాష్ట్రాల అవసరాలకు, నాగార్జునసాగర్‌లో నిర్ణయించిన నీటిమట్టం నిర్వహించడానికి శ్రీశైలం కుడి విద్యుత్తు కేంద్రం ద్వారా నీటిని విడుదల చేయాలని పేర్కొంది. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కింద ఆంధ్రప్రదేశ్‌కు నీరు విడుదల చేసినపుడు ఆవిరి నష్టాలు తక్కువగా ఉండేలా చూసేందుకు తెలంగాణ అవసరాలకు తగ్గట్లుగా జలాన్ని తీసుకోవాలని సూచించింది. నీటి వినియోగంలో ప్రాధాన్యం, అత్యవసరాలను దృష్టిలో పెట్టుకోవాలని, రెండు రాష్ట్రాలు నీటి వినియోగాన్ని సంయుక్తంగా ధ్రువీకరించి పంపాలని బోర్డు జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొంది.

సొంత పార్టీ నుంచి వైదొలగిన ఉపేంద్ర

ఈనాడు, బెంగళూరు: తన సారథ్యంలోని కన్నడ ప్రజ్ఞావంత జనతా పక్ష (కేపీజేపీ) నుంచి విలక్షణ నటుడు ఉపేంద్ర మంగళవారం నిష్క్రమించారు. నెలన్నర రోజుల వ్యవధిలో ప్రజాకీయ పార్టీ(ప్రజాధికారం)ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. కొందరు నేతలు పార్టీ స్థాపన ఆశయాన్ని నీరుగార్చినందున కేపీజేపీకి రాజీనామా చేసినట్లు ఉపేంద్ర మంగళవారం విలేకరులకు తెలిపారు. ధన ప్రమేయం లేకుండా ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆకాంక్షను అడ్డుకున్నారని ఆరోపించారు. గెలుపుతో నిమిత్తం లేకుండా వచ్చే విధానసభ, బృహత్ బెంగళూరు మహానగర పాలికె, జిల్లా పంచాయతి ఎన్నికల్లో పోటీ చేస్తామని వివరించారు. తమ పార్టీలో చేరాలని భాజపా నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆర్. అశోక్ చేసిన ఆహ్వానాన్ని ఉపేంద్ర తిరస్కరించారు. విభిన్న శైలిలో పారదర్శక పరిపాలన అందించేందుకు ప్రజాకీయ పార్టీని స్థాపించనున్నట్లు వెల్లడించారు.

COMMON LAW ADMISSION TEST (CLAT)-2018
Organising University
THE NATIONAL UNIVERSITY OF ADVANCED LEGAL STUDIES (NUALS)
HMT Colony P.O. Kochi, Kerala-683 503
ONLINE APPLICATIONS ARE INVITED FOR ADMISSION TO THE UG AND PG PROGRAMMES IN LAW (2018-19) IN THE 19 NATIONAL LAW UNIVERSITIES IN INDIA
Last date of receipt of Application : 31st March,2018.
Date of CLAT 2018 Examination : 13th May,2018 (3.00 p.m. to 5.00 p.m.)
For further details please log on to www.clat.ac.in
07.03.2018 Convenor, CLAT-2018


Dr. B.R. Ambedkar University, Srikakulam
Etcherla -532410, Andhra Pradesh, Website: www.brau.edu.in
PG COURSES ADMISSION NOTIFICATION
Dr.BRAUSKLMCET-2018
Dated: 05-03-2018
Dr.BRAU, SKLM invites online applications from eligible candidates for Admissions to various Academic Programmes of M.A., M.Com, M.Li.Sc, MJMC, M.Ed and M.Sc. of the University Campus College and its Affiliated Colleges for the Academic Year 2018-19 through Dr.BRAUSKLMCET-2018. For details see the Prospectus Published in the website www.braudoa.in

Commencement of Submission of Online Applications	07-03-2018
Last date for submission of Online Applications	06-04-2018
Downloading Hall-Tickets from website	30-04-2018
Dates of Entrance Test	5th, 6th and 7th May-2018

ETCHERLA Convener, Director of Admission (DOA)

శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయము, తిరుపతి
పరిపాలన కార్యాలయము, డా.వైయస్.ఆర్.భవన్, తిరుపతి-517 502
7వ స్నాతకోత్సవము
శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయము, తిరుపతి 7వ స్నాతకోత్సవము తేది.24 మార్చి 2018న శనివారము గం. 10-00 లకు ఆడిటోరియం, పశువైద్య కళాశాల, తిరుపతి నందు జరుగును. ఈ స్నాతకోత్సవములో తేది.01-01-2017 నుండి 31-12-2017 లో పశువైద్య శాస్త్రము, మత్స్యశాస్త్రము మరియు డైయిరీటెక్నాలజీ డిగ్రీ, పిజీ, పి.హెచ్‌డిలు పూర్తి చేసిన విద్యార్థులు అందరూ అర్హులు. ఇదివరకే దరఖాస్తు చేసిన విద్యార్థులందరూ స్నాతకోత్సవానికి హాజరుకావలెను. వివరముల కొరకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.svvu.edu.in సందర్శించగలరు.
డి. శ్రీనివాసరావు
రిజిస్ట్రారు

MISHRA DHATU NIGAM LIMITED
(A Govt of India Enterprise) (A Mini Ratna-1 Company)
PO : Kanchanbah, Hyderabad - 500 058, Telangana State
Phone No.: 040-24340001, (10 lines), Fax : 040-24340764 & 24340214.
Walk-In-Interview
MIDHANI, a Mini Ratna-I PSU proposes to engage 40 Trade Apprentices i.e **(ELECTRICIAN-10, FITTER-15, MACHINIST-05, TURNER-05, WELDER-05)** for one year Apprenticeship Training under the Apprenticeship Act-1961.
The interested ITI candidates who have registered their names at web portal **www.apprenticeship.gov.in** may attend **walk-in-interview on 12-03-2018 from 9.30 Hrs to 16.00 Hrs** at AMTL building - MIDHANI (near to DMRL) along with certificates & two photos for further details see our website **www.midhani.gov.in.**
Sd/- Dy. General Manager (HR- T&D)





ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో.. రూ.860 కోట్లతో ఇంటింటికీ కుళాయి

'ఈనాడు' కథనాలకు స్పందన

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: కృష్ణాజిల్లా ఎ.కొండూరు మండలంలోని ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో మూత్రపిండాల సమస్యలతో బాధపడుతున్న వారిపై 'ఈనాడు' ప్రధాన, జిల్లా సంచికలలో ప్రచురితమైన వరుస కథనాలకు ప్రభుత్వం, కలెక్టర్ బి.లక్ష్మీకాంతం స్పందించారు. దీనిలో భాగంగానే మంగళవారం ఎ.కొండూరు మండలం చీమలపాడులో ఆరోగ్యశాఖ, ఆంధ్రా ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 900 మందికి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి నెల రోజులకు సరిపడా మందులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ.. చీమలపాడు సమీప తండాల వాసులు మూత్రపిండాలు, కాలేయం, హృదయ సంబంధ సమస్యలతో బాధపడుతున్నారని గుర్తించినట్లు చెప్పారు. వ్యాధులకు ప్రధాన కారణం నీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండటమని గుర్తించామని, దీని నివారణకు రూ.860 కోట్లతో జిల్లాలో ఇంటింటికీ కుళాయి పథకానికి ప్రభుత్వం రూపకల్పన చేసిందని వెల్లడించారు. ఏప్రిల్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి ప్రారంభించనున్నామని చెప్పారు.

ఈ నగరానికి ఏమైంది?

- వాంతులు, విరేచనాలతో అల్లాడుతున్న జనం
- జీజీహెచ్‌తో పాటు ప్రైవేటు ఆసుపత్రులకు వరస
- చికిత్స పొందుతూ ముగ్గురి మృత్యువాత
- పది వైద్యశిబిరాలు ఏర్పాటు

ఈనాడు – గుంటూరు

వాంతులు, విరేచనాలు గుంటూరు నగరాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. రెండురోజుల వ్యవధిలో చికిత్స పొందుతూ మొత్తం ముగ్గురు చనిపోవటంతో నగరంలో కలకలం రేగింది. ముఖ్యంగా ఆనందపేట, సంగడిగుంట ప్రాంతాల్లో కలుషిత నీరు తాగి గత మూడు రోజులుగా వాంతులు, విరేచనాలతో స్థానికులు అల్లాడిపోతున్నారు.

మురికివాడైన ఆనందపేటలో ఆదివారం రాత్రి 8 మంది ఉదయం నుంచి వాంతులు, విరేచనాలు అవుతున్నాయని కొందరు గుంటూరు జీజీహెచ్‌కు రాగా వారికి వైద్యులు చికిత్సలు చేశారు. అదే ప్రాంతం నుంచి సోమవారం కూడా ఇలానే వాంతులు, విరేచనాలు అవుతున్నాయని మరికొందరు ఆసుపత్రికి చేరుకున్నారు. ఇలా గత రెండు రోజుల నుంచి గుంటూరు జీజీహెచ్‌తో పాటు ప్రభుత్వ జ్వరాల ఆసుపత్రికి బాధితులు పోటెత్తుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం వరకు 88 మందికి వైద్యసేవలు అందించారు. మంగళవారం సాయంత్రం మరో 20 మంది ఇవే కారణాలతో ఆసుపత్రి బాటపట్టారు. విషయం తెలుసుకున్న జిల్లా, నగరపాలక యంత్రాంగం మంగళవారం ఆనందపేట, సంగడిగుంట ప్రాంతాలకు వెళ్లి క్షేత్రస్థాయి పరిశీలన చేసింది.



రోగులతో కిక్కిరిసిన గుంటూరు సర్వజనాసుపత్రి

ఇంటింటి సర్వేకు ఆదేశం: గుంటూరు కలెక్టరు కోన శశిధర్ జీజీహెచ్‌లో స్థానిక వైద్యులతో పాటు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. తాగునీటి ప్రధాన రిజర్వాయర్ నుంచి పంపింగ్ లైన్ల దాకా ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా? అనేది తెలుసుకోవాలని గుంటూరు నగరపాలక ఇంజినీరింగ్ అధికారులను పది బృందాలుగా ఏర్పాటు చేసి తనిఖీలకు పంపారు. నర్సింగ్ విద్యార్థులతో ఇంటింటి సర్వేకు ఆదేశించారు. ఆనందపేటలో కొందరు బాధితులు తమ ప్రాంతంలో కలుషిత నీళ్లు సరఫరా అవుతున్నాయని, వాటిని తాగటం వల్లే తమకు వాంతులు, విరేచనాలు అవుతున్నాయని అధికారులకు ఫిర్యాదు చేశారు.

సోమవారం ఒకరు, మంగళవారం ఇద్దరు మృతి: సోమవారం ఆనందపేట జీరో లైన్‌కు చెందిన సయ్యద్ షబీనా(28) అనే మహిళ తొలుత చనిపోయారు. మంగళవారం ఉదయం 70 ఏళ్ల వయసు కలిగిన షేక్ జాన్ బీబీ అనే మృతి చెందారు. సాయంత్రం 4 గంటల సమయంలో పాతగుంటూరుకు చెందిన 55 ఏళ్ల ఫాతిమూన్ అనే మహిళ చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

70 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు: ఆసుపత్రికి వచ్చేవారికి మెరుగైన వైద్యసేవలు అందించటానికి అప్పటికప్పుడు జీజీహెచ్‌లోని క్యాజువాల్టీలో 70 పడకలతో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి అక్కడ ప్రత్యేకంగా వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని నియమించారు.

వెంటనే వైద్యసేవలు తీసుకోవాలి: జీజీహెచ్ ఆసుపత్రి పర్యవేక్షకుడు ఈ మరణాలపై డాక్టర్ రాజునాయుడు 'ఈనాడు'తో మాట్లాడుతూ వాంతులు, విరేచనాలు అయిన వెంటనే వైద్యసేవలు తీసుకోవాలన్నారు. ఆనందపేట, సంగడిగుంట ప్రాంతాల్లో నగరపాలక కమిషనర్ చల్లా అనురాధ, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జె. యాస్మిన్ పది వైద్య శిబిరాలను ఏర్పాటు చేయించి చికిత్సలు అందిస్తున్నారు. నగరపాలక కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్‌రూంను ఏర్పాటు చేశారు.



డయాఫ్రమ్‌వాల్ పనులు పరిశీలిస్తున్న పోలవరం అథారిటీ సభ్యులు

మూడు రోజుల పర్యటనకు పోలవరం అథారిటీ రాక

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎస్కే హల్దార్‌తో పాటు మరో ఇద్దరు సభ్యులతో కూడిన బృందం మంగళవారం పోలవరం చేరుకుంది. మధ్యాహ్నం 11 గంటలకు పోలవరం చేరుకున్న పీపీఏ సీఈ ఏకే ప్రధాన్, కార్యదర్శి ఆర్‌కే గుప్తాలు రాత్రి ఏడు గంటల వరకు పనులు పరిశీలించారు. తొలుత స్పిల్‌వే నిర్మాణంలో కాంక్రీటు ఎంత వాడుతున్నారు? ఎంత వాడాలి? తదితరాలపై ఎస్ఈ రమేష్‌బాబుతో మాట్లాడారు. గోదావరి మధ్యలో నిర్మిస్తున్న డయాఫ్రమ్‌వాల్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఎగువ, దిగువ కాఫర్‌డ్యామ్‌ల వద్ద జెట్ గ్రౌటింగ్ పనులు చూశారు. భోజన విరామం అనంతరం తిరిగి ప్రాజెక్టు అనుబంధ పనులు పి రెగ్యులేటర్, ఈ షడిల్‌డ్యామ్, జంట సొరంగాలు, ఆఫ్‌టెక్ రెగ్యులేటరు పనులు పరిశీలించారు. కుడి కాలువ వెంబడి కొంతదూరం ప్రయాణం చేశారు. బుధవారం ఎడమ కాలువ పనులు పరిశీలిస్తారని ఎస్ఈ వీఎస్ రమేష్‌బాబు చెప్పారు.

రైతు ప్రభుత్వంగా సేవలందిస్తా

- ప్రజాసంకల్ప యాత్రలో జగన్

ఈనాడు డిజిటల్, ఒంగోలు: వచ్చే ఎన్నికల్లో వైకాపాను గెలిపిస్తే రైతు ప్రభుత్వంగా సేవలందిస్తామని ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. ప్రతి రైతుకు పెట్టుబడి నిమిత్తం ఏటా మే నెలలోనే రూ.12,500 సాయం అందించడంతో పాటు, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని అన్నారు. అబద్ధపు హామీలు, మోసాలతో చంద్రబాబు రైతులను నిలువునా ముంచారని విమర్శించారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం ప్రకాశం జిల్లా ఇంకొల్లులో నిర్వహించిన బహిరంగ సభలో జగన్ మాట్లాడారు. రాష్ట్రంలో చిత్తూరు, నెల్లూరు, ఒంగోలు సహా అన్ని జిల్లాల్లోనూ సహకార డెయిరీలను చంద్రబాబు నిర్వీర్యం చేశారని ఆరోపించారు. ఆయన కారణంగానే ఈ నాలుగేళ్లలో ఒంగోలు డెయిరీకి రూ.80 కోట్ల నష్టం వచ్చిందన్నారు. సహకార డెయిరీలకు చేరాల్సిన పాలను తన సొంత సంస్థ హెరిటేజ్‌కు మళ్లిస్తున్నారని ఆరోపించారు. వైకాపా అధికారంలోకి వచ్చిన వెంటనే సహకార డెయిరీలను పునరుద్ధరించి, పాల సేకరణ ధరను లీటరుకు రూ.4 పెంచుతామని హామీ ఇచ్చారు. తెదేపా నాలుగేళ్ల పాలనలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిందని, ఆ సొమ్ముతో అడ్డగోలుగా ఎమ్మెల్యేలను కొంటున్నారని వ్యాఖ్యానించారు. చంద్రబాబుకు దమ్ముంటే ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటువేసి బలం నిరూపించుకోవాలని సవాలు విసిరారు. రాష్ట్రంలో గడిచిన నాలుగేళ్లలో ఏ ఒక్క పంటకైనా గిట్టుబాటు ధర లభించిందా? ఏ ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా? అని ప్రశ్నించారు. ఈ మోసాల ముఖ్యమంత్రిని క్షమించకూడదని, వచ్చే ఎన్నికల్లో తెదేపాను ఓడించి బంగాళాఖాతంలో కలపాలని వ్యాఖ్యానించారు. సభలో పార్టీ నేతలు బాలినేని శ్రీనివాసరెడ్డి, మోపిదేవి వెంకటరమణ తదితరులు మాట్లాడారు.



ప్రకాశం జిల్లా ఇంకొల్లు బహిరంగ సభలో మాట్లాడుతున్న వైఎస్ జగన్

బైకు అంబులెన్సుల ప్రారంభం

ఈనాడు – అమరావతి

దేశంలోనే తొలిసారిగా గిరిజన ప్రాంతాల్లో మోటార్ బైకు అంబులెన్సులను ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించారు. సచివాలయంలో మంగళవారం సాయంత్రం ఈ కార్యక్రమం జరిగింది. కొండలు, కోనల్లో మారుమూల ప్రాంతాల్లో ఉండే గిరిజనులకు అత్యవసర వైద్య సేవలను అందించాలంటే సరైన రోడ్డు మార్గం లేనందున ఇబ్బందులు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో మోటారు బైకుల అంబులెన్సులను రోడ్డు మార్గంలేని 122 ప్రాంతాల్లో నడపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీతంపేటలో 15, పార్వతీపురం-24, పాడేరు-42, రంపచోడవరం-21, చింతూరు-6, కేఆర్‌పురం-8, శ్రీశైలంలో ఆరు అంబులెన్సులను దశల వారీగా ఏప్రిల్ 10వ తేదీనాటికి ఉపయోగంలోకి తీసుకువస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ వెల్లడించారు. ఈ వాహనాల ద్వారా రోగులను ప్రధాన రహదారులవద్దకు తీసుకొచ్చి... 108 అంబులెన్సుల ద్వారా సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలిస్తారని చెప్పారు. 108 టోల్‌ఫ్రీ నెంబరుకు ఫోన్‌చేసిన 60 నిమిషాల్లో సంఘటనా స్థలానికి అంబులెన్సు... బాధితుల వద్దకు చేరుకుంటుందన్నారు. 12 రకాల వైద్య పరికరాలు, అత్యవసర మందులు బైకు అంబులెన్సుల్లో అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. రోగి సహాయకుడు కూడా అంబులెన్సు ద్వారా వచ్చేందుకు వీలుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీతంపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో సిద్ధం చేసిన నవజాత శిశు కేంద్రాన్ని కూడా సీఎం ప్రారంభించారు. ఈ కేంద్రాల ద్వారా గిరిజన శిశువుల సంరక్షణకు సంబంధించిన ముఖ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. శిశు మరణాలను తగ్గించేందుకు ఈ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఎ.ఎన్.ఎం.లు విధుల నిర్వహణలో భాగంగా రకరకాల వివరాలను నమోదు చేయాల్సి ఉన్నందున ఈ విధానాన్ని సులభతరం చేసే నిమిత్తం ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు.. సచివాలయంలో మంగళవారం ఉదయం వైద్య ఆరోగ్య శాఖ చేపట్టిన పథకాల అమలును సమీక్షించారు. వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య తదితరులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



'బైకు అంబులెన్స్' సర్వీసును ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రులు కామినేని, నారాయణ, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య తదితరులు

అడుగు దూరంలో భూముల అప్పగింత

- అశోక్ లేల్యాండ్‌తో ఏపీఐఐసీ క్రయ ఒప్పందం

హనుమాన్‌జంక్షన్ గ్రామీణం, న్యూస్‌టుడే: అమరావతి పరిధిలోని మల్లవల్లిలో పరిశ్రమల స్థాపన దిశగా అడుగులు వేగవంతమయ్యాయి. మౌలిక వసతుల కల్పనకు సంబంధించి దాదాపు అన్ని పనులు పూర్తి చేసిన రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల అభివృద్ధి మండలి(ఏపీఐఐసీ).. భూకేటాయింపుల ప్రక్రియ చేపట్టింది. ఈ క్రమంలో అశోక్ లేల్యాండ్ సంస్థకు కేటాయించిన భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు వీలుగా లాంఛనాలను పూర్తి చేసింది.

డీడీ చెల్లింపు: బస్సు బాడీ బిల్డింగ్ యూనిట్ నెలకొల్పేందుకు అశోక్ లేల్యాండ్ సంస్థ మల్లవల్లిని ఎంచుకుంది. దీనికోసం ఏపీఐఐసీ 75 ఎకరాలు కేటాయించింది. ఎకరం రూ.16.50 లక్షల చొప్పున ధర నిర్ణయించడంతో ఈ ప్రకారం 75 ఎకరాలకు రూ.12.50 కోట్లను ఏపీఐఐసీకి చెల్లించింది. సంస్థ ప్రతినిధులు రిజిస్ట్రేషన్ రుసుం కింద రూ.50 లక్షలు చెల్లించారు.

రిజిస్ట్రేషన్ల సమయంలో డీడీల వల్ల తలెత్తుతున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధికారులు. డీడీని బ్యాంకులో నిర్ధరించుకున్నాకే రిజిస్ట్రేషన్‌ను ఖరారు చేస్తున్నారు. అశోక్ లేల్యాండ్ వ్యవహారంలోనూ నూజివీడు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఇదే పాటించింది. ఏపీఐఐసీ తరఫున అన్ని దస్త్రాలు సమర్పించి జోనల్ మేనేజర్ శరత్‌బాబు క్రయ ఒప్పందానికి అనుగుణంగా లాంఛనాలు పూర్తి చేశారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కాగానే భూమి పూజ నిర్వహించేందుకు అశోక్ లేల్యాండ్ ఏర్పాట్లు చేసుకుంటోంది. మలి విడతలో ఛాసిస్‌ల తయారీ యూనిట్ నెలకొల్పవచ్చని సమాచారం.

తొలి మహిళా రైల్వేస్టేషన్‌గా చంద్రగిరి

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రకటన

చంద్రగిరి, న్యూస్‌టుడే: చిత్తూరు జిల్లాలోని చంద్రగిరి రైల్వేస్టేషన్ మహిళా రైల్వేస్టేషన్‌గా అవతరించింది. ఇక్కడి కార్యకలాపాల నిర్వహణ మొత్తం వారికే అప్పగించారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్‌యాదవ్ మంగళవారం ఈ స్టేషన్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా కేంద్రప్రభుత్వం చంద్రగిరిని మహిళా రైల్వేస్టేషన్‌గా ప్రకటించిందని తెలిపారు. హైదరాబాద్‌లోని బేగంపేట రైల్వేస్టేషన్‌ను సైతం ఈ విభాగంలో ఎంపిక చేశామన్నారు. దేశంలో మహిళా రైల్వే స్టేషన్లుగా తొలుత ముంబయి, మధ్యప్రదేశ్‌లోని మాతంగి రైల్వేస్టేషన్లను గుర్తించారని వివరించారు. రాష్ట్రంలో మరో ఆరు డివిజన్లలోనూ ఒక్కో స్టేషన్ చొప్పున ఏర్పాటు చేస్తామని చెప్పారు. చంద్రగిరి రైల్వేస్టేషన్ తిరుపతికి సమీపంలోని అతి చిన్నది కావడంవల్ల అతితక్కువ మంది సిబ్బందితో మహిళా విభాగంలో తీర్చిదిద్దామన్నారు. కార్యక్రమంలో డీఆర్ఎం విజయ్‌ప్రతాప్‌సింఘ్, మహిళా రైల్వేస్టేషన్ అధికార సిబ్బంది పాల్గొన్నారు.



మహిళా రైల్వేస్టేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న ద.మ. రైల్వే జీఎం వినోద్‌కుమార్‌యాదవ్

సైన్సు రంగంలో మహిళలను మరింతగా ప్రోత్సహించాలి

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఉద్ఘాటన

దిల్లీ: సైన్సు రంగంలో మహిళలు మరింతగా భాగస్వాములయ్యేలా వారిని శక్తివంచనలేకుండా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ మంగళవారం నొక్కి చెప్పారు. ఈ రంగంలో వివక్షను రూపుమాపకుంటే... సైన్సు పరంగా ఆశించిన విజయాలు సాధ్యపడవన్నారు. ఐఐఎస్సీ, ఐఐటీలు, ఐఐఎస్ఈఆర్‌ల సంచాలకులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడారు. ప్రజారోగ్యం, పేదరిక నిర్మూలన, ఆహార, ఇంధన భద్రత తదితర అనేకానేక సమస్యలను మనదేశం ఎదుర్కొంటోందన్నారు. ఇవన్నీ కూడా పెనుసవాళ్లేనని ఉద్ఘాటించారు. నిత్యకృత్యమై పోయిన ఈ తరహా ఇబ్బందులను అధిగమించడంలో ఐఐటీ, ఐఐఎస్సీ వంటి సంస్థలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ నేపథ్యంలోనే సాంకేతిక, సైన్సు రంగంలో మహిళల పాత్ర, భాగస్వామ్యం చురుగ్గా పెరగాలని ఆయన అభిప్రాయపడ్డారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య శాఖ
టెండరు ప్రకటన
DIPR No. 3648/CL/Advt/1/1/2017-18

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
(R&B) నేషనల్ హైవేస్ డిపార్ట్‌మెంట్
ఏపిఇప్రొక్యూర్‌మెంట్ నోటీసు
షార్ట్ టెండరు నోటీసు నెం. SE(R&B)/NH/VJA/14/2017-18, తేది: 3–3–2018.
ప్యాకేజ్ నెం: 1 పని పేరు: (R&B) NH డివిజన్, విశాఖపట్నం క్రింద NH 165 యొక్క పామర్రు-దిగమర్రు రోడ్ యొక్క కి.మీ. 61/740 నుండి 96/00 వరకు తీవ్రంగా దెబ్బతిన్న స్ట్రెచెస్‌కు ఇంటెన్సివ్ ప్యాచ్ వర్క్‌ను ఏర్పాటు చేయుట ద్వారా అత్యవసర మరమ్మతులు. పని సుమారు విలువ: రూ. 33.86 లక్షలు. టెండర్ల స్వీకరణకు చివరితేది మరియు సమయం: 13–3–2018, సా. 5.00 గం. వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్, అనగా www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
DIPR No. 656PP/ CL/ADVT/1/1/2017-18 సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (R&B), N.H. సర్కిల్, విజయవాడ

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనాల శాఖ
e- ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 27 to 29/TO/2017-18
www.apeprocurement.gov.in
DIPR No. 3655/CL/Advt/1/1/2017-18

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ
e- ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
No. 299 to 312/TO/2017-18
www.tender.apeprocurement.gov.in
DIPR No. 3659/CL/Advt/1/1/2017-18

ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ (P) లిమిటెడ్
APSPCL
(ఆం.ప్ర. ప్రభుత్వం మరియు భారత ప్రభుత్వం యొక్క ఒక జాయింట్ వెంచర్ కంపెనీ)
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
దిగువ తెలిపిన పనుల కొరకు APSPCL టెండర్లను కోరుతున్నది:- (1) "ఆం.ప్ర., కడప జిల్లా, మైలవరం మండలం, కడప అల్ట్రా మెగా సోలార్ పార్క్ (1000 MW) యొక్క 250 MW బ్లాక్ కొరకు CD పనులతోసహా CC డ్రైన్ మరియు టు లేన్ బి.టి. రోడ్ నిర్మాణం". పని యొక్క సుమారు విలువ: రూ. 6.80 కోట్లు. షెడ్యూలు లభించు తేది మరియు సమయం: 5–3–2018, సా. 5.00 గం. నుండి. (2) "కార్పొరేట్ కార్యాలయం మరియు సైట్ కార్యాలయాల వద్ద 1–4–2018 నుండి 31–3–2019 వరకు ఆఫీస్ అసిస్టెన్స్‌ను ఏర్పాటు చేయుట." పని యొక్క సుమారు విలువ: రూ. 91.68 లక్షలు. షెడ్యూలు లభించు తేది మరియు సమయం: 6–3–2018, సా. 5.00 గం. నుండి. వివరాల కొరకు www.apspcl.ap.gov.inను చూడండి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
www.apeprocurement.gov.in

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
శ్రీయుత జిల్లా కలెక్టర్, ప.గో.జిల్లా ఏలూరు వారి ఉత్తర్వులు
Roc. No.e- 932569/2017/ జి1, తేది: 02–03–2018న ఆమోదించబడినది
ఫారం నెం. 6 (ఎ)
ప్రాథమిక ప్రకటన
మండలం: కొవ్వూరు

క్రమ సంఖ్య	సర్వే నెం./ స.డి.నెం.	మొత్తం విస్తీర్ణం	భూసేకరణ క్రింద విస్తీర్ణం	సంబంధిత ఆసామి పేరు మరియు చిరునామా	ఉత్తరం	తూర్పు	దక్షిణం	పడమర	చెట్లు, కట్టడములు ఇతర వివరములు
1	594-2B2	0.12	0.12	[illegible]	594-1B	594-2C3	594-4	594-1C	
2	594-2C3	0.18	0.18	[illegible]	594-1B	594-6C	594-5	594-2B2	
3	594-4	0.64	0.64	[illegible]	594-2B2	594-5	596	594-3	
4	594-5	0.98	0.98	[illegible]	594-2C3	594-6C	596	594	బోర్-1
మొత్తం		1.92	1.92						

సం/- భాస్కర్ కాటంనేని, జిల్లా కలెక్టర్, పశ్చిమగోదావరి, ఏలూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం, ఒంగోలు
ఆర్.సి.బి./35/2018 తేది. 4.03.2018
ప్రకాశం జిల్లా భూసేకరణ ప్రకటన
ఫారం నెం.VI (ఎ)
(2013వ సంవత్సరం 30వ చట్టం వలన భూసేకరణ, పునరావాసం, పునస్థాపనలో న్యాయపరమైన నష్టపరిహారం పొందే, పారదర్శకత చట్టంలో సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014లో రూల్19, సబ్ రూల్ (1) ననుసరించి)
ప్రాథమిక ప్రకటన
షెడ్యూలు
జిల్లా: ప్రకాశం మండలము: మార్కాపురం గ్రామము: మార్కాపురం

1	2	3	4	5	6	7	8	9	10	11	12
1.	1388/1	1.96	[illegible]	0.44	[illegible]	[illegible]	1388	VMS	1388	1391	[illegible]
2.	1388/2	4.04	[illegible]	0.60	[illegible]	[illegible]	VMS	1388/2	1388/2	1389	[illegible]
3.	1390	2.70	[illegible]	0.18	[illegible]	[illegible]	1388/1	1388/1	1386	1388/1	[illegible]
	మొత్తం విస్తీర్ణము			1.22							

సం/- యస్.నాగలక్ష్మి, IAS.
ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, ఒంగోలు.

రీ'ఫ్రెష్'

లావా 'గో'

తక్కువ డేటా ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాల్ని పొందేలా ఎంట్రీ లెవల్ యూజర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆండ్రాయిడ్ ఒరియో 'గో ఎడిషన్' ఓఎస్‌తో లావా కంపెనీ స్మార్ట్‌ఫోన్‌ని విడుదల చేసింది. పేరు 'లావా జెడ్50'. ఆండ్రాయిడ్ గో ఓఎస్‌తో దేశంలో తొలిసారి అందుబాటులోకి వచ్చిన ఫోన్ ఇదే.



తక్కువ డేటా తీసుకుని రన్ అయ్యే గూగుల్ గో, యూట్యూబ్ గో, జీమెయిల్ గో, మ్యాప్స్ గో, అసిస్టెంట్ గో... లాంటి మరిన్ని ఆప్స్‌ని బిల్ట్‌ఇన్‌గా పొందొచ్చు. కాన్ఫిగరేషన్ విషయానికొస్తే... ర్యామ్ 1జీబీ, తాకేతెర పరిమాణం 4.5 అంగుళాలు, ఇంటర్నల్ మెమొరీ 8జీబీ, మైక్రోఎస్‌డీ కార్డ్‌తో మెమొరీ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. మీడియటెక్ ప్రాసెసర్‌ని వాడారు. 5 మెగాపిక్సల్ సామర్థ్యంలో డ్యూయల్ కెమెరాలు ఉన్నాయి.

నిజం...గా!

పాస్‌వర్డ్‌లు కూడా...

భారతీయులు జీవతభాగస్వామిని తమలో సగమని భావించడం తెలిసిందే. నెట్టింట్లోనూ ఇదే ధోరణి కనబరుస్తున్నారు. పాస్‌వర్డ్‌లు.. ఆన్‌లైన్ బ్యాంకింగ్‌కి వాడే పిన్ నెంబర్లనూ జీవిత భాగస్వామితో కలిసి పంచుకుంటున్నారట. మెకాఫీ చేపట్టిన సర్వేలో తేలిందిదే. 84 శాతం భారతీయ నెటిజన్లు జీవిత భాగస్వాములతో వ్యక్తిగత లాగిన్



వివరాల్ని పంచుకునేందుకు సందేహించడం లేదట. ఇదే మాదిరిగా సోషల్ మీడియాకి సంబంధించినవి 45 శాతం, స్ట్రీమింగ్ సర్వీసులవి 42 శాతం, వ్యక్తిగతమైన ఈమెయిల్స్‌వి 41 శాతం, బ్యాంకింగ్, ఇతర ఆర్థిక వ్యవహారాలకు సంబంధించినవి 38 శాతం పంచుకుంటున్నారని తేల్చారు. మరో చిత్రమైన విషయం ఏంటంటే... 45 శాతం మంది భాగస్వాముల సోషల్ మీడియా ఎకౌంట్‌లపై ఓ కన్నేస్తున్నట్లు అంగీకరించారు. అలాగే, ఫోన్‌ని మితిమీరి వాడడంపై గొడవకు దిగిన సందర్భాలూ ఎక్కువేనని ఒప్పుకున్నారట.

ఈ-కబుర్లు మీవే!

'తవ్వి' తీయండి

ఫోన్ గ్యాలరీలో ఫొటోలు, వీడియోలు ఎప్పటికప్పుడు జమ అవుతూనే ఉంటాయి. కొన్నిసార్లు పొరబాటున డిలీట్ అవుతుంటాయి కూడా. అలాంటప్పుడు వాటిని తవ్వి తీసేందుకు 'డిస్క్ డిగ్గర్' ఆప్ ఉంది. ఇన్‌స్టాల్ చేసి ఫోన్‌ని స్కాన్ చేస్తే డిలీట్ చేసిన మొత్తం ఫొటోలు థంబ్‌నెయిల్ బాక్సుల్లో



కనిపిస్తాయి. కావాల్సిన వాటిని సెలెక్ట్ చేసి రికవర్ చేయవచ్చు. వీడియోలను కూడా ఆప్ ద్వారా పొందే వీలుంది. రికవర్ చేసిన వాటిని ఫోన్‌లోనే కాకుండా డ్రాప్‌బాక్స్, గూగుల్ డ్రైవ్‌లోకి అప్‌లోడ్ చేసుకుని బ్యాకప్ చేసుకోవచ్చు. పీసీల్లోనూ అప్లికేషన్ సాఫ్ట్‌వేర్‌లా ఇన్‌స్టాల్ చేసి వాడుకోవచ్చు.

డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/WBWG7j

– శ్రీహర్ష ఆర్, హైదరాబాద్

'హోలో' మ్యాన్‌లు వచ్చేస్తారు

హోలో– ఐఓఎస్, ఆండ్రాయిడ్

పులితో ఫొటో దిగాలంటే? జంతు ప్రదర్శనశాలకి వెళ్లాల్సిన పని లేదు. ఉన్నచోటకే పులిని పిలవొచ్చు. ఇంకా చెప్పాలంటే... స్పైడర్ మ్యాన్‌తో స్నాప్ తీసుకుందాం అనుకుంటే? హాలీవుడ్‌కి ఎగిరి వెళ్లాల్సిన పని లేదు. పిలిస్తే మీ ఇంటి సోఫాలోకి వచ్చేస్తాడు. 'హోలో' ఏఐ ఆప్‌తో ఇది సాధ్యమే. ఇన్‌స్టాల్ చేస్తే ఆప్‌తో పాటు హోలో మ్యాన్ల గ్యాలరీ డౌన్‌లోడ్ అవుతుంది. ఇంకేముందీ... ఆప్ కెమెరా కంటితో హోలోగ్రామ్ ఇమేజ్‌లను చిటికెలో ప్రత్యక్షమయ్యేలా చేయవచ్చు. ఉదాహరణకు ఇంట్లో మీకున్న సింహాసనం పక్కనే పులికీ ఓ స్టూల్ వేసి నిలబెట్టి ఫొటో లేదా వీడియో తీసుకోవాలంటే క్షణాల్లో చిత్రీకరించొచ్చు. ఇదే మాదిరిగా స్పైడర్ మ్యాన్‌తో సందడి చేస్తూ వీడియో తీసుకోవచ్చు. ఆప్ గ్యాలరీలో విభాగాల వారీగా చాలానే ఉన్నాయి. అన్నింటినీ ఒక్కొక్కటిగా ఆప్‌కి జత చేసుకుని వాడుకోవచ్చు.

డౌన్‌లోడ్ లింక్: https://thisisholo.com/

గది అలంకరణ 'మ్యాజిక్కే'

మ్యాజిక్‌ప్లాన్– ఐఓఎస్, ఆండ్రాయిడ్

కొత్తిల్లు కట్టుకున్నారు... లేదంటే అపార్ట్‌మెంట్‌లో ఓ ఫ్లాట్ కొన్నారు. మీ అభిరుచి మేరకు గదుల కొలతల్ని తీసుకుని ఎక్కడెక్కడ ఏమేం ఉండాలో కొలుస్తూ పక్కా ప్రణాళిక వేసుకోవాలంటే? సంబంధిత నిపుణుల్ని పిలిపించాల్సిన పని లేకుండా మ్యాజిక్‌ప్లాన్ ఆప్‌ని ఓపెన్ చేస్తే సరి. ఫోన్ కెమెరాకి గది నాలుగు మూలల్ని చూపితే వెంటనే మ్యాజిక్ చేసినట్టుగా గదికి సంబంధించిన ప్లాన్ సిద్ధం అవుతుంది. ఇంకేముందీ... ఫర్నీచర్, ఫ్లోర్ మ్యాట్‌లు, ఇతర ఇంటీరియర్ డిజైన్స్‌తో గది ఎలా ఉంటుందో 3డీలో చూడొచ్చు. ఉచిత వెర్షన్‌లో 'బేసిక్ ఫ్లోర్ ఫ్లాన్'ని అందిస్తున్నారు. ఇతర సౌకర్యాల్ని యాక్సెస్ చేయాలంటే ప్రీమియం వెర్షన్‌ని కొనుగోలు చేయాలి.

డౌన్‌లోడ్ లింక్: http://www.magic-plan.com/



అగ్మెంటెడ్ రియాలిటీ... వాస్తవ ప్రపంచానికి వింతల్ని జత చేస్తోంది!

అంగుళాల తెరలపై అన్నీ అద్భుతాలే! ఎలాగంటే...

- ఫోన్ కెమెరాతో చూస్తూ గది కొలతల్ని తీసుకోవచ్చు
- ఉన్నచోటే 3డీ బొమ్మల్ని సృష్టించొచ్చు
- మీ పక్కనే హోలోగ్రామ్స్‌ని ప్రత్యక్షమయ్యేలా చేయొచ్చు
- ఆకాశపు హద్దుల్ని చెరిపేసి నక్షత్రమండలాల్ని చూడొచ్చు.
- ఫోన్‌ని స్కేలుగా మార్చేసి వస్తువుల్ని కొలవొచ్చు.

... చెప్పాలంటే ఇలా 'ఏఆర్' ఆప్‌లు చేసే అద్భుతాలు అనేకం!

ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లకు ఇవి ప్రత్యేకం...

కల్పనే నిజమాయెనే!

గ్రాఫిక్: శ్రీనివాస్

ఫోన్‌ని ముందు పెట్టుకుని కెమెరా కంటితో చూస్తూ ఆడిన పోకిమాన్ గేమ్ గుర్తుందిగా! అది మొదలు ఈ అగ్మెంటెడ్ రియాలిటీ ఓ మోస్తరు టెకీలకు పరిచయం అయింది. అయితే, కేవలం గేమింగ్‌కి మాత్రమే వేదిక కాకుండా పరిధిని పెంచుకుని పలు రంగాల్లో ప్రవేశిస్తోంది. ఐటీ దిగ్గజాలైన గూగుల్, యాపిల్ సంస్థలు ఏఆర్‌ని మరో మెట్టుపైకి ఎక్కిస్తూ పలు రకాల ఆవిష్కరణలతో ముందుకొస్తున్నాయి. దీంతో అగ్మెంటెడ్ రియాలిటీ వాస్తవ ప్రపంచంతో వేగంగా జత కట్టేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. వర్చువల్ కార్డ్‌బోర్డులు, టెక్ గ్యాడ్జెట్‌లు ఆన్‌లైన్ అంగళ్లలో... మొబైల్ అప్లికేషన్లు ప్లే స్టోర్‌ల్లో తెగ సందడి చేస్తున్నాయి. ఇప్పటికే యాపిల్ కంపెనీ 'ఏఆర్‌కిట్'తో ఐఓఎస్ 11 ఓఎస్ వెర్షన్‌తో ఐఫోన్, ఐప్యాడ్‌పై ఏఆర్ అద్భుతాల్ని వినియోగదారులకు పరిచయం చేసింది. మరోవైపు గూగుల్ 'ఏఆర్‌కోర్' పేరుతో ఏఆర్ ఆప్స్‌ని సులభంగా ఆధునిక ఫోన్లపై రన్ చేసుకునేలా ప్రత్యేక ప్లాట్‌ఫామ్‌ని సిద్ధం చేసింది. రాబోయే రోజుల్లో ఏఆర్‌కోర్ 'వెర్షన్ 1.0'తో సుమారు 10 కోట్ల ఆండ్రాయిడ్ ఫోన్లను మార్కెట్‌లో పరిచయం చేసేందుకు గూగుల్ సిద్ధం అవుతోంది. దీంతో భవిష్యత్‌లో బడ్జెట్ ఫోన్లలోనూ ఏఆర్ ఆప్‌లను రన్ చేసుకునే వీలుంటుంది. ప్రముఖ మొబైల్ తయారీ కంపెనీలన్నీ ఈ దిశగానే అడుగులు వేస్తున్నాయి. ఏఆర్‌కోర్ వెర్షన్ 1.0తో ఆప్ డెవలపర్లకీ ఏఆర్ ఆప్స్‌ని ప్లే స్టోర్‌లోకి ప్రవేశపెట్టేందుకు దార్లు తెరుచుకోనున్నాయి. ఆప్‌లే కాకుండా మరోవైపు ఏఆర్ గ్యాడ్జెట్‌లతోనూ గూగుల్ ముందుకొస్తోంది. గతంలో పరిచయం చేసి పక్కన పెట్టిన 'గూగుల్ గ్లాస్'ను తిరిగి మార్కెట్‌లోకి తెచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఇప్పటికైతే మొబైల్ ప్రియుల్ని లక్ష్యంగా చేసుకుని మొబైల్ అప్లికేషన్లు ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లను అలరిస్తూ ఆయా ఆప్ స్టోరుల్లో సిద్ధంగా ఉన్నాయి. అవేంటో ఓ లుక్కేద్దాం పదండి!

3డీ బొమ్మలతో నేర్చుకోవచ్చు

జిగ్ స్పేస్– ఐఓఎస్

ఏదైనా పరికరం ఎలా పని చేస్తుందో వివరంగా తెలుసుకోవాలంటే? వెంటనే స్మార్ట్ ఫోన్ అందుకుని టెక్స్ట్ మేటర్ చదివో, వీడియో చూసో తెలుసుకుని ఉంటారు. ఇంకాస్త వివరంగా ఉన్నచోటే ఫోన్‌తో పలు పరికరాల్ని 3డీలో సృష్టించి పరిశీలిస్తే! జిగ్ స్పేస్ ఆప్ ఇన్‌స్టాల్ చేస్తే ఇది సాధ్యమే. ఎందుకంటే ఇదో 3డీ లెర్నింగ్ ఆప్. ఇన్‌స్టాల్ చేసి గ్యాలరీలో ఉన్న వాటిని ఎప్పుడైనా... ఎక్కడైనా... 3డీలో సృష్టించి చూడొచ్చు. ఉదాహరణకు మీరో ఆటోమొబైల్ విద్యార్థి అయితే వాహన ఇంజిన్లని డ్రాయింగ్ టేబుల్‌పైనే 3డీలో సృష్టించొచ్చు. భాగాల్ని విడదీసి ఇంటరాక్టివ్ పద్ధతిలో నిశితంగా పరిశీలించే వీలుంది. ఇప్పటికైతే జిగ్స్ గ్యాలరీలో పరిమిత డిజైన్లే ఉన్నాయి. కొత్తగా రానున్న వెర్షన్లో 'జిగ్ వర్క్‌షాప్' విభాగాన్ని జత చేయనున్నారు. దీంతో యూజర్లూ వారు రూపొందించిన వాటిని గ్యాలరీలోకి అప్‌లోడ్ చేసి ఇతరులతో పంచుకోవచ్చు.

డౌన్‌లోడ్ లింక్: https://jig.space/

యాపిల్ పరికరాలే 'స్కేళ్లు'

మెజర్‌కిట్– ఐఓఎస్

ఏదైనా కొలవాలంటే ఇక మీదట స్కేల్ కోసం వెతకాల్సిన పని లేదు. జేబులోని ఐఫోనో, ఐప్యాడో తీస్తే చాలు. అదెలా అంటారా? ఏఆర్ మెజర్‌కిట్ ఆప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోండి. ఆప్ కెమెరా ఆప్షన్‌తో దేన్నయినా ఇట్టే కొలవొచ్చు. అందుకు 'రూలర్' ఆప్షన్‌ని ఉచితంగా అందిస్తున్నారు. కెమెరాతో చూస్తున్నప్పుడు అగ్మెంటెడ్ రియాలిటీలో స్కేల్ ప్రత్యక్షమవుతుంది. దాంతో వస్తువు కొలతల్ని తీసుకోవచ్చు. ప్రీమియం ఆప్షన్లుగా... మాగ్నెటోమీటర్, ఫేస్ మెష్, మార్కర్ పిన్, యాంగిల్స్, క్యూబ్, లెవల్... ఆప్షన్లు ఉన్నాయి. 'యాంగిల్స్'తో గది నాలుగు మూలల్నీ కొలవొచ్చు. 'పర్సన్ హైట్' ఆప్షన్‌తో ముందు నిలిచున్న వ్యక్తి ఎత్తుని క్షణాల్లో కొలవొచ్చు. 'ఫేస్ మెష్'తో ముఖాన్ని 3డీ మోడల్‌లో సృష్టించొచ్చు. డౌన్‌లోడ్ లింక్: https://measurekit.com/

ప్రపంచమంతా కాన్వాసే

వరల్డ్ బ్రష్– ఐఓఎస్


చూసేకళ్లుంటే ప్రపంచమే ఓ పెద్ద కాన్వాస్. అందుకే మీ ఫోన్ కెమెరా కంటితో చూసే మొత్తం ప్రపంచాన్ని ఓ కాన్వాస్‌లా మార్చేసి కుంచెతో బొమ్మలు తీస్తే! ఎలా సాధ్యమో తెలియాలంటే యాపిల్ యూజర్లు వరల్డ్ బ్రష్ ఆప్‌ని ప్రయత్నించొచ్చు. ఆప్‌ని రన్ చేసి కెమెరా ఆప్షన్స్‌లో బ్రష్‌లను సెలెక్ట్ చేసి 'లైవ్ లొకేషన్'లో బొమ్మలు గీయొచ్చు. సందర్శించిన ప్రాంతాల్ని చూస్తూ మీదైన శైలిలో స్పందిస్తూ తెరపై రాయొచ్చు. ఇలా గీసిన, రాసిన వాటిని పబ్లిక్‌తో పంచుకుంటే... ఆప్ వాడే యూజర్లు మీరు సందర్శించిన చోటికి వెళ్తే తెరపై అవి కూడా కనిపిస్తాయి. ఇతరుల ఏఆర్ స్పందనల్ని మీరూ చూడొచ్చు.

డౌన్‌లోడ్ లింక్: https://worldbrush.net/

ఆకాశం హద్దులు దాటి...

స్కైవ్యూ– ఐఓఎస్, ఆండ్రాయిడ్

నక్షత్ర మండలాలు, గ్రహాల్ని చూడాలంటే? ప్లానిటోరియం అడ్రసో... టెలిస్కోప్ అడ్డాకో వెళ్లాల్సిన పని లేదు. జేబులో స్మార్ట్ ఫోన్ తీస్తే చాలు. మీరు ఉన్న చోట ఆకాశపు హద్దుల్ని చెరిపేస్తూ గ్రహాలు,



నక్షత్ర మండాల్ని ప్రత్యక్షంగా చూడొచ్చు. ఆప్‌ని ఓపెన్ చేసి కెమెరా కంటితో ఆకాశం వైపు చూపితే చాలు. కోట్ల నక్షత్రాల్ని కథలు, వాటి ఆకారాల్ని ఎక్స్‌ప్లోర్ చేసి చూడొచ్చు. రాత్రి సమయంలో ఆప్‌ని వాడితే మంచి ఫలితాల్ని రాబట్టొచ్చు.

డౌన్‌లోడ్ లింక్: https://goo.gl/iiS1QL

పీసీ కార్నర్

బడ్జెట్ ల్యాపీలు

చదువైనా.. ఉద్యోగమైనా... వ్యాపారమైనా... పర్సనల్ కంప్యూటర్ భాగస్వామ్యం ఉండాల్సిందే. సరే కొందాం అనుకున్నాక ముందు బడ్జెట్ వేసుకుంటాం. నెట్టింట్లో సందడి చేస్తున్న నోట్‌బుక్.. నెట్ బుక్.. ల్యాప్‌టాప్ మోడళ్లను పరిశీలిస్తాం. కాన్ఫిగరేషన్ల కహానీలు చదివేస్తాం. తర్వాతే కావాల్సిన మోడల్‌ని ఎంపిక చేసుకుంటాం. ఇదే దృక్పథంతో వినియోగదారుల అవసరాలకు సరిపడేలా 'ఆర్‌డీపీ' బడ్జెట్ ల్యాపీలు ముందుకొచ్చాయి. నాజూకు డిజైన్లతో మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి!

అదిరే డిస్‌ప్లేతో.. థింక్‌బుక్ 1130



- హెచ్‌డీడీ, ఎస్ఎస్‌డీ స్లాట్
- 11.6 అంగుళాల హెచ్‌డీ ఐపీఎస్
- ర్యామ్ 2జీబీ
- స్టోరేజ్ 32జీబీ
- విండోస్ 10

స్టోరేజ్ సామర్థ్యాన్ని మైక్రోఎస్‌డీ కార్డ్‌తోనే కాకుండా హైఎండ్ పీసీలా హార్డ్‌డ్రైవ్‌తో పెంచుకునే వెసులుబాటు ఉంది. అందుకు ప్రత్యేకంగా హార్డ్‌డిస్క్ డ్రైవ్ స్లాట్‌ని ఏర్పాటు చేశారు. వినియోగదారులు అవసరం మేరకు హార్డ్‌డ్రైవ్‌ని కొనుగోలు చేసుకుని సులువైన పద్ధతిలో డ్రైవ్‌ని ల్యాపీకి ఇన్‌సర్ట్ చేసుకోవచ్చు. బ్యాటరీ బ్యాకప్ మరో ప్రధాన ఆకర్షణ. ఒకసారి ఛార్జ్ చేసి 10.5 గంటలు వాడుకోవచ్చు. స్టాండ్‌బై మోడ్‌లో 21 రోజులు ఉంటుంది. ఇంటెల్ క్వాడ్ కోర్ 1.92 జీహెచ్‌జెడ్ ప్రాసెసర్‌ని వాడారు. Windows 10 Gestures సదుపాయంతో ల్యాపీ టచ్‌ప్యాడ్‌ని టచ్‌స్క్రీన్‌లా వాడుకోవచ్చు. వై-ఫై, బ్లూటూత్, యూఎస్‌బీ 3.0, హెచ్‌డీఎంఐ, మిని హెచ్‌డీఎంఐ, మైక్రోఎస్‌డీ స్లాట్ ఉన్నాయి. నాజూకు డిజైన్‌తో తయారైన ల్యాపీ మందం 20.1 ఎంఎం. బరువు 1.1 కేజీలు. ధర రూ.10,599

తెర పెద్దగా.. థింక్‌బుక్ 1430ఎ

- తెర పరిమాణం 14.1 అంగుళాలు
- ర్యామ్ 2జీబీ
- ఇంటర్నల్ మెమొరీ 32జీబీ.
- విండోస్ 10 ప్రొఫెషనల్

20ఎంఎం మందంతో స్లిమ్‌గా 14.1 అంగుళాల హెచ్‌డీ స్క్రీన్‌తో అందిస్తున్నారు. ఇంటెల్ క్వాడ్‌కోర్ ప్రాసెసర్‌ని వాడారు. మైక్రోఎస్‌డీ కార్డ్‌తో మెమొరీ సామర్థ్యాన్ని 128జీబీ వరకూ పెంచుకునే వీలుంది. బ్యాటరీ సామర్థ్యం 10,000 ఎంఏహెచ్. ఒకసారి ఛార్జ్ చేస్తే సుమారు 8.5 గంటల పాటు పని చేస్తుంది. బ్లూటూత్ 4.0, వై-ఫై నెట్‌వర్క్‌లను సపోర్ట్ చేస్తుంది. ధర రూ.13,999. విండోస్ ఓఎస్ లేకుండా రూ.11,999


మోడళ్లకు సంబంధించిన ఇతర వివరాలకు
https://goo.gl/xbgH3d

తాకేతెరతో.. థింక్‌బుక్ 1110



- 11.6 అంగుళాల తాకేతెర
- ర్యామ్ 2జీబీ
- స్టోరేజ్ సామర్థ్యం 32జీబీ.
- విండోస్ 10 బిల్డ్‌వన్ ఓఎస్

అన్ని అవసరాలకు సరిపడే 'కన్వర్టబుల్ ల్యాప్‌టాప్'లను కొందాం అనుకుంటే? అదీ తాకేతెర సౌకర్యంతో కావాలనుకుంటే? బడ్జెట్ భారీగా పెట్టాల్సిందే అనుకుంటే పొరబాటే. ఎందుకంటే... నాణ్యతలో రాజీ లేకుండా మధ్య తరగతివారూ ఆధునిక టెక్నాలజీని అందిపుచ్చుకునేలా థింక్‌బుక్ 1110 మోడల్‌ని తీర్చిదిద్దారు. నాలుగు రకాలుగా (ల్యాప్‌టాప్, స్టాండ్, టెంట్, ట్యాబ్లెట్) ల్యాపీనీ వాడుకోవచ్చు. హెచ్‌డీ టచ్‌స్క్రీన్ డిస్‌ప్లేపై గ్రాఫిక్స్ ఆకట్టుకుంటాయి. ఇంటెల్ క్వాడ్ కోర్ 1.92 జీహెచ్‌జెడ్ ప్రాసెసర్‌ని వాడారు. మైక్రోఎస్‌కార్డ్‌తో మెమొరీ సామర్థ్యాన్ని 128 జీబీ వరకూ పెంచుకోవచ్చు. బ్లూటూత్ 4.0, యూఎస్‌బీ 3.0, 2.0 పోర్టులు, మిని హెచ్‌డీఎంఐ, మైక్రోఎస్‌డీ స్లాట్, వెబ్ కెమెరా ఉన్నాయి. డ్యూయల్ స్పీకర్లతో ఆడియో వినొచ్చు. అత్యంత నాజూకుగా రూపుదిద్దుకున్న ల్యాపీ బరువు 1.3 కేజీలు. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 6.5 గంటల పాటు పని చేస్తుంది. బ్యాటరీ సామర్థ్యం 8,000ఎంఏహెచ్. ధర రూ.13,999



ఈనాడు సినిమా

అమ్మకిచ్చిన మాట కోసం...


మహేష్‌బాబు

'ఈ ఊరు మనకు చాలా ఇచ్చింది. ఎంతోకొంత తిరిగి ఇవ్వకపోతే లావై పోతాం' - 'శ్రీమంతుడు'లో మహేష్‌బాబు చెప్పిన మాట ఇది. భరత్ కూడా ఇలాంటి బంగారంలాంటి మరో మాట చెప్పాడు. 'ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. లేదంటే మనం మనుషులం అనిపించుకోం' అని! 'భరత్ అనే నేను' కథాంశం ఈ 'మాట' చుట్టూనే తిరగబోతోంది. మహేష్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రమిది. కొరటాల శివ దర్శకుడు. డి.వి.వి. దానయ్య నిర్మాత. మంగళవారం ప్రచార చిత్రాన్ని విడుదల చేశారు. 'చిన్నప్పుడు మా అమ్మ నాకో మాట చెప్పింది. ఒక్కసారి ప్రామిస్ చేసి ఆ మాట తప్పితే యు ఆర్ నాట్ కాల్డ్ ఏ మ్యాన్' అంటూ మహేష్ డైలాగ్ ఈ టీజర్‌లో వినిపించింది. భరత్ ఆశయం ఏంటి? ఇచ్చిన మాట ఏంటి? అందుకోసం ఏం చేశాడన్నదే ఈ సినిమా. ఆ విషయాన్ని టీజర్‌లోనే క్లుప్తంగా చూపించాడు దర్శకుడు. వచ్చే నెల 20న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. సంగీతం: దేవిశ్రీ ప్రసాద్

పడి పడి లేచే...


శర్వానంద్

శర్వానంద్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. సాయిపల్లవి కథానాయిక. సుధాకర్ చెరుకూరి, ప్రసాద్ చుక్కపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం కోల్‌కతాలో కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. శర్వానంద్ పుట్టినరోజును పురస్కరించుకొని మంగళవారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేయడంతో పాటు, పేరును ప్రకటించారు. 'పడి పడి లేచే మనసు' పేరును చిత్రానికి ఖరారు చేశారు. నిర్మాతలు మాట్లాడుతూ "సృజనాత్మకతతో కూడిన విభిన్నమైన ప్రేమకథా చిత్రమిది. అందుకు తగ్గట్టుగానే పేరు కుదిరింది. పేరుకు మంచి స్పందన లభిస్తోంది. విశాల్ చంద్రశేఖర్ సంగీతం, జయకృష్ణ ఛాయాగ్రాహణం సినిమాకి బలం. త్వరలోనే వెంకట్ నేతృత్వంలో యాక్షన్ ఘట్టాల్ని తెరకెక్కిస్తాం" అన్నారు. మురళీశర్మ, ప్రియారామన్, వెన్నెల కిషోర్, కల్యాణి నటరాజన్ తదితరులు నటిస్తున్నారు.

అందరికీ కాలేజీ రోజులు గుర్తొస్తాయి!



"నా ప్రతి సినిమా విడుదలకు ముందు ఆందోళనే. జ్వరం వచ్చినట్టు అయిపోతుంది. ఇప్పుడు 'కిరాక్‌పార్టీ' విడుదల దగ్గరపడటంతో నా పరిస్థితి అలానే ఉంద"న్నారు నిఖిల్. 'హ్యాపీడేస్', 'స్వామి రారా', 'కార్తికేయ', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా'..ఇలా విజయాలను అందుకొంటూ దూసుకుపోతున్నాడు నిఖిల్. తాజాగా ఆయన నటించిన 'కిరాక్ పార్టీ' ఈ నెల 16న విడుదల కానుంది. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వంలో రామబ్రహ్మం సుంకర నిర్మించారు. నిఖిల్ సరసన సంయుక్త హెగ్డే నటించింది. ఈ సందర్భంగా నిఖిల్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు.

"ఇంజినీరింగ్ కాలేజీ నేపథ్యంలో నడిచే కథ ఇది. కాలేజీ కుర్రాడిగా నా పాత్ర రెండు పార్శ్వాల్లో సాగుతుంది. రెండు రకాలుగా కనిపించడం కోసం కసరత్తులు చేశా. నాకు మిత్రులుగా నటించిన ఏడుగురు కాలేజీ కుర్రాళ్ల పాత్రల కోసం ఆడిషన్స్ చేసి ఎంపిక చేశాం. నేను ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతూ కాలేజీ లీడర్‌గా కనిపిస్తా. అప్పుడొచ్చే దృశ్యాలు సరదాగా, ఆలోచింపజేసేవిగా ఉంటాయి. కాలేజీ అనగానే ప్రేమలు, గొడవలు, ఇగోలు, రాజకీయాలు, కొట్టుకోడాలు..ఇలా అన్నీ ఉంటాయి. 'హ్యాపీడేస్' తర్వాత మళ్లీ పదేళ్లకి కాలేజీ కుర్రాడిగా నటించాను. అప్పుడు ఇంజినీరింగ్ అంటే గొప్ప. ఇప్పుడా భావన లేదు. పదేళ్లకీ ఇప్పటికీ కాలేజీ కుర్రాళ్ల ఆలోచనల్లో మార్పులొచ్చాయి. మంచి మార్కులొచ్చినా ఇప్పుడు మంచి ఉద్యోగాలు రావడంలేదు."

సరదాలు.. గొడవలు

"కన్నడలో విజయం సాధించిన 'కిరిక్ పార్టీ' సినిమాకి రీమేక్ ఇది. ఆద్యంతం వినోదాత్మకంగా సాగుతుంది. అజనీష్ లోకనాథ్ సంగీతం, సుధీర్ స్క్రీన్‌ప్లే, చందు మొండేటి మాటలు, ఎ.కె ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మాణ విలువలు సినిమాకి బలం. శరన్ కొప్పిశెట్టి దర్శకత్వం అదనపు ఆకర్షణ. కచ్చితంగా ప్రేక్షకులకి విభిన్నతరహాలో సాగే కాలేజీ చిత్రమనే భావన కలుగుతుంది. సంయుక్త హెగ్డే నృత్యాలు ఆకట్టుకుంటాయి. ఈ సినిమాలో చేసేప్పుడు కాలేజీ రోజుల్లో నేను చేసిన సరదాలు, అల్లర్లు, గొడవలు గుర్తుకొచ్చాయి. నాకే కాదు సినిమా చూసే ప్రతి కాలేజీ యువకుడికీ తమ తమ కాలేజీ అనుభవాలు గుర్తుకొస్తాయి"

దేని విజయం దానిదే!

"నేను కథానాయకుడిగా ఠాగూర్ మధు నిర్మాణంలో ఒక చిత్రం తెరకెక్కనుంది. తమిళ కుర్రాడు దర్శకత్వం వహిస్తారు. ఈ ఏడాది ప్రథమార్ధంలోనే మొదలవుతుంది. కార్తికేయ సినిమాకి సీక్వెల్ చిత్రం కూడా ఈ సంవత్సరంలోనే మొదలయ్యే అవకాశాలున్నాయి. తొలి భాగానికి పనిచేసిన బృందమే సీక్వెల్‌కీ పనిచేస్తుంది. మరో రెండు కొత్త చిత్రాలు ఒప్పుకోనున్నాను. ఇప్పటివరకూ పదిహేను చిత్రాలు చేశా. నేను నటించిన 'కేశవ' మంచి వసూళ్లు రాబట్టడమే కాక నాకు మంచి పేరు తెచ్చింది. ప్రతి సినిమాని 'కార్తికేయ', 'ఎక్కడికిపోతావు చిన్నవాడా', 'సూర్య వర్సెస్ సూర్య' సినిమాల స్థాయి విజయాలతో పోల్చుకోకూడదు. దేనికదే!"

ఎప్పటికప్పుడు వ్యూహాలు మార్చుకోవాల్సిందే!


తమన్నా

ఆచితూచి అడుగులేయాలి... ఆలోచించి నిర్ణయం తీసుకోవాలనే మాటలు చిత్రసీమలో తరచుగా వినిపిస్తుంటాయి. నిజానికి అది అవసరం కూడా! ఒక్క సినిమా చాలు... జీవితాలు తలకిందులై పోవడానికి. అందుకే ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ కెరీర్‌ని కొనసాగిస్తుంటారు. మీరూ అంతేనా? అని తమన్నాని అడిగితే... నేను మరీ అంత జాగ్రత్తేమీ కాదంటోంది. "ఒక సినిమా ఒప్పుకొనే ముందు నేనూ చాలా లెక్కలేసుకొంటా. కానీ ఎవరెన్ని లెక్కలేసుకొన్నా, చిత్రసీమలో ఫలితాల్ని మాత్రం నిర్దేశించలేరు. అంతా మన చేతుల్లోనే ఉన్నట్టు అనిపిస్తుంది కానీ, ఊహించని అనుభవాలు ఎదురవుతుంటాయి. వచ్చే ఫలితం ఏదైనా సరే, స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి. ఒక ప్రణాళిక వేసుకొన్నామని అన్నీ అనుకొన్నట్టు జరగవు. రోజూ ఓ కొత్త మార్పు చోటు చేసుకొనే అవకాశాలుంటాయి. అందుకు అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యూహాలు మార్చుకోవల్సిందే. అందుకే నేను ప్రణాళికల్ని, ఫలితాల్ని పట్టించుకోకుండా ప్రయాణాన్ని ఆస్వాదిస్తా. ఏం చేస్తే ఏమవుతుందో అనే భయం, గందరగోళం నాలో ఎప్పుడూ ఉండవు. ఒక కథ మనసుకు నచ్చిందంటే చాలు... మిగతా విషయాల గురించి పట్టించుకోను" అని చెప్పింది తమన్నా. ప్రస్తుతం ఆమె కల్యాణ్‌రామ్‌తో కలిసి 'నా నువ్వే'తో పాటు, 'క్వీన్'లో నటిస్తోంది.

ప్రతి ఒక్కరి మనసుకు దగ్గరయ్యే కథ


ఎన్.వి.ప్రసాద్, నిరన్ షా, విజయ్, సాయిపల్లవి, నాగ అశోక్‌కుమార్, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, జెమిని కిరణ్, బేబీ వెరోనికా

నాగశౌర్య, సాయిపల్లవి జంటగా నటించిన తెలుగు చిత్రం 'కణం'. విజయ్ దర్శకత్వం వహించారు. ఎన్.వి.ప్రసాద్ నిర్మాత. విడుదలకి సిద్ధమైంది. హైదరాబాద్‌లో విడుదల ముందస్తు వేడుక జరిగింది. ఎన్.వి.ప్రసాద్ మాట్లాడుతూ "సినిమా చూశా. చాలా బాగుంది. అందరికీ నచ్చేలా దర్శకుడు తెరకెక్కించారు. నటనలో నాగశౌర్య, సాయిపల్లవి పోటీపడి చేశారు. సాయిపల్లవికి హాట్రిక్ సినిమా అవుతుంది. ఇందులో సాయిపల్లవి తన గత చిత్రాలకన్నా భిన్నంగా ఉంటుంది. తను భావోద్వేగభరిత దృశ్యాల్లో నటనతో కట్టిపడేస్తుంది. పాపగా బేబి వెరోనికా నటన బాగుంటుంది. ఓ కాన్సెప్ట్ ప్రకారం దర్శకుడు విజయ్ వినూత్నంగా తెరకెక్కించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "అబార్షన్ సరైంది కాదని చెప్పే కాన్సెప్ట్ ఓరియంటెడ్ కథకి కొద్దిగా హారర్‌ని జోడించి తెరకెక్కించాను. సాయిపల్లవి, నాగశౌర్య, బేబి వెరోనికా నటన ప్రేక్షకుల్ని మెప్పిస్తాయ"న్నారు. సాయిపల్లవి మాట్లాడుతూ "ఓ తల్లి.. ఓ పాప పడే తపన నేపథ్యంలో రూపొందింది. సన్నివేశాలకి తగ్గట్టు చక్కటి భావాలను ప్రదర్శిస్తూ నటించారు నాగశౌర్య. హృదయాలను కదిలించే భావోద్వేగభరిత దృశ్యాలున్నాయి. ఇవి చూడగానే ప్రతి ఒక్కరికీ వారి వారి అనుభవాలు గుర్తుకొస్తాయి. ప్రతి ఒక్కరి మనసుకు దగ్గరయ్యే కథ ఇది. ఎన్వీ ప్రసాద్‌గారి సహకారం బాగుంద"న్నారు. ఈ కార్యక్రమంలో జెమిని కిరణ్, శానం నాగఅశోక్‌కుమార్, బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్, బేబి వెరోనికా, ప్రేమ్, ప్రత్యూష, నిరన్ షా, శ్రీకృష్ణ మాదినేని తదితరులు పాల్గొన్నారు.

భావోద్వేగాల యుద్ధభూమి


అల్లు శిరీష్

భారత్, పాకిస్థాన్‌ల సరిహద్దులో 1971లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన మలయాళ చిత్రం '1971 బియాండ్ బోర్డర్స్'. అల్లు శిరీష్ కథానాయకుడిగా మోహన్‌లాల్ ప్రధానపాత్రలో నటించిన ఈ సినిమాను 'యుద్ధభూమి'గా తెలుగులోకి అనువదిస్తున్నారు. మేజర్ రవి దర్శకుడు. ఎయన్ బాలాజీ నిర్మాత. ఈ చిత్ర ట్రైలర్‌ను మోహన్‌లాల్ చేతుల మీదుగా కేరళలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "మేజర్ రవి ఆర్మీలో పని చేయడంతో ఆ నేపథ్యంలోనే ఇప్పటివరకు పది సినిమాలు తీశారు. వాటిలో ఐదు నాతోనే చేశారు. అల్లు శిరీష్‌తో కలిసి నటించడం ఆనందంగా అనిపించింది. మంచి నటనను కనబరిచాడ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఈ చిత్రం మలయాళంలో నాకు మంచి పేరు తెచ్చింది. ఇరుదేశాల సైనికుల భావోద్వేగాలు, బాధలు, బాధ్యతలను చిత్రంలో చూపించామ"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "త్వరలో హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుకను నిర్వహిస్తామ"న్నారు.

శుక్రవారం నుంచి ప్రదర్శనలు షురూ?


డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లకీ, చిత్ర పరిశ్రమకీ మధ్య విజువల్ ప్రింటింగ్ ఫీజు (వి.పి.ఎఫ్) విషయంలో తలెత్తిన వివాదం సద్దుమణిగే సూచనలు కనిపిస్తున్నాయి. మంగళవారం జరిగిన చర్చల్లో 17 శాతం వి.పి.ఎఫ్‌ను తగ్గించేందుకు డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లు ముందుకొచ్చినట్టు తెలిసింది. మరికొన్ని డిమాండ్ల గురించి బుధవారం చర్చలు సాగనున్నట్టు సమాచారం. డిజిటల్ ఛార్జీలు భారంగా మారాయని నిర్మాతలు, పంపిణీదారులు, ప్రదర్శనకారులు కలిసి మార్చి 2 నుంచి తెలుగు రాష్ట్రాల్లో సినిమాల ప్రదర్శనని నిలిపివేసిన సంగతి తెలిసిందే. అప్పట్నుంచీ చలన చిత్ర పరిశ్రమకి చెందిన జాయింట్ యాక్షన్ కమిటీకీ, డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లకీ మధ్య చర్చలు జరుగుతూనే ఉన్నాయి. మొదట 9 శాతం ఛార్జీలే తగ్గిస్తామన్న డిజిటల్ కంటెంట్ ప్రొవైడర్లు, ఇప్పుడు 17 శాతానికి దిగొచ్చినట్టు తెలిసింది. ఇరువర్గాల మధ్య చర్చలు ఫలప్రదమయ్యే దిశగా సాగుతుండడంతో, శుక్రవారం నుంచి థియేటర్లలో యథావిధిగా ప్రదర్శనలు షురూ అయ్యే అవకాశాలున్నాయని తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి వర్గాలు తెలిపాయి.

వీడు మామూలోడు కాదు


నిత్యా శెట్టి, నిరోషా, సుధాకర్ కోమాకుల

సుధాకర్ కోమాకుల, నిత్యా శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'నువ్వు తోపురా'. హరనాథ్ బాబు బి దర్శకుడు. శ్రీకాంత్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. "కృష్ణవంశీ శిష్యుడు హరనాథ్. ఆయన తరహాలోనే ఓ సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల్ని మెప్పించడానికి ప్రయత్నించాడు. 70 శాతం చిత్రీకరణ అమెరికాలోనే జరిగింది. నిరోషా ఓ కీలకమైన పాత్రలో కనిపిస్తారు. ఆమె నటన ఆకట్టుకుంటుంది. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రానికి మంచి స్పందన వచ్చింది. హాలీవుడ్ కాన్సెప్టుతో తెరకెక్కించిన చిత్రమిది. థ్రిల్లింగ్‌గా ఉంటుంది. సుధాకర్ నటన కొత్త కోణంలో సాగుతుంద"న్నారు నిర్మాత.

షమ్మీ ఆంటీ ఇక లేరు



బాలీవుడ్ సినీ ప్రముఖులు షమ్మీ ఆంటీగా ప్రేమతో పిలుచుకునే సీనియర్ నటి షమ్మీ ఇక లేరు. 89 ఏళ్ల షమ్మీ అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం కన్నుమూశారు. ఆమె అసలు పేరు నర్గీస్ రబాడి. సుమారు రెండు వందల చిత్రాలు, టీవీ సీరియల్స్‌లో షమ్మీ తన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రధానంగా అత్త, నాన్నమ్మ లాంటి పాత్రల్లో షమ్మీ పండించిన హాస్యం ఆమెకు అభిమానులను సంపాదించిపెట్టింది. 'ఖుదా గవా', 'కూలీ నెం.1', 'హమ్ సాథ్ సాథ్ హై', 'ది ట్రైన్', 'స్వర్గ్' తదితర చిత్రాలు షమ్మీకి గుర్తింపు తెచ్చాయి. ఆమె కొన్ని చిత్రాల్లో కథానాయిక, రెండో కథానాయిక పాత్రల్లోనూ నటించారు. బాలీవుడ్ దర్శకుడు సుల్తాన్ అహ్మద్‌ను వివాహం చేసుకున్నారు షమ్మీ. అయితే కొన్నేళ్ల తర్వాత వారు విడిపోయారు. షమ్మీ మృతి పట్ల బాలీవుడ్ తారలు సంతాపం వ్యక్తం చేశారు. అమితాబ్ బచ్చన్ ఆమె జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. "చిత్రసీమకు కొన్ని దశాబ్దాలుగా సేవలందించిన ప్రసిద్ధ నటి, నా కుటుంబ స్నేహితురాలు షమ్మీ దీర్ఘకాలిక అనారోగ్యం, వయోభారంతో దూరమైంది. అందుకు బాధగా ఉంది. నెమ్మది నెమ్మదిగా అందరూ వెళ్లిపోతున్నార"ని ట్వీట్ చేశారు అమితాబ్.

అర్జున్‌రెడ్డితో పోల్చొద్దు


మల్కాపురం శివకుమార్

"ప్రభాస్‌కి 'బాహుబలి', విజయ్ దేవరకొండకి 'అర్జున్ రెడ్డి' బ్లాక్ బస్టర్ విజయాలు. ఆ కథానాయకుల నుంచి వచ్చే ప్రతి సినిమా వాటిలాగే ఉండాలని ఆశించడం సరికాదు. విజయ్ దేవరకొండ 'ఏ మంత్రం వేశావే..'ని అర్జున్‌రెడ్డితో సరిపోల్చుకుని చూడొద్ద"న్నారు మల్కాపురం శివకుమార్. శ్రీధర్ మర్రి స్వీయదర్శకత్వంలో నిర్మించిన 'ఏ మంత్రం వేశావె' చిత్రానికి శివకుమార్ సమర్పకులుగా వ్యవహరించారు. ఈ నెల 9న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా శివకుమార్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో మాట్లాడుతూ "'అర్జున్‌రెడ్డి' కంటే ముందే ఈ చిత్రం మొదలైంది. ఈ సినిమా విడుదల గురించి పలువురితో మాట్లాడారు శ్రీధర్. ఆర్థిక కారణాల వల్ల ఆ ఒప్పందాలు కుదరలేదు. ఆయన నాకు చెప్పిన ఈ కథ నచ్చడంతో సమర్పకుడిగా వ్యవహరించాను. ఇప్పుడు నేనే తెలుగు రాష్ట్రాలతోపాటు ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాను. విజయ్‌కి 'అర్జున్ రెడ్డి'తో ఏర్పడిన క్రేజ్‌ని దృష్టిలో పెట్టుకోకుండా ఈ కథ నచ్చి, ఆదరణ పొందుతుందనే నమ్మకంతో విడుదల చేస్తున్నాను. ఓ గేమ్ మత్తులో మునిగిపోయి తన వారందర్నీ మరచిపోయిన యువకుడి కథతో తెరకెక్కింది. ఇందులో విజయ్ మరో కోణంలో కనిపించి ప్రేక్షకుల మెప్పుపొందుతాడని కచ్చితంగా చెప్పగలను. విజయ్ నటన కొత్తగా ఉంటుంది. దర్శకుడు ఆసక్తికరంగా తెరకెక్కించాడు. మా సొంత పతాకం సురక్షపై ఈ ఏడాది మూడు సినిమాలు నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నాను. ఈ చిత్రాల ద్వారా కుమార్, రవిచంద్రన్, కన్నడకు చెందిన రఘురాజ్ దర్శకులుగా పరిచయం అవుతారు. భవిష్యత్తులో మంచి కథ ఎవరు అందించినా వారితో సినిమా చేయడానికి మా సురక్ష సంస్థ సిద్ధంగానే ఉంటుంద"న్నారు.



చర్మానికి చల్లని పూత


ఎండలు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. ఆ వేడికి చర్మం కమిలిపోవడం సహజం. ఇలాంటి సమయంలో చర్మానికి వేసుకునే పూతలు కూడా చల్లచల్లగా ఉంటేనే బాగుంటుంది. ఆలస్యం ఎందుకు కుదిరినప్పుడల్లా చందనంతో రకరకాల పూతలు ప్రయత్నించేద్దాం.

- మూడు చెంచాల చందనంపొడిలో తగినంత గులాబీనీరు కలిపి ముఖానికి పట్టించాలి. 15 నిమిషాల తరువాత చల్లని నీటితో శుభ్రం చేసుకుంటే చర్మం మృదువుగా మారుతుంది. వారంలో రెండు లేదా మూడు సార్లు ఇలా చేస్తే ఎండవేడి నుంచి ముఖచర్మం పొడారిపోకుండా ఉంటుంది. ఈ పూత కంటికింద నల్లని వలయాల్ని కూడా పోగొడుతుంది.
- రెండు చెంచాల చందనంపొడీ, రెండు చెంచాల పసుపు, సరిపడా గోరువెచ్చని నీరు తీసుకుని అన్నింటినీ కలిపి ముద్దలా చేయాలి. దీన్ని ముఖానికి పట్టించి 20 నిమిషాల తరువాత చల్లని నీటితో కడిగేసుకుంటే ముఖంపై నల్లని మచ్చలు తగ్గుముఖం పడతాయి.



- రెండు చెంచాల చొప్పున చందనంపొడీ, ముల్తానీమట్టీ, తగినంత గులాబీనీరు తీసుకుని అన్నింటినీ కలపాలి. దీన్ని ముఖానికి పట్టించి, 20 నిమిషాల తరువాత చల్లనినీటితో కడిగేయాలి. వారానికి రెండు లేదా మూడు సార్లు ఇలా చేస్తే పొడి చర్మం తాజాగా మారుతుంది.
- ఎండలో బయటకు వెళ్లి వచ్చిన తరువాత వాతావరణంలోని వేడి వల్ల చర్మం నల్లగా మారుతుంది. దాన్ని పోగొట్టాలంటే నాలుగు చెంచాల చందనంపొడిలో సగం నిమ్మచెక్క రసాన్ని కలిపి ముద్దలా చేసుకుని ముఖం, మెడకూ రాసుకోవాలి. పావుగంటయ్యాక చల్లని నీటితో శుభ్రం చేసుకుంటే చాలు. నలుపుగా మారిన చర్మం తిరిగి పూర్వపు స్థితికి మారుతుంది. వారంలో రెండు సార్లు ఇలా చేస్తే మంచిది.
- చెంచా చొప్పున సెనగపిండీ, చందనంపొడీ, పసుపు తీసుకుని గులాబీనీటితో ముద్దలా కలపాలి. దీన్ని ముఖం, మెడకు రాసుకుని ఇరవై నిమిషాలయ్యాక చల్లనినీటితో కడిగేయాలి. ముఖచర్మం కాంతులీనుతుంది.

నజరానా



చెక్క వస్తువులపై గీతలు పడితే.. వెనిగర్, వంట నూనె మిశ్రమంలో ముంచిన వస్త్రంతో తుడిచి చూడండి. ఆ మరకలు పోతాయి.

జ్యూస్ జ్యూస్ బేబీ!

ఆరోగ్యంగా ఉండాలంటే... చర్మం మెరవాలంటే పండ్లు, ఆకుకూరలూ, కూరగాయలు ఎక్కువ తినాలంటారు.. ఆ రెండింటితోపాటూ బరువు అదుపులో ఉండాలంటే... కొన్నిరకాల జ్యూస్‌లు మన జీవనశైలిలో చేర్చుకోవాలి. ఎండలూ మొదలయ్యాయి కాబట్టి... వీటిని తీసుకుంటే డీహైడ్రేషన్ సమస్య కూడా తగ్గుతుంది.

పాలకూరతో...



కావల్సినవి: పాలకూర ఆకుల తరుగు - కప్పు, యాపిల్ - ఒకటి (సన్నగా తరగాలి), ఉప్పు - చిటికెడు, నిమ్మరసం - అరచెంచా.

తయారీ: పై పదార్థాలన్నీ మిక్సీలో తీసుకుని, కాసిని నీళ్లుపోసి చిక్కని రసంలా చేసుకోవాలి. తరువాత వడగట్టాలి. కావాలనుకుంటే ఇందులో కాస్త మిరియాలపొడి కూడా వేసుకోవచ్చు.

లాభాలు: ఇందులో విటమిన్-ఇ ఎక్కువగా ఉంటుంది. ఫోలేట్, ఇనుము, పీచు కూడా ఎక్కువే.

నల్లద్రాక్షతో...



కావల్సినవి: నల్లద్రాక్ష - అర కప్పు, బీట్‌రూట్ తరుగు - అర కప్పు, తేనె - అర చెంచా, వేయించిన జీలకర్ర పొడి- అర చెంచా, ఉప్పు - చిటికెడు.

తయారీ: నల్లద్రాక్షా, బీట్‌రూట్‌ను మెత్తగాచేసుకోవాలి. ఈ రసాన్ని గ్లాసులోకి వడగట్టాలి. ఇందులో తేనె, ఉప్పూ, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి.

లాభాలు: ఈ రసం శరీరానికి శక్తినిస్తుంది. రక్తాన్ని శుద్ధి చేస్తుంది.

కమలాపండుతో...

కావల్సినవి: కమలాపండ్లు - రెండు, పసుపు - పావుచెంచా, క్యారెట్ - సగం ముక్క, యాపిల్ - సగం ముక్క, ఉప్పు - చిటికెడు.

తయారీ: కమలాపండ్లూ, క్యారెట్ చెక్కుతీసి పెట్టుకోవాలి. క్యారెట్, యాపిల్‌ని చిన్న చిన్న ముక్కలుగా కోసి పెట్టుకోవాలి. ఇప్పుడు ఉప్పు తప్ప మిగిలిన పదార్థాలన్నింటిని మిక్సీ జార్‌లో వేసి, అరగ్లాసు నీళ్లుపోసి మెత్తగా చేసుకోవాలి. చివరగా ఉప్పు కలిపితే సరి. దీన్ని తయారు చేసిన వెంటనే తీసుకోవాలి.

లాభాలు: ఇందులో విటమిన్ ఏ, సీలతోపాటు ఖనిజాలు ఎక్కువ. చర్మాన్ని మెరుగుపరచడంతోపాటూ రోగనిరోధకశక్తినీ అందిస్తుందీ జ్యూస్.



పుచ్చకాయతో...



కావల్సినవి: పుచ్చకాయ ముక్కలు - 15, దానిమ్మ పండు - ఒకటి, యాపిల్ సిడార్ వెనిగర్ - రెండు పెద్ద చెంచాలు, దాల్చినచెక్క పొడి - అర చెంచా, ఉప్పు - కొద్దిగా.

తయారీ: పుచ్చకాయ ముక్కలూ, దానిమ్మ గింజలూ, గ్లాసు నీళ్ల మిక్సీలో తీసుకుని రసంలా చేసుకోవాలి. తరువాత యాపిల్ సిడార్ వెనిగర్, దాల్చిన చెక్క పొడి, ఉప్పు కలిపితే సరిపోతుంది

లాభాలు: దీనిలోని యాంటిఆక్సిడెంట్లు ఆరోగ్యానికి మేలుచేయడంతోపాటు బరువునూ అదుపులో ఉంచుతాయి. చర్మం కూడా తాజాగా కనిపిస్తుంది.

కీరదోసతో...

కావల్సినవి: సన్నగా తరిగిన కీరా ముక్కలు - కప్పు, టొమాటో - చిన్న ముక్క, నిమ్మరసం - రెండు టేబుల్‌స్పూన్లు, ఉప్పు - తగినంత, పుదీనా ఆకులు - గుప్పెడు, మిరియాలపొడి - అరచెంచా.

తయారీ: కీరా, టొమాటో ముక్కలూ, పుదీనాఆకులు మిక్సీలో తీసుకుని రసంలా చేసుకోవాలి. తరువాత నిమ్మరసం, ఉప్పు, మిరియాలపొడి వేసి బాగా కలపాలి.

లాభాలు: ఇది అదనపు కొవ్వును కరిగిస్తుంది.



బీట్‌రూట్‌తో...



కావల్సినవి: శుభ్రంగా కడిగి చెక్కు తీసిన బీట్‌రూట్ - ఒకటి, కీరదోస - సగం ముక్క, స్ట్రాబెర్రీలు - నాలుగు, టొమాటో - సగం, కొత్తిమీర - కట్ట, ఉప్పూ, మిరియాల పొడి - చిటికెడు చొప్పున.

తయారీ: ఈ పదార్థాలన్నీ మిక్సీలో తీసుకుని రసంలా చేసుకోవాలి. అవసరం అనుకుంటే కాసిని నీళ్లుపోసి మరోసారి మిక్సీపడితే చాలు. దీన్ని అప్పటికప్పుడు చేసుకుని తాగితేనే మంచిది.

లాభాలు: శరీర ఆరోగ్యానికి కావాల్సిన పోషకాలన్నీ ఈ జ్యూస్‌లో ఉన్నాయి. దీన్ని తాగడం వల్ల అధిక కొవ్వు తగ్గుతుంది. ఒత్తిడీ అదుపులో ఉంటుంది.

డియర్ వసుంధర

మారాల్సింది నేనా... నా భర్తా?

- నాకు పెళ్లై అయిదు సంవత్సరాలవుతోంది. ఒక బాబు. పెళ్లైన కొత్తలో మా ఆయన చాలా తక్కువగా మాట్లాడేవారు. కానీ ఇన్నేళ్లయినా ఆ తీరులో మార్పులేదు. జీతం మొత్తం నా చేతిలోనే పెడతారు, నేను ఏ తప్పు చేసినా చిన్న మాట కూడా అనరు. కానీ, ఇంట్లో విషయాలు మాత్రం పట్టించుకోరు. బాబుకు సంబంధించిన పనులన్నీ నేనే చూడాలి. ఇంట్లో ఎలా ఉన్నామన్న సంగతితో అసలు సంబంధం ఉండదు. ఆయన తీరుతో ఇబ్బంది లేదు గానీ, సంతోషంగా మాత్రం ఉండలేకపోతున్నా. మారాల్సింది నేనా? ఆయనా? అర్థం కావట్లేదు.!


– ఓ సోదరి

డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

- మార్పు గురించి ఆలోచించే ముందు ఎదుటివాళ్లను... వాళ్లెలా ఉన్నారో అలాగే స్వీకరించడం అలవాటు చేసుకోవాలి. మనమెప్పుడూ 'ఒక వ్యక్తి ఇలా ఉంటే బాగుంటుంది' అనే ఆలోచనతో ఉంటాం. ఇలా ఆలోచించడం తప్పు కాదు. కానీ, మనం ఇష్టపడనిది దొరకనప్పుడు దొరికినదాంతోనే సంతృప్తిపడాలి. ఇప్పుడు మీరు మీ భర్త తీరు మారాలనుకుంటున్నారు. దానికన్నా ముందు ఆయన అలా ఎందుకుంటున్నారో ఆలోచించండి. దానికి మూడు కారణాలు ఉండొచ్చు. మొదటిది ఆయనకు జన్మతః వచ్చిన స్వభావం వల్ల తక్కువగా మాట్లాడటం అతని తీరేమో. దాన్ని ఇప్పుడు మార్చుకోవడం కాస్త కష్టమే. రెండోది... కుటుంబ వాతావరణం. వాళ్లింట్లో అమ్మానాన్నలు పిల్లల్ని పట్టించుకుని ఉండకపోవచ్చు. అందుకే అతనికి కూడా అదే అలవాటయ్యింది. మూడోది... అమ్మానాన్నలు అతన్ని గారాబం చేసి ఏ పనులూ చేయించకపోవడంవల్ల బాధ్యత తెలియదేమో. మొదటి సమస్య అయితే మీరే తరచూ మాట్లాడటం మొదలుపెట్టాలి. దీనివల్ల కాస్త మార్పు రావొచ్చు. దాని గురించి ఆలోచించకుండా ఉండటానికి వారానికి ఒకసారి స్నేహితుల్ని కలవడం, మీకు ఆసక్తి ఉన్న పని ఏదైనా ఉంటే దాంట్లో శిక్షణ తీసుకోవడం మొదలుపెట్టండి. ఇక బాధ్యతల గురించి మాట్లాడితే... పనులకు సంబంధించి ఒక ప్రణాళిక వేయండి. అన్నీ మీరే ఒంటరిగా చేసుకోలేక పోతున్నానని చెప్పండి. కొన్ని పనులు అప్పగించండి. అతనిలో మార్పు కనబడుతుంది.

మీ ప్రశ్నలు ఇకపై **vasupsych@eenadu.net** కు పంపించగలరు.

email:
vasundhara@eenadu.net



బంగారం వెండి

6న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	31,520	31,570	31,400	31,500
ఆర్నమెంట్	29,430	29,480	29,150	29,200
వెండి (కిలో)	39,665	39,630	39,700	40,000

	ప్రొద్దుటూరు		రాజమండ్రి	
బంగారం(24క్యా)	31,350	31,400	31,260	31,180
ఆర్నమెంట్	29,060	29,120	29,260	29,180
వెండి (కిలో)	39,800	39,800	39,000	39,200

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	31,280	31,380	-------	-------
ఆర్నమెంట్	29,090	29,190	2,909	2,918 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41. 40	41. 70 గ్రా



తోబుట్టువులకు అమ్మగా మారి...

ఈమె పేరు రమణమ్మ. చిన్నతనంలోనే అమ్మానాన్నలు చనిపోతే... కుటుంబబాధ్యతల్ని మీదేసుకుంది. చోడవరం వికాస మహిళా పొదుపు బ్యాంకులో చిరుద్యోగిగా చేరింది.

కట్‌చేస్తే...

ఆమె ఇప్పుడా బ్యాంకుకి మేనేజర్. ఓవైపు ఉద్యోగం, మరోవైపు తోబుట్టువులూ, ఇంకోవైపు సాటి మహిళలకోసం కష్టపడుతోన్న రమణమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే.

అప్పుడు రమణమ్మకు పదిహేనేళ్లుంటాయంతే. తల్లీతండ్రీ మూడు నెలల తేడాలో చనిపోయారు. దాంతో పది, ఐదేళ్ల వయసున్న ఇద్దరు తమ్ముళ్లూ, నెలల వయసున్న చెల్లి బాధ్యత ఆమెపై పడింది. బంధువులు జాలి చూపించారే తప్ప ఆసరా ఇవ్వలేదు. దాంతో ఓ వైపు చదువుకుంటూనే కూలీకి వెళ్లింది. ఆ డబ్బుల్ని పొదుపుగా వాడుతూ, వాళ్లనీ చదివించాలనుకుంది. ఆ తరువాత డిగ్రీలో చేరింది. ఓ వైపు కాలేజీకి వెళ్తూనే, మరోవైపు కూలి పనికి వెళ్లేది. బీకాం పూర్తయ్యాక చోడవరంలో వికాస పరస్పర సహాయ సహకార పొదుపు సంఘంలో 500 రూపాయల జీతానికి ఫీల్డ్ ఆర్గనైజర్‌గా చేరింది. అంటే ఈ సంఘం పరిధిలోని 12 గ్రామాలకు సైకిల్‌పై తిరిగి మహిళల నుంచీ పొదుపూ, రుణాలు వసూళ్లు చేయాలి. 'రోజంతా సైకిల్‌పై ఎలా తిరుగుతావు' అని చాలామంది అన్నా పట్టించుకోలేదు. 'నా తోబుట్టువులకు మంచి జీవితం ఇవ్వాలంటే నేను ఏదైనా చేయాలి. అందుకే ఎంత కష్టమైనా సరే... చేరిపోయా' అంటుంది రమణమ్మ.

ఆ పిల్లల్నీ చూడాలి... ఆ ఉద్యోగం చేస్తూనే మిగిలినవాళ్లనీ చదివించింది. పెద్ద తమ్ముడికి పెళ్లిచేసిన కొన్నాళ్లకే అతని భార్య చనిపోయింది. రెండేళ్లకు అతనూ హృద్రోగంతో చనిపోయాడు. ఇప్పుడు వాళ్ల ఇద్దరు పిల్లల బాధ్యత కూడా రమణమ్మదే. చిన్న తమ్ముడికి చెవులు వినిపించకపోయినా... ఎమ్మెస్సీ, బీఈడీ చేసి, ప్రస్తుతం ఓ ప్రైవేటు బదిర పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. చెల్లి అమ్మాజీని బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేయించింది. ప్రస్తుతం ఆమె హుకుంపేట పీహెచ్‌సీలో స్టాఫ్ నర్స్‌గా చేస్తోంది. 'మా చెల్లికి పెళ్లి చేశా. జీవితంలో ఎన్నో ఒడిదొడుకుల్ని ఎదుర్కొన్నా. నా పనిని గుర్తించి బ్యాంకు నిర్వాహకులు ఫీల్డ్ వర్క్ నుంచి, ఫీల్డ్ కోఆర్డినేటర్‌గా పదోన్నతి కల్పించారు. పనిచేస్తూనే దూర విద్యలో ఎమ్మెస్సీ పూర్తిచేశా. టైపు, కంప్యూటర్‌లో శిక్షణ కూడా తీసుకున్నా...' అంటుంది రమణమ్మ. ఇప్పుడామె ఆ బ్యాంకులో మేనేజర్‌గా పనిచేస్తోంది.

21 కోట్లకు పెరిగిన టర్నోవరు... 'నేను వికాస మహిళా పొదుపు బ్యాంకులో చేరినప్పుడు పొదుపు వేలల్లోనే ఉండేది. ఇప్పుడది 21 కోట్లరూపాయల టర్నోవరుకు చేరుకుంది. మేం ఉపాధి కోరుకునే మహిళలకు రుణాలు ఇస్తాం. మా పనితీరు జాతీయ బ్యాంకులూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉన్నతాధికారులెందరో మెచ్చుకున్నారు. ఇప్పటివరకూ వేలాదిమంది మహిళలకు రుణాలందించి ఉపాధి కల్పించాం. మేనేజరుగా కేవలం రుణాలు మాత్రమే కాకుండా, ఇక్కడికొచ్చే మహిళలకు పలు అంశాల్లో అవగాహన అందిస్తుంటా...' అంటుంది రమణమ్మ.

– బొద్దల పైడిరాజు, ఈనాడు డిజిటల్, విశాఖపట్నం



చదువు

ఈనాడు విజయవాడ బుధవారం మార్చి 7, 2018 ■ e-mail: edc@eenadu.in

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

షార్‌లో సైంటిస్టులు

ఇస్రోకు చెందిన శ్రీహరికోట హై ఆల్టిట్యూడ్ రేంజింగ్ (షార్)లో సైంటిస్టు ఖాళీలు.

పోస్టు-ఖాళీలు: సైంటిస్టు/ ఇంజినీర్ ఎస్‌సీ- 24, మెడికల్ ఆఫీసర్ ఎస్‌సీ/ ఎస్‌డీ: 01.

విభాగాలు: కెమికల్, క్వాలిటీ అండ్ మేనేజ్‌మెంట్, థర్మల్, మెషిన్ డిజైన్, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్, ఆర్థోపెడిక్స్ తదితరాలు. **అర్హత:** బీఈ/ బీటెక్, ఎంఈ/ ఎంటెక్, ఎంబీబీఎస్‌తోపాటు డిప్లొమా, ఎండీ/ డీఎన్‌బీ ఉత్తీర్ణత. **దరఖాస్తు:** ఆన్‌లైన్.

చివరితేది: 23.03.2018.

వెబ్‌సైట్: www.shar.gov.in

ఎంజేపీటీబీసీడబ్ల్యూ ఆర్‌జేసీ, ఆర్‌డీసీసెట్ - 2018

మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకులాల్లో 2018-19 విద్యా సంవత్సరానికి గానూ ఇంటర్మీడియట్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష. **అర్హతలు:** ఆర్‌జేసీ పరీక్షకు పదోతరగతి, ఆర్‌డీసీకి ఇంటర్ ద్వితీయ సంవత్సరం మార్చి 2018 పరీక్షలకు హాజరయ్యే తెలంగాణ విద్యార్థులు.

ఇంటర్ కోర్సులు: ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ. **డిగ్రీ కోర్సులు:** బీఎస్సీ, బీజెడ్‌సీ, బీఏ, బీకాం. **ఎంపిక:** ప్రవేశపరీక్ష ద్వారా.

ఆన్‌లైన్ దరఖాస్తు: 08.03.2018 నుంచి 11.04.2018 వరకు.

పరీక్ష తేది: 26.04.2018.

వెబ్‌సైట్: mjptbcwreis.cgg.gov.in

ప్రవేశాలు

ఏపీ ఎడ్‌సెట్ - 2018

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బీఎడ్ కళాశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి రెండేళ్ల బీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష.

అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.

ఎంపిక: ప్రవేశపరీక్ష ద్వారా.

దరఖాస్తు రుసుం: రూ.650.

ఆన్‌లైన్ దరఖాస్తు: 08.03.2018 నుంచి 05.04.2018 వరకు. **పరీక్ష తేది:** 19.04.2018.

వెబ్‌సైట్: sche.ap.gov.in

నైసర్‌లో ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం

భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్‌లో ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ-పీహెచ్‌డీ(ఫిజిక్స్) ప్రోగ్రాంలో ప్రవేశాలు.

అర్హత: బ్యాచిలర్ డిగ్రీ (ఫిజికల్ సైన్సెస్/ ఫిజిక్స్), బీఈ/ బీటెక్ (ఇంజినీరింగ్ ఫిజిక్స్) ఉత్తీర్ణత. **ఎంపిక:** జామ్ 2018/ జెస్ట్ 2018, ఇంటర్వ్యూ ద్వారా. **దరఖాస్తు:** ఆన్‌లైన్. **చివరితేది:** 28.03.2018.

వెబ్‌సైట్: www.niser.ac.in

ఏపీ లాసెట్ - 2018

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని న్యాయ కళాశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి మూడు, అయిదేళ్ల ఎల్‌ఎల్‌బీ, రెండేళ్ల ఎల్‌ఎల్‌ఎం కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష.

అర్హతలు: అయిదేళ్ల ఎల్‌ఎల్‌బీ కోర్సుకు ఇంటర్, మూడేళ్ల ఎల్‌ఎల్‌బీకి ఏదైనా డిగ్రీ, ఎల్‌ఎల్‌ఎంకు ఎల్‌ఎల్‌బీ/బీఎల్ ఉత్తీర్ణత.

ఎంపిక: ప్రవేశపరీక్ష ద్వారా.

దరఖాస్తు రుసుము: ఎల్‌ఎల్‌బీ పరీక్షకు రూ.750, ఎల్‌ఎల్‌ఎంకు రూ.850.

ఆన్‌లైన్ దరఖాస్తు: 09.03.2018 నుంచి 05.04.2018 వరకు. **పరీక్ష తేది:** 19.04.2018.

వెబ్‌సైట్: sche.ap.gov.in

వాక్ ఇన్స్

ఐఏఆర్ఐ, న్యూదిల్లీ

ఐకార్- భారత వ్యవసాయ పరిశోధనా సంస్థలో కింది ఖాళీలకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు.

పోస్టు-ఖాళీలు: యంగ్ ప్రొఫెషనల్- 3, ఎస్ఆర్ఎఫ్- 2.

అర్హత: ఎంఎస్సీ (మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ), నెట్/ గేట్ ఉత్తీర్ణత.

వయసు: 35 ఏళ్లు మించకూడదు.

ఇంటర్వ్యూ తేది: 20.03.2018.

వేదిక: మైక్రోబయాలజీ విభాగం, ఐఏఆర్ఐ, పూసా క్యాంపస్, న్యూదిల్లీ.

వెబ్‌సైట్: www.iari.res.in

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

పీజీకి అర్హత ఉందా?

➤ బీటెక్ (ఈఈఈ) పూర్తిచేశాను. జియో విభాగంలో సైన్స్ లేదా ఇంజినీరింగ్ సంబంధిత అంశాల్లో పీజీ చేయాలనుంది. నేను అర్హుడినేనా? అందించే కళాశాలలేవి?

- ఆర్. శ్రీకాంత్

జ: జియో విభాగంలో పీజీ చేయడానికి బ్యాచిలర్ డిగ్రీలో సైన్స్, ఇంజినీరింగ్, స్టాటిస్టిక్స్, జియాలజీ చదివిన వారు అర్హులు. వీరు ఎంఎస్సీ జియో ఇన్ఫర్మాటిక్స్ కోర్సును రిమోట్స్, ఎంఎస్సీ (రిమోట్స్ సెన్సింగ్ జీఐఎస్) కోర్సును ఎంచుకోవచ్చు. బీటెక్ చేసినవారు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ వారు అందించే (ఐఐఆర్ఎస్) ఎంఎస్సీ- జియో ఇన్ఫర్మేషన్ సైన్స్ అండ్ జాగ్రఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ కోర్సును ఎంచుకోవచ్చు. ఐఐఆర్ఎస్ వారు తమ సొంత ప్రవేశపరీక్ష ద్వారా ఈ కోర్సులకు ప్రవేశాన్ని కల్పిస్తున్నారు. టీఈఆర్ఐ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ జమ్మూ, జీవాజి యూనివర్సిటీవారు ఎంఎస్సీ జియో ఇన్ఫర్మాటిక్స్ కోర్సులను అందిస్తున్నారు. కాబట్టి మీరు జియో విభాగంలో పై కోర్సులు చేయడానికి అర్హులు.





ఇష్టమైన సబ్జెక్టులో లోతైన పరిశోధనలు చేసి మరింత నైపుణ్యాన్ని, పరిజ్ఞానాన్ని పెంచుకోడానికి సాయపడుతోంది సీఎస్ఐఆర్ నెట్. ఆర్థిక సాయంతోపాటు ఉద్యోగాలకు కావాల్సిన అర్హతలనూ అందిస్తోంది. ఈ పరీక్షలో నెగ్గితే జేఆర్ఎఫ్‌గా పరిశోధన రంగంలో ప్రవేశించవచ్చు. విశ్వవిద్యాలయాలూ, కళాశాలల్లో యూజీసీ గుర్తింపు పొందిన అధ్యాపకులుగా చేరే వీలుంది. సొంత ల్యాబ్‌లు పెట్టుకోవడం, రిసెర్చ్ బృందాలకు నాయకత్వం వహించడం వంటి వాటికి అవకాశం ఉంటుంది.

సీఎస్ఐఆర్

నెట్‌లో నెగ్గుదాం నేర్పుగా!

మనదేశంలో శాస్త్రీయ, సాంకేతిక మానవ వనరులను అభివృద్ధి చేస్తున్న అతిపెద్ద సంస్థ సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్). ప్రపంచంలోనే పెద్దదైన ఇండస్ట్రియల్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థ ఇది. బయోటెక్నాలజీ, ఫార్మాస్యూటికల్, ఇతర మౌలిక సైన్స్ రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్న సంస్థ కూడా ఇదే. దీని పరిధిలో దేశం మొత్తంలో 38 జాతీయ ప్రయోగశాలలు, 80 ఫీల్డ్ స్టేషన్లు ఉన్నాయి.

సీఎస్ఐఆర్- యూజీసీ నెట్ విభాగంలో పరీక్షలను నిర్వహించే సబ్జెక్టులు.. ▮ కెమికల్ సైన్సెస్ ▮ ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్, ప్లానిటరీ సైన్సెస్ ▮ లైఫ్ సైన్సెస్ ▮ మేథమేటికల్ సైన్సెస్ ▮ ఫిజికల్ సైన్సెస్

అర్హత: ఎంఎస్సీ లేదా ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీలో 55% మార్కులతో ఉత్తీర్ణులైన జనరల్, ఓబీసీ విద్యార్థులూ 50% మార్కులతో ఉత్తీర్ణులైన ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ విద్యార్థులూ ఈ పరీక్షకు అర్హులు. ఎంఎస్సీ, ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ తుది సంవత్సరం చదువుతున్న వారూ అర్హులే.



పీటీవీఏ శ్రీనివాస్
డైరెక్టర్, కెంబయోసిస్ కోచింగ్ సెంటర్

జేఆర్ఎఫ్‌కు అర్హత సాధించడానికి జనరల్ కేటగిరీ విద్యార్థులకు గరిష్ఠ వయసు పరిమితి 28 సంవత్సరాలు. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్, మహిళా విద్యార్థులకు వయసులో అయిదేళ్ల సడలింపు ఉంది. నాన్ క్రీమిలేయర్ ఓబీసీ విద్యార్థులకు మూడేళ్ల సడలింపు ఉంది. లెక్చరర్‌షిప్ (ఎల్ఎస్) కు వయ:పరిమితి లేదు.

పరీక్ష ఫీజు: జనరల్ కేటగిరీకి రూ.1000, ఓబీసీ- నాన్ క్రీమిలేయర్‌కు రూ.500, ఎస్సీ/ ఎస్టీ/ పీహెచ్/ వీహెచ్ కేటగిరీకి రూ.250గా నిర్ణయించారు.

పరీక్ష విధానం

సీఎస్ఐఆర్- యూజీసీ నెట్‌లో అన్ని ప్రశ్నలూ మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. ఈ పరీక్షకు గరిష్ఠంగా 200 మార్కులు, 3 గంటల సమయాన్ని కేటాయించారు. ఈ పరీక్షలో మూడు విభాగాలు (ఎ, బి, సి) ఉంటాయి.

పార్ట్-ఎ: అందరికీ ఒకేవిధంగా ఉంటుంది. ఇందులో జనరల్ ఆప్టిట్యూడ్‌తో కూడిన లాజికల్ రీజనింగ్, గ్రాఫికల్ అనాలిసిస్, అనలిటికల్ అండ్ న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ కంపారిజన్, సిరీస్ ఫార్మేషన్, పజిల్స్ మొదలైనవాటికి సంబంధించిన 20 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో ఏవైనా 15 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రతి సరైన సమాధానానికీ 2 మార్కులు. ఈ విభాగానికి 30 మార్కులు కేటాయించారు.

పార్ట్-బి: దీనిలో అభ్యర్థుల సంబంధిత సబ్జెక్టులో మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. 20 నుంచి 35 ప్రశ్నలు అడిగే అవకాశముంది. ఈ విభాగానికి 70 మార్కులు.

పార్ట్-సి: సైంటిఫిక్ కాన్సెప్టులపై అభ్యర్థికి ఉన్న అవగాహన, పరిజ్ఞానం, అనువర్తిత ధోరణి మొదలైన అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. ఈ ప్రశ్నలన్నీ అభ్యర్థి విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షించేలా ఉంటాయి. ఈ విభాగానికి 100 మార్కులను కేటాయించారు.

ఈ విభాగంలోని ప్రశ్నలకు ఎక్కువ వెయిటేజీ ఉంది. అందుకే సంబంధిత సిలబస్‌ను స్టాండర్డ్ రిఫరెన్స్ పుస్తకాలు, రిసెర్చ్ జర్నల్స్‌ను అనువర్తిత ధోరణిలో అధ్యయనం చేయాలి. రుణాత్మక మార్కులున్నాయి. కాబట్టి తెలిసిన ప్రశ్నలకు మాత్రమే సమాధానాలను గుర్తించాలి. వివిధ సబ్జెక్టుల్లో అడిగే ప్రశ్నల సంఖ్య, గుర్తించే సమాధానాల సంఖ్య వేరువేరుగా ఉండవచ్చు.

ఎలా తయారవ్వాలి?

లైఫ్ సైన్సెస్: బోటనీ, జువాలజీల్లో ఎంఎస్సీ చేసి, లైఫ్ సైన్స్ రాసే విద్యార్థులు ఆధునిక బయాలజీ (మాలిక్యులార్ బయాలజీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, బయోకెమికల్ టెక్నిక్స్, బయోఫిజిక్స్, స్పెక్ట్రోస్కోపి) పై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి. ఆధునిక బయాలజీలో పీజీ చేసినవారు తమ ఆప్షనల్‌తోపాటు క్లాసికల్ బయాలజీపై, ఎకాలజీ, ఎవల్యూషన్, బయోడైవర్సిటీ మొదలైనవి చూసుకోవాలి.

కెమికల్ సైన్సెస్: కెమికల్ సైన్స్ రాసేవారు ఆర్గానిక్ కెమిస్ట్రీలో రియాక్షన్ మెకానిజం, స్టీరియో కెమిస్ట్రీలో ఎసెమిట్రిక్ సింథసిస్, కన్ఫర్మేషనల్ అనాలిసిస్, ఆర్గానిక్ స్పెక్ట్రోస్కోపి, రియేజెంట్స్, పెరిసైక్లిక్ చర్యలు, కాంతి రసాయనశాస్త్రం తదితర అంశాలనూ, ఇనార్గానిక్ కెమిస్ట్రీలో సంశ్లిష్ట సమ్మేళనాలు, అనలిటికల్ కెమిస్ట్రీ, బయో ఇనార్గానిక్ కెమిస్ట్రీ, కర్బన లోహ సమ్మేళనాలు, మెటల్ క్లస్టర్స్ మొదలైన అంశాలను అనువర్తిత ధోరణిలో విశ్లేషణాత్మకంగా చదవాలి.

ఫిజికల్ కెమిస్ట్రీలో క్వాంటమ్ కెమిస్ట్రీ, సాలిడ్‌స్టేట్, మాలిక్యులర్ స్పెక్ట్రోస్కోపి, స్టాటిస్టికల్ థర్మోడైనమిక్స్, కెమికల్ కైనెటిక్స్, ఎలక్ట్రో కెమిస్ట్రీ మొదలైన అంశాలను అనువర్తిత ధోరణిలో అధ్యయనం చేయాలి.

రిఫరెన్స్ పుస్తకాలు

కెమిస్ట్రీ: ఆర్గానిక్ కెమిస్ట్రీ: Clayden, Carey Sundberg, William Kemp, Nasi Puri, Carruthers, Smith. ఫిజికల్ కెమిస్ట్రీ: W.Atkins, K.L.Kapoor, Mc.Quarie, Banwell ఇనార్గానిక్ కెమిస్ట్రీ: Huheey, Shriver & Atkins, Cotton & Wilkinson.

మేథ్స్: కాల్క్యులస్: M.J.Strauss, H.Anton రియల్ అనాలిసిస్: Shanti Narayan, Richard R Goldberg డిఫరెన్షియల్ ఈక్వేషన్స్: Sastri SS, Collins P.J. కాంప్లెక్స్ నంబర్స్: Murry R Spiegel ఆల్జీబ్రా: Bhattacharya, Devid C Lay ప్రాబబిలిటీ ఆఫ్ స్టాటిస్టిక్స్: C.E.Weatherban, Das Gupta, Ray & Sharma

ఫిజిక్స్: మెకానిక్స్: D S Mathur, Daniel వేవ్స్ అండ్ ఆప్టిక్స్: D R Brown, N K Bajaj ఎలక్ట్రిసిటీ అండ్ మాగ్నెటిజమ్: D C Tayal, Edward M Purcell కైనెటిక్ థియరీ అండ్ థర్మోడైనమిక్స్: D John, Charles E Hecht మోడరన్ ఫిజిక్స్: D.C. Pandey, B L Theraja సాలిడ్ స్టేట్ ఫిజిక్స్: S.P. Singh, D.K.Bhattacharya

బయాలజీ: బయోకెమిస్ట్రీ: Voet & Voet, Albert Lehninger మైక్రోబయాలజీ: Prescott సెల్ బయాలజీ: Alberts, Lodish మాలిక్యులర్ బయాలజీ: Weaver ఇమ్యునాలజీ: Kuby జెనెటిక్స్: Griffith, Suzuki యానిమల్ ఫిజియాలజీ: Nielsen ప్లాంట్ ఫిజియాలజీ: Teiz and Zeiger

సన్నద్ధత వృథా కాదు!

ఒకవేళ సీఎస్ఐఆర్‌లో జేఆర్ఎఫ్ రాకపోయినప్పటికీ మీ సన్నద్ధత వృథా కాదు. అదే సిలబస్, సన్నద్ధతతో ఇతర పోటీపరీక్షలైన ఐఐఎస్సీ, ఐఐటీ, టీఐఎఫ్ఆర్, జేఎన్‌సీఎస్ఐఆర్, బార్క్, హెచ్‌సీయూ, ఓఎన్‌జీసీ, ఎన్‌టీపీసీ, ఎఫ్‌సీఐ, ఏపీసెట్, టీఎస్‌సెట్, డీఎల్, పేటెంట్ ఆఫీసర్, జెన్‌కో, డీఆర్‌డీఓ, ఎన్ఎఫ్ఎల్‌యూపీఎస్సీ, జెస్ట్, వివిధ విశ్వవిద్యాలయాల పీహెచ్‌డీ ప్రవేశపరీక్షలు మొదలైనవాటిలో, ఇంటర్వ్యూల్లో మంచి ఫలితాలు సాధించవచ్చు. సానుకూల దృక్పథంతో కృషి చేస్తే మంచి ఫలితం తప్పక వస్తుంది.

మాదిరి ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. ఇవి http:/sirhrdg.res.in/AnswerKeys.html లో లభిస్తాయి. సీఎస్ఐఆర్-యూజీసీ నెట్‌ను దేశవ్యాప్తంగా 27 కేంద్రాల్లో నిర్వహిస్తారు. మన తెలుగు రాష్ట్రాల్లో గుంటూరు, హైదరాబాద్‌ల్లో నిర్వహిస్తారు.



సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే, పరిశోధన చేసేవారికి మొదటి రెండు సంవత్సరాలు ప్రతి నెల రూ.25,000 చొప్పున స్టైపెండ్ ఇస్తారు. ఏటా రూ.20,000 చొప్పున పరిశోధన చేసే సంస్థ లేదా విశ్వవిద్యాలయం నుంచి కంటిన్‌జెంట్ గ్రాంటు కింద అభ్యర్థికి ఇస్తారు. ఆ తరువాత ఎస్ఆర్ఎఫ్ అర్హత సాధించిన వారికి ప్రతి నెల రూ.28,000 చొప్పున (ఎస్ఆర్ఎఫ్ కింద) స్టైపెండ్ ఇస్తారు.

జూన్ 2018 సీఎస్ఐఆర్ పరీక్షలో జేఆర్ఎఫ్ అర్హత సాధించినవారికి జనవరి 1, 2019 నుంచి రెండేళ్ల వరకు వ్యాలిడిటీ ఉంటుంది. ఈ రెండేళ్లలో మాత్రమే ఏదైనా పరిశోధన సంస్థ లేదా విశ్వవిద్యాలయంలో ప్రవేశం పొందాలి. **వెబ్‌సైట్:** www.csirhrdg.res.in

ఫిజికల్ సైన్సెస్: ఫిజికల్ సైన్స్ రాసేవారు మోడరన్ ఫిజిక్స్, న్యూక్లియర్, పార్టికల్ ఫిజిక్స్, హీట్, థర్మోడైనమిక్స్ (క్లాసికల్, స్టాటిస్టికల్), ఎలక్ట్రోమాగ్నటిక్ థియరీ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎక్స్‌పరిమెంటల్ మెథడ్స్, ఆప్టిక్స్, మెకానిక్స్ సబ్జెక్టులను విపులంగా చదవాలి.

మేథమేటికల్ సైన్సెస్: మేథమేటిక్స్‌లో స్టాటిస్టిక్స్, ఎక్స్‌పోలేటరీ డేటా అనాలిసిస్, కాంప్లెక్స్, డిఫరెన్షియల్ అనాలిసిస్, మ్యాట్రిక్స్, డెరివేటివ్స్, వెక్టర్, త్రికోణమితి, జామెట్రీ పాఠ్యాంశాలను క్షుణ్ణంగా చదవాలి.

ముఖ్యమైన తేదీలు

- ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేదీ: 26.03.2018
- ఈ-అడ్మిట్ కార్డులు: జూన్ 2018 మొదటి వారం నుంచి అందుబాటులో ఉంటాయి
- సింగిల్ ఎంసీక్యూ పరీక్ష తేదీ: 17.06.2018

లైఫ్ సైన్సెస్, ఎర్త్, అట్మాస్ఫిరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్, మేథమేటికల్ సైన్సెస్, కెమికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్‌ల నుంచి అభ్యర్థి ఎంచుకున్న ఒక సబ్జెక్టు ప్రకారం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మూడు గంటల పాటు; మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుంది.

నిట్‌ల్లో ఎంసీఏకు నిమ్‌సెట్

ఐటీ రంగంలోకి ప్రవేశించాలనుకునే వారికి ఇంజినీరింగ్‌కు ప్రత్యామ్నాయంగా ఉన్న ఇంకో కోర్సు ఎంసీఏ. ప్రోగ్రామింగ్ వృత్తిలో స్థిరపడాలన్నా, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లేదా డిజైన్‌లో భాగస్వాములు కావాలన్నా ఈ డిగ్రీ చేయవచ్చు. ఐటీ నిపుణులు కావాలన్న తమ కలను సాకారం చేసుకోవచ్చు.



రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలోకి అడుగు పెట్టాలనుకునే అభ్యర్థులకు ఇంజినీరింగ్ కాకుండా ఉన్న మరో చక్కటి మార్గం ఎంసీఏ (మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్). దేశంలోని ప్రఖ్యాత సంస్థల్లోని ఎంసీఏ కోర్సుల్లో చేరడానికి అర్హత కల్పించేందుకు ఏటా నిమ్‌సెట్ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఎంసీఏ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) నిర్వహిస్తున్నారు. ఈ పరీక్ష ద్వారా 11 నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)ల్లో ప్రవేశం లభిస్తుంది. వీటిలో వరంగల్ ఒకటి.

దేశవ్యాప్తంగా 31 జాతీయ సాంకేతిక విద్యా శిక్షణ సంస్థ (నిట్)లు ఉన్నాయి. అయితే వీటిలో 11 మాత్రమే ఎంసీఏ కోర్సును అందిస్తున్నాయి. ఈ 11 సంస్థలూ ఉమ్మడి పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి ఎంసీఏ కోర్సుల్లోకి ప్రవేశం కల్పిస్తున్నాయి. ఈ ఏడాది పరీక్షను నిట్ సూరత్కల్ నిర్వహిస్తోంది.

ఎంసీఏ అందిస్తోన్న నిట్‌లు: అగర్తలా, అలహాబాద్, భోపాల్, కాలికట్, దుర్గాపూర్, జంషెడ్‌పూర్, కురుక్షేత్ర, రాయ్‌పూర్, సూరత్కల్, తిరుచిరాపల్లి (ట్రిచీ), వరంగల్.

ఐటీ సంస్థల అవసరాల ప్రకారం ఇక్కడి ఎంసీఏ సిలబస్‌ను రూపొందిస్తారు. ఈ 11 సంస్థలూ ఒకే సిలబస్‌ను అనుసరిస్తాయి.

అర్హత: బీఎస్సీ, బీసీఏ, బీఐటీ, బీటెక్/ బీఈ వీటిలో ఏదైనా డిగ్రీలో కనీసం 60 శాతం మార్కులతో (ఎస్సీ, ఎస్టీలైతే 55 శాతం) ఉత్తీర్ణత సాధించాలి. ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

సీట్ల సంఖ్య: ఎంసీఏ కోర్సు అందిస్తోన్న 11 ఎన్ఐటీల్లోనూ మొత్తం 805 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ సీట్లన్నీ రాత పరీక్షలో చూపిన ప్రతిభ, రిజర్వేషన్ల ప్రాతిపదికన అఖిల భారత స్థాయిలో భర్తీ చేస్తారు. ఆయా నిట్‌లవారీ రాష్ట్రాల కోటా లేదు. మొత్తం 805 సీట్లలో 387 సీట్లు ఓపెన్ కేటగిరీ ద్వారా భర్తీ చేస్తారు. ఈ సీట్ల కోసం దేశవ్యాప్తంగా పరీక్షకు హాజరైన అభ్యర్థులంతా పోటీ పడవచ్చు. 209 సీట్లు ఓబీసీలకు, 114 ఎస్సీ విద్యార్థులకు, 54 సీట్లు ఎస్టీ అభ్యర్థులకు కేటాయించారు. దివ్యాంగుల కోసం 41 సీట్లు ఉన్నాయి (వీటిలో 18 సీట్లు కోసం దివ్యాంగులు అందరూ పోటీ పడవచ్చు. 9 సీట్లు ఓబీసీ, 9 సీట్లు ఎస్సీ, 5 సీట్లు ఎస్టీ దివ్యాంగులకు కేటాయించారు).

సంస్థలవారీ సీట్ల వివరాలు: అగర్తలా- 40, అలహాబాద్ - 93, భోపాల్ - 92, కాలికట్ - 46, దుర్గాపూర్ - 30, జంషెడ్‌పూర్ - 92, కురుక్షేత్ర - 60, రాయ్‌పూర్ - 92, సూరత్కల్ - 92, తిరుచురాపల్లి - 92, వరంగల్ - 46, కురుక్షేత్ర - 30.

పరీక్ష తేదీ: 27.05.2018 (ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు)

తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రం: వరంగల్.

ఫలితాలు: జూన్ 6న ప్రకటిస్తారు.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.2200; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.1100.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 31.03.2018 (సాయంత్రం 5 వరకు)

వెబ్‌సైట్: https://nimcet.in

ప్రశ్నపత్రం

మొత్తం 120 ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి రెండు గంటలు. అంటే ప్రతి ప్రశ్నకు నిమిషం సమయం కేటాయించుకోవచ్చు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. సబ్జెక్టుల వారీ మ్యాథమేటిక్స్ 50 ప్రశ్నలు, అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 40, కంప్యూటర్ అవేర్‌నెస్ 10, జనరల్ ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలడుగుతారు. ప్రతి సరైన జవాబుకు 4 మార్కులు. రుణాత్మక మార్కులు ఉన్నాయి. తప్పుగా గుర్తించిన ప్రతి సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు.

మార్కుల వెయిటేజీ: మొత్తం మార్కులను 1000గా పరిగణిస్తారు. అంటే మ్యాథ్స్‌లో మొత్తం మార్కులకు 3 రెట్లు, అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ మార్కులకు ఒకటిన్నర రెట్లు, కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగంలోని మార్కులకు 2 రెట్లు, ఇంగ్లిష్ మార్కులను యథావిధిగా ఉంచి లెక్కిస్తారు. ఈ లెక్కన మ్యాథ్స్ విభాగానికి 600 మార్కులన్నమాట. (50 ప్రశ్నలు, ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు కాబట్టి మొత్తం 200 మార్కులు. వీటికి 3 రెట్లు అంటే 600 మార్కులు) అలాగే అనలిటికల్ ఎబిలిటీ అండ్ లాజికల్ రీజనింగ్ 240 (మొత్తం 40 ప్రశ్నలు, ప్రతి ప్రశ్నకు 4 మార్కులు కాబట్టి 160 మార్కులు. వీటికి ఒకటిన్నర రెట్లు అంటే 160+80=240 మార్కులు), కంప్యూటర్ అవేర్‌నెస్ 80 (10 ప్రశ్నలకు 40 మార్కులు దానికి రెట్టింపు 80), ఇంగ్లిష్ విభాగానికి 80 (20 ప్రశ్నలు. ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు కాబట్టి 80) మార్కులు కేటాయించారు.

స్వపక్షమే విపక్షమై..

- లోక్‌సభలో కేంద్రంపై కదం తొక్కిన తెదేపా, శివసేన
- జతకలిసిన కాంగ్రెస్, తెరాస, ఏఐఏడీఎంకె.. తృణమూల్, వైకాపా, వామపక్షాల నిరసనలు
- రాజ్యసభలోనూ తీవ్రస్థాయిలో ఆందోళనలు
- పదే పదే వాయిదా పడిన సభా కార్యక్రమాలు


మంగళవారం రాజ్యసభలో విపక్షాల నిరసన

ఈనాడు - దిల్లీ

ఇటీవలి కాలంలో ఎన్నడూలేనంత స్థాయిలో విపక్షాలు, కొన్ని ఎన్డీయే మిత్రపక్షాలు ఆందోళనకు దిగడంతో మంగళవారం లోక్‌సభ దద్దరిల్లింది. సభానిర్వహణ అసాధ్యంగా మారింది. స్పీకర్ సుమిత్రా మహాజన్ తొలుత 12 గంటలకు, ఆ తర్వాత బుధవారానికి సభను వాయిదావేశారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాలుగేళ్లలో ఎన్నడూలేనంతగా ఆందోళనల తీవ్రత మంగళవారం సభ వెలుపల, లోపల ప్రతిధ్వనించింది.

సభ ప్రారంభానికి ముందు...

మంగళవారం ఉదయం 10 గంటల నుంచే పార్లమెంటు వెలుపల ఉన్న గాంధీ విగ్రహం వద్ద విపక్షాలన్నీ మోహరించి ఆందోళనకు దిగాయి. గాంధీ విగ్రహం ఎదుట తెలుగుదేశం రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు ప్లకార్డులు పట్టుకొని నిరసన మొదలుపెట్టారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలంటూ నినదించారు. ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారికి కుడివైపున తెరాస లోక్‌సభ సభ్యులంతా రిజర్వేషన్ల కోటా పెంపుకోసం ఆందోళన చేపట్టారు. ఏక్ దేశ్ ఏక్‌నీతి... ఒకే దేశం ఒకే చట్టం.. అంటూ నినదించారు. గాంధీ విగ్రహానికి ఎడమవైపున శివసేన లోక్‌సభ సభ్యులు మరాఠీకి ప్రాచీన హోదా ఇవ్వాలంటూ గళమెత్తారు. మధ్యలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలంతా బ్యాంకింగ్ కుంభకోణంపై నిరసనకు దిగారు. నీరవ్‌మోదీకో వాపస్‌లావ్.. . చోటామోదీకో వాపస్‌లావ్ అంటూ నినాదాలు చేశారు. గాంధీ విగ్రహం సమీపంలో చోటు మిగలకపోవటంతో వైకాపా ఎంపీలు పార్లమెంటు మొదటి గేటువద్ద ప్లకార్డులు పట్టుకొని నిరసన కొనసాగించారు. కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత పళ్లంరాజు కూడా కొద్ది సమయం పాటు వీరితో ఉన్నారు. తెలుగుదేశం సభ్యుల మధ్యకు కాంగ్రెస్ సభ్యులు కేవీపీ రామచంద్రరావు, రేణుకాచౌదరి, మాజీ ఎంపీ జేడీ శీలం వచ్చి నిల్చొని ఆందోళనలో పాలుపంచుకున్నారు. ఒకేసారి ఇన్ని పార్టీలు ఆందోళనకు దిగడం పార్లమెంటు ఆవరణంలో ప్రకంపనలు సృష్టించింది. బయట ఆందోళన చేసిన వారంతా ఉదయం 11 గంటలకు సభలోకి లోపలికెళ్లారు.

తొలి నిమిషంలోనే లోక్‌సభ వాయిదా

సభ ప్రారంభమైన వెంటనే తెదేపా, తెరాస, కాంగ్రెస్, ఏఐఏడీఎంకె, శివసేన, వైకాపా, కాంగ్రెస్, తృణమూల్, వామపక్షాల సభ్యులంతా నినాదాలు చేసుకుంటూ సభా మధ్యంలోకి దూసుకొచ్చారు. చేసేదేమీ లేక స్పీకర్ సుమిత్రా మహాజన్ నిమిషంలోనే సభను 12 గంటలకు వాయిదావేశారు. సభ తిరిగి ప్రారంభమైనా ఇదే పరిస్థితి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ లేచి సభ్యులు ఆందోళన విరమించాలంటూ చేసిన విజ్ఞప్తిని ఎవరూ వినిపించుకోలేదు. ఆయన మాట్లాడుతున్నప్పుడు తెలుగుదేశం, తెరాస, ఏఐఏడీఎంకె సభ్యులు చుట్టుముట్టి ఆయన కనిపించకుండా ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు కొనసాగించడంతో ఏంమాట్లాడుతున్నారో తెలియని తీవ్ర గందరగోళం నెలకొంది. లోక్‌సభ టీవీల్లో మంత్రి కనిపించకుండా ప్లకార్డులతో ముంచేశారు. అనంతరం ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే 52వ నిబంధన కింద తమకు చర్చకు అనుమతివ్వాలని స్పీకర్‌ను కోరారు. అనంతకుమార్ సమాధానమిస్తుండగా వివిధ పక్షాల సభ్యుల ఆందోళన మిన్నంటడంతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను బుధవారానికి వాయిదావేశారు. మంగళవారం నాటి ఆందోళనలో వైకాపాకు చెందిన నలుగురు సభ్యులు సభామధ్యంలోకి రాకుండా వారి సీట్ల వద్దే నిల్చొని ప్లకార్డులు పట్టుకొని నిరసనలో పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వేషంలో శివప్రసాద్

రోజుకో వేషంతో వినూత్న నిరసన తెలుపుతూ వస్తున్న చిత్తూరు ఎంపీ శివప్రసాద్ మంగళవారం ఎన్టీఆర్‌లా కాషాయ వస్త్రాలు ధరించారు. చెయ్యెత్తి జైకొట్టు తెలుగోడా...గతమెంతో ఘనకీర్తి కలవోడా... అన్న ఎన్టీఆర్ నినాదాన్ని వినిపిస్తూ ఆందోళనలో పాల్గొన్నారు. మాగంటి బాబు వెంకటేశ్వరస్వామి ప్రతిమ, మూడు పవిత్ర మతగ్రంథాల(భగవద్గీత, బైబిల్, ఖురాన్)ను చేతబట్టుకొని నిరసన కొనసాగించారు.

రాజ్యసభలో ఆందోళనలకు వైకాపా, తెరాస దూరం

ప్రత్యేకహోదా, రిజర్వేషన్ల పెంపు డిమాండ్లతో వైకాపా, తెరాసలు లోక్‌సభలో ఆందోళనలు చేసినా రాజ్యసభలో మాత్రం ఆ రెండు పార్టీల సభ్యులు ఆందోళనలకు దూరంగా ఉన్నారు. ఉదయం పార్లమెంటు ప్రధాన ద్వారం వద్ద నిరసనలో పాల్గొన్న వైకాపా సభ్యుడు విజయసాయిరెడ్డి రాజ్యసభ లోపల ఆందోళనలో పాల్గొనడం కానీ, సభామధ్యంలోకి రావడంకానీ చేయలేదు.


మంగళవారం పార్లమెంట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న వైకాపా ఎంపీలు

రాజ్యసభలోనూ నిరసనల సెగ

లోక్‌సభ తరహాలోనే రాజ్యసభ కూడా ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే వాయిదా పడింది. ఉదయం సభ ప్రారంభమైన వెంటనే తెలుగుదేశం, ఏఐఏడీఎంకె, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు ప్లకార్డులు పట్టుకొని సభామధ్యంలోకి వచ్చి నినాదాలు చేశారు. దాంతో సభాధ్యక్షుడు వెంకయ్యనాయుడు సభను అరగంటపాటు వాయిదావేశారు. వెంటనే సభానాయకుడు అరుణ్‌జైట్లీతోపాటు, అన్నిపక్షాల నేతలను తన ఛేంబర్‌లోకి పిలిపించుకొని మాట్లాడారు. సీఎం రమేష్ మాట్లాడుతూ పార్లమెంటు ఆమోదించిన విభజన చట్టాన్ని, ఇదే సభలో నాటి ప్రధాని ఇచ్చిన హామీలను అమలుచేయాలని మాత్రమే తాము కోరుతున్నామని పేర్కొన్నారు. కేవీపీ రామచంద్రరావు ఆందోళనను విరమింపజేయడం తమకు సాధ్యంకాదని గులాంనబీఆజాద్ అన్నట్లు తెలిసింది. ఈ సందర్భంగా తమిళనాడు సభ్యుడు ఒకరు.. ఆంధ్రప్రదేశ్‌లో ఇంత జరుగుతున్నా మీ రాష్ట్రానికి చెందిన విజయసాయిరెడ్డి సభలో నిశ్శబ్దంగా ఉన్నారు. మీరు అలాగే ఉండండి అని సీఎం రమేష్‌ను ఉద్దేశించి అన్నట్లు సమాచారం.

ఇది బజారుకాదు..

సభాపక్షనేతల సమావేశం ముగిసిన తర్వాత సభ పునఃప్రారంభమైన వెంటనే ఆందోళనలు మళ్లీ మొదలయ్యాయి. ఎంత చెప్పినా వినిపించుకోకపోవడంతో వెంకయ్యనాయుడు సభ్యుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బజారుకాదు... పార్లమెంటు అని గుర్తుచేశారు. ఇలాంటి ఆందోళనలకు అనుమతివ్వనంటూ సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. మధ్యాహ్నం సభ పునఃప్రారంభమైన తర్వాత సభాధ్యక్షస్థానంలోకి ఉపసభాపతి పీజే కురియన్ వచ్చారు. ఆ సందర్భంగా కాంగ్రెస్ లేవనెత్తిన బ్యాంకింగ్ కుంభకోణాలపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సహాయమంత్రి విజయ్‌గోయల్ ప్రకటించినప్పటికీ నిరసనలు కొనసాగాయి. అయినా పరిస్థితి అలాగే కొనసాగడంతో సభను మూడున్నరకు వాయిదావేశారు. ఆ తర్వాత సభ తిరిగి ప్రారంభమైనా తెలుగుదేశం, ఏఐఏడీఎంకె, తృణమూల్, కాంగ్రెస్ సభ్యులు వారి వారి డిమాండ్లతో ఆందోళన కొనసాగించటంతో కురియన్ సభను బుధవారానికి వాయిదావేసి వెళ్లిపోయారు.

రూ.12,476 కోట్లు ఇచ్చాం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం కింద కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక సాయం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.12,476.76 కోట్లు ఇచ్చినట్లు కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మంగళవారం రాజ్యసభలో వెల్లడించారు. కాంగ్రెస్ సభ్యుడు టి.సుబ్బరామిరెడ్డి అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక సాయం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.16,725 కోట్లు రావాల్సి ఉంటుందని, ఆ మొత్తాన్ని విదేశీ ఆర్థికసంస్థల ద్వారా కాకుండా నాబార్డు రుణం ద్వారా ఇప్పించాలని ముఖ్యమంత్రి కోరినట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చేసిన ఆ సూచన ప్రస్తుతం తమ పరిశీలనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి కోసం విభజన చట్టంలో పలు నిబంధనలు పెట్టినట్లు తెలిపారు. రెవిన్యూ లోటు భర్తీకింద రూ.3,979.50 కోట్లు, ఏడు వెనుకబడిన జిల్లాలకు రూ.1,050 కోట్లు, రాజధాని నగరం, దాని పరిధిలో ముఖ్యమైన మౌలికవసతుల అభివృద్ధి కోసం రూ.2,500 కోట్లు, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు రూ.4,947.26 కోట్లు కలిపి ఇప్పటివరకూ రూ.12,476.76 కోట్లు ఇచ్చామన్నారు. రాజధానికి ఇచ్చిన రూ.2,500 కోట్లలో విజయవాడ, గుంటూరు నగరాల్లో భూగర్భడ్రైనేజీ నిర్మాణంకోసం కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ ఇచ్చిన రూ.వెయ్యికోట్లు కూడా ఉందన్నారు. ప్రత్యేక ప్యాకేజీ కింద రూ.16,725 కోట్ల మొత్తాన్ని ఆరు ప్రాజెక్టుల కోసం అడిగినట్లు చెప్పారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ తాగునీటి సరఫరా కోసం రూ.4,500 కోట్లు, మండల, గ్రామీణ రహదారి అనుసంధాన ప్రాజెక్టు కోసం రూ.3,200 కోట్లు, గురుకుల పాఠశాల భవనాల నిర్మాణం కోసం రూ.3,341 కోట్లు, రహదారులు, భవనాల పునర్నిర్మాణం కోసం రూ.3,200 కోట్లు, అమరావతిలో అటవీప్రాంతం అభివృద్ధి ప్రాజెక్టు కోసం రూ.1,484 కోట్లు అడిగినట్లు తెలిపారు. 13వ షెడ్యూల్ కింద చెప్పిన జాతీయ సంస్థల్లో ఎయిమ్స్ కోసం రూ.54.51 కోట్లు, ఐఐటీకి రూ.65.49 కోట్లు, ట్రిపుల్‌ఐటీకి రూ.20.1కోట్లు, ఎన్ఐటీకి రూ.226 కోట్లు, ఐఐఎంకి రూ.42.96 కోట్లు, ఐఐఎస్ఈఆర్‌కు రూ.64 కోట్లు, వ్యవసాయ విశ్వవిద్యాలయానికి రూ.135 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ మొత్తం కలిపి రూ.608.06 కోట్లు ఉంది. విశాఖపట్నం, విజయవాడ మెట్రోరైల్ ప్రాజెక్టులకు ఇప్పటివరకూ రూ.2.64 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. విశాఖపట్నం మెట్రో డీపీఆర్ ప్రస్తుతం పట్టణాభివృద్ధిశాఖ పరిశీలనలో ఉందని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొన్ని వివరణలు కోరిందని తెలిపారు. విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు కేంద్రం సూత్రప్రాయ అంగీకారాన్ని తెలిపినట్లు పేర్కొన్నారు. జాతీయ ప్రకృతి విపత్తు సంస్థ దక్షిణ క్యాంపస్‌ను రూ.70.87 కోట్లతో ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడానికి కేంద్రం ఆమోదముద్ర వేసిందన్నారు.

2020కి మంగళగిరి ఎయిమ్స్ పూర్తి

ఈనాడు, దిల్లీ: మంగళగిరిలో రూ.1,618 కోట్లతో తలపెట్టిన ఎయిమ్స్ నిర్మాణాన్ని 2020 అక్టోబర్‌కల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా తెలిపారు. రాజ్యసభలో భాజపా సభ్యుడు వినయ్ సహస్రబుద్దే అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 50 సీట్లతో కూడిన ఎంబీబీఎస్ బ్యాచ్ 2018-19 విద్యాసంవత్సరం నుంచి విజయవాడ సిద్ధార్థ మెడికల్ కాలేజీలో ప్రారంభం అవుతుందని తెలిపారు. పుదుచ్చేరి జిప్‌మర్ ఇందుకు మార్గదర్శిగా వ్యవహరిస్తుందన్నారు. తొలి ఏడాది తరగతులు నిర్వహించడానికి అవసరమైన అధ్యాపకుల భర్తీకోసం త్వరలో ప్రకటన విడుదల చేస్తామని చెప్పారు. ఇప్పటివరకూ ఇక్కడ ప్రహరీ నిర్మించినట్లు తెలిపారు. అమెరికాకు చెందిన పెర్కిన్స్ ఈస్ట్‌మేన్, ఎడిఫైస్ కన్సల్టెంట్ అనే సంస్థలను గ్లోబల్ బిడ్‌ద్వారా డిజైన్ కన్సల్టెంట్‌గా ఎంపికచేసినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు మాస్టర్‌ప్లాన్, కాన్సెప్ట్‌ప్లాన్, పూర్తిస్థాయి డిజైన్లు ఖరారైనట్లు చెప్పారు. 2017 ఆగస్టు 30న గృహనిర్మాణం, ఓపీడీ బ్లాక్ నిర్మాణ పనులను అప్పగించినట్లు తెలిపారు. హాస్పిటల్ బ్లాక్, అకడెమిక్ క్యాంపస్ నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నట్లు తెలిపారు.

చంద్రబాబు విజ్ఞప్తిని పరిశీలిస్తున్నాం

విదేశీ ఆర్థిక సంస్థల (ఈఏపీ) ద్వారా కాకుండా నాబార్డు ద్వారా రుణాలు ఇప్పించాలన్న ఏపీ సీఎం చంద్రబాబు విజ్ఞప్తి పరిశీలనలో ఉందని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పొన్ రాధాకృష్ణన్ తెలిపారు. మంగళవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ కేవీపీ రామచంద్రరావు అడిగిన ఓ ప్రశ్నకు ఈ సమాధానమిచ్చారు. ఏపీ ప్రభుత్వ లెక్కలు ఆడిట్ చేసిన అనంతరం నాలుగు ఆర్థిక సంవత్సరాలకు కేంద్ర ప్రాయోజిత సంస్థలకు ఇవ్వాల్సిన 30 శాతం నిధులు విడుదలను ఖరారు చేస్తామని వివరించారు.

దిల్లీలో 12న విభజన కమిటీ సమావేశం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని 13వ షెడ్యూలు అంశాలపై దిల్లీలో ఈ నెల 12న కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని కమిటీ సమావేశం జరపనుంది. దీనికి ఇరు రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరు కావాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. 13వ షెడ్యూలులో కొత్త సంస్థల ఏర్పాటు తదితర అంశాలున్నాయి. వీటిలో ఎన్ని ఏర్పాటయ్యాయి? ఇంకా ఎన్ని కావాలి? తదితర సమస్యలపై చర్చించనున్నారు.

మోదీని అవమానిస్తారా?

- రౌడీలు, గూండాలను తెదేపా ప్రోత్సహిస్తున్నట్లుంది
- మమ్మల్ని హత్య చేయిస్తారేమో?
- విశాఖలో తెదేపా నిరసనపై భాజపా నేతల సంచలన వ్యాఖ్యలు


హామీలు నెరవేర్చాలంటూ ప్లకార్డులతో భాజపా ఎమ్మెల్సీలు మాధవ్, సోము వీర్రాజు

ఈనాడు అమరావతి: 'రౌడీలు, గూండాలను తెదేపా కిరాయికి తెచ్చుకుంది. వారికి పదవులూ ఇస్తోంది. ఓ పది లక్షల రూపాయలిస్తే ఆ రౌడీలు మమ్మల్నీ హత్య చేస్తారేమో. రాష్ట్రంలో భాజపా ప్రజాప్రతినిధులం ఏడుగురమే ఉన్నాం..' అంటూ భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు సంచలన వ్యాఖ్యలు చేశారు. రైల్వే జోన్ సాధన ఉద్యమంలో భాగంగా విశాఖలో తెదేపా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్, ఆ పార్టీ నేత ముత్యాలనాయుడు చేపట్టిన నిరసనలో ప్రధానిని అవమానించేలా వ్యవహరించారని మండిపడ్డారు. హత్య కేసులో ముత్యాలనాయుడు నిందితుడని, రాజకీయ జోక్యంతో ఆ కేసు నుంచి తప్పించారని ఆరోపించారు. అలాంటి నేత, ఒక ఎమ్మెల్యే ప్రధానిని అవమానించేలా నిరసన కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి మార్గదర్శకత్వం లేకుండానే చేయగలరా? అని ప్రశ్నించారు. ప్రధానిని అవమానించేలా వ్యవహరించినందుకు వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేదా వారితో ప్రభుత్వమే అలా చేయించిందా? చెప్పాలన్నారు. మంగళవారం విష్ణుకుమార్‌రాజు భాజపాకు చెందిన మరో ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ, ఎమ్మెల్సీలు సోము వీర్రాజు, మాధవ్‌లు అసెంబ్లీ మీడియాపాయింట్‌లో, లాబీల్లో వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ.. 'పిచ్చిపిచ్చి వేషాలు వేస్తూ వ్యక్తిగత విమర్శలకు దిగితే చూస్తూ ఊరుకోడానికి భాజపా సిద్ధంగా లేదు. నోరు తెరిస్తే పరిస్థితులు వేరేగా ఉంటాయ'ని అన్నారు. సోము వీర్రాజు మాట్లాడుతూ రైల్వేజోన్‌పై కేంద్రం తీవ్రంగా పరిశీలిస్తోంది. ఎవరేం ఇచ్చినా మాదే.. ఇవ్వకపోతే తప్పు అవతలివాళ్లదనే ధోరణి సరికాదు. దుగరాజపట్నానికి రాష్ట్రంలో ఎవరు అడ్డుపడుతున్నారు? ఇవన్నీ ప్రజల ముందుంచాలి. ఇప్పటికైనా ప్రజలను రెచ్చగొట్టడం మానుకోవాల'ని అన్నారు. ఆకుల సత్యనారాయణ మాట్లాడుతూ 'ఓ వైపు కేంద్రంతో చర్చిస్తూనే, మరోవైపు పార్లమెంటులో తెదేపా నిరసనలు తెలపడమేంటో అర్థం కావడం లేదు. దీన్ని ఎలా సమర్థించుకుంటారో ముఖ్యమంత్రే చెప్పాల'ని అన్నారు.

మేం అడుక్కోవాలా..?

'భాజపాను ఎవరు వేలెత్తి చూపితే వాళ్లు ఏ1 నిందితులా? ఆర్థిక నేరాల్లో ఏ1 నిందితుడిగా ఉన్న జగన్ మాత్రం వారికి కావలసినవారయ్యారా? తప్పులను ఎత్తిచూపే వారిని జైలుకు పంపిస్తామంటారా? ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడమనేది మా హక్కు. నాలుగేళ్లుగా చేస్తాం.. చూస్తామని చెప్పి నేటి వరకు కేంద్రం ఏమీ చేయకపోతే రాష్ట్ర ప్రజల తరఫున నిలబడాల్సిన బాధ్యత తెదేపా కార్యకర్తలుగా మాపై ఉంది. ఆంధ్రప్రదేశ్.. దేశంలో భాగం కాదా? మేం అడుక్కోవాలా?'

-వాసుపల్లి గణేశ్‌కుమార్, ఎమ్మెల్యే, తెదేపా

కర్ణాటకలో భాజపాకు వ్యతిరేకంగా ఓట్లు

ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై కర్ణాటకలోని తెలుగువాళ్లు మండిపడుతున్నారు. అక్కడి 40 నియోజకవర్గాల్లో తెలుగువారి ప్రాబల్యం ఉంది. వారంతా భాజపాకు వ్యతిరేకంగా ఓట్లేసే అవకాశం ఉంది. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గతానికంటే పుంజుకుంటోంది.

-పయ్యావుల కేశవ్, మండలిలో చీఫ్ విప్

కేసీఆర్ తృతీయ కూటమి ప్రకటన వెనుక మోదీ

కేసీఆర్ తృతీయ కూటమి ప్రకటన వెనుక ప్రధాని మోదీ ఉన్నారేమో అనిపిస్తోంది. ప్రతికూల పరిస్థితులను అనుకూలంగా మార్చుకునేందుకే కూటమి ప్రకటన చేశారు. కర్ణాటకలో సిద్ధరామయ్య గెలుస్తారు. ప్రతిపక్షం సభలో లేకపోవడంతో మేం ఎంత మాట్లాడినా జనంలోకి వెళ్లదు.

-కె.అచ్చెన్నాయుడు, మంత్రి

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ బలపడుతోంది

రాష్ట్ర ప్రయోజనాల కోసమే భాజపాతో తెగదెంపుల గురించి మాట్లాడటం లేదు. భాజపా, తెదేపా పంతాలకు పోతే ప్రజలే నష్టపోతారు. అందుకే కలహాలున్నా.. రాష్ట్రం కోసం, ప్రజల కోసం కాపురం చేయాల్సి వస్తోంది. 2019లోనూ కేంద్రంలో భాజపా అధికారంలోకి రావొచ్చు. 2014లో సాధించినంత అధిక సంఖ్యలో స్థానాలయితే దక్కించుకోలేదు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ బలపడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో మళ్లీ తెదేపాయే అధికారంలోకి వస్తుందన్నది అందరికీ తెలిసిందే.

- అయ్యన్నపాత్రుడు, మంత్రి

ముస్లిం ఓట్ల కోసమే కేసీఆర్ జాగ్రత్తలు

ముస్లిం ఓట్లు కాంగ్రెస్‌కు వెళ్లకుండా కేసీఆర్ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఈ వ్యూహంలో భాగంగానే తృతీయ కూటమి ప్రతిపాదన తెచ్చినట్లు భావిస్తున్నాను. కేసీఆర్ కూటమి ఎలా ఉంటుందో చూడాలి.

-కళా వెంకట్రావు, మంత్రి, తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు

ఆ ఘనత చిన్నమ్మకూ దక్కుతుంది

- రాష్ట్ర విభజనతో రూ.16వేల కోట్ల లోటు బడ్జెట్ నెత్తిన పెట్టారు
- వైకాపా ఏమంటుందో.. భాజపా అదే మాట్లాడుతోంది..
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలపై చర్చలో తెదేపా విమర్శనాస్త్రాలు



సభలో మాట్లాడుతున్న ఆకుల సత్యనారాయణ, మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: రాయలసీమ చెరువుల్లో జలకళ చూసి ఓర్చుకోలేకపోతున్న ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తూ ప్రజల్ని రెచ్చగొడుతుంటే వారికి తోడుగా భాజపా కూడా నడుస్తోందని తెదేపా నేతలు ధ్వజమెత్తారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మంగళవారం జరిగిన చర్చలో తెదేపా, భాజపా నాయకులు పాల్గొన్నారు. తొలి రోజు చర్చలో మిత్రపక్షమే లక్ష్యంగా తెలుగుదేశం విమర్శనాస్త్రాలు సంధించింది. తాము ప్రధాని మోదీ, భాజపాకు వ్యతిరేకం కాదంటూనే చెప్పాల్సింది చెప్పేసింది. ప్రత్యేక హోదాతో పాటు రాయలసీమ డిక్లరేషన్ ప్రధానాంశాలుగా ఎక్కుపెట్టింది. ఇదే సమయంలో భాజపా ఎమ్మెల్యే సత్యనారాయణ కేంద్రం చేసింది వివరించే ప్రయత్నం చేశారు. గవర్నర్ ప్రసంగంపై తొలుత చర్చను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి తన ప్రసంగంలో కర్నూలు డిక్లరేషన్ ప్రకటించిన భాజపా రాయలసీమకు రాజధాని, హైకోర్టు కావాలని కోరుతున్న విషయాన్ని ప్రస్తావించారు. లోపాయికారీగా, రహస్య ఎజెండాతో వైకాపా మాట్లాడేదే భాజపా కూడా మాట్లాడుతోందని విమర్శించారు. ప్రత్యేకహోదా కోసం ఎప్పుడైనా ప్రధానిని ప్రశ్నించారా? అని జగన్‌ను నిలదీశారు. లోక్‌సభ ఎంపీ లేనా? రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డితో కూడా రాజీనామా చేయిస్తారో లేదో చెప్పాలని డిమాండు చేశారు. రాష్ట్ర విభజనతో రూ.16వేల కోట్ల లోటు బడ్జెట్ నెత్తిన పెట్టారని చర్చలో పాల్గొన్న తెదేపా ఎమ్మెల్యే రామానాయుడు పేర్కొన్నారు. ఈ ఘనత రాష్ట్ర విభజనకు కారణమైన పెద్దమ్మ(సోనియా)కే కాదు.. చిన్నమ్మ(సుష్మాస్వరాజ్)కు కూడా దక్కుతుందన్నారు.

విశాఖపట్నంలో రైల్వేజోన్ కోసం జరిగిన నిరసనలో స్థానిక ఎమ్మెల్యే ఒకరు ప్రధాని నరేంద్రమోదీ మాస్కు ధరించిన వ్యక్తిని మహిళలతో చెప్పులతో కొట్టించడం ఎంతవరకు సమంజసం? అని భాజపా ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ ప్రశ్నించారు. పదేళ్లలో చేయాల్సి ఉన్నా మూడున్నరేళ్లలో ఎన్నో చేశామన్నారు. విశాఖపట్నంలో జరిగిన సంఘటనైనా.. విజయవాడలో పోస్టర్లు పెట్టినా వెంటనే తొలగించమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారని మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. తాము ప్రధాని మోదీ, భాజపాకు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. మీరు దిల్లీ వెళ్లి చట్టంలో ఉన్నవే అమలు చేయమని కోరండని సూచించారు. భాజపాకు రాయలసీమపై అంత ప్రేమ ఉంటే బుందేల్‌ఖండ్ తరహాలో నిధులిచ్చి అభివృద్ధి చేయాలని శాసనసభ్యుడు చాంద్‌బాషా అన్నారు. దేశ రెండో రాజధాని, సుప్రీంకోర్టు బెంచి కూడా పెడితే బాగుంటుందని సూచించారు.

సీఆర్‌డీఏ పరిధిలో జీఎస్‌టీ మినహాయింపు

- పంచాయతీలు, మున్సిపాల్టీల సేవలకు వర్తింపు

ఈనాడు, దిల్లీ: సీఆర్‌డీఏ పరిధిలోని పంచాయతీలు, మున్సిపాల్టీలకు రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధీకృతసంస్థ, ప్రభుత్వ సంస్థలు అప్పగించిన సేవలకు జీఎస్‌టీ నుంచి మినహాయింపునిచ్చినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి శివ్‌ప్రతాప్‌శుక్లా తెలిపారు. అమరావతి నిర్మాణం కోసం చేసే ఖర్చుపై పూర్తి జీఎస్‌టీ మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందా అని మంగళవారం రాజ్యసభలో తెదేపా సభ్యుడు టీజీ వెంకటేష్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఏపీసీఆర్‌డీఏ యాక్ట్ కింద ఏర్పాటు చేసిన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థకు ప్రభుత్వ సంస్థ హోదా కల్పించాలని కోరుతూ 2016 డిసెంబర్ 20న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసినట్లు తెలిపారు. దీని సేవలను జీఎస్‌టీ విధానంలో కూడా నెగెటివ్ లిస్ట్ కిందికి తీసుకురావాలని కోరినట్లు చెప్పారు. రాజధాని ప్రాంతంలో మౌలికవసతుల అభివృద్ధి, తయారీ కార్యాకలాపాల్లో పాల్గొనే కంపెనీలు చెల్లించే జీఎస్‌టీలో కేంద్ర ప్రభుత్వ వాటాను పదేళ్లపాటు తిరిగి చెల్లించాలని కూడా కోరినట్లు తెలిపారు. జీఎస్‌టీపై జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక అధికార సంస్థ, ప్రభుత్వ ప్రాధికార సంస్థలు అందించే సేవలను ఏదైనా కార్యకలాప రూపంలోకానీ, ఏదైనా పనికి సంబంధించికానీ పంచాయతీ, మున్సిపాల్టీకి అప్పగిస్తే దానికి జీఎస్‌టీ నుంచి మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. రహదారులు, వంతెనలు, సొరంగాలు, రహదారి రవాణా కోసం టెర్మినల్, మెట్రో, మోనోరైల్, పైప్‌లైన్, నీటిసరఫరా ప్లాంట్లు, నీటిశుద్ధి, మురుగుశుద్ధి, ప్రభుత్వ వర్క్స్ కాంట్రాక్ట్ సేవలకు 12శాతం రాయితీ జీఎస్‌టీ వర్తిస్తుందన్నారు.

బీసీల కోసం మూడేళ్లలో రూ.13 వేల కోట్ల ఖర్చు

- కాంగ్రెస్ పదేళ్లలో పెట్టిన ఖర్చు రూ.7 వేల కోట్లే
- తెదేపాకు కంచుకోటగా బీసీలు
- ముందస్తు బడ్జెట్ సమావేశంలో ముఖ్యమంత్రి

ఈనాడు, అమరావతి: తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నెముక అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లలో బీసీల కోసం రూ.7 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయగా, తమ ప్రభుత్వం మూడేళ్లలో వారి సంక్షేమం కోసం రూ.13 వేల కోట్లు ఖర్చు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకుందని ఆయన అన్నారు. ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌లో మంగళవారం రాత్రి 'బీసీల సంక్షేమం-ముందస్తు బడ్జెట్' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. తెదేపా ఆవిర్భావం నుంచి బీసీలు కంచుకోటగా నిలుస్తున్నారని, సమాజంలో 50 శాతంగా ఉన్న బీసీలకు సంక్షేమ పథకాల్లో అగ్రస్థానం కల్పించామని తెలిపారు. నాయకత్వ పటిమను సమర్థంగా వినియోగించుకుంటే సమాజానికి ఉపయుక్తమని, కాపుల రిజర్వేషన్లను ప్రత్యేక కేటగిరీగా పరిగణించాలని అన్నారు. సమాఖ్యలకు బదులుగా కంపెనీ చట్టం అమలు చేయాలన్న ప్రతిపాదనలు పరిశీలించాల్సి ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. బీసీల్లో వెయ్యి మందిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేలా బడ్జెట్‌లో మెరుగైన పథకాలు, కార్యక్రమాలు తీసుకొస్తామని, ఇందుకోసం తగిన ఆలోచనలు అందిస్తే పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా పలువురు బీసీ నేతలు కేంద్రం వైఖరిపై మండిపడ్డారు. భాజపాపై గట్టిగా పోరాటం చేయాలని, మద్దతు ఉంటుందని ప్రకటించగా, తగిన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటానని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. సమావేశంలో మంత్రి కె.అచ్చెన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీద మస్తాన్‌రావును రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికచేయాలి

నెల్లూరు జిల్లాకు చెందిన బీద మస్తాన్‌రావును తెదేపా రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేయాలని మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నారాయణ, అమర్‌నాథ్‌రెడ్డి, అఖిలప్రియ సహా ఆ జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ముఖ్యమంత్రికి విన్నవించారు.


ముద్దుకృష్ణమకు నివాళి అర్పిస్తున్న చంద్రబాబు

నగరి డిగ్రీ కళాశాలకు ముద్దుకృష్ణమ పేరు

- వేణుగోపాలసాగర్‌కు కూడా..
- గాలి సంతాప తీర్మానంపై చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: చిత్తూరు జిల్లా నగరిలోని డిగ్రీ కళాశాల, పుత్తూరు మండలంలోని వేణుగోపాలసాగర్‌కు దివంగత ఎమ్మెల్సీ గాలి ముద్దుకృష్ణమనాయుడు పేరు పెట్టనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. శాసనమండలిలో మంగళవారం ఎమ్మెల్సీ ముద్దుకృష్ణమనాయుడు మృతికి సంతాపంగా మంత్రి కళా వెంకట్రావు(ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడి తరఫున) సభలో సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..ముద్దుకృష్ణమ సంతాప తీర్మానం సభలో పెట్టాల్సి వస్తుందని ఏనాడూ ఊహించలేదని, ఆయన మృతి చెందినట్లు ఫోన్ రాగానే దిగ్భ్రాంతికి గురయ్యానని, కొంతసేపు నమ్మలేకపోయానని పేర్కొన్నారు. ఒత్తిడి చేసి పనులు చేయించుకునేవారని తెలిపారు. ఆయన ఆత్మకు శాంతికలగాలని కోరుకుంటూ ఆయన కుటుంబానికి ప్రగాఢసానుభూతి తెలిపారు.

★ ముద్దుకృష్ణమ మృతి చెందడానికి ఏడాది, ఏడాదిన్నర ముందు తనని కలిసినప్పుడు ఆయన తీరు చూసి మీ ఆరోగ్యం బాగున్నట్టుగాలేదు అంటే ఆస్పత్రిలో చూపించుకున్నానుగా అని అన్నారని మంత్రి కామినేని శ్రీనివాస్ తెలిపారు. ఏదైనా విద్యా సంస్థకు ఆయన పేరు పెట్టాలని మంత్రి మొదట ప్రతిపాదించారు.

★ గత సమావేశాల్లో డెంగీ, విషజ్వరాలు గురించి మాట్లాడిన వ్యక్తి అదే జ్వరంతో మృతి చెందడం బాధకరమని మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు.

★ పేదల స్వరంగా ముద్దుకృష్ణమకు పేరుందని, ఎవరైనా సమస్యలపై వస్తే వారిని వెంట తీసుకువెళ్లి పనులు చేయించి పెట్టేవారని మంత్రి అమరనాథ్‌రెడ్డి తెలిపారు.

★ దివంగత నాయకుడు ముద్దుకృష్ణమతో తనకు 30ఏళ్ల అనుబంధం ఉందని, ఆయన లెక్చరర్‌గా పాఠాలు చెప్పడమే కాదు.. రాజకీయాల్లోకి వచ్చి తన గురించి చెప్పుకునేలా పని చేశారని మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు.

★ పుత్తూరులో అనేక విద్యాసంస్థలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు.



అపర కుబేరుడు జెఫ్ బెజోస్

ఫోర్బ్స్ ప్రపంచ సంపన్నుల జాబితాలో అగ్రస్థానం
19వ స్థానంలో ముకేశ్ అంబానీ

ప్రపంచ కుబేరుల జాబితాలో అగ్రస్థానాన్ని తొలిసారి అమెజాన్ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) జెఫ్ బెజోస్ అధిరోహించారు. బెజోస్ సంపద 112 బిలియన్ డాలర్ల (సుమారు రూ.7.28 లక్షల కోట్ల) ని 'ఫోర్బ్స్ 2018 వరల్డ్ బిలియనీర్స్' జాబితా వెల్లడించింది. 2017 సంపదతో పోలిస్తే, 39.2 బి.డాలర్ల మేర పెరగడంతో, మంగళవారం వెలువడిన జాబితాలో అగ్రస్థానానికి బెజోస్ చేరారు.



- ✦ గత 24 సంవత్సరాలలో, 18 ఏళ్ల పాటు అగ్రస్థానంలో ఉన్న మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్ రెండోస్థానానికి పడిపోయారు.
- ✦ ఈ ఏడాది జాబితాలోని కుబేరుల సంపద మొత్తం విలువ 9.1 లక్షల కోట్ల డాలర్లు (సుమారు రూ.591.5 లక్షల కోట్లు). 2017లో ఈ మొత్తం 7.7 లక్షల కోట్ల డాలర్లు. ప్రపంచ కుబేరుల సగటు సంపద మొత్తం 4.1 బి.డాలర్లుగా ఫోర్బ్స్ పేర్కొంది.

భారత్‌కు సంబంధించి..

ఈ జాబితాలో భారతీయులు 119 మంది చోటు సాధించారు. ఇందులో 18 మంది కొత్త వారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ 40.1 బి.డాలర్ల (సుమారు రూ.2.60 లక్షల కోట్ల) సంపదతో మొత్తం జాబితాలో 19వ స్థానంలో ఉన్నారు. దేశీయుల్లో ఈయనదే అగ్రస్థానం. ఈయన తరవాత స్థానాల్లో అజీమ్ ప్రేమ్‌జీ (18.8 బి.డాలర్లు, 58వ స్థానం), లక్ష్మీ మిత్తల్ (18.5 బి.డాలర్లు, 62వ స్థానం), శివ్ నాడార్ (14.6 బి.డాలర్లు, 98వ స్థానం), దిలీప్ సంఘ్వి (12.8 బి.డాలర్లు, 115వ స్థానం) ఉన్నారు.

✦ భారత్‌కే చెందిన రామ్‌దియో అగర్వాల్ (2124వ స్థానం), తరంగ్ జైన్, నిర్మల్ మిందా, రవీంద్ర కిశోర్ సిన్హాల సంపద విలువ తలా బిలియన్ డాలర్ల మేర ఉంది.

స్టాక్ విలువ ఆధారంగానే..

2018 ఫిబ్రవరి 9 నాటి స్టాక్ విలువలు, ఎక్స్ఛేంజ్ రేట్ల ఆధారంగా ఈ జాబితా రూపొందించినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. మొత్తం 2,208 మంది ఈ జాబితాలో ఉన్నారు. సంపన్నులు మరింత సంపన్నులు అవుతున్నారని సంస్థ తెలిపింది.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు 766వ స్థానం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ 3.1 బి.డాలర్ల సంపదతో 766వ స్థానం పొందారు. 2017లో ఈయన స్థానం 544. మిడ్‌టౌన్ మన్‌హటన్ స్థిరాస్తి విలువలు, గోల్ఫ్ ఆస్తుల నుంచి ఆదాయాలు తగ్గడం వల్ల, అప్పటితో పోలిస్తే, ట్రంప్ సంపద 400 మిలియన్ డాలర్లు తగ్గింది.

తొలగింపుల జాబితాలో నీరవ్ మోదీ

ఈ జాబితా నుంచి వైదొలగిన వారిలో భారత వజ్రాభరణాల వ్యాపారి నీరవ్ మోదీ, పాపా జోన్స్ పిజ్జా వ్యవస్థాపకుడు జాన్ ష్నాటర్, సౌదీ అరేబియా రాకుమారుడు ఆల్వాలీద్ బిన్ తలాల్ అల్‌సాద్ ఉన్నారు.



రామ్ ప్రసాద్

ఇద్దరు తెలుగు వారు..

అరబిందో ఫార్మా సహ వ్యవస్థాపకుడు పీవీ రామ్‌ప్రసాద్ రెడ్డి (2.5 బి.డాలర్లతో 965వ స్థానం), దివీస్ ఛైర్మన్ దివి మురళి (2.3 బి.డాలర్లతో 1070వ స్థానం) పొందారు.



మురళి

పెద్దల పాస్‌పోర్ట్ వివరాలు వదలొద్దు

● 45 రోజుల్లోగా సేకరించండి ● బ్యాంకులకు ఆర్థిక శాఖ ఆదేశాలు



దిల్లీ

రూ.50 కోట్ల కంటే ఎక్కువ రుణాలు తీసుకున్న అందరి పాస్‌పోర్ట్ వివరాలను సేకరించాలని ప్రభుత్వ రంగ బ్యాంకులకు ఆర్థిక శాఖ ఆదేశాలు జారీ చేసింది. నీరవ్ మోదీ, విజయ్ మాల్యా వంటి వారు దేశం నుంచి వెలుపలికి వెళ్లినట్టు.. ఇతరులు వెళ్లకుండా చేయడం కోసం 45 రోజుల్లోగా సమాచారాన్ని సేకరించాలని చెప్పినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఒక వేళ రుణ స్వీకర్తకు పాస్‌పోర్ట్ లేకపోతే.. ఆ వ్యక్తి నుంచి ఆ మేరకు పాస్ట్‌పోర్ట్ లేనట్లుగా ఒక లిఖితపూర్వక లేఖను తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. అదే విధంగా రుణ దరఖాస్తుల్లో పాస్‌పోర్ట్ వివరాలను పొందుపరచాలనీ ఆదేశాలు జారీ అయ్యాయని తెలుస్తోంది. పాస్‌పోర్ట్ వివరాల ద్వారా సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి వారు దేశం వదిలి పారిపోకుండా చూసుకోవచ్చన్నది ఆ శాఖ భావనగా ఉంది. నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీ, విజయ్ మాల్యా, జతిన్ మెహతా వంటి ఎగవేతదార్లు దేశం బయటకు వెళ్లి రుణ రికవరీ ప్రక్రియలను సంక్లిష్టం చేసిన సంగతి తెలిసిందే.

ఆ చట్టంతో వీరి ఆట కట్టు: నీరవ్ మోదీ మోసం నేపథ్యంలో గత వారం కేంద్రం ఆమోదించిన ఫుజిటివ్ ఎకనమిక్ అఫెండర్స్ బిల్(ఆర్థిక నేరాల బిల్లు)ను ఆయుధంగా చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశం వదిలి వెళ్లిన మోసగాళ్లు, రుణ ఎగవేతదార్ల అందరి ఆస్తులను జప్తు చేసే అధికారం ఈ బిల్లు ఇస్తుంది. అదే సమయంలో ఆడిటర్లపై స్వతంత్ర నియంత్రణ సంస్థగా నేషనల్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ అథారిటీ(ఎన్ఎఫ్ఆర్ఏ)ని ఏర్పాటు చేయడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలిపింది కూడా.



గంటన్నరలో కొంప కొల్లేరు..

ముంచిన బ్యాంకింగ్ షేర్లు

● చందాకొచ్చర్, శిఖాశర్మలకు సమన్లు నేపథ్యం
● కీలక స్థాయిల దిగువకు సూచీలు ● కొనసాగిన ఎఫ్ఐఐల అమ్మకాలు
● ఆజ్యం పోసిన రూపాయి క్షీణత ● 5 రోజుల్లో రూ.4.30 లక్షల కోట్లు ఆవిరి

అయిదో రోజూ మదుపరికి ఏడుపే మిగిలింది. వరుస నష్టాల నుంచి పుంజుకుంటుందేమోనని భావించిన మార్కెట్ మళ్లీ నిరాశపరచింది. ఆరంభంలో మంచి దూకుడు మీద కనిపించి.. ఈసారి పెరుగుతున్నట్లే అనిపించింది. అయితే చివరి గంటన్నర ట్రేడింగ్ ఆ ఆనందాన్ని ఒక్కసారిగా ఎగరేసుకుపోయింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణంలో చందాకొచ్చర్, శిఖా శర్మలకు ఎస్ఎఫ్ఐఓ సమన్లు జారీ చేసిందన్న వార్తల నేపథ్యంలో బ్యాంకింగ్ షేర్లు కుప్పకూలాయి. ఫలితంగా సెన్సెక్స్, నిఫ్టీ రెండూ కీలక మద్దతు స్థాయిలను కోల్పోవడం గమనార్హం. ఎఫ్ఐఐలు స్థిరంగా అమ్మకాలు కొనసాగించగా, రూపాయి క్షీణత ఇందుకు తోడైంది. సూచీల వరుస నష్టాల నేపథ్యంలో మదుపర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ 145.75 లక్షల కోట్ల నుంచి రూ.144.20 లక్షల కోట్లకు చేరింది. గత అయిదు సెషన్లలో రూ.4.30 లక్షల కోట్ల సంపద ఆవిరైంది. ఆసియా షేర్లు రాణించగా, ఐరోపా మార్కెట్లు మెరుగ్గా ట్రేడయ్యాయి.

సానుకూల ఆసియా సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 34047.43 పాయింట్ల వద్ద భారీ లాభాల్లో ప్రారంభమైంది. అదే జోరులో 34,060.13 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. అయితే ఆఖరి గంటన్నర ట్రేడింగ్‌లో అమ్మకాలు వెల్లువెత్తడంతో సూచీ నష్టాల్లోకి జారిపోయింది. ఒకానొకదశలో 33,209.76 పాయింట్లకు పడిపోయిన సెన్సెక్స్.. చివరకు 429.58 పాయింట్ల నష్టంతో 33,317.20 దగ్గర స్థిరపడింది. డిసెంబరు 14 తర్వాత సూచీకిదే కనిష్ఠ స్థాయి కావడం గమనార్హం. గత అయిదు సెషన్లలో సూచీ 1,129 పాయింట్లు కోల్పోయింది. ఇక నిఫ్టీ సైతం 109.60 పాయింట్ల నష్టంతో 10,249.25 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,215.90- 10,441.35 పాయింట్ల మధ్య కదలాడింది.

బ్యాంకింగ్ షేర్లు బెంబేలెత్తాయి. చందా కొచ్చర్, శిఖా శర్మలకు ఎస్ఎఫ్ఐఓ సమన్లు జారీ చేసినట్లు వార్తల నేపథ్యంలో ఇండియన్ బ్యాంక్ 5.02%, కెనరా బ్యాంక్ 4.40%, ఎస్‌బీఐ 2.77%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.64%, బ్యాంక్ ఆఫ్ బరోడా 2.45%, పంజాబ్ నేషనల్ బ్యాంక్ 2.30%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.53%, యాక్సిస్ బ్యాంక్ 1.31%, ఫెడరల్ బ్యాంక్ 1.08%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.07% చొప్పున నష్టాలు నమోదు చేశాయి. బ్యాంక్ నిఫ్టీ 370 పాయింట్లు కోల్పోయి 24,448 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 26 నష్టాలు చవిచూశాయి. సన్‌ఫార్మా 2.95%, ఎం అండ్ ఎం 2.52%, మారుతీ సుజుకీ 2.05%, టీసీఎస్ 1.76%, భారతీ ఎయిర్‌టెల్ 1.75%, పవర్‌గ్రిడ్ 1.62%, హెచ్‌డీఎఫ్‌సీ 1.59%, టాటా మోటార్స్ 1.58%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.53%, విప్రో 1.51%, ఐటీసీ 1.44% చొప్పున డీలా పడిన వాటిలో ఉన్నాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.21%, టాటా స్టీల్ 0.79%లు మాత్రం రాణించాయి.

మోసం విలువ

రూ.13,000 కోట్ల పైమాటే!

పంజాబ్ నేషనల్ బ్యాంక్ కుంభకోణం విలువ రూ.13,000 కోట్ల కంటే ఎక్కువగానే ఉండొచ్చని తెలుస్తోంది. పీఎన్‌బీ వర్గాలు, కోర్టు పత్రాల ఆధారంగా వార్తా సంస్థ రాయిటర్స్ ఆ విధమైన అంచనాకు వచ్చింది. పీఎన్‌బీ ఉద్యోగులు జారీ చేసిన రుణ హామీ పత్రాలను దర్యాప్తు సంస్థలు ఇంకా పూర్తిగా సేకరించలేదని సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆ విలువ ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

యాక్సిస్, ఐసీఐసీఐ అధికారులను విచారించిన ఎస్ఎఫ్ఐఓ

● పీఎన్‌బీ దర్యాప్తులో భాగంగానే ● కొచ్చర్, శిఖాలకు నోటీసులంటూ వార్తలు ● వివరణ కోరిన స్టాక్ ఎక్స్ఛేంజీలు

ముంబయి: యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్‌లకు చెందిన సీనియర్ అధికారులు తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం(ఎస్ఎఫ్ఐఓ) ఎదుట మంగళవారం హాజరయ్యారు. నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీలకు చెందిన కంపెనీలకు రుణాలిచ్చిన బ్యాంకుల నుంచి ఎస్ఎఫ్ఐఓ వివరాలను సేకరిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగానే యాక్సిస్ బ్యాంక్ ప్రతినిధులను విచారణకు పిలిచినట్లు తెలుస్తోంది. దీంతో యాక్సిస్ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ వి. శ్రీనివాసన్ నేతృత్వంలోని ఇతర అధికారులు ఇక్కడి ఎస్ఎఫ్ఐఓ కార్యాలయానికి వెళ్లినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. నీరవ్ మోదీకి చెందిన కొన్ని కంపెనీలు, ఛోక్సీకి చెందిన గీతాంజలి జెమ్స్ వంటి సంస్థలతో బ్యాంకు జరిపిన లావాదేవీల గురించి రెండు గంటల పాటు విచారించి.. ఎస్ఎఫ్ఐఓ వివరాలు రాబట్టినట్లు తెలుస్తోంది. ఐసీఐసీఐ బ్యాంకు వంటి ఇతర బ్యాంకు అధికారులను సైతం కార్యాలయానికి పిలిపించినట్లు సమాచారం.

30కి పైగా బ్యాంకులకు లేఖలు: కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఎస్ఎఫ్ఐఓ 30కి పైగా బ్యాంకులకు (పీఎన్‌బీ కుంభకోణంతో సంబంధమున్న బ్యాంకులు) లేఖలు రాసినట్లు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

గీతాంజలికి రూ.6,800 కోట్ల ఐసీఐసీఐ రుణం: గీతాంజలి జెమ్స్‌కు నేరుగా యాక్సిస్ బ్యాంక్ ఎటువంటి రుణాలు ఇవ్వలేదు. కానీ పీఎన్‌బీ అధికారులు ఇచ్చిన మోసపూరిత లెటర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్(ఎల్ఓయూలు) ద్వారా డబ్బులు ఇచ్చిన వివిధ బ్యాంకులకు చెందిన విదేశీ శాఖల్లో యాక్సిస్ బ్యాంకుకు చెందిన శాఖ కూడా ఉంది. ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం తన ఆధ్వర్యంలోని 31 బ్యాంకుల కన్సార్షియం ద్వారా రూ.6,800 కోట్ల రుణాన్ని గీతాంజలి జెమ్స్‌కు ఇచ్చింది. నీరవ్ మోదీకి సంబంధించిన కంపెనీలకు ఎటువంటి రుణాలనూ ఐసీఐసీఐ ఇవ్వలేదు.

నేడు ఎస్ఎఫ్ఐఓ ముందుకు పీఎన్‌బీ ఎండీ!: పీఎన్‌బీ ఎండీ , సీఈఓ సునీల్ మెహతా నేడు తీవ్ర రుణాల దర్యాప్తు కార్యాలయం (ఎస్ఎఫ్ఐఓ) ఎదుట హజరయ్యే అవకాశం ఉంది.



వివరణ ఇవ్వండి: ఎక్స్ఛేంజీలు

ఐసీఐసీఐ బ్యాంక్ ఎండీ, సీఈఓ చందాకొచ్చర్, యాక్సిస్ బ్యాంక్ సీఈఓ శిఖా శర్మలకు పీఎన్‌బీ కేసులో ఎస్ఎఫ్ఐఓ నుంచి సమన్లు అందాయని వచ్చిన మీడియా వార్తల నేపథ్యంలో స్టాక్ ఎక్స్ఛేంజీలు వారి నుంచి వివరణ కోరినట్లు సమాచారం. ఈ వార్తల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లలో బ్యాంకింగ్ షేర్లు కుదేలుకావడం గమనార్హం. మంగళవారం మార్కెట్ నష్టాలకు ఇవి కారణమయ్యాయి.



దిల్లీ హైకోర్టుకు నీరవ్ కంపెనీ

పీఎన్‌బీ కుంభకోణానికి సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దాఖలు చేసిన మనీలాండరింగ్ కేసును సవాలు చేస్తూ నీరవ్ మోదీకి చెందిన కంపెనీ ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ దిల్లీ హైకోర్టుకు వెళ్లింది. సోదా వారెంట్లకు సంబంధించిన కాపీని ఆర్థిక శాఖ, ఈడీల ద్వారా తమకు ఇప్పించాల్సిందిగా ఆదేశాలు జారీ చేయాలని కోర్టును కోరింది. సీబీఐ తొలి సమాచార నివేదిక(ఎఫ్ఐఆర్) ఆధారంగా నీరవ్ మోదీ, ఇతరులపై మనీలాండరింగ్ కేసును ఈడీ నమోదు చేసిన సంగతి తెలిసిందే. కాగా, 'చరాస్థులను తీసుకు వెళ్లి.. పీఎన్‌బీ బ్యాంకులో డిపాజిట్ చేసిన ఈడీ చర్యలను రద్దు చేయాల'ని అందులో విజ్ఞప్తి చేసింది.



భవిష్యత్‌లో పీఎన్‌బీ రాణిస్తుంది: జైట్లీ

ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)పై ఆశావహ దృక్పథాన్ని ప్రదర్శించారు. భవిష్యత్‌లో మంచి పనితీరును ప్రదర్శించడానికి ఆ బ్యాంకు సిద్ధంగా ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'పీఎన్‌బీకి బలమైన మూలాలున్నాయి. మంచి వృద్ధిని ప్రదర్శించగలదు. అందువల్ల స్థిరమైన పనితీరుకు అవకాశం ఉంది. పోను పోను సానుకూల సెంటిమెంటును పొందుతుంది. మార్కెట్ విలువను పెంచుకుంటుంద'ని రాజ్యసభకిచ్చిన ఒక రాతపూర్వక సమాధానంలో ఆయన వివరించారు. పీఎన్‌బీ షేరు ఫిబ్రవరి 14 నుంచి ఫిబ్రవరి 26 మధ్య 23.25 శాతం కోల్పోయిందని ఆయన వివరించారు. ఫిబ్రవరి 14నే ఆ బ్యాంకు ఎక్స్ఛేంజీలకు కుంభకోణం గురించి వివరాలిచ్చిన సంగతి తెలిసిందే. పీఎన్‌బీ వ్యయం, ఆదాయ నిష్పత్తి తక్కువగా ఉందని, కేటాయింపుల కవరేజీ నిష్పత్తి బాగుందని, మొండి బకాయిల నిష్పత్తి స్థిరీకరణకు గురి అవుతుందని ఆ సమాధానంలో చెప్పుకొచ్చారు. ప్రధానేతర ఆస్తులను విక్రయించుకోవడం ద్వారా మూలధనాన్ని సమీకరించుకోవడానికి ఎక్కువ అవకాశాలున్న నేపథ్యంలో బ్యాంకుకు అధిక వృద్ధి సాధ్యమవుతుందని జైట్లీ తెలిపారు.

భారత్‌లోకి శామ్‌సంగ్ ఎస్9, ఎస్9+

● ధర రూ.57,900 నుంచి
● 16 నుంచి అమ్మకాలు



దిల్లీ: దక్షిణ కొరియా దిగ్గజం శాంసంగ్ తన గెలాక్సీ శ్రేణిలో ఎస్9, ఎస్9+ ఫోన్లను భారత విపణిలోకి ప్రవేశపెట్టింది. తద్వారా దేశీయ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ విభాగంలో తమ స్థానాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని కంపెనీ భావిస్తోంది. గెలాక్సీ ఎస్9, గెలాక్సీ ఎస్9+ ప్లస్ (64జీబీ వేరియంట్లు) ధరలు వరుసగా రూ.57,900, రూ.64,900గా ఉన్నాయి. ఇక 256 జీబీ వేరియంట్ల ధర రూ.65,900, రూ.72,900గా కంపెనీ నిర్ణయించింది. కొద్ది రోజుల కిందట జరిగిన బార్సిలోనా మొబైల్ కాంగ్రెస్‌లో కంపెనీ వీటిని తొలి సారిగా ప్రదర్శించిన విషయం తెలిసిందే. డ్యూయల్ అపెర్చర్, స్లోమోషన్ వీడియో, డాల్బీ అట్‌మాస్ వీటియోలు, ఏఆర్ ఎమోజీలు వంటి ప్రత్యేకతలు ఇందులో ఉన్నాయి. యాపిల్ ఐఫోన్ ఎక్స్, గూగుల్ పిక్సెల్ 2 సిరీస్ మొబైళ్లతో ఇవి పోటీపడే అవకాశం ఉంది. 'ఎస్8 భారత్‌లో రికార్డు విక్రయాలు నమోదు చేసింది. ఇప్పుడు అధునాతన సదుపాయాలతో ఎస్9, ఎస్9+లను తీసుకొస్తున్నాం. ప్రీమియం విభాగంలో మాకు 58 శాతం మార్కెట్ వాటా ఉంది. తాజా మొబైళ్లతో మరింత బలోపేతం చేసుకోనున్నాం' అని శామ్‌సంగ్ ఇండియా సీనియర్ ఉపాధ్యక్షుడు ఆసిమ్ వార్సి పేర్కొన్నారు. కొత్త మొబైళ్లు పూర్తిగా భారత్‌లోనే తయారు చేసినట్లు వివరించారు. కొత్త ఫోన్ల కోసం రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌తో జట్టు కట్టినట్లు వివరించారు.

	ఎస్9	ఎస్9+
తెర	5.8 అంగుళాలు	6.2 అంగుళాలు
ప్రాసెసర్	క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 845	క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 845
ర్యామ్	4 జీబీ	6 జీబీ
వెనుక కెమేరా	12 మెగాపిక్సెల్	12 మెగాపిక్సెల్
ముందు కెమేరా	8 మెగాపిక్సెల్	12 మెగాపిక్సెల్
పిక్సెల్ రిజల్యూషన్	1440x2960	1440x2960
ఆపరేటింగ్ సిస్టమ్	ఆండ్రాయిడ్ 8.0	ఆండ్రాయిడ్ 8.0
స్టోరేజ్	64/128/256 జీబీ	64/128/256 జీబీ
విస్తరణ సామర్థ్యం	400 జీబీ	400 జీబీ
బ్యాటరీ సామర్థ్యం	3000 ఎంఏహెచ్	3,500 ఎంఏహెచ్



సుజుకీ కొత్త జిక్సర్, జిక్సర్ ఎఫ్

ధర రూ.80,928, రూ.90,037

దిల్లీ: సుజుకీ మోటార్ కార్ప్ అనుబంధ సంస్థ సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా తమ దిగ్గజ మోటార్‌సైకిళ్లు జిక్సర్, జిక్సర్ ఎస్ఎఫ్ మోడళ్లలో 2018 వెర్షన్లను విపణిలోకి విడుదల చేసింది. వీటి ధరలు వరుసగా రూ.80,928, రూ.90,037 (ఎక్స్-షోరూమ్ దిల్లీ). అల్ట్రా లైట్ 155 సీసీ ఇంజిన్ కలిగిన ఈ రెండు బైకులు సుజుకీకి చెందిన ఎకో పెర్ఫార్మెన్స్ (ఎస్ఈపీ) టెక్నాలజీతో తయారు చేసినట్లు కంపెనీ వెల్లడించింది. జిక్సర్ బ్రాండ్‌ను కంపెనీ తొలిసారిగా 2014లో విడుదల చేసింది. అద్భుతమైన ప్రయాణ అనుభూతి కోరుకునేవారికి జిక్సర్ మంచి ఎంపికని, 2018 సిరీస్ యువతను మెప్పించే విధంగా ఉంటుందని సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు (అమ్మకాలు, మార్కెటింగ్) సంజీవ్ రాజశేఖరన్ తెలిపారు. 2018 సిరీస్ జిక్సర్, జిక్సర్ ఎఫ్‌ల విక్రయాలు ప్రారంభమయ్యాయని, దేశవ్యాప్తంగా కంపెనీ విక్రయశాలల్లో అందుబాటులోకి తీసుకొచ్చామని కంపెనీ తెలిపింది.

సెన్సెక్స్ ▼ 430 **33317**

నిఫ్టీ ▼ 110 **10249**

డోజోన్స్ 24920 ▲ 43 | నాస్‌డాక్ 7365 ▲ 36

అమెరికా కాలమానం ప్రకారం సోమవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 64.96 ▲ (ఒక అమెరికా డాలరుకు) 16 పైసలు

ముడి చమురు 65.82 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ఘనం (+)

నిఫ్టీ	6న	మార్పు %
BPCL	445.20	2.51
ZEE ENTERTAINMENT	559.50	1.39
ULTRATECH CEM	4150.30	1.34
INDUSIND BANK	1710.30	1.25
AUROBINDO PHA	606.20	0.91
CIPLA	584.10	0.84
INDIAN OIL CORP	382.20	0.78


గ్రహణం (-)


నిఫ్టీ	6న	మార్పు %
SUN PHARMA	531.75	-3.06
ICICI BANK	295.05	-2.74
M & M	719.90	-2.66
SBI	256.55	-2.64
UPL	702.40	-2.57
AMBUJA CEMENTS	240.65	-2.21
TECH MAHINDRA	617.25	-2.16

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.10	68.53
పౌండ్ స్టెర్లింగ్	81.81	94.90
యూరో	72.96	84.61
జపనీస్ యెన్/100	55.54	64.43
ఆస్ట్రేలియా డాలరు	45.97	53.19
సింగపూర్ డాలరు	44.84	53.11
థాయ్ బాత్/100	188.33	225.18
బ్రహెయిన్ దీనార్	160.04	183.40
కువైట్ దీనార్	179.12	223.06
సౌదీ రియాల్	15.72	18.62
యూఏఈ దిర్హమ్	16.09	18.81
మలేషియా రింగిట్	14.82	18.22
చైనీస్ యువాన్	7.24	11.76





20 ఏళ్లు 8-9 శాతం వృద్ధి

- అప్పుడే పేదరిక నిర్మూలన సాధ్యం
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రంగరాజన్



హైదరాబాద్: పేదరికం, ఆరోగ్య సంరక్షణ, ఇతర సమస్యలు పరిష్కారం కావాలంటే.. మరో రెండు దశాబ్దాల పాటు భారత్ ఆర్థిక వ్యవస్థ 8-9 శాతం చొప్పున వృద్ధి చెందాల్సిన అవసరం ఉందని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నరు సి.రంగరాజన్ అన్నారు. సమాజంలోని నిరుపేద వర్గాల ప్రయోజనాలకు భంగం కలగకుండా వృద్ధి రేటు ఉండాలని సూచించారు. డీమ్డ్ విశ్వ విద్యాలయం ఇక్ఫాయ్ ఫౌండేషన్ ఫర్ హైయర్ ఎడ్యుకేషన్ (ఐఎఫ్‌హెచ్‌ఈ) ఎనిమిదో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా 'హెల్త్ అండ్ డెవలప్‌మెంట్: కెన్ ఇండియా బ్రిడ్జ్ ద డిస్కనెక్ట్' అనే అంశంపై ఉపన్యాసాన్ని నిర్వహించింది. ఈ అంశంపై భారత ప్రజా ఆరోగ్య ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీనాథ్ రెడ్డి మాట్లాడారు. ఐఎఫ్‌హెచ్‌ఈ ఛాన్సలర్ అయిన రంగరాజన్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధిరేటుపై మాట్లాడారు. దక్షిణ కొరియా మూడు దశాబ్దాల పాటు 7-8 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని, పేదరికం, ఇతర సమస్యలను తొలగించడంలో విజయం సాధించిందని రంగరాజన్ అన్నారు. మెరుగైన విద్యా, వైద్య సౌకర్యాలను కల్పిస్తోందని వివరించారు. పారిశ్రామిక దేశాల్లో ముందు వృద్ధి చోటు చేసుకుందని.. ఆ తర్వాత సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించారని అన్నారు.

అంతర్గత దర్యాప్తు చేయండి

వాట్సాప్‌లో ఫలితాల లీక్‌పై టాటా మోటార్స్‌కు సెబీ ఆదేశం

దిల్లీ: వాట్సాప్ ద్వారా త్రైమాసిక ఫలితాల వివరాలు ముందుగానే బయటకు రావడంపై అంతర్గతంగా దర్యాప్తు నిర్వహించాలని టాటా మోటార్స్‌కు సెబీ ఆదేశించింది. వాట్సాప్ లీకేజీ వ్యవహారంపై సెబీ ఆదేశాలు జారీ చేసిన మూడో కంపెనీ ఇదే. ఇంతకుముందు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లకు కూడా సెబీ నుంచి ఇదే తరహా ఆదేశాలు వచ్చాయి. 'టాటా మోటార్స్ అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలను ఫిబ్రవరి 9 లేదా ఆ లోపే ఖరారు చేసింది. అయితే వాట్సాప్ ద్వారా ఇవి 11వ తేదీన బయటకు వచ్చాయి. అంటే వాట్సప్‌లో లీక్ అవడానికి ముందే ఫలితాలను కంపెనీ ఖరారు చేసిన విషయం ప్రాథమికంగా తెలుస్తోంద'ని ఆదేశాల్లో సెబీ పేర్కొంది. అంతేకాకుండా వాట్సాప్‌లో లీకైన ఫలితాల గణంకాలు, ఆ తర్వాత టాటా మోటార్స్ ప్రకటించిన ఫలితాల గణంకాలు ఒకేలా ఉన్నట్లు గుర్తించామని తెలిపింది. అందువల్ల అంతర్గత దర్యాప్తు నిర్వహించి, ఫలితాలు ముందుగానే బయటకు రావడంలో హస్తం ఉన్న అధికారులను కనుగొనాల్సిందిగా కంపెనీకి మూడు నెలల గడువును సెబీ ఇచ్చింది. అలాగే భవిష్యత్‌లో ఇలాంటి పరిణామాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాల్సిందిగా కూడా టాటా మోటార్స్‌కు సూచించింది.

మళ్లీ విమానాల పండగ

- హైదరాబాద్‌లో 8 నుంచి 'వింగ్స్ ఇండియా 2018' • 10 దేశాల నుంచి ప్రతినిధులు
- 125 కంపెనీల ఉత్పత్తుల ప్రదర్శన • ప్రారంభోత్సవానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్

International Exhibition & Conference on Civil Aviation
WINGS INDIA 2018
March 8-11, 2018
Begumpet Airport, Hyderabad, India

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లో ప్రతి రెండేళ్లకు ఒక సారి జరిగే పౌర విమానయాన, ఏరోస్పేస్ సదస్సు, ప్రదర్శన ఈనెల 8-11 తేదీల్లో బేగంపేట విమానాశ్రయంలో జరగనుంది. 'వింగ్స్ ఇండియా 2018'ను మార్చి 8న తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు (కేసీఆర్), కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పి.అశోక్ గజపతి రాజు ప్రారంభిస్తారు. మొదటి రెండు రోజులు కంపెనీల ప్రతినిధుల ప్రవేశానికి మాత్రమే అనుమతి ఉంటుంది. శని, ఆదివారాలు సాధారణ సందర్శకులను అనుమతిస్తారు. కేంద్ర విమానయాన మంత్రిత్వ శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) సంయుక్తంగా నిర్వహిస్తోంది. 'భారత్ ప్రపంచ విమానయాన పరిశ్రమకు కేంద్రం' అనే ప్రధాన ఉద్దేశంతో దీన్ని నిర్వహిస్తున్నారు. ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడం ద్వారా సాధారణ ప్రజలు కూడా విమానయానం చేయాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కలలను సాకారం చేయడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై 'వింగ్స్ ఇండియా 2018'లో దృష్టి కేంద్రీకరిస్తారు. కంపెనీల మధ్య చర్చలు, పెట్టుబడుల ప్రతిపాదనలు, రాష్ట్రాలు, వివిధ పట్టణాల మధ్య విమాన అనుసంధానానికి దేశ, విదేశీ విమానయాన కంపెనీల మధ్య చర్చలకు ఈ సదస్సు వేదిక కానుందని ఫిక్కీ తెలిపింది. ప్రపంచ విమానయాన రంగంలోని భాగస్వాములు భారత్‌లో పెట్టుబడులు అవకాశాలను పరిశీలించగలరని పేర్కొంది. ప్రదర్శన, సదస్సుతోపాటు వింగ్స్ ఇండియా అవార్డులను ప్రదానం చేస్తారు. పర్యాటకం, కార్గో, , లాజిస్టిక్స్, నైపుణ్యాలు తదితర అంశాలపై ప్రత్యేక చర్చలు జరుగుతాయి. వ్యాపార ప్రతిపాదనల సమావేశాలు జరుగుతాయి. సీఈఓల ఫోరమ్‌ను నిర్వహిస్తారు.



15 విమానాల ప్రదర్శన

విమానాల తయారీ, యంత్ర పరికరాలు, విమానయాన రంగంలో సేవలను అందించే కంపనీలు, ఎయిర్‌కార్గో, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాల అభివృద్ధి, శిక్షణ తదితర విభాగాలకు చెందిన కంపెనీలు ఈ ప్రదర్శనలో పాలుపంచుకోనున్నాయి. అమెరికా, జపాన్, యూకే, రష్యా, సింగపూర్ సహా 10 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కానున్నారు. దాదాపు 125 కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయి. ఏటీఆర్, హోండా, ట్రూజెట్, గల్ఫ్‌స్ట్రీమ్, బోయింగ్, ఎంబ్రార్, డసాల్ట్ తదితర కంపెనీలు తమ విమానాలను ప్రదర్శనకు ఉంచుతాయి.

బోయింగ్ విమానాలు ప్రత్యేక ఆకర్షణ

బోయింగ్ కంపెనీ తన సరికొత్త విమానాలను ప్రదర్శనకు ఉంచనుంది. 737 మ్యాక్స్, 787 డ్రీమ్‌లైనర్, 777ఎక్స్ విమానాలను ప్రదర్శనకు తీసుకురానున్నట్లు బోయింగ్ వెల్లడించింది. 'ప్రపంచంలోనే అత్యంత వేగంగా భారత్ విమానయాన రంగం వృద్ధి చెందుతోంది. ఈ సారి ప్రదర్శనలో ఇంధన ఆదా చేసే విమానాలను ప్రదర్శించనున్నాం' అని బోయింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఆసియా, పసిఫిక్), భారత అమ్మకాలు దినేశ్ కేల్కర్ అన్నారు.

రూ.2,500 కోట్లకు

బంధన్ బ్యాంకు ఇష్యూ!

దిల్లీ: ప్రైవేటు రంగంలోని బంధన్ బ్యాంకు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు వచ్చేందుకు మార్గం సుగమమైంది. సంస్థ ఐపీఓకు సెబీ ఆమోదం లభించింది. ఈ ఇష్యూ ద్వారా దాదాపు రూ.2,500 కోట్ల నిధులను సమీకరించాలని బ్యాంకు భావిస్తోంది. కోల్‌కతా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న బంధన్ బ్యాంకు జనవరి 1న ఐపీఓకు సంబంధించిన ముసాయిదా పత్రాలను సెబీకి సమర్పించింది. ఫిబ్రవరి 28న సెబీ పరిశీలనలు పూర్తయి తాజాగా ఐపీఓకు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. బంధన్ బ్యాంకు ముసాయిదా పత్రాల్లో అందించిన వివరాల ప్రకారం ఐపీఓ ద్వారా 9,76,63,910 షేర్లను జారీ చేయబోతున్నారు. 1,40,50,780 షేర్లను ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఎఫ్‌సీ), 75,65,804 షేర్లను ఐఎఫ్‌సీ ఎఫ్‌ఐజీ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీలు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించబోతున్నాయి.

హెచ్‌ఎంటీ రాకెట్ యంత్ర పరికరాలు

హైదరాబాద్ (కుత్బుల్లాపూర్), న్యూస్‌టుడే: రాకెట్ తయారీలో వినియోగించే త్రీయాక్సిస్ వర్టికల్ ఫేసింగ్ మిల్లింగ్ యంత్ర పరికరాన్ని ఉత్పత్తి చేసి హైదరాబాద్ హెచ్‌ఎంటీ యంత్ర పరికరాల విభాగం చరిత్ర సృష్టించిదని హెచ్‌ఎంటీ కంపెనీస్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.గిరీష్‌కుమార్ అన్నారు. హైదరాబాద్ హెచ్‌ఎంటీ యంత్ర పరికరాల విభాగంలో మొదటి సారి తయారు చేసిన రూ.18 కోట్ల విలువచేసే ఈ యంత్ర పరికరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి ఇస్రో డైరెక్టర్ బాలమురళికి అందజేశారు. ఈ పరికరం పనితీరును సమీక్షించి ఇస్రో సంస్థ రూ.36 కోట్ల విలువచేసే మరో రెండు యంత్ర పరికరాలను తయారు చేయడానికి హైదరాబాద్ హెచ్‌ఎంటీకే ఆర్డర్లు ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. ప్రస్తుతం హెచ్‌ఎంటీలో రూ.70 కోట్ల విలువచేసే ఉత్పత్తులకు ఆర్డర్లున్నాయని, వచ్చే ఏడాది రూ. 100 కోట్ల ఉత్పత్తులను లక్ష్యంగా పెట్టుకుని ముందుకు పోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ పరికరాన్ని తయారు చేయడానికి డిజైన్ రూపొందించిన కంపెనీ జేజీఎం బీవీఎస్ ప్రసాద్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంటీ జీఎం రాజేందర్, జేజీఎంలు హరిప్రసాద్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి

రూ.10,000 కోట్లు!

డివిడెండు చెల్లించనున్న ఆర్‌బీఐ

దిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కేంద్ర ప్రభుత్వానికి ఈ నెలలో రూ.10,000 కోట్ల మధ్యంతర డివిడెండును చెల్లించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఆర్‌బీఐ నుంచి మొత్తం రూ.45,000 కోట్ల డివిడెండును ప్రభుత్వం ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. డివిడెండు చెల్లింపు విషయంలో ప్రభుత్వానికి, ఆర్‌బీఐకి మధ్య చర్చలు ఇంకా కొనసాగుతున్నాయని అభిజ్ఞ వర్గాలు తెలిపాయి.

నాణ్యమైన సేవల్లో

హైదరాబాద్ జీఎంఆర్ భేష్

ఏసీఐ అవార్డుల్లో విమానాశ్రయానికి అగ్రస్థానం

ఈనాడు, హైదరాబాద్: విమానాశ్రయాల్లో అత్యున్నత నాణ్యమైన సేవలను అందిస్తున్నందుకుగాను జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి (జీహెచ్‌ఐఏఎల్) అంతర్జాతీయంగా మొదటి స్థానం దక్కింది. 2017 సంవత్సరానికి గాను.. 50 లక్షలు -1.50కోట్ల ప్రయాణికుల విభాగంలో ఈ అవార్డును ఎయిర్‌పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ (ఏసీఐ) ప్రకటించింది. ప్రయాణికుల నుంచి సేకరించిన వివరాలను ఆధారంగా చేసుకొని దీన్ని అందించినట్లు జీఎంఆర్ విమానాశ్రయం తెలిపింది. 2014 నుంచి వరుసగా నాలుగోసారి ఈ అవార్డును చేజిక్కించుకుంది. ఈ సందర్భంగా జీఎంఆర్ గ్రూప్, ఎయిర్‌పోర్ట్స్- ఛైర్మన్ శ్రీనివాస్ బొమ్మిడాల మాట్లాడుతూ.. విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ పెరుగుతోందనీ, దానికి తగ్గట్టుగా మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతోపాటు, ప్రయాణికులకు ఆహ్లాదకరమైన అనుభూతిని కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఐఏఎల్ సీఈఓ ఎస్‌జీకే కిశోర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వృద్ధి పథంలో సాగుతుండటం విమానాశ్రయంలో ప్రయాణికుల సంఖ్య పెరగడానికి కారణం అవుతోందన్నారు. గత నాలుగేళ్లుగా ఏటా 20శాతం చొప్పున ప్రయాణికుల సంఖ్య పెరుగుతోందనీ, ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 1.8కోట్ల మంది ఇక్కడి నుంచి ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. .




4 కోట్ల ప్రయాణికుల విభాగంలో దిల్లీకి

జీఎంఆర్ గ్రూపు నిర్వహిస్తోన్న దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయానికి (డీఐఏఎల్) 4కోట్ల ప్రయాణికుల విభాగంలో నాణ్యమైన సేవల విభాగంలో మొదటిస్థానం లభించింది. 2017లో ఇక్కడి నుంచి 6.35కోట్ల మంది ప్రయాణించారు. ఆసియాలో అత్యంత రద్దీగా ఉండే విమానాశ్రయాల్లో ఇది 7వ స్థానం, ప్రపంచంలో 20వ స్థానంలోకి చేరింది. డీఐఏఎల్ సీఈఓ ఐ.ప్రభాకర రావు మాట్లాడుతూ.. దిల్లీ విమానాశ్రయంలో ఏటా ప్రయాణికుల సంఖ్య పెరుగుతోందనీ, అంతర్జాతీయ విమానయాన రంగంలో ఈ విమానాశ్రయానికి ప్రత్యేక గుర్తింపు లభిస్తోందని తెలిపారు. ఇదే విభాగంలో జీవీకే నిర్వహిస్తోన్న ఛత్రపతి శివాజీ అంతర్జాతీయ విమానాశ్రయానికి (సీఎస్ఐఏ) నాణ్యమైన సేవలను అందిస్తున్నందుకు ఉత్తమ విమానాశ్రయంగా అవార్డు దక్కింది. ఈ సందర్భంగా జీవీకే ఛైర్మన్ జీవీకే రెడ్డి మాట్లాడుతూ.. 2017లో ఇక్కడి నుంచి 4.6కోట్ల మంది ప్రయాణించారని తెలిపారు.

మార్కెట్లో దిద్దుబాటు రావచ్చు!

- బజాజ్ అలియాంజ్ సీఐఓ సంపత్ రెడ్డి
- మార్కెట్లోకి కొత్త యులిప్

ఈనాడు, హైదరాబాద్: గత నాలుగేళ్లుగా వృద్ధి పథంలో సాగుతున్న స్టాక్ మార్కెట్లో కాస్త దిద్దుబాటుకు అవకాశం లేకపోలేదని బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ సంపత్ రెడ్డి అన్నారు. అమెరికాలో వడ్డీ రేట్లు పెరగడం, ఇతర అంతర్జాతీయ పరిణామాలు దీనికి కారణం అయ్యే అవకాశం ఉందన్నారు. ఐటీ, లోహ, కమోడిటీ రంగాలకు ఇప్పుడు మంచి అవకాశం కనిపిస్తోందన్నారు. ప్రైవేటు రంగం బ్యాంకులు కూడా ఆకర్షణీయంగా ఉన్నాయని తెలిపారు. చాలా మంచి కంపెనీల షేర్ల ధరలు అందుబాటులో ఉండటం పెట్టుబడులకు మంచి అవకాశమన్నారు. మంచి కంపెనీలను ఎంచుకుని, మదుపు చేసే వ్యూహాన్ని పాటించడం ఇప్పుడు కలిసొస్తుందని పేర్కొన్నారు. యూఎస్‌ఎఫ్‌డీఏ ఆంక్షల నేపథ్యంలో ఫార్మా సంస్థలకు ఇబ్బంది కలిగిస్తోందని, ఇది మరి కొన్ని నెలలు కొనసాగవచ్చని తెలిపారు. మంగళవారం బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ నుంచి 'లైఫ్ గోల్ ఎస్యూర్' యూనిట్ ఆధారిత బీమా పాలసీని తెలుగు రాష్ట్రాల్లోకి విడుదల చేసిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం మిడ్ క్యాప్ ఫండ్లకన్నా.. లార్జ్ క్యాప్ ఫండ్లు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయన్నారు. బడ్జెట్‌లో ప్రవేశ పెట్టిన దీర్ఘకాలిక మూలధన రాబడి పన్ను (ఎల్‌టీసీజీ) వల్ల మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టాలనుకునే వారి దృష్టి యులిప్‌ల వైపు మళ్లిందని పేర్కొన్నారు. ఇది బీమా రంగానికి కలిసొచ్చే అంశమని తెలిపారు. బజాజ్ అలియాంజ్ ఫండ్లు సగటున 15-16శాతం వరకూ రాబడిని అందిస్తున్నాయని తెలిపారు. తమ సంస్థ కొత్త ప్రీమియం వసూలులో ఈ ఆర్థిక సంవత్సరంలో 40శాతం వృద్ధి సాధించిందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జనవరి వరకూ రూ.150 కోట్ల ప్రీమియం వసూలయ్యిందని చెప్పారు. యూనిట్ ఆధారిత బీమా పాలసీ (యులిప్)కి చెల్లించిన ప్రీమియంలో జీవిత బీమా కోసం మినహాయించిన సొమ్ము (మోర్టాలిటీ ఛార్జీ)ను వ్యవధి తీరిన తర్వాత తిరిగి ఇచ్చేలా లైఫ్ గోల్ ఎస్యూర్‌ను అందుబాటులోకి తెచ్చింది.



కోడిగుడ్లు — 6న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	345	వరంగల్	347
చిల్లరగా(ఒక గుడ్డు)	4.05	విశాఖపట్నం	350
బెంగళూరు	375	చెన్నై	385
7వ తేదీకి...		చిత్తూరు	378
విజయవాడ/గోదావరి	340	నమక్కల్	370

నేటి మార్కెట్

మార్కెట్ల నష్టాలు నేడూ కొనసాగే అవకాశం ఉంది. బ్యాంకింగ్ రంగ సెంటిమెంట్ బలహీనంగానే ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నేడు నిఫ్టీ 10155- 10300 పాయింట్ల శ్రేణిలో కదలాడే అవకాశం ఉందని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బ్యాంకింగ్, వాహన షేర్లకు అమ్మకాలు వెల్లువెత్తడంతో మంగళవారం నిఫ్టీ 10300 పాయింట్ల దిగువకు చేరింది. 2018లో సూచీకిది అత్యల్ప స్థాయి కావడం గమనార్హం. సూచీల బలహీనతలు కొనసాగడంతో నిఫ్టీ 200 రోజుల సగటు కదలికల స్థాయిని పరీక్షించొచ్చని, లాభాలు వచ్చినా 10,300 పాయింట్లు అధిగమించకపోవచ్చని నిపుణులు భావిస్తున్నారు. అమెరికా దిగుమతి సుంకాలను విధించొచ్చన్న భయాలు, ఐరోపా సమాఖ్య ప్రతిపాదించిన చర్యలు సైతం సెంటిమెంట్ ప్రభావం చూపొచ్చని అంటున్నారు.

వ్యాపారాల్లో మహిళల పాత్ర కీలకం

ఈనాడు, హైదరాబాద్: మహిళల్లో పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం పలు పథకాలను అందుబాటులోకి తెచ్చిందనీ, వాటిని వినియోగించుకొని మహిళలు స్వశక్తితో ముందుకెళ్లాలని ఆదాయపు పన్ను శాఖ (ఇన్వెస్టిగేషన్స్) డైరెక్టర్ (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిషా) నీనా నిగమ్ అన్నారు. మహిళలు తమ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలనీ, స్వతంత్రంగా, ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం ఎఫ్‌ట్యాప్సీ మహిళా పారిశ్రామికవేత్తల విభాగం ఆధ్వర్యంలో జరిగిన 'మహిళా సాధికారికతతో బలమైన దేశం' అనే కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు తలచుకుంటే ఆకాశమే హద్దుగా దేన్నైనా సాధించగలరన్నారు. మహిళల్లో నైపుణ్యాలు, యాజమాన్య లక్షణాలు, తమ తోటి వారి పట్ల సహనం అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. ఎఫ్‌ట్యాప్సీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా వ్యాపారాల్లో మహిళల ప్రాధాన్యం క్రమంగా పెరుగుతోందన్నారు.

విపణిలోకి హావెల్స్ నీటి శుద్ధి యంత్రాలు

ఈనాడు, హైదరాబాద్: హావెల్స్ ఇండియా విపణిలోకి వాటర్ ప్యూరిఫైయర్లను ప్రవేశపెట్టింది. హావెల్స్ కొత్తగా అభివృద్ధి చేసిన సాంకేతిక పరిజ్ఞానంతో ఈ వాటర్ ప్యూరిఫైయర్లను తయారు చేస్తున్నామని.. నీటిలో సమతౌల్య పీహెచ్‌ని కొనసాగించడం, సహజ సిద్ధ ఖనిజ, లవణాలను కాపాడుతునే నీటిని శుద్ధి చేయడం ఈ సాంకేతిక పరిజ్ఞానం ప్రత్యేకత అని కంపెనీ వెల్లడించింది. హరిద్వార్‌లోని యూనిట్‌లో ప్యూరిఫైయర్ల తయారీ సముదాయాన్ని కంపెనీ ఏర్పాటు చేసింది. ఏడాదికి 5 లక్షల నీటి శుద్ధి యంత్రాలను తయారు చేయనుంది. ఆరు రకాల మోడళ్లను తెలంగాణ విపణిలోకి విడుదల చేసింది.



ఛాంపియన్స్

బ్యాటింగ్‌లో మెరుపుల్లేవు. బౌలింగ్‌లో పదును లేదు. కెప్టెన్ కోహ్లి సహా అరడజనుమంది కీలక ఆటగాళ్లు లేని టీమ్‌ఇండియా డీలా పడింది. ముక్కోణపు టీ20 టోర్నీని ఓటమితో ఆరంభించింది. కుర్రాళ్లతో నిండిన భారత్‌పై ఆతిథ్య శ్రీలంక అన్ని రంగాల్లోనూ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. కుశాల్ పెరీరా చెలరేగిన వేళ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. శిఖర్ ధావన్ శ్రమ వృథా అయింది.



భారీ స్కోరు సాధించలేకపోయినా.. మ్యాచ్‌ను కాపాడుకోగలిగే పరుగులు సాధించాం. ఐతే శ్రీలంక మెరుపు ఆరంభంతో మ్యాచ్‌ను లాగేసుకుంది. ఈ మ్యాచ్ గెలుస్తామనే అనుకున్నాం. కానీ.. మైదానంలో ప్రణాళికలను సరిగ్గా అమలు చేయలేకపోయాం. ఈ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటాం

– రోహిత్ శర్మ

ముక్కోణపు టీ20 టోర్నీ



కుశాల్ ధాటికి కుదేల్

శ్రీలంక చేతిలో భారత్ ఓటమి ● ధావన్ శ్రమ వృథా

కొలంబో

ముక్కోణపు టీ20 టోర్నీలో భారత్‌కు భంగపాటు. మంగళవారం జరిగిన ఆరంభ మ్యాచ్‌లో రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమ్ ఇండియా ఐదు వికెట్ల తేడాతో శ్రీలంక చేతిలో ఓడిపోయింది. శిఖర్ ధావన్ (90; 49 బంతుల్లో 6×4, 6×6) చెలరేగడంతో మొదట భారత్ 5 వికెట్లకు 174 పరుగులు చేసింది. కుశాల్ పెరీరా (66; 37 బంతుల్లో 6×4, 4×6), తిసార పెరీరా (22 నాటౌట్; 10 బంతుల్లో 2×4, 1×6)ల వీరబాదుడుతో లక్ష్యాన్ని లంక 18.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. యువ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ (2/28) చక్కని బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు.

కుశాల్ అదరహో..: రెండో ఓవర్లోనే బంతిని అందుకున్న సుందర్.. ఓపెనర్ కుశాల్ మెండిస్ (11)ను ఔట్ చేసి భారత్‌కు శుభారంభాన్నే ఇచ్చాడు. కానీ మరో కుశాల్ భారత్‌పై విరుచుకుపడ్డాడు. భారీ షాట్లతో భారత బౌలింగ్‌ను తుత్తునియలు చేసిన కుశాల్ పెరీరా స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. మంచి రన్‌రేట్‌తో జట్టును లక్ష్యం దిశగా నడిపించాడు. ముఖ్యంగా శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో విధ్వంసం సృష్టించాడు. అతడు వేసిన ఇన్నింగ్స్‌లో మూడో ఓవర్లో ఏకంగా నాలుగు ఫోర్లు, ఓ సిక్స్ బాదేశాడు. మరోవైపు గుణతిలక (19), చండిమాల్ (14) ఔటైనా పెరీరా జోరుతో లంక 12 ఓవర్లలో 126/3తో అలవోకగా లక్ష్యం దిశగా సాగింది. ఐతే భారీ షాట్ ఆబోయిన కుశాల్ పెరీరాను సుందర్ బోల్తా కొట్టించడం, తరంగ (17)ను చాహల్ (2/37) ఔట్ చేయడంతో పరుగుల వేగం తగ్గింది. లంక చివరి 3 ఓవర్లలో 24 పరుగులు చేయాల్సిన స్థితిలో మ్యాచ్ కాస్త ఆసక్తికరంగా మారింది. కానీ 18వ ఓవర్లో 16 పరుగులు సమర్పించిన ఉనద్కత్.. భారత్ అవకాశాలపై నీళ్లు చల్లాడు. ఆ ఓవర్లో తిసార పెరీరా సిక్స్, ఫోర్.. శనక (15 నాటౌట్) ఓ బౌండరీ బాదడంతో లంక పని తేలికైపోయింది.



ధావన్ దంచేశాడు: భారత్ ఇన్నింగ్స్‌లో ధావన్ ఆటే హైలైట్. మిగతా బ్యాట్స్‌మెన్ నిరాశపరిచినా భారత్ 170 పై స్కోరు చేసిందంటే కారణం ధావన్ సూపర్ ఇన్నింగ్సే. చెలరేగి ఆడిన అతడు దాదాపుగా ఒంటి చేత్తో జట్టును నడిపించాడు. అసలు జట్టు ఆరంభమే పేలవం. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్.. 4 ఓవర్లలో 18 పరుగులకే రెండు వికెట్లు చేజార్చుకుంది. పేలవ ఫామ్‌లో ఉన్న రోహిత్ ఖాతా కూడా తెరవలేదు. తొలి ఓవర్లోనే వెనుదిరిగాడు. ఆఫ్‌స్టంప్ ఆవల ఫుల్ డెలివరీని ఆడిన రోహిత్.. జీవన్ మెండిస్ అందుకున్న చక్కని క్యాచ్‌కు నిష్క్రమించాడు. తర్వాతి ఓవర్లోనే రైనా (1) ఓ పేలవ షాట్‌తో పెవిలియన్ బాట పట్టాడు. మొత్తం మూడు స్టంపులు వదిలి ఆడిన అతడు.. ప్రదీప్ ఫుల్‌టాస్‌కు బౌల్డయ్యాడు. ఐతే ధావన్ దూకుడు కొనసాగిస్తూ.. మనీష్ పాండే (37; 35 బంతుల్లో 3×4, 1×6) సహకారంతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ఆరంభంలో కాస్త తడబడ్డా.. క్రమంగా చెలరేగిపోయాడు. చక్కటి బౌండరీలతో అలరించాడు. ఫెర్నాండో బౌలింగ్‌లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన ధావన్.. అతడి మరో ఓవర్లో వరుసగా రెండు సిక్స్‌లు బాదాడు. ధనంజయ బౌలింగ్‌లో మోకాలిని వంచుతూ చూడముచ్చటైన బౌండరీతో అర్ధశతకం (30 బంతుల్లో) పూర్తి చేశాడు. పాండే ఎక్కువగా సింగిల్స్‌కే పరిమితమయ్యాడు. 12 ఓవర్లలో స్కోరు 100/2. పాండేను జీవన్ మెండిస్ ఔట్ చేయడంతో 95 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. అయినా ధావన్ దూకుడు తగ్గలేదు. నాలుగు కళ్లు చెదిరే సిక్స్‌లతో జట్టు స్కోరును 17 ఓవర్లలో 150 పరుగులకు చేర్చాడు. అతను శతకం చేయడం ఖాయమనిపించింది. కానీ అదే దూకుడుతో ఆడబోయి గుణతిలక బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఆఖరి ఓవర్లో 14 పరుగులు రావడంతో స్కోరు 174కు చేరుకుంది. రిషబ్ పంత్ (23; 23 బంతుల్లో 1×4, 1×6) ధాటిగా ఆడడంలో విఫలమయ్యాడు. లేదంటే స్కోరు ఇంకా పెరిగేదే. ఈ మ్యాచ్‌తో ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ అరంగేట్రం చేశాడు.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) మెండిస్ (బి) చమీర 0; ధావన్ (సి) పెరీరా (బి) గుణతిలక 90; రైనా (బి) ఫెర్నాండో 1; మనీష్ పాండే (సి) గుణతిలక (బి) మెండిస్ 37; రిషబ్ పంత్ (సి) ఫెర్నాండో (బి) చమీర 23; దినేశ్ కార్తీక్ నాటౌట్ 13; ఎక్స్‌ట్రాలు 10 **మొత్తం:** (20 ఓవర్లలో 5 వికెట్లకు) **174; వికెట్ల పతనం:** 1-1, 2-9, 3-104, 4-153, 5-174; **బౌలింగ్:** చమీర 4-0-33-2; ఫెర్నాండో 3-0-38-1; ధనంజయ 4-0-37-0; తిసార పెరీరా 3-0-25-0; జీవన్ 3-0-21-1; గుణతిలక 3-0-16-1

శ్రీలంక ఇన్నింగ్స్: గుణతిలక (సి) పంత్ (బి) ఉనద్కత్ 19; కుశాల్ మెండిస్ (సి) ధావన్ (బి) సుందర్ 11; కుశాల్ పెరీరా (స్టంప్డ్) (బి) సుందర్ 66; చండిమాల్ (బి) చాహల్ 14; తరంగ (బి) చాహల్ 17; శనక నాటౌట్ 15; తిసార పెరీరా నాటౌట్ 22; ఎక్స్‌ట్రాలు 11 **మొత్తం:** (18.3 ఓవర్లలో 5 వికెట్లకు) **175; వికెట్ల పతనం:** 1-12, 2-70, 3-98, 4-127, 5-136; **బౌలింగ్:** జైదేవ్ ఉనద్కత్ 3-0-35-1; వాషింగ్టన్ సుందర్ 4-0-28-2; శార్దూల్ ఠాకూర్ 3.3-0-42-0; చాహల్ 4-0-37-2; విజయ్ శంకర్ 2-0-15-0; రైనా 2-0-14-0





ఆమె వయసు 16 ఏళ్లు. షూటింగ్‌లోకి వచ్చి రెండేళ్లే అయింది. ఇప్పటికే జాతీయ షూటింగ్‌లో పతకాల పంట పండించి సంచలనం సృష్టించింది. ఇప్పుడామె ప్రపంచ వేదిక మీదా అబ్బుర పరిచే ప్రదర్శన చేసింది. తన తొలి ప్రపంచకప్‌లోనే ఒకటికి రెండు స్వర్ణాలు కొల్లగొట్టి చరిత్ర సృష్టించింది. తన పేరు మను బాకర్.

'మను' చరిత్ర!

● 16 ఏళ్ల షూటర్ సంచలనం
● ప్రపంచకప్‌లో రెండో స్వర్ణం కైవసం

దిల్లీ

భారత యువ షూటర్ మను బాకర్ ప్రపంచకప్ షూటింగ్‌లో ఒక్క రోజు వ్యవధిలో రెండు స్వర్ణాలతో సంచలనం సృష్టించింది. 16 ఏళ్ల మను సోమవారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో స్వర్ణం గెలిచిన సంగతి తెలిసిందే. మంగళవారం ఆమె టీమ్ విభాగంలో పసిడి సాధించింది. మను, ఓంప్రకాశ్ మితర్వాల్ జోడీ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్లో 476.1 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. జర్మనీ భార్యాభర్తల జోడీ క్రిస్టియన్ రీట్జ్-సాంద్రా రీట్జ్ 475.2 పాయింట్లతో రెండో స్థానం సాధించింది. క్వాలిఫయింగ్ రౌండ్లో మను-ఓంప్రకాశ్ 770 పాయింట్లతో ఫైనల్‌కు అర్హత సాధించారు. క్రిస్టియన్-సాంద్రా క్వాలిఫయింగ్‌లో 777 పాయింట్లతో ప్రపంచ రికార్డు నెలకొల్పడం విశేషం. భారత్‌కే చెందిన మహిమ అగర్వాల్-షాజర్ రిజ్వి కూడా 763 పాయింట్లతో అర్హత సాధించారు. అయితే తుది పోరులో 372.4 పాయింట్లతో నాలుగు స్థానానికి పరిమితమయ్యారు. మరోవైపు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో దీపక్ కుమార్-మెహులి ఘోష్ కాంస్యం గెలిచింది. ఫైనల్లో దీపక్-మెహులి జోడీ 435.1 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఈ ప్రపంచకప్‌లో అద్భుత ప్రదర్శన చేస్తున్న భారత షూటర్లు ఇప్పటిదాకా మూడు స్వర్ణాలు, నాలుగు కాంస్యాలు గెలుచుకున్నారు. పతకాల పట్టికలో భారత్‌దే అగ్రస్థానం కావడం విశేషం.

రెండేళ్ల కిందట మొదలెట్టి..

ఆట ఏదైనా సరే ప్రపంచ స్థాయి పోటీల్లో సత్తా చాటాలంటే ఎన్నో ఏళ్ల శ్రమ, అత్యున్నత స్థాయి శిక్షణ అవసరం. సుదీర్ఘ కాలం శ్రమించాక.. ఒక వయసు, పరిణతి వచ్చాక కానీ పతకాలు సొంతం కావు. అసలు అన్నీ కుదిరినా ప్రపంచ అత్యుత్తమ క్రీడాకారులతో పోటీ పడుతూ, విపరీతమైన ఒత్తిడిని తట్టుకుంటూ అత్యుత్తమ ప్రదర్శన చేయడం, పతకాలు సాధించడం సులువైన విషయం కాదు. ముఖ్యంగా షూటింగ్ లాంటి క్రీడలో ఈ కష్టం మరింత ఎక్కువగా ఉంటుంది. కానీ ఈ క్రీడలోకి ప్రవేశించిన రెండేళ్లకే ప్రపంచకప్‌లో రెండు స్వర్ణాలు కొల్లగొట్టడమంటే అద్భుతమైన విషయమే. మను బాకర్ ఈ అద్భుతమే చేసింది. హరియాణాకు చెందిన ఈ పదహారేళ్ల అమ్మాయి.. షూటింగ్‌లోకి వచ్చింది రెండేళ్ల కిందటే. అంతకుముందు ఆమెకు బాక్సింగ్, మార్షల్ ఆర్ట్స్‌లో ప్రవేశముంది. ఆ క్రీడల్లో టోర్నీలు కూడా ఆడింది. ఐతే రెండేళ్ల కిందట మను తండ్రి ఆమెను షూటింగ్ రేంజికి తీసుకెళ్లాడు. ఆమె గన్ను పట్టుకుని కొన్ని షాట్లను లక్ష్యానికి దగ్గరగా కాల్చింది. దీంతో తండ్రి ఆమెకు షూటింగ్‌లోనే శిక్షణ ఇప్పించాడు. కొన్ని నెలల్లోనే ఆమె అద్భుత ప్రదర్శన చేసి జాతీయ స్థాయికి ఎదిగింది. గత ఏడాది కేరళలోని తిరువనంతపురంలో జరిగిన జాతీయ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో ప్రదర్శనతో మను పేరు షూటింగ్ వర్గాల్లో మార్మోగిపోయింది. ఆ టోర్నీలో ఏకంగా 9 స్వర్ణాలు సహా 15 పతకాలు కొల్లగొట్టిందామె. అంతే కాదు.. హీనా సిద్ధు లాంటి స్టార్ షూటర్‌ను ఓడించడమే కాక, తన పేరిట సుదీర్ఘ కాలంగా ఉన్న జాతీయ రికార్డును కూడా బద్దలుకొట్టింది. దీంతో మను ప్రపంచ స్థాయి షూటర్ అనే విషయం అందరికీ అర్థమైంది. ఇప్పుడు 16 ఏళ్ల వయసులో ప్రపంచకప్‌లో అరంగేట్రం చేసి, అక్కడా అద్భుత ప్రదర్శన చేసింది. ఒకటికి రెండు స్వర్ణాలు కొల్లగొట్టింది. సీనియర్ ప్రపంచకప్‌లో భారత్ తరపున స్వర్ణం గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలు మనునే. ప్రస్తుతం మను ఇంటర్మీడియట్ తొలి సంవత్సరం చదువుతోంది.

> "నా ప్రదర్శన నమ్మశక్యంగా లేదు. ప్రపంచకప్‌ను రెండు స్వర్ణాలతో ముగిస్తానని అస్సలు అనుకోలేదు. పతకాల గురించి, రికార్డుల గురించి నేను ఆలోచించలేదు. అవి అలా జరిగిపోయాయంతే. నేను గెలుస్తున్నపుడు రికార్డులు సృష్టిస్తున్నట్లు నాకు తెలియదు. నా టెక్నిక్ మీద గంటలు గంటలు పని చేసి, నాకెన్నో విలువైన సలహాలిచ్చిన నా కోచ్‌లకు కృతజ్ఞతలు" – మను బాకర్

దేవధర్ ట్రోఫీ

ఫైనల్లో కర్ణాటక

ధర్మశాల: విజయ్ హజారె వన్డే ట్రోఫీ విజేత కర్ణాటక.. దేవధర్ ట్రోఫీ మీదా కన్నేసింది. ఈ టోర్నీలోనూ ఆ జట్టు ఫైనల్ చేరింది. ఫైనల్లో ఆ జట్టు భారత్-బిని ఢీకొనబోతోంది. మంగళవారం కర్ణాటక 65 పరుగుల తేడాతో భారత్-ఎను ఓడించి ఫైనల్‌కు అర్హత సాధించింది. మొదట సమర్థ్ (85), పవన్ దేశ్ పాండే (95) రాణించడంతో కర్ణాటక 4 వికెట్ల నష్టానికి 339 పరుగులు చేసింది. అనంతరం భారత్-ఎ 39.5 ఓవర్లలో 274 పరుగులకే ఆలౌటైంది. ఉన్ముక్త్ చంద్ (81), ఇషాన్ కిషన్ (73) రాణించినా ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. గౌతమ్ (4/52) భారత్-ఎను దెబ్బ తీశాడు.

నేరం చేయలేదు.. కానీ తప్పే!

పుణె క్యురేటర్ సాల్గోంకర్‌పై ఆరు నెలల నిషేధం



దుబాయ్: గత ఏడాది అక్టోబరు 25న పుణెలో భారత్-న్యూజిలాండ్ వన్డే మ్యాచ్‌కు ముందు బుకీల రూపంలో ఉన్న విలేకరులతో పిచ్ సమాచారం పంచుకున్న క్యురేటర్ పాండురంగ్ సాల్గోంకర్‌పై ఐసీసీ ఆరు నెలల సస్పెన్షన్ వేటు వేసింది. మ్యాచ్ రోజుతో మొదలై ఏప్రిల్ 25తో అతడి సస్పెన్షన్ ముగుస్తుందని ఐసీసీ ప్రకటించింది. మ్యాచ్‌ను ఫిక్స్ చేసేందుకు సాల్గోంకర్ ప్రయత్నించినట్లు ఆధారాలు లేవని, అతను నేరం చేయలేదని నిర్ధరించిన ఐసీసీ.. బుకీల రూపంలో వచ్చిన విలేకరులు తనను పిచ్ సమాచారం అడిగిన విషయాన్ని నివేదించకపోవడాన్ని తప్పిదంగా పేర్కొంది. ఈ తప్పిదం కిందే అతడిపై సస్పెన్షన్ విధించింది. ఐసీసీ తీర్పును తాను అనుసరిస్తానని సాల్గోంకర్ అన్నాడు. "ప్రచార యావతో, జనాల దృష్టిని ఆకర్షించేందుకే నాపై ఈ ఆరోపణలు చేశారు. ఐసీసీ తీర్పును అంగీకరిస్తున్నా. నేను అవినీతి నిరోధక విభాగానికి ఆ రోజు జరిగింది నివేదించాల్సింది. ఐతే నా భార్య ఆ రోజు ఆసుపత్రిలో చేరింది. నేనా బాధలో ఉండి సమాచారం ఇవ్వలేకపోయాను" అని అతను చెప్పాడు.



యూఏఈపై విండీస్ విజయం

గేల్ రికార్డు శతకం

హరారె: వెస్టిండీస్ విధ్వంసక ఓపెనర్ క్రిస్ గేల్ అరుదైన ఘనత సాధించాడు. వన్డేల్లో సచిన్, ఆమ్లాల తర్వాత 11 విభిన్న దేశాలపై శతకాలు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా మంగళవారం యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో చెలరేగి ఆడిన గేల్ 91 బంతుల్లో 123 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో 11 సిక్సర్లు, 7 ఫోర్లు ఉన్నాయి. ఈ మ్యాచ్‌లో విండీస్ 60 పరుగుల తేడాతో గెలిచింది. మొదట విండీస్ 4 వికెట్ల నష్టానికి 357 పరుగుల భారీ స్కోరు సాధించింది. గేల్‌తో పాటు హెట్‌మైర్ (127) కూడా చెలరేగాడు. అనంతరం యూఏఈ 50 ఓవర్లలో 6 వికెట్లకు 297 పరుగులు చేసింది. షాజాద్ (112) సెంచరీ సాధించాడు.

రంజీ ఆటగాళ్లకు చెల్లింపుల్లేవ్!

ముంబయి: బీసీసీఐ.. ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డు. ఏటా దీని ఆదాయం వేల కోట్లలోనే ఉంటుంది. అలాంటి బోర్డు రంజీ ఆటగాళ్లకు రెండు సీజన్ల నుంచి మ్యాచ్ ఫీజులు చెల్లించట్లేదంటే నమ్మగలరా? ఇది నిజం. ఐతే ఆటగాళ్లకు డబ్బులివ్వంది బోర్డు దగ్గర నిధుల్లేక కాదు. ఇందుకు కారణం వేరు. లోధా సంస్కరణల అమలులో వివిధ రాష్ట్రాల క్రికెట్ సంఘాలు మీనమేషాలు లెక్కిస్తుండటంతో వినోద్ రాయ్ నేతృత్వంలోని బీసీసీఐ పాలకుల కమిటీ (సీఓఏ) వాటికి నిధులు విడుదల చేయలేదు. దీంతో చాలా సంఘాలు నిధుల లేమితో కటకటలాడుతున్నాయి. రంజీ మ్యాచ్‌లు ఆడిన క్రికెటర్లకు ఇవ్వాల్సిన మ్యాచ్ ఫీజుల్లో మెజారిటీ బీసీసీఐ నుంచే రావాలి. రాష్ట్ర సంఘాల్లో లోధా సంస్కరణలు అమలు కాకపోవడంతో ఆ నిధులు కూడా బోర్డు విడుదల చేయలేదు. కొన్ని సంఘాలు తమ దగ్గరున్న నిధులతో ఆటగాళ్లకు కొంతమేర చెల్లింపులు చేశాయి. కానీ పూర్తిగా ఎవరికీ మ్యాచ్ ఫీజులు అందలేదు. చాలామంది ఆటగాళ్లు అసలేమాత్రం ఫీజులు అందుకోలేదు. దాదాపు 500 మంది ఆటగాళ్లకు చెల్లింపులు చేయాల్సి ఉంది.



నీరజ్ @ 85.94 మీ

పటియాలా: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా కామన్వెల్త్ క్రీడల ముంగిట చక్కటి ప్రదర్శన చేశాడు. ఫెడరేషన్ కప్ జాతీయ సీనియర్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో అతను జావెలిన్‌ను 85.94 మీటర్లు విసిరాడు. అతడికిది కెరీర్లో రెండో అత్యుత్తమ ప్రదర్శన. రెండేళ్ల కిందట పోలెండ్‌లో జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో నీరజ్ 86.48 మీటర్ల దూరం జావెలిన్ విసిరి జూనియర్ స్థాయిలో ప్రపంచ రికార్డు నెలకొల్పిన సంగతి తెలిసిందే. మంగళవారం ఆ ప్రదర్శనకు చేరువగా వెళ్లాడు నీరజ్. కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనబోయే జావెలిన్ త్రోయర్లెవరూ ఈ సీజన్లో ఇంతకంటే మెరుగైన ప్రదర్శన చేయకపోవడం విశేషం. ఈ ప్రదర్శనను పునరావృతం చేసినా నీరజ్ కామన్వెల్త్ క్రీడల్లో పతకం గెలిచేందుకు అవకాశముంది. మరోవైపు మహిళల 400 మీటర్ల పరుగులో అసోం యువ స్ప్రింటర్ హిమా దాస్ 51.97 సెకన్ల టైమింగ్‌తో కామన్వెల్త్ క్రీడలకు అర్హత సాధించింది. మహిళల 100 మీటర్ల పరుగులో స్టార్ స్ప్రింటర్ ద్యుతి చంద్ పసిడి గెలుచుకుంది. 11.6 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసింది. పురుషుల 100 మీటర్ల పరుగులో శివ స్వర్ణం సొంతం చేసుకున్నాడు.

భారత్ ఓటమి

అజ్లాన్ షా కప్ హాకీ

ఇపో (మలేసియా): అజ్లాన్ షా కప్ హాకీలో భారత జట్టు ఫైనల్ ఆశలు ఆవిరయ్యాయి. రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ 2-4 తేడాతో ఆస్ట్రేలియా చేతిలో పరాజయంపాలైంది. మ్యాచ్‌లో రమన్‌దీప్ సింగ్ (52, 53వ నిమిషం) రెండు గోల్స్ చేయడంతో వైట్‌వాష్ తప్పింది. తిరుగులేని ప్రదర్శన చేసిన ఆస్ట్రేలియా 12 నిమిషాల వ్యవధిలో నాలుగు గోల్స్ చేసి మ్యాచ్‌ను శాసించింది. మార్క్ నోల్స్ (28వ నిమిషం), ఆరన్ జలెవ్‌స్కి (35వ), డానియల్ బీలె (38వ), బ్లేక్ గోవర్స్ (40వ) ఆ జట్టు తరపున గోల్స్ చేశారు. తొలి మ్యాచ్‌లో 2-3తో అర్జెంటీనా చేతిలో ఓడిన సర్దార్ సేన.. ఇంగ్లాండ్‌తో రెండో మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసుకుంది.

మహిళల జట్టు విజయం: కొరియాతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యం సంపాదించింది. మంగళవారం రెండో మ్యాచ్‌లో భారత జట్టు 3-2తో ఆతిథ్య జట్టును ఓడించింది. పూనమ్ రాణి (6వ నిమిషం), కెప్టెన్ రాణి రాంపాల్ (27వ), గుర్జిత్ కౌర్ (32వ) భారత్ తరపున గోల్స్ చేశారు.

త్రిపురలో విధ్వంసకాండ

- భాజపా-సీపీఎం కార్యకర్తల నడుమ ఘర్షణలు
- వామపక్ష కార్యాలయాలపై దాడులు.. లెనిన్ విగ్రహం కూల్చివేత
- హింసను అదుపుచేయాలని గవర్నర్, డీజీపీలకు రాజ్‌నాథ్ ఆదేశం




త్రిపురలోని బెలోనియాలో ధ్వంసం చేసిన లెనిన్ విగ్రహం ■ విగ్రహం కూల్చివేయడంపై కోల్‌కతాలో నిరసన వ్యక్తం చేస్తున్న సీతారాం ఏచూరి, నేతలు ప్రకాశ్‌కారాట్ తదితరులు

అగర్తలా

పాతికేళ్ల తర్వాత తొలిసారిగా అధికార మార్పు ముంగిట నిలిచిన త్రిపురలో అల్లర్లు చెలరేగాయి. రాష్ట్రవ్యాప్తంగా భాజపా, వామపక్ష కార్యకర్తల నడుమ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. సోవియెట్ మాజీ నాయకుడు, కమ్యూనిస్టు దిగ్గజం లెనిన్ విగ్రహాలను ఆందోళనకారులు కూల్చివేశారు. భాజపా నేతలే ఈ ఘటనలకు పాల్పడ్డారని సీపీఎం, తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించాయి. ఈ నేపథ్యంలో కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్.. రాష్ట్ర గవర్నర్, డీజీపీలతో మాట్లాడారు. హింసను అదుపుచేయాలని ఆదేశించారు.

బెలోనియా, శాబ్రోమ్‌లో లెనిన్ విగ్రహాలను కూల్చివేశారని ఎస్పీ మోంచాక్ ఇప్పర్ తెలిపారు. బెలోనియాలోని విగ్రహాన్ని జేసీబీతో కూల్చివేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి తపస్ దత్తా చెప్పారు. అనంతరం 'భారత్ మాతాకీ జై' నినాదాలు చేశారని చెప్పారు.

వ్యాఖ్యలపై వివాదం..

మరోవైపు విగ్రహాల కూల్చివేతపై స్పందిస్తూ.. "ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ఒక ప్రభుత్వం చేసిన పనిని.. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన మరో ప్రభుత్వం రద్దు చేయవచ్చు" అంటూ త్రిపుర గవర్నర్ తథాగత రాయ్ చేసిన ట్వీట్ వివాదాస్పదమైంది. దీనిపై సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మండిపడ్డారు.

అల్లర్ల నేపథ్యంలో పశ్చిమ త్రిపురలోని అనేక ప్రాంతాల్లో నిషేధాజ్ఞలు విధించారు. భాజపా, ఐపీఎఫ్‌టీ కార్యకర్తలు భయాందోళనలు సృష్టిస్తున్నారని ఏచూరి కోల్‌కతాలో ఆరోపించారు. తమ పార్టీకి చెందిన 514 మంది కార్యకర్తలపైన, 1539 ఇళ్లపై దాడులు జరిగాయని పేర్కొన్నారు. 196 ఇళ్లను తగులబెట్టారని, పార్టీకి చెందిన 134 కార్యాలయాలపై దాడులు చేసి, లూటీలకు పాల్పడ్డారన్నారు. 64 కార్యాలయాలను తగులబెట్టారని ఆరోపించారు. ఈ విధ్వంసాన్ని నిరసిస్తూ ఏచూరి పార్టీ అగ్రనేతలు ప్రకాశ్ కారాట్, బృందా కారాట్ తదితర నేతలు కోల్‌కతాలో ర్యాలీ నిర్వహించారు. మరోపక్క సీపీఎం కార్యకర్తలు తమ పార్టీకి చెందిన 49 మందిపై దాడులు చేశారని, 17 మంది ఆసుపత్రి పాలయ్యారని భాజపా ఆరోపించింది.

ఒక పథకం ప్రకారమే విగ్రహాల కూల్చివేతకు భాజపా పాల్పడుతోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి విమర్శించారు. విదేశీ నేతల విగ్రహాలకు భారత్‌లో చోటు లేదన్న మంత్రి హన్స్‌రాజ్ అహిర్ వ్యాఖ్యలను ఆయన ఖండించారు. మహాత్మా గాంధీ విగ్రహాలు అనేక దేశాల్లో ఉన్నాయని గుర్తు చేశారు.

అణచివేతకు గురైనవారే..

వామపక్ష పాలనలో అణచివేతకు గురైనవారే లెనిన్ విగ్రహాన్ని కూల్చివేశారని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ పేర్కొన్నారు. హింసావాదాన్ని భాజపా ప్రేరేపించదని, ఆ పనిచేసేది వామపక్షమేనని పేర్కొన్నారు. విదేశీ నేతల విగ్రహాలకు భారత్‌లో చోటులేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారామ్ అహిర్ వ్యాఖ్యానించారు. "లెనిన్ విదేశీయుడు. ఒకరకంగా ఉగ్రవాది కూడా. అలాంటి వ్యక్తి విగ్రహం మన దేశంలో ఉండకూడదు. కావాలనుకుంటే కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యాలయంలో దాన్ని పెట్టుకొని, పూజలు చేసుకోమనండి" అని భాజపా ఎంపీ సుబ్రమణ్య స్వామి పేర్కొన్నారు. భాజపా సీనియర్ నేత రామ్ మాధవ్ స్పందిస్తూ.. "ప్రజలు లెనిన్ విగ్రహాన్ని తొలగించింది రష్యాలో కాదు.. త్రిపురలోనే. చలో పాల్టాయ్ (మార్చేద్దాం పదండి)" అని ట్విటర్‌లో తొలుత వ్యాఖ్యానించారు. ఆ తర్వాత ఈ వ్యాఖ్యలను తొలగించారు.

త్రిపుర సీఎంగా విప్లవ్‌కుమార్

- భాజపా శాసనసభాపక్ష నేతగా ఏకగ్రీవ ఎన్నిక
- ఉప ముఖ్యమంత్రిగా గిరిజన నేత జిష్ణుదేవ్ వర్మ
- 9న ప్రమాణ స్వీకారం... హాజరుకానున్న ప్రధాని

అగర్తలా: త్రిపుర భాజపా శాసనసభాపక్ష నేతగా విప్లవ్‌కుమార్ దేవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ పరిశీలకునిగా వచ్చిన కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ సమక్షంలో మంగళవారం జరిగిన శాసనసభాపక్ష సమావేశంలో దేవ్ నాయకత్వానికి ఎమ్మెల్యేలంతా ఆమోదం తెలిపారు. నూతన సీఎంగా గిరిజన శాసనసభ్యుడికి అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేసిన భాజపా భాగస్వామ్య పక్షం- 'ఇండీజీనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర' (ఐపీఎఫ్‌టీ) మాత్రం ఈ సమావేశానికి గైర్హాజరయింది. మంత్రివర్గంలో తమకు సముచిత స్థానం కల్పించకపోతే ప్రభుత్వంలో చేరబోమనీ, షరతుల్ని అంగీకరించనిపక్షంలో వెలుపలి నుంచి మద్దతు ఇస్తామనీ ఐపీఎఫ్‌టీ ఇప్పటికే ప్రకటించింది. ఎన్నికలు జరిగిన 59 స్థానాల్లో 35 భాజపాకి లభించగా, ఐపీఎఫ్‌టీ 8 చోట్ల గెలిచింది. ఇంతవరకు భాజపా రాష్ట్రశాఖ అధ్యక్షునిగా ఉన్న విప్లవ్‌కుమార్ దేవ్ ఈ నెల 9న సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శాసనసభాపక్ష ఉప నేతగా ఎన్నికైన జిష్ణుదేవ్ వర్మ ఉప ముఖ్యమంత్రిగా ఉంటారని గడ్కరీ విలేకరులకు తెలిపారు. సమావేశానంతరం విప్లవ్‌కుమార్, జిష్ణుదేవ్ తదితరులు గవర్నర్ తథాగతరాయ్‌ను కలిసి లాంచనపూర్వకంగా లేఖను అందజేశారు.

గవర్నర్ నుంచి ఆహ్వానం

ప్రభుత్వ ఏర్పాటు నిమిత్తం గవర్నర్ నుంచి తనకు ఆహ్వానం లభించినట్లు విప్లవ్‌కుమార్ దేవ్ వెల్లడించారు. శాసనసభాపక్ష తీర్మానం మేరకు గవర్నర్ తనను సీఎంగా నియమించారని చెప్పారు. ప్రమాణ స్వీకారోత్సవానికి భాజపా అధ్యక్షుడు అమిత్‌షా, 19 మంది భాజపా పాలిత రాష్ట్రాల సీఎంలను కూడా ఆహ్వానిస్తామని తెలిపారు. సీపీఎం అభ్యర్థి మరణంతో ఎన్నికలు వాయిదా పడిన చారిలమ్ రిజర్వ్‌డ్ నియోజకవర్గం నుంచి జిష్ణుదేవ్ భాజపా అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈ నెల 12న అక్కడ ఎన్నికలు జరగనున్నాయి. 9నే సీఎంతో పాటు ఆయన ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారు. శాసనసభాపక్ష సమావేశానంతరం భాజపా అగ్రనేతలంతా ఐపీటీఎఫ్ శాసనసభ్యులతో విడిగా సమావేశమయ్యారు. సంకీర్ణ ప్రభుత్వంలో తాము చేరుతామని ఐపీటీఎఫ్ అధ్యక్షుడు ఎన్.సి.దేవ్‌శర్మ చెప్పారు. భాగస్వామికి రెండు (గిరిజన సంక్షేమం, అటవీ) శాఖల్ని కేటాయించడానికి భాజపా అంగీకరించింది. మొత్తం 12 మందిని మంత్రివర్గంలో తీసుకుంటారు.

మేఘాలయ సీఎంగా కాన్రాడ్ ప్రమాణం

- కుటుంబం కల నెరవేరిందన్న మాతృమూర్తి

షిల్లాంగ్: మేఘాలయ ముఖ్యమంత్రిగా 'నేషనల్ పీపుల్స్ పార్టీ' (ఎన్‌పీపీ) అధినేత కాన్రాడ్ సంగ్మా (40) మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. లోక్‌సభ మాజీ స్పీకర్, దివంగత పి.ఎ.సంగ్మా తనయుడైన ఆయన చేత గవర్నర్ గంగాప్రసాద్ రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించారు. పదేళ్ల కాంగ్రెస్ పాలనకు కాన్రాడ్ తెరదించారు. ఆయన తుర నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ముఖ్యమంత్రితో పాటు ఆయన సోదరుడు జేమ్స్ పి.కె.సంగ్మా సహా 11 మంది మంత్రివర్గ సభ్యులు ప్రమాణం చేశారు. 60 స్థానాలున్న శాసనసభలో 21 మంది ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించినా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోయింది. ఎన్‌పీపీకి చెందిన 19 మందితో పాటు భాజపా సహా నాలుగు పార్టీలకు చెందినవారు, ఒక స్వతంత్ర శాసనసభ్యుడు (మొత్తం 34 మంది) తనకు మద్దతునిస్తున్నారని గవర్నర్‌కు కాన్రాడ్ రెండ్రోజుల క్రితమే తెలిపారు.



మంగళవారం షిల్లాంగ్‌లో మేఘాలయ సీఎంగా ప్రమాణం చేస్తున్న కన్రాద్ సంగ్మా

ప్రమాణ స్వీకారోత్సవానికి కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్, భాజపా అధ్యక్షుడు అమిత్‌షా తదితరులు హాజరయ్యారు. కాన్రాడ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి ప్రధాని నరేంద్ర మోదీ ట్విటర్లో అభినందనలు తెలిపారు. కుమారుడి బాధ్యతల స్వీకారోత్సవానికి హాజరైన సరోడిని కె సంగ్మా భావోద్వేగానికి గురయ్యారు. తమ కుటుంబ చిరకాల స్వప్నం నెరవేరిందన్నారు.

నాగాలాండ్ ముఖ్యమంత్రిగా రియో

- గవర్నర్ నుంచి ఆహ్వానం... రేపు ప్రమాణ స్వీకారం

కోహిమా: నాగాలాండ్ ముఖ్యమంత్రిగా 'నేషనల్ డెమోక్రాటిక్-ప్రోగ్రెసివ్ పార్టీ (ఎన్‌డీపీపీ) సీనియర్ నాయకుడు నెయిఫియు రియోను గవర్నర్ పి.బి.ఆచార్య నియమించారు. నూతన సీఎం ఈ నెల 8న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నెల 16వ తేదీలోగా సభలో బల నిరూపణ చేసుకోవాల్సిందిగా గవర్నర్ ఆయన్ని కోరారు. 18 మంది శాసనసభ్యులున్న ఎన్‌డీపీపీకి మద్దతు ప్రకటించినవారిలో భాజపాకి చెందిన 12 మంది, జేడీ(యు)కి చెందిన ఒకరు, ఎన్‌పీపీ నుంచి ఇద్దరు, మరో స్వతంత్ర సభ్యుడు ఉన్నారు. ఈ మేరకు వీరి నుంచి మద్దతు లేఖల్ని కేంద్ర మంత్రి జె.పి.నడ్డా, ఇతర నేతలు గవర్నర్‌కు తొలుత సమర్పించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి టి.ఆర్.జెళియాంగ్ మంగళవారం రాజీనామా చేశారు.

భాజపాది సైద్ధాంతిక విజయం

- త్రిపుర గెలుపుపై మోదీ వ్యాఖ్య

దిల్లీ: త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా గెలుపును.. వామపక్షంపై సాధించిన 'సైద్ధాంతిక విజయం'గా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. మూడు ఈశాన్య రాష్ట్రాల్లో పార్టీ తాజా ప్రదర్శన.. పార్టీలోనూ, దేశ ప్రజల్లోనూ ఉత్సాహం నింపిందని ఆయన అన్నారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు మరికొద్ది రోజుల్లో జరగనున్న నేపథ్యంలో.. విజయాల పరంపరను కొనసాగించేందుకు పార్టీ కష్టించి పనిచేయాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. రెండు లోక్‌సభ స్థానాలే ఉన్న త్రిపురలో భాజపా విజయానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత గురించి విమర్శకుల నుంచి వచ్చిన స్పందనలను మోదీ ప్రస్తావించారు. పాతికేళ్లుగా మార్క్సిజానికి కంచుకోటగా ఉన్న రాష్ట్రంలో భాజపా సైద్ధాంతిక విజయం సాధించిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధి విషయంలో రాష్ట్రాల మధ్య చిన్నాపెద్దా తేడాల్లేవని. . అన్నీ సమానమేనని ఆయన అన్నారు. హింస, విద్వేషాలతో కూడుకున్న వామపక్ష రాజకీయాలను ప్రతీ చోట ప్రజలు తిరస్కరించారని చెప్పారు. ప్రపంచం అంతటా వామపక్షం అంతమైపోయిందని, భారత్‌లోనూ అంతరించిపోయే దశకు చేరుకుందని అన్నారు. మంగళవారం జరిగిన భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో.. మోదీ ఈమేరకు వ్యాఖ్యానించినట్లు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంత్‌కుమార్ తెలిపారు. ఇటు మేఘాలయలో మంగళవారం భాజపా సహిత కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రాష్ట్ర నూతన ముఖ్యమంత్రి కాన్రడ్ సంగ్మాకు మోదీ శుభాకాంక్షలు తెలిపారు.



భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ, అద్వాణీ, సుష్మాస్వరాజ్, తావర్ చంద్ గెహ్లాట్, రాధామోహన్ సింగ్

9న భాజపా ఎంపీల విందు సమావేశం

ప్రధానమంత్రి నరేంద్రమోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్‌షా లతో భాజపా ఎంపీలందరికీ ఈ శుక్రవారం(9వ తేదీ) రాత్రి విందు సమావేశం ఉంది. ఇక్కడి భాజపా నూతన ప్రధాన కార్యాలయంలో ఈ విందు సమావేశం జరుగుతుంది. భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఈ విషయాన్ని మోదీ ప్రత్యేకంగా ఎంపీలందరికీ తెలియచేశారు. దీన్‌దయాళ్ ఉపాధ్యాయ మార్గ్‌లో అత్యంత సువిశాల ప్రాంగణంలో అత్యాధునికంగా నిర్మించిన భాజపా నూతన కార్యాలయాన్ని ఎంపీలంతా ఈ సందర్భంగా చూడవచ్చు.

విధులు నిర్వర్తించకుండా హక్కులను కోరుకోవడం రాజ్యాంగానికి విరుద్ధమే: ప్రధాని

దిల్లీ: విధులు నిర్వర్తించకుండా, కేవలం హక్కులను మాత్రమే కోరుకోవడం రాజ్యాంగ మౌలిక విలువలకు విరుద్ధమవుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అభిప్రాయపడ్డారు. విధుల గురించి కూడా ప్రజలకు అవగాహన కల్పించడం ఆవశ్యకమని ఆయన అన్నారు. దిల్లీలో కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) నూతన భవనం ఆవిష్కరణ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సమాచార హక్కు తరహాలోనే.. 'సరైన నడవడిక' (యాక్టింగ్ రైట్) ప్రాధాన్యతనూ ప్రజలకు తెలియజెప్పాలని సీఐసీని మోదీ అభ్యర్థించారు. కార్యక్రమంలో సీఐసీ మొబైల్ యాప్‌ను కూడా మోదీ ఆవిష్కరించారు.

13న విపక్ష నేతలకు సోనియా విందు!

ఐక్యఫ్రంట్ ఏర్పాటు దిశగా తాజా అడుగు!

దిల్లీ: భాజపాకు వ్యతిరేకంగా ఐక్యఫ్రంట్ ఏర్పాటు దిశగా జరుగుతున్న యత్నాల్లో భాగంగా కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ తాజాగా ప్రతిపక్ష నాయకులందరినీ విందుకు ఆహ్వానించారు. ఈనెల 13న ఆమె విపక్ష నాయకులందరికీ విందునిస్తారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఒకరకంగా చెప్పాలంటే...2019 లోక్‌సభ ఎన్నికల్లో ఐక్యఫ్రంట్ ఆవిర్భావానికి ప్రతిపక్ష ఐక్యతను మరింత పటిష్టం చేయడంలో ఈ విందు అంశాన్ని తాజా ముందడుగుగా భావిస్తున్నారు. ఎన్‌డీఏ మిత్రపక్షమైన తెలుగుదేశంపార్టీ కూడా సోనియా గాంధీ విందు సమావేశానికి హాజరుకానున్నట్లు అభిజ్ఞవర్గాల సమాచారం.

శ్రీలంకలో అత్యవసర పరిస్థితి

కొలంబో: మత ఘర్షణలు రాజుకోవడంతో శ్రీలంకలో ప్రభుత్వం 10 రోజుల పాటు అత్యవసర పరిస్థితి(ఎమర్జెన్సీ)ని మంగళవారం ప్రకటించింది. కాండీ జిల్లాలో రెండు మత వర్గాల మధ్య గత కొద్ది రోజులుగా హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయి. పరస్పర దాడుల్లో ఇద్దరు మృతి చెందగా.. అనేక ఇళ్లు, నిర్మాణాలు, దుకాణాలు దెబ్బతిన్నాయి.

అదానీని బాధ్యుడిని చేయాలి: సుబ్రమణ్యస్వామి

దిల్లీ: పారిశ్రామికవేత్త గౌతం అదానీపై భాజపా సీనియర్ నేత, ఎంపీ సుబ్రమణ్యస్వామి విల్లు ఎక్కుపెట్టారు. అత్యధిక నిరర్థక ఆస్తులతో విన్యాసం చేస్తున్న కళాకారుడంటూ ఆయణ్ని అభివర్ణించారు. అదానీని బాధ్యుడిని చేయాల్సిన తరుణం వచ్చిందనీ, లేకుంటే ప్రజాప్రయోజన వ్యాజ్యం అనివార్యమవుతుందని స్వామి హెచ్చరించారు. స్వామి వ్యాఖ్యలకు అదానీ గ్రూప్ స్పందిస్తూ- "తక్కువ సమయంలో ప్రపంచస్థాయి మౌలిక వసతుల ప్రాజెక్టులను చేపట్టిన చరిత్ర మాకుంది. దేశీయ, అంతర్జాతీయ బాండ్లు; ఈసీబీ రుణాలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకుల నుంచి రుణాలు మాకు అందుబాటులో ఉన్నాయి" అని ఓ ప్రకటనలో పేర్కొంది.

నేరాన్ని అంగీకరించనున్న శ్రీనివాస్ కూచిభొట్ల హత్యకేసు నిందితుడు

వాషింగ్టన్: అమెరికాలో భారత ఐటీ నిపుణుడు శ్రీనివాస్ కూచిభొట్లను హత్య చేసిన ఆడమ్ ప్యూరింటన్.. తన నేరాన్ని అంగీకరించే అవకాశం ఉంది. గత ఏడాది ఫిబ్రవరిలో కేన్సస్ నగరంలో ఆస్టిన్ బార్ అండ్ గ్రిల్‌లో ఈ హత్య జరిగింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌ను పొట్టనబెట్టుకోవడంతో పాటు అలోక్ మదసాని, ఇయాన్ గ్రిలియట్‌లను గాయపరచినట్లు ప్యూరింటన్‌పై అభియోగాలు నమోదయ్యాయి.

గుజరాత్‌లో ఘోర ప్రమాదం: 30 మంది మృతి

వంతెనపై నుంచి కిందకు పడిన ట్రక్కు

భావ్‌నగర్: గుజరాత్‌లో పెళ్లి బృందంతో వెళుతున్న ట్రక్కు మంగళవారం వంతెనపై నుంచి కిందకు పడిపోయిన ఘోర ప్రమాదంలో 30 మంది మృతి చెందారు. పలువురు గాయపడగా.. వారిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో నలుగురు పిల్లలు, 8 మంది మహిళలు ఉన్నారు. అనిడా గ్రామం నుంచి తోటమ్‌లో పెళ్లికి హాజరయ్యేందుకు 60 మందితో బయల్దేరిన ట్రక్కు భావ్‌నగర్-రాజ్‌కోట్ జాతీయ రహదారిపై ఓ వాహనాన్ని దాటిస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు ఇన్‌ఛార్జి ఎస్పీ ఐ.ఎం.సయ్యద్ తెలిపారు.



సింగపూర్, మలేసియాల్లో రాహుల్ పర్యటన!

దిల్లీ: కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఈ నెల 8 నుంచీ 10వ తేదీ వరకూ సింగపూర్, మలేసియాల్లో పర్యటించనున్నారు. 8, 9 తేదీల్లో ఆయన సింగపూర్‌లో ఉంటారు. పదోతేదీన మలేసియా చేరుకుంటారని కాంగ్రెస్ మంగళవారం ట్విటర్‌లో వెల్లడించింది. ఆయన తన రెండురోజుల సింగపూర్ పర్యటనలో అక్కడి ప్రవాస భారతీయులనుద్దేశించి ప్రసంగిస్తారు. మలేసియాలో వ్యాపార, యువజన సదస్సునుద్దేశించి రాహుల్ ఉపన్యసిస్తారు.

సీబీఐ అదుపులో గీతాంజలి సంస్థల ఉపాధ్యక్షుడు

ముంబయి: వేల కోట్ల రూపాయల పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) కుంభకోణంలో మరో వ్యక్తిని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. గీతాంజలి గ్రూప్ కంపెనీల ఉపాధ్యక్షుడు విపుల్ చితాలియాను ముంబయి విమానాశ్రయంలో పట్టుకున్న అధికారులు.. బంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని సీబీఐ కార్యాలయానికి తీసుకొచ్చి ప్రశ్నించారు.

సిరియాలో కూలిన రష్యా విమానం: 32 మంది మృతి

మాస్కో: రష్యాకు చెందిన విమానం సిరియాలో నేలకూలిన ఘటనలో మంగళవారం 32 మంది మృతి చెందారు. రష్యా నిర్వహిస్తున్న హ్మైమిమ్ వైమానిక స్థావరంలోనే ఈ ప్రమాదం సంభవించింది. 26 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బందితో కూడిన విమానం సాంకేతిక లోపంతోనే నేలకూలినట్లు రష్యా రక్షణ శాఖ ప్రాథమిక సమాచారం అందించింది. రన్‌వేకు 500 మీటర్ల దూరంలో ఈ దుర్ఘటన జరిగినట్లు వెల్లడించింది.

మరో 3 రోజులు కస్టడీలోనే కార్తి

- దర్యాప్తు పురోగతిని సీల్డ్‌కవర్‌లో కోర్టుకు సమర్పించిన సీబీఐ

దిల్లీ: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో అరెస్టు అయిన కార్తి చిదంబరం కస్టడీని ప్రత్యేక న్యాయస్థానం మరో మూడు రోజులు పొడిగించింది. గత అయిదు రోజుల కస్టడీ మంగళవారంతో ముగియగా సీబీఐ.. కార్తిని ప్రత్యేక న్యాయస్థానం జడ్జి సునీల్ రాణా ముందు హాజరుపరిచింది. ఈ కేసుకు సంబంధించిన కీలకమైన ఆధారాలను సేకరించగలిగామని, మరిన్ని వివరాలను రాబట్టేందుకు కార్తి చిదంబరంను మరో 9 రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని సీబీఐ కోరింది. ఈ సందర్భంగా దర్యాప్తు సంస్థ తరఫు న్యాయవాదులు, కార్తి తరఫు న్యాయవాదులు కోర్టులో తమ వాదనలు వినిపించారు. తాము స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్ల పాస్‌వర్డ్‌లను తెలిపేందుకు కార్తి నిరాకరించారని, ఏమి అడిగినా తాను రాజకీయ కక్షల బాధితుడినని మాత్రమే చెబుతున్నారని కోర్టుకు సీబీఐ తెలిపింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో సాక్ష్యాలను తారుమారు చేసే యత్నం జరిగిందని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. ఐఎన్ఎక్స్ మీడియా మాజీ యజమానుల్లో ఒకరైన ఇంద్రాణి ముఖర్జియాతో కార్తిని ఆదివారం నాడు ముఖాముఖి సమావేశపరిచి కేసులో కీలకమైన విషయాలను రాబట్టేందుకు యత్నించామని వివరించింది. కుమార్తె హత్య కేసులో ఇంద్రాణి ప్రస్తుతం ముంబయిలోని బైకుల్లా జైలులో ఉన్నారు. కార్తిని కస్టడీకి అప్పగించాల్సిన అవసరంలేదని, విడిగానైనా ప్రశ్నించే వీలుందని కార్తి తరఫు న్యాయవాదులు వాదించారు. బెయిల్ అభ్యర్థనపై తదుపరి విచారణను న్యాయస్థానం ఈ నెల 9వ తేదీకి వాయిదా వేసింది. పాటియాలా హౌస్ కాంప్లెక్స్‌లోని ప్రత్యేక న్యాయస్థానానికి కార్తి తల్లిదండ్రులు నళిని, కేంద్ర మాజీ మంత్రి చిదంబరంలు మంగళవారం కూడా వచ్చారు. విచారణ ప్రారంభానికి కొద్ది నిమిషాల ముందు తమ కుమారుడితో మాట్లాడారు.



పటియాలా హౌస్ కోర్టు వద్ద కార్తి చిదంబరం

కార్తికి సుప్రీంకోర్టులో లభించని ఉపశమనం: ఐఎన్ఎక్స్ మీడియాకే సంబంధించి నగదు అక్రమ చలామణి కేసులో.. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనను అరెస్టు చేయకుండా నివారించేలా ఆదేశాలు ఇవ్వాలన్న కార్తి చిదంబరం అభ్యర్థనను సుప్రీంకోర్టు నిరాకరించింది.

బ్యాంకు కుంభకోణం నుంచి దృష్టి మరల్చేందుకే ..

దిల్లీ: ఆర్థికశాఖ మాజీ మంత్రి చిదంబరంపై భాజపా తాజాగా చేసిన ఆరోపణలను కాంగ్రెస్ మంగళవారం తీవ్రంగా ఖండించింది. యూపీఏ సర్కారు గతంలో ప్రవేశపెట్టిన బంగారం దిగుమతి పథకం ద్వారా ప్రయివేటు సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు చిదంబరం ప్రయత్నించారన్న ఆరోపణలు అవాస్తవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్ చేసిన విమర్శలను కాంగ్రెస్ ప్రతినిధి ఆనంద్‌శర్మ ప్రస్తావిస్తూ...సంచలనాత్మక బ్యాంకు-నీరవ్‌మోదీ కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మరలించేందుకు ఇలాంటి ఆరోపణలకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. బంగారం దిగుమతిపై లోగడ విధించి ఉన్న పరిమితులను తొలగించింది భాజపా సారథ్యంలోని సర్కారేనని ఆనంద్‌శర్మ పేర్కొన్నారు.

భారత్‌లో తగ్గుతున్న బాల్యవివాహాలు

యునిసెఫ్ నివేదికలో వెల్లడి

దిల్లీ: గత పదేళ్లలో భారత్‌లో బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయని ఐక్యరాజ్యసమితికి చెందిన బాలల వేదిక 'యునిసెఫ్' పేర్కొంది. గత పదేళ్లలో బాలికల్లో.. 18వ పుట్టినరోజు కన్నా ముందు పెళ్లిళ్లు చేసుకుంటున్న వారు 27 శాతం మేర ఉన్నట్లు వివరించింది. దశాబ్దం కిందట అది 47శాతంగా ఉండేదని తెలిపింది. భారత్‌లో చోటుచేసుకున్న తగ్గుదల వల్ల ప్రపంచవ్యాప్తంగానూ బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయని వివరించింది.

- 2005-06 నుంచి 2015-16 వరకూ ప్రపంచవ్యాప్తంగా బాల్యవివాహాలు 15 శాతం మేర తగ్గాయి. పదేళ్ల కిందట ప్రతి నలుగురిలో ఒకరికి చిన్నతనంలోనే వివాహం జరిగేది. ఇప్పుడు ప్రతి ఐదుగురిలో ఒకరు ఇలాంటి వివాహాలు చేసుకుంటున్నారు.
- 2005-06 నుంచి 2015-16లో ప్రపంచవ్యాప్తంగా 2.5 కోట్ల బాల్య వివాహాలను నిరోధించగలిగారు. ఇందులో అధికవాటా దక్షిణాసియాదే. ఈ విషయంలో భారత్ ముందుంది.
- బాలికల్లో విద్యాస్థాయి పెరగడం, కిశోర ప్రాయ బాలికలకు సంబంధించిన పథకాలకు ప్రభుత్వం కేటాయింపులు పెంచడం, బాల్య వివాహాలు చట్టవిరుద్ధమన్నఅవగాహన ప్రజల్లో పెరగడం, వాటివల్ల జరిగే హాని వంటి అంశాలకారణంగా ఈ పోకడ తగ్గుతోంది.

రాష్ట్రాలు ఎస్సీలను వర్గీకరించకూడదు

కేంద్ర సామాజికన్యాయం, సాధికారశాఖ మంత్రి

ఈనాడు, దిల్లీ: సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రాలు ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించకూడదని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారశాఖ సహాయమంత్రి విజయ్‌సాంప్లా తెలిపారు. మంగళవారం లోక్‌సభలో కాంగ్రెస్ సభ్యుడు నంది ఎల్లయ్య అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఇదివరకు ఆంధ్రప్రదేశ్‌లోని 59 ఎస్సీ కులాలను ఏబీసీడీలుగా వర్గీకరించడానికి ఉద్దేశించిన ఏపీఎస్సీ(రిజర్వేషన్ల హేతుబద్ధీకరణ) చట్టం 2000ని ఆ రాష్ట్ర శాసనసభ ఆమోదించిందని చెప్పారు. వారికున్న 15% రిజర్వేషన్లను 1, 7, 6, 1 శాతం చొప్పున కేటాయించినట్లు పేర్కొన్నారు. అయితే ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని వి.చిన్నయ్య వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీం కోర్టు ప్రకటించినట్లు స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ కులాల వర్గీకరణకోసం 2006-07లో జాతీయ కమిషన్ ఏర్పాటైందని.. వర్గీకరణకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 341ని సవరించాలని ఆ కమిషన్ సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంలో ఇప్పటివరకూ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. జాతీయ ఎస్సీ కమిషన్ చేసిన సిఫార్సులపై రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలితప్రాంతాల అభిప్రాయాలు తెలుసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాష్ట్రాలు ఎస్సీలను వర్గీకరించకూడదని విజయ్‌సాంప్లా పేర్కొన్నారు.

అయోధ్య సమస్యకు ఉభయలాభ పరిష్కారం

ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్

బరేలీ: అయోధ్యలో రామ జన్మభూమి-బాబ్రీ మసీదు వివాదానికి ఉభయలాభ (విన్-విన్) పరిష్కారాన్ని కనుగొంటామని ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీరవిశంకర్ అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా ఈ సమస్య పరిష్కారానికి కృషిచేస్తున్న ఆయన... మంగళవారమిక్కడ ఇత్తెహాద్-ఎ-మిలాత్ కౌన్సిల్ అధ్యక్షుడు మౌలానా తాకిర్ రజాఖాన్‌తో సమావేశమయ్యారు. సిరియాను ఉటంకిస్తూ గతంలో తానుచేసిన వ్యాఖ్యలపై రవిశంకర్ వివరణ ఇచ్చారు. "అది కేవలం ఉదాహరణగా చెప్పిన మాట. మతవిద్వేషాలు మనకొద్దు. రామ మందిరాన్నీ నిర్మించాలి. మసీదునీ నిర్మించాలి. త్వరలోనే ఉభయులకూ లాభదాయకమైన పరిష్కారాన్ని కనుగొంటాం" అని రవిశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. అయోధ్య వివాద పరిష్కారానికి ఉభయ వర్గాలు కూర్చుని మాట్లాడుకునే వాతావరణం కల్పిస్తామని రవిశంకర్ తనతో అన్నట్లు రజాఖాన్ వెల్లడించారు. అయోధ్య సమస్యకు నాలుగు పరిష్కారాలను ప్రతిపాదిస్తూ- ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్‌కు రవిశంకర్ లేఖ రాశారు. "ముస్లిం పెద్దలు ముందుకొచ్చి ఎకరా స్థలాన్ని హిందువులకు ఇవ్వండి. ప్రతిగా వారు ఐదెకరాల స్థలాన్ని మీకిస్తారు. అక్కడ అద్భుతమైన మసీదును నిర్మించుకోవచ్చు. తద్వారా వంద కోట్ల మంది హిందువుల హృదయాల్లో మంచి స్థానం సంపాదించుకోండి" అని బోర్డ్‌కు రవిశంకర్ ప్రతిపాదించారు.

జిన్‌పింగ్ 'శాశ్వత యోచన'కు భారీ మద్దతు

బీజింగ్: చైనా అధ్యక్షునిగా జిన్‌పింగ్ నిరంతరాయంగా కొనసాగేందుకు రంగం సిద్ధమైంది. అధ్యక్షునిగా కొనసాగేందుకు ప్రస్తుతం రెండు పర్యాయాలకు మాత్రమే రాజ్యాంగం అనుమతిస్తుంది. ఈ కాలపరిమితిని రద్దుచేస్తూరూపొందించిన రాజ్యాంగ సవరణ ముసాయిదా బిల్లును అధికార కమ్యూనిస్ట్ పార్టీ (సీపీసీ) మంగళవారం పార్లమెంటు (నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్)లో ప్రవేశపెట్టింది. దీనికి పార్టీ నుంచి, ప్రజల నుంచి విశేష మద్దతు ఉందని సీపీసీ వెల్లడించింది. వారం తర్వాత ఎలాంటి ఆటంకం లేకుండా ఈ రాజ్యాంగ సవరణలను పార్లమెంటు ఆమోదించే అవకాశముంది.

ఎంపీల వేతనాలు వారే నిర్ణయించడం నైతిక అంశం: సుప్రీం

దిల్లీ: పార్లమెంటు సభ్యులు తమ జీతభత్యాలను తామే నిర్ణయించుకోవడం నైతిక అంశమని సుప్రీంకోర్టు మంగళవారం పేర్కొంది. ఎంపీలు తమకు తామే జీతభత్యాలను ఎలా నిర్ణయిస్తారన్న ప్రశ్నలు లేవనెత్తడంతో పాటు, మాజీ ఎంపీలకు పెన్షన్లు రద్దు చేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలను జస్టిస్ జె.చలమేశ్వర్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎంపీల వేతనాల నిర్ణయానికి విస్తృత ప్రక్రియ ఉందనిఅటార్నీ జనరల్ కె.కె. వేణుగోపాల్ ధర్మాసనానికి నివేదించారు. విచారణను ధర్మాసనం బుధవారానికి వాయిదా వేసింది.

అణ్వాయుధాలు వదులుకునేందుకు కిమ్‌జోంగ్ సిద్ధం

- వచ్చే నెలలో రెండు కొరియా అగ్రనేతల నడుమ భేటీ
- దక్షిణ కొరియా వెల్లడి

సియోల్: కొరియా ద్వీపకల్పంలో దశాబ్దాలుగా సాగుతున్న ఉద్రిక్తతలు నాటకీయంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఉప్పూనిప్పుగా ఉన్న ఉత్తర, దక్షిణ కొరియాల అగ్రనాయకుల మధ్య.. వచ్చే నెలలో చరిత్రాత్మక శిఖరాగ్ర సదస్సు జరగనుంది. భద్రతాపరంగా పూచీకత్తు ఇస్తే అణ్వాయుధాలను త్యజించడానికి ఉత్తర కొరియా సంసిద్ధత వ్యక్తంచేసింది. ఈ అంశంపై అమెరికాతో చర్చలకూ సై అంది. దక్షిణ కొరియా జాతీయ భద్రతా సలహాదారు చుంగ్ యాంగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం.. రెండు రోజుల పాటు ఉత్తర కొరియాలో పర్యటించి వచ్చింది. ఉత్తర కొరియా పాలకుడు కిమ్ జోంగ్ ఉన్ సహా పలువురు కీలక నేతలతో సమావేశమైంది. తమ పర్యటన విశేషాలను చుంగ్ యాంగ్.. మంగళవారం మీడియాకు వివరించారు. "కొరియా ద్వీపకల్పంలో అణు నిరాయుధీకరణకు ఉత్తర కొరియా సంసిద్ధత వ్యక్తంచేసింది. తమ జాతీయ భద్రతకు, తమ నాయకత్వ రక్షణకు ఎలాంటి ముప్పు లేనప్పుడు అణు కార్యక్రమాన్ని కొనసాగించడానికి తమకు ఎలాంటి కారణాలూ కనిపించడంలేదని చెప్పింది" అని ఆయన పేర్కొన్నారు. అణు నిరాయుధీకరణపైన, అమెరికాతో సంబంధాలను క్రమబద్ధీకరించుకోవడంపై ఆ దేశంతో గట్టి చర్చలకు సిద్ధమని కూడా ఉత్తర కొరియా ప్రకటించినట్లు తెలిపారు. అంతర్జాతీయ సమాజంతో చర్చలు సాగిస్తున్న సమయంలో అణు, క్షిపణి పరీక్షలు చేపట్టబోమని కూడా హామీ ఇచ్చినట్లు చెప్పారు. దక్షిణ కొరియాపై అణు, సంప్రదాయ ఆయుధాల ప్రయోగం చేయబోమని కూడా చెప్పినట్లు వివరించారు. వచ్చే నెలాఖరులో ఉత్తర కొరియా నాయకుడు కిమ్ జోంగ్ ఉన్.. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్ మధ్య సరిహద్దుల్లోని నిస్సైనిక ప్రాంతంలో ఉన్న పాన్‌ముంజోమ్ గ్రామంలో శిఖరాగ్ర సమావేశం జరగనుందని చుంగ్ చెప్పారు.

విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలు అవసరం

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని.. వాటిని సాధించే వరకు నిరంతరం కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ అన్నారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ తరగతుల్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. డిజిటల్ తరగతుల జిల్లాగా కృష్ణాను తీర్చిదిద్దాలన్న సంకల్పంతో అమెరికా తెలుగు అసోసియేషన్ కృషి చేస్తోందన్నారు. ఉత్తర అమెరికాలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి కోమటి జయరాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా 900 పాఠశాలల్లో డిజిటల్ తరగతుల్ని ఏర్పాటు చేయడానికి అసోసియేషన్ ముందుకు వచ్చిందన్నారు. 236 అంగన్‌వాడీ కేంద్రాల ఆధునికీకరణ, నిర్మాణం చేయనున్నామని చెప్పారు.

ఆర్టీసీ ఈ- వాలెట్‌లో మార్పులు

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం ప్రవేశపెట్టిన ఈ-వాలెట్‌లో కొన్ని మార్పులు చేసి ఈనెల 8వ తేదీ నుంచి పునః ప్రారంభిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) జి. జయరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు గూగుల్ ప్లేస్టోర్/ యాప్ స్టోర్ నుంచి ఏపీఎస్ఆర్టీసీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వాలెట్ అనే ఐకాన్ మీద క్లిక్ చేసి సైనప్ చేయడం ద్వారా ఖాతా ప్రారంభించుకోవచ్చని వివరించారు. జీరో బ్యాలెన్స్‌తో తెరవచ్చని, దీని ద్వారా టికెట్ కొనుగోలు చేసిన ప్రయాణికులకు టిక్కెట్ బేసిక్ ఛార్జిలో 5 శాతం క్యాష్ బ్యాక్ పొందవచ్చని చెప్పారు.

ఉపాధ్యాయుల్లో ఆంగ్ల నైపుణ్యం పెంపునకు చర్యలు

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయుల్లో ఆంగ్ల నైపుణ్యం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బ్రిటిష్ కౌన్సిల్, దక్షిణ ఇండియా సహకారంతో ఆంగ్ల ఉపాధ్యాయులు, ఆంగ్లమాధ్యమ ఉపాధ్యాయుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు అధ్యయనం చేయిస్తోంది. ప్రయోగాత్మకంగా శ్రీకాకుళం, కడప, తూర్పుగోదావరి, చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో ఈ అధ్యయనం చేస్తారు. ఒక్కో జిల్లా నుంచి 20మంది ఉపాధ్యాయులకు పరీక్ష నిర్వహించనున్నారు. కడపలో సోమవారం పరీక్ష నిర్వహించారు. మిగిలిన జిల్లాలలో బుధవారం పరీక్ష జరుపుతారు.

ఐదుగురు ఐఏఎస్‌ల బదిలీ

కార్యదర్శిగా రామాంజనేయులుకు పదోన్నతి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఐదుగురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ బి.రామాంజనేయులుకు కార్యదర్శిగా పదోన్నతి కల్పించి గ్రామీణ తాగునీటి సరఫరా, గ్రామీణ పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ వద్ద ప్రత్యేక అధికార బాధ్యతలు(ఓఎస్‌డీ) నిర్వహిస్తూ ఇటీవలే ఐఏఎస్ హోదా పొందిన రంజిత్‌బాషాను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సంచాలకుడిగా నియమించింది. 1987 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన జేఎస్‌వీ ప్రసాద్‌ను కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల, నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక, ఆవిష్కరణల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్ దినేశ్‌కుమార్‌ను ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి(సీఈఓ)గా, తిరుపతి సబ్‌కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను ఐటీడీఏ పీఓగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

వైకాపా రాజ్యసభ అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డి నామినేషన్ నేడు

ఈనాడు అమరావతి: వైకాపా తరఫున రాజ్యసభ ఎన్నికల బరిలో నిలిచిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 11 గంటలకు అసెంబ్లీలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పించనున్నారు.

ప్రత్యేక హోదా ఇవ్వాలి.. జగన్: దిల్లీలో ధర్నాలో పాల్గొన్న పార్టీ శ్రేణులు, మద్దతిచ్చిన వామపక్షాలు, ఆప్ నేతలకు వైకాపా అధ్యక్షుడు జగన్ అభినందనలు తెలిపారు. 'ప్రధాని నరేంద్రమోదీ మన ఆకాంక్షలను పరిగణనలోకి తీసుకుంటారని భావిస్తున్నా.. మన హక్కు ప్రత్యేక హోదాను ఇవ్వాల'ంటూ ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు.

నాసా సదస్సుకు కస్తూర్బా విద్యార్థినులకు ఆహ్వానం

ఈనాడు, అమరావతి: అమెరికాలోని లాస్‌ఏంజిల్స్‌లో మే 24 నుంచి నిర్వహించే అంతర్జాతీయ అంతరిక్ష అభివృద్ధి సదస్సుకు నాసా ఎంపిక చేసిన చిత్తూరు, నెల్లూరు జిల్లాలకు చెందిన 11 మంది విద్యార్థినులు హాజరు కానున్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న వీరు అంతరిక్షంలో నివాసాల ఏర్పాటు అనే అంశంపై పత్రాలను రూపొందించారు. వీటిని పరిశీలించిన నాసా అమెరికాలో నిర్వహించే సదస్సుకు ఉపాధ్యాయులతో సహా ఆహ్వానించింది.

విద్యుత్తు సిబ్బంది సమ్మె విరమణ

ఈనాడు, అమరావతి: సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న విద్యుత్తు శాఖలోని పొరుగు సేవల సిబ్బంది మంగళవారం రాత్రి విరమించారు. విద్యుత్తు సౌధలో ఏపీ ట్రాన్స్‌కో సీఎండీ, ఏపీ జెన్‌కో ఎండీ కె.విజయానంద్, జేఎండీలు దినేష్ పరుచూరి, పి.ఉమాపతి, జెన్‌కో డైరక్టర్లు నాగేశ్వరరావు, బీఏ మోహన్‌రావు తదితరులతో విద్యుత్తు కాంట్రాక్టు వర్కర్ల యునైటెడ్ ఫోరం ప్రతినిధులు కాశీ మధుబాబు, బాలకాశి తదితరులు చర్చలు జరిపారు. సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం ఈనెల 9న డిస్కంల సీఎండీలు, విద్యుత్తు సంస్థల్లో గుర్తింపు సంఘం ప్రతినిధులు, ఏపీ విద్యుత్తు కాంట్రాక్టు వర్కర్ల యునైటెడ్ ఫోరం ప్రతినిధులతో చర్చిస్తామని సీఎండీ విజయానంద్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేయడంతో సమ్మతించి సిబ్బంది సమ్మె విరమించారు.

కందులు, శనగ రైతులకు అమ్మకపు కష్టాలు

- ఈ-క్రాపింగ్‌తో ఇబ్బందులు
- శాసనసభలో ఎమ్మెల్యేలు

ఈనాడు, అమరావతి: కందులు, శనగలు అమ్ముకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న వైనాన్ని పలువురు శాసనసభ్యులు మంగళవారం శాసనసభ శూన్య గంటలో ప్రస్తావించారు.

★ ప్రకాశం జిల్లాలో 12,500 టన్నుల కొనుగోలుకే మార్క్‌ఫెడ్ అనుమతించిందని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ వివరించారు. పూర్తి స్థాయిలో కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం క్వింటా రూ.5,450 చొప్పున మద్దతు ధరకు అమ్ముకోలేకపోతున్నారన్నారు. దీంతో దళారులు గ్రామాల్లోకి వెళ్లి క్వింటా రూ.3,400 చొప్పున కొనుగోలు చేస్తున్నారని వివరించారు. ఈ-క్రాపింగ్ నిబంధన వల్ల కొంతమంది ఇబ్బంది పడుతున్నారని, సులభ పద్ధతిలో సేకరించేలా చూడాలని కోరారు.

★ కేంద్రం అనుమతించిన దానికి మించి ఎక్కువ స్థాయిలో కందులు కొనుగోలు చేసేలా చూడాలని గుంటూరు జిల్లా వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సూచించారు. సాగు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నా పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. ఈపూరు మండలంలో గతేడాది మిర్చి అమ్ముకున్న రైతులకు అదనపు ధర పథకం కింద క్వింటాకు ఇచ్చే రూ.1,500 అందలేదని చెప్పారు.

★ ప్రకాశం జిల్లాలో ప్రధానపంట శనగ కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కందుకూరు ఎమ్మెల్యే పోతుల రామారావు కోరారు.

హోంగార్డుల వేతనం పెంపుపై పరిశీలన

ఈనాడు, అమరావతి: హోంగార్డుల వేతనం పెంపు అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని రాష్ట్ర హోం శాఖ మంత్రి చినరాజప్ప తెలిపారు. ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు చినరాజప్ప సమాధానమిస్తూ.. "ప్రస్తుతం హోంగార్డులకు రోజు వారీగా చెల్లించే రూ.400 నుంచి రూ.500కు పెంచే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. 2016లో హోంగార్డుల డ్యూటీ అలవెన్సును రూ.300 నుంచి రూ.400కు పెంచాం. ఇకపై ఏడాదికోసారి రోజు వారీ వేతనాన్ని రూ.50 చొప్పున పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం" అని పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమంలో అమిత్ షా నెం.2

తొలి స్థానంలో ప్రధాని నరేంద్ర మోదీ

దిల్లీ: దేశంలో సామాజిక మాధ్యమంలో ఎక్కువ మంది అనుసరిస్తున్న నేతల్లో ప్రధాని నరేంద్రమోదీ తర్వాత స్థానంలో భాజపా అధ్యక్షుడు అమిత్ షా నిలిచారు. ఫేస్‌బుక్, ట్విటర్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఆయనకు 2 కోట్ల మందికిపైగా అనుచరులు ఉన్నారు. ప్రధాని మోదీని ఒక్క ట్విటర్‌లోనే 5 కోట్ల మంది అనుసరిస్తున్నారు. 2013 మే నెలలో అమిత్ షా ట్విటర్ ఖాతా ప్రారంభమైంది. సోమవారం నాటికి ఆయనను అనుసరిస్తున్న వారి సంఖ్య కోటి దాటింది. ఫేస్‌బుక్‌లో 1.1 కోట్ల మంది, ఇన్‌స్టాగ్రామ్‌లో 6.77 లక్షల మంది అనుసరిస్తున్నారు. భాజపా అధ్యక్షుడు ఇప్పటి వరకు 5,700 సార్లు ట్వీట్ చేశారు.

102 దేశాలకు పొగాకు ఎగుమతులు

- 8న ఏపీలో కొనుగోళ్లు ప్రారంభం
- బోర్డు ఇన్‌ఛార్జి ఛైర్మన్ మనోజ్‌కుమార్ ద్వివేది

ఈనాడు, అమరావతి: భారత దేశంలో పండించే పొగాకును 102 దేశాలకు ఎగుమతి చేస్తున్నామని భారత పొగాకు బోర్డు ఇన్‌ఛార్జి ఛైర్మన్ మనోజ్‌కుమార్ ద్వివేది అన్నారు. గుంటూరులోని బోర్డు ప్రధాన కార్యాలయంలో మంగళవారం పాలకవర్గ సభ్యులు, ఐటీఏ ప్రతినిధులు, బోర్డు అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. కర్ణాటకలో కొనసాగుతున్న కొనుగోళ్లతో పాటు ఈ నెల 8 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించనున్న కొనుగోళ్లపై సమీక్షించారు. సమావేశం అనంతరం ఇన్‌ఛార్జి ఛైర్మన్ మనోజ్‌కుమార్ ద్వివేది విలేకరులతో మాట్లాడారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దేశీయ పొగాకుకు ప్రధానంగా బ్రెజిల్, జింబాబ్వే, చైనా దేశాల నుంచి పోటీ ఎదురవుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ నాణ్యత గల పొగాకును పండించేలా రైతులను బోర్డు ప్రోత్సహిస్తుందన్నారు. జపాన్, యు.కె, కొరియా, థాయిలాండ్ దేశాలకు ఎగుమతి చేసేందుకు చర్చలు జరుపుతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లభించేలా ఐటీఏ నాయకులతో చర్చించామన్నారు. పొగాకు ముడి సరుకు మీద జీఎస్టీ 28 శాతం వసూలు చేయటంతో రైతులు, వ్యాపారులకు కలుగుతున్న నష్టంపై కూడా చర్చించి ప్రత్యామ్నాయాలను ప్రభుత్వానికి నివేదించేందుకు నిర్ణయం తీసుకున్నామని వివరించారు. కిలో పొగాకు రూ.175 ధరకు కొనుగోలు చేసేలా ఐటీఏ బృందానికి సూచించామన్నారు.

తెలుగొచ్చే గేదెలే కావాలి

పిఠాపురం ఎమ్మెల్యే వర్మ

ఈనాడు, అమరావతి: పొరుగు రాష్ట్రాల గేదెలు కాదని.. పక్క జిల్లాల తెలుగు గేదెలను కొనుగోలు చేసినప్పటికీ రుణాలు ఇవ్వాలని తూర్పు గోదావరి జిల్లా పిఠాపురం ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ కోరారు. శాసనసభలో మంగళవారం ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో వర్మ మాట్లాడుతూ "రుణాల మంజూరులో ఇటీవల వరకు హరియాణా గేదెలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ప్రస్తుతం తమిళనాడు నుంచి గేదెలను కొనుగోలు చేయమంటున్నారు. మాకు తెలుగు గేదెలు మాత్రమే కావాలి. తెలుగులో చెబితేనే గేదెలు అర్థం చేసుకుంటాయి. పరాయీ భాషలో చెబితే వాటికి ఏం అర్థమవుతుంది. పొరుగు రాష్ట్రాల గేదెలను మాత్రమే కొనుగోలు చేయాలని నిబంధన విధించడంవల్ల గ్రామాల్లో తిరగలేకపోతున్నాం." అని అన్నారు.

చెన్నైలో 9 కిలోల బంగారు నగల చోరీ

చెన్నై, న్యూస్‌టుడే: చెన్నై తిరుమంగలంలోని ఏకేఎస్ నగల దుకాణంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు దుకాణం గోడకు రంధ్రం చేసి తొమ్మిది కిలోల బంగారు నగలు చోరీ చేశారు. చోరీ అయిన బంగారం విలువ రూ.మూడు కోట్లని, రూ.7 లక్షల నగదు కూడా ఎత్తుకెళ్లారని పోలీసులు చెప్పారు. ఉత్తర భారతానికి చెందిన ముఠాదొంగతనం చేసినట్లు అనుమానిస్తున్నారు.

దుగరాజపట్నం ప్రారంభించండి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం ప్రకారం దుగరాజపట్నంలో పోర్టు ఏర్పాటు చేయాల్సి ఉందని, ఆ మేరకు పనులు ప్రారంభించాలని కేంద్రానికి వైకాపా ఎంపీ వరప్రసాద్ విజ్ఞప్తిచేశారు. మంగళవారమిక్కడ కేంద్ర నౌకాయాన శాఖ కార్యదర్శికి ఆయన వినతిపత్రం అందజేశారు.





Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00